www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆన్‌లైన్ కంటెంట్‌పై ఎవరిది బాధ్యత?

అశ్లీల, చట్ట విరుద్ధ కంటెంట్ నియంత్రణకు స్వతంత్ర, స్వయంప్రతిపత్తి గల సంస్థ అవసరం

నిబంధనలు రూపొందించాలంటూ కేంద్రానికి సుప్రీం కోర్టు ఆదేశం

నాలుగు వారాల గడువు

2

శుక్రవారం | 28-11-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 240 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం; తిథి: అష్టమి రా.12.16 తదుపరి నవమి; నక్షత్రం: శతభిష రా.2.49 తదుపరి పూర్వాభాద్ర; వర్జ్యం: ఉ.9.49-11.26; దుర్ముహూర్తం: ఉ.8.43-9.28, మ.12.25-1.09; అమృతఘడియలు: రా.7.31-9.09; రాహుకాలం: ఉ.10.30-12.00; సూర్యోదయం: 6.31; సూర్యాస్తమయం: 5.34 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

రూకగ్రీవాలు

సర్పంచ్ పదవికి జోరుగా వేలం పాటలు

ఏకగ్రీవం చేసి ఆ డబ్బును అభివృద్ధికి వెచ్చించే యోచన

ఎంతైనా వెచ్చించేందుకు సిద్ధమవుతున్న ఆశావహులు

గద్వాల జిల్లా కొండపల్లిలో రూ.60 లక్షలు పలికిన పదవి

గొర్లఖాన్ దొడ్డిలో 53 లక్షలు..

చింతలకుంటలో 38.5 లక్షలు

స్మశానానికి ఎకరం ఇచ్చే వారికే పదవి.. వామనపల్లిలో ఆఫర్

పెళ్లిళ్లు, జాతరలకు డీజేలు.. చావులకు వైకుంఠ రథం

ఆలయానికి ఎకరం ఇస్తా..

ఇంటి, నల్లా బిల్లులూ కడతా

ఖమ్మం జిల్లాలో రూ.కోటితో ఓ అభ్యర్థి మేనిఫెస్టో విడుదల

గ్రామ పెద్దలు.. ఈ మాట కన్నా గ్రామ పెద్ద అనే మాటే కిక్కు! సర్పంచ్ పదవి చేపడితేనే దానికి సార్థకత! ఆ హోదానే వేరు.. ఆ గుర్తింపే ప్రత్యేకం!! ఇలా పదవీ కాంక్షతో ఆశావహులు ఏకగ్రీవ అస్త్రాన్ని వదులుతున్నారు. పోటీ లేకుండా సర్పంచ్‌గా ఎన్నికయ్యేందుకు పావులు కదుపుతున్నారు. ఇందుకు ఎంతడబ్బైనా వెచ్చించేందుకు సిద్ధం అంటున్నారు.



..అటు గ్రామ పెద్దలు కూడా.. ఎన్నికల్లో అభ్యర్థులు విచ్చలవిడిగా డబ్బు ఖర్చు చేసే బదులు.. ఆ డబ్బునే ఏకగ్రీవం కోసం వెచ్చిస్తే ఊర్లో అభివృద్ధి పనులకు వినియోగించవచ్చని ప్రతిపాదిస్తూ జోరుగా చర్చలు జరుపుతున్నారు. ఫలితంగా ఏకగ్రీవాల కోసం నువ్వానేనా అన్నట్లుగా వేలంపాటలు సాగుతున్నాయి. గద్వాల జిల్లా రూరల్ మండలం కొండపల్లి గ్రామంలో ఎవరైనా ఆలయ అభివృద్ధికి డబ్బులిస్తే వారే ఏకగ్రీవంగా సర్పంచ్ కావొచ్చునని ప్రకటించడంతో ఓ సీడ్ ఆర్గనైజర్ సై అన్నారు. ఆలయ అభివృద్ధికి రూ. 60 లక్షలు ఇస్తానని ఆయన ప్రకటించినట్లు తెలుస్తోంది. అయితే తాను తప్ప మరెవ్వరూ నామినేషన్ వేయకపోతేనే తాను ఆ డబ్బిస్తానని ఆయన షరతు పెట్టారు. ఇక కేటీదొడ్డి మండలం చింతలకుంట గ్రామంలో ఓ నాయకుడు రూ.38.5 లక్షలు

మిగతా 12వ పేజీలో...

వేలంపాట, బెదిరింపులతో 'ఏకగ్రీవం' చెల్లదు!

ఫిర్యాదులు వాస్తవమైతే రద్దే

పర్యవేక్షక కమిటీలు పరిశీలించాకే ఏకగ్రీవానికి ఆమోదం

సర్పంచ్ ఏకగ్రీవాలపై ఈసీ మార్గదర్శకాలు

పంచాయతీ నామినేషన్లు షురూ

12



రాష్ట్ర ఎంపీల సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క.. చిత్రంలో సీఎస్ రామకృష్ణారావు, జితేందర్‌రెడ్డి

బీసీ బిల్లుపై ప్రధానితో చర్చలకు సిద్ధం

ఆయన సమయమిస్తే ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో ఢిల్లీకి వెళ్తాం

రాష్ట్రంలోని అన్ని పార్టీల ఎంపీలు ప్రధానిని కలిసి వినతిపత్రం ఇవ్వాలి

రాష్ట్రానికి రావాల్సిన నిధులపై కేంద్రానికి లేఖలు రాశాం

పార్లమెంటు సమావేశాల్లో ఆ అంశాలను ప్రస్తావించండి

నిర్ణీత ఫార్మాట్‌లో సమాచారం ఇచ్చేందుకు ఢిల్లీలో ప్రత్యేక విభాగం

రాష్ట్ర ఎంపీల సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

పాల్గొన్న బీజేపీ ఎంపీలు.. బీఆర్ఎస్, మజ్లిస్ ఎంపీల గైర్హాజరు

12

హైదరాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ సమయం ఇస్తే బీసీ బిల్లుపై చర్చించేందుకు సీఎం రేవంత్ అధ్యక్షతన ఢిల్లీ వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశాన్ని వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ప్రత్యేకంగా చర్చకు తీసుకురావాలని ఎంపీలను కోరారు. నిర్దేశిత ఫార్మాట్‌లో వాయిదా తీర్మానం ఇవ్వాలని లేదా ప్రశ్నోత్తరాల సమయంలో చర్చకు పెట్టాలని సూచించారు. అన్ని పార్టీల ఎంపీలు ప్రధానమంత్రిని కలిసి వినతిపత్రం ఇవ్వాలని కోరారు. పార్లమెంట్ సమావేశాలు జరగనున్న నేపథ్యంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన గురువారం రాష్ట్ర ఎంపీలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో కాంగ్రెస్ ఎంపీలు మల్లు రవి, బలరాం నాయక్, సురేశ్ షెట్కార్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, రామసహాయం రఘురాంరెడ్డి, కడియం కావ్య, గడ్డం వంశీ, అనిల్‌కుమార్ యాదవ్, బీజేపీ ఎంపీలు రఘునందన్‌రావు, నగేష్ పాల్గొన్నారు. మజ్లిస్ ఎంపీ అసదుద్దీన్, బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యులు సమావేశానికి హాజరు కాలేదు. కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం, రాష్ట్రానికి రావాల్సిన నిధులు, పథకాలతోపాటు 12శాఖలకు సంబంధించిన 47అంశాలపై

మిగతా 13వ పేజీలో...

పరిశీలించి ఉత్తర్వులిస్తాం

పంచాయతీల్లో బీసీ రిజర్వేషన్ల తగ్గింపునకు సంబంధించిన పిటిషన్లపై హైకోర్టు ధర్మాసనం వ్యాఖ్య

12

కోర్టులో ఓ మూలన నిలబెడతాం





ఉదయం 10:30 నుంచి సాయంత్రం దాకా ఉంచగలం

న్యాయస్థానం ఉత్తర్వుల పట్ల గౌరవ మర్యాదలు ఉండాలి

హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై హైకోర్టు తీవ్ర ఆగ్రహం

వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశించినా రాకపోవడంతో ఫైర్

5న రాకపోతే నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేస్తామని హెచ్చరిక

హైదరాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌పై రాష్ట్ర హైకోర్టు గురువారం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అవసరమైతే ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు కోర్టులో ఓ మూల నిలబెడతామంటూ హెచ్చరించింది. అంబర్‌పేట్‌లోని బతుకమ్మ కుంట వ్యవహారానికి సంబంధించిన విచారణకు హైడ్రా కమిషనర్ గైర్హాజరవడమే కాక వ్యక్తిగత హాజరుకు

మిగతా 10వ పేజీలో...

గ్రూప్-2 ఉద్యోగులకు ఊరట

2015 నోటిఫికేషన్ ఫలితాల కొట్టివేతపై హైకోర్టు డివిజన్ బెంచ్ స్టే

10

సిగాచి కేసులో దర్యాప్తు అధికారి హాజరుకు ఆదేశం



వరంగల్‌లోని ఫాదర్ కొలంబో వైద్య కళాశాల

వైద్య కళాశాలల్లో ఈడీ సోదాలు

తెలంగాణ, ఏపీ సహా 10 రాష్ట్రాల్లో తనిఖీలు

జాతీయ వైద్య కమిషన్ తనిఖీ అధికారులకు భారీగా ముడుపుల కేసులో రంగంలోకి ఈడీ

హవాలా మార్గంలో ముడుపుల చెల్లింపు

66 లక్షలు చెల్లించిన వరంగల్ జిల్లాలోని ఫాదర్ కొలంబో కాలేజీ యాజమాన్యం

ముగ్గురు మధ్యవర్తుల ఇళ్లలోనూ సోదాలు

హైదరాబాద్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తెలంగాణ, ఏపీ సహా పది రాష్ట్రాల్లోని వైద్య కళాశాలల తనిఖీలకు వెళ్లిన జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) అధికారులకు కోట్లాది రూపాయల ముడుపులు అందిన కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగంలోకి దిగింది. సీబీఐ నమోదు చేసిన ఈ కేసులో మనీ లాండరింగ్ కోణం ఉన్నట్లు గుర్తించిన ఈడీ.. తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర

మిగతా 14వ పేజీలో...

అణు విద్యుత్తులో ప్రైవేటు భాగస్వామ్యం

త్వరలోనే ప్రైవేటు రంగానికి అవకాశం

2047 నాటికి 100 గిగావాట్ల అణు విద్యుత్తు

అంతరిక్ష పరిశోధనల్లో భారత ప్రైవేటు రంగం భేష్: మోదీ

దేశంలోనే తొలి ప్రైవేటు వాణిజ్య రాకెట్ విక్రం-1 ఆవిష్కరణ

రూపొందించిన హైదరాబాద్ కంపెనీ స్కైరూట్





విక్రం-1ను వర్చువల్‌గా ఆవిష్కరిస్తున్న ప్రధాని

న్యూఢిల్లీ, నవంబరు 27: దేశంలో అణు విద్యుత్తు ఉత్పత్తికి ప్రైవేటు కంపెనీలకు కూడా త్వరలో అవకాశం కల్పిస్తామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రకటించారు. 2047 నాటికి 100 గిగావాట్ల అణు విద్యుత్తును ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ప్రైవేటు అంతరిక్ష పరిశోధన స్టార్టప్ సంస్థ స్కైరూట్ తయారుచేసిన దేశంలోనే తొలి ప్రైవేటు రాకెట్ విక్రం-1ను హైదరాబాద్‌లోని ఆ సంస్థకు చెందిన ఇన్ఫినిటీ క్యాంపస్‌లో ప్రధానమంత్రి మోదీ గురువారం వర్చువల్‌గా

మిగతా 13వ పేజీలో...

చైనా, జపాన్ స్థాయి అభివృద్ధే లక్ష్యం

13

'తెలంగాణ రైజింగ్' లక్ష్యమదే..

రాష్ట్రాభివృద్ధిని ప్రతిబింబించేలా విధాన పత్రాన్ని రూపొందించాలి

2034 నాటికి ట్రిలియన్ డాలర్లు.. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ: సీఎం



దీప్తి శర్మకు రూ. 3.20 కోట్లు

11

డబ్ల్యూపీఎల్ వేలంలో ఆల్‌రౌండర్ టాప్

తెలుగమ్మాయి శ్రీ చరణికి 1.30 కోట్లు

జనవరి 9 నుంచి డబ్ల్యూపీఎల్ పోటీలు



వైట్‌హౌస్ వద్ద కాల్పుల కలకలం

నేషనల్ గార్డులపై అఫ్గాన్ జాతీయుడి కాల్పులు.. ఇద్దరికి తీవ్ర గాయాలు

2

ఘటనపై అధ్యక్షుడు ట్రంప్ ఆగ్రహం

అఫ్గాన్‌తో ఇమిగ్రేషన్ సంబంధాలు కట్



కూలుతున్న భవిష్యత్ తరం!

విద్యార్థుల్లో పెరుగుతున్న ఆత్మహత్యలు.. పదేళ్లలో 65% పెచ్చు

42 నిమిషాలకు ఒక విద్యార్థి ప్రాణాలు తీసుకుంటున్న విషాదం

పలు కారణాలు.. ర్యాంకుల కోసం పోటీ, సుదీర్ఘ స్టడీ అవర్స్, కుటుంబ ఒత్తిడి, ఆర్థిక సమస్యలు, నిరాశలో కూరుకుపోవడం

తల్లిదండ్రులు, విద్యాసంస్థలు, ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి

ఆత్మహత్యల నివారణకు మానసిక నిపుణుల సూచన

2

ఖర్చు ఎక్కువైనా కట్టాల్సిందే!

భారీగా పెరిగిన థర్మల్ విద్యుత్తు ప్లాంట్ల నిర్మాణ వ్యయం

యాదాద్రిలో మెగావాట్‌కు రూ.10 కోట్లకు చేరిక

రామగుండం ప్లాంటులో 14.6 కోట్లు

అయినా థర్మల్ ప్లాంట్లు నిర్మించక తప్పదంటున్న సీఈఏ

2035 కి దేశవ్యాప్తంగా 60 వేల మెగావాట్ల థర్మల్ విద్యుత్ అవసరం

లేదంటే గ్రిడ్ నిర్వహణ ప్రశ్నార్థకమే

థర్మల్ ప్లాంట్లను జెన్‌కోనే నిర్మించాలంటున్న నిపుణులు



యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం (ఫైల్)

హైదరాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): దేశంలో పారిశ్రామికీకరణ, పట్టణీకరణ శరవేగంగా సాగుతున్న నేపథ్యంలో విద్యుత్ డిమాండ్ కూడా అదే స్థాయిలో పెరుగుతోంది. మనదేశంలో విద్యుత్ రంగంలో ఇప్పటికీ థర్మల్ విద్యుత్‌దే సింహభాగం. కాలుష్య రహితమైన జల, సౌర, పవన విద్యుత్ ఉత్పత్తిని ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నప్పటికీ.. వాటికి పరిమితులు ఉండటంతో ఇప్పటికీ బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్‌పైనే ఆధారపడుతున్నాం. ఇటీవలి కాలంలో థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్మాణ వ్యయం భారీగా పెరిగినప్పటికీ.. నిర్మించక తప్పదని కేంద్ర విద్యుత్ అథారిటీ (సీఈఏ) స్పష్టంచేసింది. 2035 నాటికి 60 వేల మెగావాట్ల

మిగతా 3వ పేజీలో...



ఓ పునరావాస శిబిరంలో బాధితులు

ప్రాణాలు బుగ్గి

హాంకాంగ్ అగ్నిప్రమాద ఘటనలో 83కు పెరిగిన మృతుల సంఖ్య

2

300 మందికి పైగా ఆచూకీ గల్లంతు

కొనసాగుతున్న సహాయక చర్యలు

రసకందాయంలో 'కర్ణాటకం'

» సిద్దరామయ్య, డీకే శివకుమార్ మాటల తూటాలు

బెంగళూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పుపై రాజకీయం బాగా వేడెక్కింది. ఒకదాన్ని మించి ఒకటిగా నాటకీయ పరిణామాలు కొనసాగుతున్నాయి. సిద్దరామయ్య, డీకే శివకుమార్ మధ్య కుర్చీపోరు తుది దశకు చేరుకుంది. తన సహనం నశిస్తోందంటూ డీకే సంకేతాలు ఇస్తుండగా, కుర్చీ దిగేదే లేదన్నట్లు సిద్దరామయ్య తేల్చిచెబుతున్నారు. వీరి పోరాటం తాజాగా సోషల్ మీడియాకు ఎక్కింది. ఇద్దరూ గురువారం 'ఎక్స్'లో వాడీవేడీ పోస్టులు పెట్టారు. 'ఇచ్చిన మాట మీద నిలబడటం ప్రపంచంలో గొప్ప విషయం, అది న్యాయమూర్తి కావచ్చు, రాష్ట్రపతి కావచ్చు లేదా నేను కావచ్చు' అని డీకే శివకుమార్ పోస్టు చేయగా, దీనికి కౌంటర్‌గా సిద్దరామయ్య.. 'మేము కర్ణాటకకు ఇచ్చిన మాట కేవలం నినాదం కాదు.. అదే మాకు సర్వస్వం' అని ట్వీట్ చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలోనే కన్నడ రాజకీయం ఢిల్లీకి మారింది. బెంగళూరు పర్యటనకు వచ్చిన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గురువారం ఉదయం హడావుడిగా ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. దీనికి ముందు ఆయన తన నివాసం వద్ద మీడియాతో మాట్లాడుతూ 'రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు నాకు తెలుసు. ఒకట్రెండు రోజుల్లోనే సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌ను ఢిల్లీకి పిలుస్తాం. సోనియా, రాహుల్‌తో సహా సీనియర్ నేతలతో సమావేశమై చర్చిస్తాం' అన్నారు.

వైట్‌హౌస్ వద్ద కాల్పుల కలకలం

» నేషనల్ గార్డులపై అఫ్గాన్ జాతీయుడి కాల్పులు

» మహిళసహా ఇద్దరు గార్డులకు తీవ్ర గాయాలు



వాషింగ్టన్, నవంబరు 27: అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్‌కు అతి సమీపంలో నేషనల్ గార్డులపై ఓ అఫ్గానిస్థాన్ జాతీయుడు కాల్పులు జరపటం కలకలం సృష్టించింది. దేశ రాజధాని వాషింగ్టన్ డీసీలోని ఫరాగట్ వెస్ట్ మెట్రో స్టేషన్ సమీపంలో రహమానుల్లా లకన్‌వాల్ అనే వ్యక్తి బుధవారం మధ్యాహ్నం(స్థానిక కాలమానం) 2.15 గంటల సమయంలో కాల్పులు జరిపాడు. వీధుల్లో గస్తీ నిర్వహిస్తున్న వెస్ట్ వర్జీనియా నేషనల్ గార్డు దళ సభ్యులపై అతి సమీపం నుంచి కాల్పులు జరపటంతో ఇద్దరు గార్డులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఒక మహిళ కూడా ఉంది. గార్డుల ఎదురుకాల్పుల్లో రహమానుల్లా కూడా గాయపడ్డాడు. అతడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అమెరికాలో గురువారం థ్యాంక్స్ గివింగ్ డే వేడుకలు నిర్వహిస్తున్నారు. ప్రజలంతా ఆ ఉత్సాహంలో ఉండగా, ఒక రోజు ముందు కాల్పులు జరగటం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది.

ఇది క్రూరమైన దాడి

కాల్పుల ఘటనపై అమెరికా అధ్యక్షుడు తీవ్రంగా స్పందించారు. థ్యాంక్స్ గివింగ్ డే వేడుకల్లో పాల్గొనేందుకు ఫ్లోరిడా వెళ్లిన ఆయన.. మీడియాతో మాట్లాడుతూ.. గత అధ్యక్షుడు జో బైడెన్ ఇమిగ్రేషన్ విధానాల వల్లే దేశంలో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ఆరోపించారు. 'వాషింగ్టన్ డీసీలో విధుల్లో ఉన్న నేషనల్ గార్డు సభ్యులపై వైట్‌హౌస్‌కు కొన్ని అడుగుల దూరంలోనే చోటుచేసుకున్న కాల్పుల ఘటన అత్యంత క్రూరమైన చర్య. ఇది కచ్చితంగా ఉగ్రవాద దాడే. భూమిపై అఫ్గానిస్థాన్ నరకద్వారంగా మారింది.' అని అన్నారు. కాగా, కాల్పులు జరిపిన రహమానుల్లా లకన్‌వాల్‌కు గతంలో అఫ్గానిస్థాన్‌లో సైనిక శిక్షణ ఇచ్చింది అమెరికా నిఘా వర్గాలేనని తేలింది. అఫ్గానిస్థాన్ నుంచి అమెరికా తన బలగాలను వెనక్కు తీసుకున్న సమయంలో నాటి అధ్యక్షుడు బైడెన్ అమలుచేసిన 'ఆపరేషన్ అలైజ్ వెల్‌కం'(భాగస్వాములకు స్వాగతం)లో భాగంగా 2021, సెప్టెంబర్ 8న అతడు అమెరికా చేరుకున్నాడు. ఇప్పటికే విదేశీయుల రాకపై ఆంక్షలు విధించిన ట్రంప్.. తాజా ఘటన నేపథ్యంలో అఫ్గానిస్థాన్‌తో సంబంధాలను పూర్తిగా నిలిపేస్తున్నట్లు ప్రకటించారు. ఆ దేశస్తుల ఇమిగ్రేషన్ దరఖాస్తుల పరిశీలనను నిరవధికంగా నిలిపేస్తున్నట్లు అమెరికా సిటిజన్‌షిప్, హోంల్యాండ్ సెక్యూరిటీ ప్రకటించింది.

ఆన్‌లైన్ కంటెంట్‌పై ఎవరిది బాధ్యత..?: సుప్రీం

న్యూఢిల్లీ, నవంబరు 27: సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసే కంటెంట్‌కు ఎవరో ఒకరు జవాబుదారీగా ఉండాల్సిన అవసరముందని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. వ్యక్తులు సొంతంగా చానెళ్లు ప్రారంభించి.. ఆ తర్వాత బాధ్యతారాహిత్యంగా ఉండటమనేది వింతగా ఉందని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చిల ధర్మాసనం ఆక్షేపించింది. ఓ కార్యక్రమంలో యూట్యూబర్ రణవీర్ అలహాబాదియా తల్లిదండ్రుల శృంగారంపై ఓ వ్యక్తిని అడిగిన ప్రశ్నలు వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. దీనికి సంబంధించిన కేసు తాజాగా విచారణకు వచ్చింది. దీనిపై కోర్టు స్పందిస్తూ.. 'నేను సొంతంగా చానెల్ పెట్టుకుంటాను. ఎవరికీ జవాబుదారీగా ఉండను అంటే ఎలా..? ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలలో అశ్లీల, అభ్యంతరకర, చట్ట విరుద్ధమైన కంటెంట్‌ను నియంత్రించడానికి తటస్థ, స్వతంత్ర, స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థ అవసరముంది. యూజర్లు రూపొందించిన సోషల్ మీడియా కంటెంట్‌ను నియంత్రించేలా నిబంధనలు తీసుకురావడానికి కేంద్రానికి నాలుగు వారాల గడువు ఇస్తున్నాం" అని సుప్రీంకోర్టు పేర్కొంది.

పాకిస్థానీయులకు యూఏఈ వీసాలు బంద్

ఇస్లామాబాద్, నవంబరు 27: పాకిస్థానీయుల్లో చాలా మందికి యూఏఈ వీసాలను నిలిపివేసింది. దాదాపుగా నిషేధించినంత పని చేసింది. యూఏఈకి వెళ్లే పాకిస్థానీయులు నేరపూరిత చర్యలకు పాల్పడుతుండడమే ఇందుకు కారణం. సౌదీ అరేబియా కూడా దాదాపుగా ఇలాంటి నిర్ణయాన్నే అమలు చేస్తోంది. ఈ విషయాన్ని సెనేట్ మానవ హక్కుల ఫంక్షనల్ కమిటీకి అంతర్గత వ్యవహారాల శాఖ తెలిపింది. ఒకవేళ నిషేధమే విధిస్తే దానిని ఎత్తేయించడం కష్టమవుతుందని ఆ కమిటీ చైర్‌పర్సన్ సమీనా జాహ్రీ అభిప్రాయపడ్డారు. యూఏఈ అతికష్టం మీద ఇటీవల కొంతమందికి మాత్రమే వీసాలు జారీ చేసిందని చెప్పారు. జూలై నుంచి వీసాల మంజూరును బాగా తగ్గిస్తుండడాన్ని ప్రభుత్వం గుర్తించి ఆ దేశం దృష్టికి తీసుకెళ్లింది. మరోవైపు పాకిస్థాన్‌లోని యూఏఈ రాయబారి.. పాక్ ఆర్థిక మంత్రి ఔరంగజేబ్‌తో కలిసి తాము చేపట్టిన వీసా సంస్కరణలను వివరించారు. పాక్‌లోని యూఏఈ వీసా సెంటర్‌లో రోజుకు 500 వీసా దరఖాస్తులను పరిశీలిస్తున్నట్టు చెప్పారు.

అసోంలో బహుభార్యాత్వం నిషేధం

గువాహటి, నవంబరు 27: బహుభార్యాత్వాన్ని నిషేధిస్తూ గురువారం అసోం అసెంబ్లీ తీర్మానాన్ని ఆమోదించింది. నిబంధనలు ఉల్లంఘించి రెండో పెళ్లి చేసుకున్న వారికి గరిష్ఠంగా పదేళ్ల వరకు జైలు శిక్ష విధించే అవకాశం ఈ బిల్లులో ఉంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి హిమాంత బిశ్వశర్మ మాట్లాడుతూ తుర్కియే దేశాన్ని ఉదాహరణగా తీసుకొని ఈ బిల్లును ప్రవేశపెట్టినట్టు చెప్పారు. ఇది ఇస్లాంకు వ్యతిరేకం కాదని చెప్పారు. నిజమైన ముస్లింలుగా ఈ బిల్లుకు మద్దతు తెలపాలని కోరారు. ఇస్లాం బహుభార్యాత్వాన్ని ప్రోత్సహించదని తెలిపారు. తుర్కియే బహుభార్యాత్వాన్ని నిషేధించిందని, పాకిస్థాన్‌లో ఆర్బిట్రేషన్ కౌన్సిల్ ఉందని చెప్పారు. ఈ బిల్లు రాజ్యాంగంలోని ఆరో షెడ్యూలు అమలయ్యే గిరిజన ప్రాంతాలకు వర్తించదని చెప్పారు. గిరిజనులకు కూడా వర్తించదని తెలిపారు. అక్రమంగా రెండో వివాహం చేసుకున్నవారికి ఏడేళ్ల జైలు శిక్ష, మొదటి వివాహాన్ని దాచిపెట్టిన వారికి పదేళ్ల వరకు జైలు శిక్ష ఉంటుంది. పదేపదే ఈ తప్పు చేసిన వారికి మరింత కఠిన శిక్షలు ఉంటాయి. బాధిత మహిళలకు రక్షణ, పరిహారం చెల్లించే ఏర్పాట్లు ఉన్నాయి.

'సిందూర్' మన సామర్థ్యాన్ని చాటింది: రాష్ట్రపతి

న్యూఢిల్లీ, నవంబరు 27: ఉగ్రవాద అణచివేత-నిరోధ వ్యూహంలో 'ఆపరేషన్ సిందూర్‌'ను నిర్ణయాత్మక చర్యగా రాష్ట్రపతి, భారత సాయుధ బలగాల సర్వసైన్యాధ్యక్షురాలు ద్రౌపది ముర్ము అభివర్ణించారు. దీని ద్వారా భారత సైనిక సామర్థ్యాన్నే గాక.. నైతిక స్పష్టతతో అది నిక్కచ్చిగా, బాధ్యతాయుతంగా వ్యవహరిస్తుందని ప్రపంచంతా చూసిందన్నారు. భారత సైన్యం గురువారం ఢిల్లీలో నిర్వహించిన 'చాణక్య డిఫెన్స్ డైలాగ్' మూడో సంచికలో ఆమె ప్రసంగించారు. 'వసుధైవ కుటుంబకం' స్ఫూర్తితో.. వ్యూహాత్మక స్వయం సామర్థ్యంతో పాటు ప్రపంచ జవాబుదారీతనం కూడా మనకుందని ఆపరేషన్ సిందూర్‌తో చాటామని తెలిపారు.

కూలుతున్న భవిష్యత్ తరం!

విద్యార్థుల్లో పెరుగుతున్న ఆత్మహత్యలు.. గత పదేళ్లలో 65 శాతం పెరుగుదల



'మాథ్స్‌లో తక్కువ మార్కులు వచ్చాయి.. బాగా కష్టపడి చదువు.. నీ భవిష్యత్తు కోసమే చెబుతున్నా' అంటూ తండ్రి మందలించిన తెల్లారే పదో తరగతి విద్యార్థిని అయిన కుమార్తె అపార్ట్‌మెంట్‌పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. 'ఇంకా ఎన్ని రోజులు సెలవు పెట్టి ఇంట్లో ఉంటావు.. ఉన్నది చాలు.. స్కూలుకు వెళ్లు!' అని తల్లిదండ్రులు కోప్పడినందుకు 8వ తరగతి విద్యార్థి ప్రాణాలు తీసుకున్నాడు. ఈ రెండు ఘటనలూ ఇటీవల హైదరాబాద్‌లో జరిగాయి. దేశంలో పెరిగిపోతున్న విద్యార్థుల ఆత్మహత్యలకు ఇవి నిదర్శనాలు. ఒకప్పుడు రైతుల ఆత్మహత్యలు మీడియాలో ప్రముఖంగా కనిపించేవి. వాటి స్థానంలో ఇప్పుడు విద్యార్థుల ఆత్మహత్యలు కనిపిస్తున్నాయి. వినటానికి నమ్మశక్యంగా లేకపోవచ్చుగానీ.. నేడు దేశంలో రైతులు, ఉద్యోగులు తదితర వర్గాల కంటే విద్యార్థుల ఆత్మహత్యలే అధికంగా ఉంటున్నాయి. రైతుల ఆత్మహత్యలు సమాజంలో కలిగించే కలకలం, వాటికి మీడియా ఇచ్చే ప్రాధాన్యం విద్యార్థుల ఆత్మహత్యలకు ఇవ్వకపోవటంతో ఆ అంశం బలంగా ముందుకు రావటం లేదని విశ్లేషకులు చెబుతున్నారు. దేశంలో ప్రతీ 42 నిమిషాలకు ఒక విద్యార్థి ప్రాణాల్ని తీసుకుంటున్నాడని జాతీయ నేర గణాంకాల విభాగం చెబుతోంది. దేశంలో ఆత్మహత్యలు ఏటా సగటున 2 శాతం చొప్పున పెరుగుతుండగా.. విద్యార్థుల్లో మాత్రం ఇది 4 శాతంగా నమోదవుతోంది. రైతుల ఆత్మహత్యలు ఇటీవలి కాలంలో క్రమంగా తగ్గుతుండగా.. విద్యార్థుల ఆత్మహత్యలు మాత్రం పెరుగుతుండటం ఆందోళన కలిగించే పరిణామం.

పదేళ్లలో 65 శాతం పెరుగుదల

2013-2023 మధ్య నమోదైన గణాంకాల్ని పరిశీలిస్తే.. 2013లో 8,423 మంది విద్యార్థుల ఆత్మహత్యలు చోటుచేసుకోగా, 2023లో 13,892 మంది ప్రాణాలు తీసుకున్నారు. అంటే, పదేళ్లలో 65 శాతం పెరిగిపోయాయి. ఇదే పదేళ్లలో దేశంలో మొత్తం ఆత్మహత్యలు 27 శాతం పెరిగాయి (2013లో 1.35 లక్షలు కాగా 2023లో 1.71 లక్షలు). మొత్తం ఆత్మహత్యల్లో విద్యార్థుల ఆత్మహత్యలు 2013లో 6.2 శాతం కాగా, 2023లో అది 8.1 శాతానికి పెరిగాయి. ప్రాణాలు తీసుకుంటున్న విద్యార్థుల్లో బాలికల కంటే బాలురు అధికంగా ఉంటున్నారు.

కారణాలేమిటి?

విద్యార్థుల్లో ఆత్మహత్యలు పెరిగిపోవటానికి పలు కారణాలు ఉన్నాయని మానసిక నిపుణులు చెబుతున్నారు. అవి.. మార్కులు, ర్యాంకుల కోసం ఇతర విద్యార్థులతో ఉండే పోటీ, విరామం లేకుండా సుదీర్ఘంగా ఉంటున్న కాలేజీ, రీడింగ్ అవర్స్, మంచి ర్యాంకు తెచ్చుకోవాలంటూ కుటుంబపరంగా ఉండే ఒత్తిడి, కుటుంబంలో ఆర్థికపరమైన సమస్యలు, ఉద్యోగం లభిస్తుందో లేదోనన్న ఆందోళన, నిరాశలో కూరుకుపోయిన విద్యార్థిని ఓదార్చి, ధైర్యం ఇచ్చే వ్యక్తులు, వ్యవస్థలు అందుబాటులో లేకపోవటం మొదలైనవి. కరోనా సమయంలో విద్యాసంస్థలు మూతబడిపోయి విద్యార్థులు ఇంటికే పరిమితమైన సమయంలో వారిలో ఒంటరితనం, అనిశ్చితి వంటివి పెరిగిపోయాయని, తర్వాత కూడా వీటి ప్రభావం కొనసాగుతోందని చెబుతున్నారు. గణాంకాలు కూడా దీనికి అనుగుణంగా ఉండటం గమనార్హం. 2019 నుంచి 2023 మధ్య విద్యార్థుల ఆత్మహత్యలు ఏకంగా 34 శాతం పెరిగాయని జాతీయ నేర గణాంకాల విభాగం వెల్లడించింది.

నివారణ మార్గాలు

- తమ పిల్లలు తమ ముందు స్వేచ్ఛగా అభిప్రాయాల్ని, భావోద్వేగాల్ని వెల్లడించే స్వేచ్ఛ, వాతావరణం ఇంట్లో తల్లిదండ్రులు కల్పించాలి. పిల్లలు తమ సమస్యలు చెప్పినప్పుడు సావధానంగా విని, తామున్నామనే భరోసా కల్పించాలి. మార్కులు, ర్యాంకులు అవసరమేగానీ.. వాటి కోసం పిల్లల మీద విపరీతమైన ఒత్తిడి తీసుకురావొద్దు.
- సోషల్ మీడియా, ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటైన పిల్లలు సెల్‌ఫోన్ మీద ఎక్కువ సమయం వెచ్చిస్తూ ఒంటరితనంలో కూరుకుపోతున్నారు. దీనిని జాగ్రత్తగా మాన్పించాలి. వారితో తల్లిదండ్రులు ఎక్కువ సమయం గడపాలి.
- స్కూళ్లు, కాలేజీలు కెరీర్ కౌన్సెలింగ్‌కు ఇస్తున్న ప్రాధాన్యం.. సైకలాజికల్ కౌన్సెలింగ్‌కు ఇవ్వటం లేదన్న విమర్శలున్నాయి. విద్యార్థుల్లో ఆదుర్దా, డిప్రెషన్ వంటి సమస్యలను నివారించటానికి మానసిక కౌన్సెలర్లను నియమించుకోవాలి. వారి సేవలు విద్యార్థులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలి.
- విద్యార్థి చదువుల్లో వెనకబడుతున్నప్పుడు క్రమశిక్షణ చర్యలు తీసుకోవటానికి బదులు కారణాలేమిటో కనుక్కొని వాటిని పరిష్కరించే దిశగా విద్యాసంస్థలు కృషి చేయాలి. అందుకు తగిన వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలి.

లక్షణాలు

యుక్తవయస్కుల్లో ఆదుర్దా, డిప్రెషన్ వంటివి పెరుగుతున్నాయని, కానీ, ఈ లక్షణాల్ని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తీవ్రంగా తీసుకోకుండా, చదువుల మీద శ్రద్ధ లేకపోవటం, బద్ధకం అని భావిస్తున్నారని డాక్టర్ శివప్రసాద్ అనే సైకియాట్రిస్ట్ తెలిపారు. ఆత్మహత్యకు పాల్పడటానికి ముందు కొన్ని లక్షణాలు కనిపిస్తాయని, వాటిని గమనించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. 'కుటుంబం నుంచి దూరంగా, ఒంటరిగా ఉండటం. స్నేహితుల్ని కలవకపోవటం, అమితంగా బాధపడటం, చిరాకు, కోపం పెరగటం, తరచూ ఏడవటం, వ్యక్తిత్వంలో అకస్మాత్తుగా మార్పులు రావటం ఇవన్నీ ఆత్మహత్యకు ముందు ఉండే లక్షణాలే'నని పేర్కొన్నారు. ఢిల్లీకి చెందిన ఫోరెన్సిక్ సైకియాట్రిస్ట్ డాక్టర్ అస్తిక్‌జోషి మాట్లాడుతూ.. తలనొప్పి, కడుపునొప్పి వంటి కారణాలతో స్కూలు/ కాలేజీకి తరచూ దుమ్మా కొట్టటం, అకస్మాత్తుగా బరువు తగ్గటం వంటివి కూడా సీరియస్‌గా తీసుకోవాల్సిన లక్షణాలని తెలిపారు. ఆత్మహత్య ఆలోచనలు వస్తున్నాయని తమకు సన్నిహితంగా ఉండే వారికి కూడా చెబుతుంటారని, ఏదో చెప్పి సర్దిపుచ్చకుండా.. తక్షణం మానసిక వైద్యుడి వద్దకు తీసుకెళ్లాలని సూచించారు.

- విద్యార్థుల మధ్య, విద్యార్థులకు ఉపాధ్యాయులకు మధ్య సహృద్భావ వాతావరణం నెలకొనేలా విద్యాసంస్థలు చర్యలు తీసుకోవాలి.
- ఆత్మహత్య వంటి తీవ్రమైన ఆలోచనలతో విద్యార్థి ఉన్నట్లు గమనిస్తే.. తల్లిదండ్రులుగానీ, విద్యాసంస్థలుగానీ మానసిక వైద్యుల వద్దకు తీసుకెళ్లాలి.
- విద్యార్థుల్లో వ్యాయామం, యోగా, ధ్యానం, తగినంత సమయం నిద్రపోవటం వంటి మంచి అలవాట్లను పెంపొందించటం ద్వారా వారిలో నిరాశ వంటివి దరిచేరకుండా చేయవచ్చు.
- ప్రభుత్వాల పరంగా పరీక్షల్లో సంస్కరణలు, మానసిక నిపుణుల సేవలను అందుబాటులో ఉంచటం, ఉపకారవేతనాలు అందించి ఆర్థికపరమైన సమస్యలు లేకుండా చేయటం, విద్యాసంస్థలకు తగిన నిబంధనల్ని నిర్దేశించటం వంటి విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.
- ఒత్తిడి బారిన పడిన విద్యార్థులకు చేయూత అందించటం కోసం 2020లో కేంద్రప్రభుత్వం మనోదర్పణ్ పేరుతో టెలీ కౌన్సెలింగ్ సేవల్ని ప్రారంభించింది. ఆత్మహత్యల నివారణకు పలు స్వచ్ఛందసంస్థలు కూడా సమర్థవంతమైన సేవల్ని అందిస్తున్నాయి. వాటి సేవల్ని కూడా వినియోగించుకోవచ్చు.

- సెంట్రల్ డెస్క్

లోకం తీరు



క్యూఆర్ కోడ్‌లతో జరభద్రం

» వాట్సాప్ వెబ్ కోడ్‌లతో సైబర్ నేరగాళ్ల నయా మోసం

» టాస్క్‌ల పేరిట వల వేసి గుట్టుగా వాట్సాప్ ఖాతాల్లోకి లాగిన్

న్యూఢిల్లీ, నవంబరు 27: మేము చెప్పిన ఈ చిన్న పని(టాస్క్) పూర్తి చేసి మా పేజీ లేదా వెబ్‌సైట్‌లోని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే చాలు మీ వ్యాలెట్‌లో రూ.100 జమ అవుతాయి.. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ తదితర సామాజిక మాధ్యమాల్లో ఈ తరహా ప్రకటన ఏదైనా చూస్తే.. ఈజీ మనీ కోసం ఆశపడి గుర్తు తెలియని వెబ్‌సైట్లలోని క్యూఆర్ కోడ్‌లు స్కాన్ చేశారో.. అంతే సంగతి. మీ వాట్సాప్ హ్యాక్ అయిపోయినట్టే. అవును సైబర్ నేరగాళ్లు ఇటీవల ఈ కొత్త మోసానికి తెగబడుతున్నారు. టాస్క్‌ల పేరిట సోషల్ మీడియాలో ఎర వేసి వాట్సాప్ వెబ్ లాగిన్ క్యూఆర్ కోడ్‌లతో అమాయక ప్రజల వాట్సాప్ ఖాతాల్లోకి గుట్టుగా లాగిన్ అయిపోతున్నారు. ఆపై, ఫలానా కష్టంలో ఉన్నా కొంత డబ్బు పంపండి అంటూ ఆ వాట్సాప్ ఖాతాలోని ఇతర కాంటాక్ట్‌లకు మెసేజ్‌లు పంపుతున్నారు. తెలిసిన వ్యక్తి నుంచి సందేశం రావడంతో చాలా మంది ఆ సందేశంలో పేర్కొన్న విధంగా డబ్బులు పంపేస్తున్నారు. అలాగే, బ్యాంకు ఖాతాలు ఖాళీ చేసేందుకు, వ్యక్తిగత సమాచారాన్ని కాజేసేందుకు పనికొచ్చే ప్రమాదకరమైన ఏపీకే ఫైల్స్‌ను కూడా సైబర్ నేరగాళ్లు ఆ వాట్సాప్ లాగిన్ల ద్వారా షేర్ చేస్తున్నారు. దీంతో బాధితుల సంఖ్య చాపకింద నీరులా పెరిగిపోతుంది. వాట్సాప్ వెబ్ లాగిన్ ద్వారా ఈ మోసమంతా జరుగుతుండడంతో అసలైన వాట్సాప్ యూజర్లు ఈ వ్యవహారాన్ని ఆలస్యంగా గుర్తించి తలలు పట్టుకుంటున్నారు. వాట్సాప్ వెబ్ లాగిన్ మోసాలు ఇటీవల అధికమైన నేపథ్యంలో.. వాట్సాప్ క్యూఆర్ కోడ్‌ల అంశంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు చెందిన ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్(ఐ4సీ) హెచ్చరించింది.

గేమ్‌చేంజర్ ఎస్-400

» మరో ఐదు గగనతల రక్షణ వ్యవస్థల కొనుగోలుకు భారత్ సిద్ధం

» 10 వేల కోట్లతో క్షిపణుల కొనుగోలు

» 63 వేల కోట్లతో సుఖోయ్-30 ఆధునీకరణ

» 5న మోదీ, పుతిన్ మధ్య ఒప్పందాలు..?

న్యూఢిల్లీ, నవంబరు 27: గగనతలాన్ని శత్రు దుర్భేద్యంగా మార్చడానికి మనదేశం వేగంగా అడుగులు వేస్తోంది. ఆపరేషన్ సిందూర్‌లో పాకిస్థాన్ దాడులను సమర్థంగా తిప్పికొట్టిన ఎస్-400 గగనతల రక్షణ వ్యవస్థను మరింత విస్తరించడానికి సిద్ధమైంది. భారత వైమానిక దళం (ఐఏఎఫ్) దీనిని ఓ గేమ్‌చేంజర్‌గా అభివర్ణిస్తున్న నేపథ్యంలో మరో ఐదు ఎస్-400లను కొనుగోలు చేయనున్నారు. డిసెంబరు 5న జరిగే ప్రధాని మోదీ, రష్యా అధ్యక్షుడు పుతిన్ భేటీలో వీటితో పాటు మరిన్ని క్షిపణుల కొనుగోలుకు ఒప్పందాలు జరిగే అవకాశం ఉంది. అలాగే రూ. 63 వేల కోట్లతో సుఖోయ్-30ఎంకేఐ యుద్ధవిమానాల ఆధునీకరణ కార్యక్రమానికి కూడా భారత్ సిద్ధమవుతోందని టైమ్స్ ఆఫ్ ఇండియా తన కథనంలో తెలిపింది. ఆ కథనం ప్రకారం.. మరిన్ని ఎస్-400 స్క్వాడ్రన్‌లు కొనుగోలుకు ఇప్పటికే రక్షణ శాఖ సిద్ధమైంది. అలాగే పాక్‌తో యుద్ధం సమయంలో తరిగిపోయిన నిల్వలను మళ్లీ పెంచడానికి ఎస్-400 క్షిపణులను కూడా కొనుగోలు చేయాలని నిర్ణయించింది. 120, 200, 250, 380 కి.మీటర్ల రేంజ్ క్షిపణుల కోసం ప్రత్యేకంగా రూ. 10 వేల కోట్లను కేటాయించడానికి నిర్ణయించారు. ఇక ఐఏఎఫ్‌కు చెందిన 259 సుఖోయ్-30 ఎంకేఐ యుద్ధ విమానాల్లో మొదటి దఫాలో 80 యుద్ధ విమానాలను రూ. 63 వేల కోట్లతో ఆధునీకరించడానికి ప్రధాని నేతృత్వంలోని భద్రతపై క్యాబినెట్ కమిటీ (సీసీఎస్) అనుమతి తెలిపింది. ఈ ఫైటర్లను ఆధునిక రాడార్లు, ఏవియానిక్స్, సుదూర రేంజ్ ఆయుధాలు, బహుళ సెన్సార్లతో ఆధునీకరించి, మరో 30 ఏళ్లపాటు పోరాడే సామర్థ్యానికి తగ్గట్లుగా తీర్చిదిద్దుతారు. వీటిని రష్యా సహకారంతో దేశీయంగా అభివృద్ధి చేస్తారు.

ఫ్రాన్స్‌లో ఇక మిలటరీ వాలంటీర్లు

» 18-19 ఏళ్ల యువత సైన్యంలో 10 నెలల పాటు పనిచేయాలి

వర్సేస్, నవంబరు 27: ఫ్రాన్స్‌లో ఇక నుంచి మిలటరీ వాలంటీర్ల వ్యవస్థను తీసుకురానున్నట్టు అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ వెల్లడించారు. యూరోప్ దేశాలకు రష్యా నుంచి ముప్పు ఉన్న నేపథ్యంలో ఫ్రాన్స్ సైన్యాన్ని బలోపేతం చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. 18-19 ఏళ్ల మధ్య ఉన్న యువత సైన్యంలో చేరి, 10 నెలల పాటు పని చేయాల్సి ఉంటుందని తెలిపారు. మిలటరీ యూనిఫారం ధరించి ప్రధాన భూ భాగంలోనూ, ఫ్రాన్స్ ఆధీనంలోని ఇతర ప్రాంతాల్లోనూ పనిచేయాల్సి ఉంటుందని చెప్పారు. విదేశాల్లో నిర్వహించే మిలటరీ ఆపరేషన్లకు మాత్రం పంపించబోమని స్పష్టం చేశారు. వర్సేస్ మిలటరీ బేస్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ వచ్చే ఏడాది వేసవిలో ఈ నూతన జాతీయ సేవా వ్యవస్థను ఏర్పాటు చేస్తామని తెలిపారు. దాన్ని క్రమేణా విస్తరిస్తామని తెలిపారు. తొలుత వచ్చే ఏడాది 3,000 మందిని వాలంటీర్లుగా తీసుకుంటామని చెప్పారు.

డ్రాగన్ రుణ 'వల'యంలో ప్రపంచం!

అమెరికా, రష్యా, ఆస్ట్రేలియా సహా పెద్ద దేశాల కంపెనీలకూ భారీగా రుణాలు

» 179 దేశాలకు అప్పులిచ్చిన చైనా ప్రభుత్వ ఆర్థిక సంస్థలు

» ఆ దేశాల్లోని కీలక రంగాల కంపెనీల్లో వాటాలు, పెత్తనం పెంచుకునే వ్యూహాలు



న్యూఢిల్లీ, నవంబరు 27: ప్రపంచం 'డ్రాగన్' రుణ వలయంలో చిక్కింది. అగ్రరాజ్యాలు సహా ప్రపంచంలోని 80శాతం దేశాల్లోని కంపెనీలకు చైనా బ్యాంకులు భారీ స్థాయిలో అప్పులు ఇచ్చాయి. ఈ రుణాలను అడ్డుపెట్టుకునే ఆ కంపెనీలను, తద్వారా దేశాలను చైనా ప్రభావితం చేస్తోంది. చైనా నుంచి రుణాలు తీసుకున్న దేశాల్లో అమెరికా టాప్‌లో ఉంది. రష్యా, ఆస్ట్రేలియా, వెనెజువెలా, పాకిస్థాన్ దేశాలు తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. అమెరికా వర్జీనియాలోని విలియం అండ్ మేరీ కాలేజీకి చెందిన పరిశోధక విభాగం 'ఎయిడ్ డేటా' తాజాగా విడుదల చేసిన నివేదిక ఈ వివరాలు వెల్లడించింది. సుమారు మూడేళ్లపాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న వివిధ ఆర్థిక సంస్థలు, ఇతర మార్గాల ద్వారా సమాచారాన్ని సేకరించి, క్రోడీకరించి.. 2000వ సంవత్సరం నుంచి 2023 మధ్య డేటాతో ఈ నివేదికను రూపొందించింది. అందులోని వివరాల ప్రకారం..

పెద్ద దేశాలకే ఇస్తూ.. ప్రభావితం చేస్తూ..

చైనా మొదట్లో పేద, అభివృద్ధి చెందుతున్న దేశాలకు భారీగా రుణాలు ఇచ్చేది. ఆయా దేశాలు, అక్కడి వనరులపై పెత్తనం చలాయించేది. కానీ 2000 సంవత్సరం నుంచి వ్యూహం మార్చి క్రమంగా సంపన్న దేశాలు, వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాలకు రుణాలను పెంచుతూ వచ్చింది. మొదట్లో పేద, మధ్యాదాయ దేశాలకే 90శాతం రుణాలు ఇవ్వగా.. ఇప్పుడు 75శాతానికి పైగా రుణాలు పెద్ద దేశాలకే ఇవ్వడం గమనార్హం. దీంతో ఆయా దేశాల్లోని సంస్థలను, వాటి ద్వారా ఆ దేశాలను తనకు అనుకూలంగా వ్యవహరించేలా లేదా తనపై ఎలాంటి చర్యలూ చేపట్టలేని విధంగా చైనా ప్రభావితం చేస్తోంది. ఉదాహరణకు చైనా ఇప్పటివరకు అమెరికాలోని 2,500 సంస్థలు, ప్రాజెక్టులకు రూ.18.1 లక్షల కోట్ల (202బిలియన్ డాలర్లు) రుణాలు ఇచ్చింది. 27దేశాల యూరోపియన్ యూనియన్ కూటమికి చెందిన 1,800 కంపెనీలు, ప్రాజెక్టులకు రూ.14.4లక్షల కోట్లు (161 బిలియన్ డాలర్లు) అప్పులు ఇచ్చింది. ఈ రుణాల్లో 95శాతానికిపైగా చైనా ప్రభుత్వ బ్యాంకులు, ఆర్థిక సంస్థలు ఇచ్చినవే. చైనా నుంచి సంపన్న దేశాలకు వెళ్తున్న రుణాల్లో చాలా వరకు కీలక మౌలిక సదుపాయాలు, సెమీ కండక్టర్ తయారీవంటి టెక్ కంపెనీలు, అరుదైన ఖనిజాలకు సంబంధించిన కంపెనీలు, ప్రాజెక్టులకే అందుతుండటం గమనార్హం. ఇందుకోసం షెల్ కంపెనీలు, అంతర్జాతీయ బ్యాంక్ సిండికేట్లను చైనా వినియోగించుకుంటోందని నివేదిక పేర్కొంది. మొత్తంగా ఆయా కంపెనీల్లో వాటాలు పెంచుకోవడం, వీలైతే చేజిక్కించుకోవడం ద్వారా సంపన్న దేశాల్లోని కీలక రంగాలపై చైనాపట్టు సాధిస్తోందని తెలిపింది.

- ప్రపంచంలో గుర్తింపు ఉన్న మొత్తం 217 దేశాలకుగాను 179 దేశాలకు చైనా ప్రభుత్వ ఆర్థిక సంస్థలు 196 లక్షల కోట్ల రుణాలు ఇచ్చాయి.
- 2023లో ప్రపంచంలో అత్యంత ఎక్కువగా రుణాలు ఇచ్చిన, తిరిగి వసూలు చేసుకున్న దేశం చైనాయే. ఆ ఏడాది చైనా వివిధ దేశాలకు కలిపి మొత్తం రూ.12.5 లక్షల కోట్లు (140 బిలియన్ డాలర్లు) రుణాలు ఇచ్చింది.
- నాటో, జీ7 వంటి కూటములు కూడా వివిధ దేశాలకు భారీగా రుణాలు ఇస్తున్నాయి. పశ్చిమ దేశాల్లోని చాలా ఆర్థిక సంస్థలు కొంత కాలం నుంచి చైనా ప్రభుత్వ ఆర్థిక సంస్థలతో కలిసి పనిచేస్తున్నాయి. చైనా నుంచి భారీగా రుణాలు తీసుకుని, ఇతర దేశాలకు అందిస్తున్నాయని 'ఎయిడ్‌డేటా' పేర్కొంది.
- చైనా నుంచి భారత కంపెనీలకు అందిన రూ. 1.6 లక్షల కోట్ల రుణాల్లో చాలా వరకు విద్యుత్, ఆర్థిక రంగాల్లోని కంపెనీలకే అందాయి.

చైనా నుంచి వివిధ దేశాలు తీసుకున్న అప్పులు (రూ.లలో)

దేశం	తీసుకున్న రుణాలు
అమెరికా	18.1 లక్షల కోట్లు
రష్యా	15.3 లక్షల కోట్లు
ఆస్ట్రేలియా	11.6 లక్షల కోట్లు
వెనెజువెలా	9.4 లక్షల కోట్లు
పాకిస్థాన్	6.6 లక్షల కోట్లు
బ్రెజిల్	5.7 లక్షల కోట్లు
ఇండోనేషియా	5.4 లక్షల కోట్లు
యూకే	5.3 లక్షల కోట్లు
స్విట్జర్లాండ్	3.6 లక్షల కోట్లు
అర్జెంటీనా	3.2 లక్షల కోట్లు
సింగపూర్	3.1 లక్షల కోట్లు
జర్మనీ	2.9 లక్షల కోట్లు
టర్కీ	2.9 లక్షల కోట్లు
భారత్	1.6 లక్షల కోట్లు

మృతదేహాల దిబ్బగా భవన సముదాయం

» హాంకాంగ్ అగ్ని ప్రమాద ఘటనలో 83కు పెరిగిన మృతుల సంఖ్య

» 300 మందికి పైగా ఆచూకీ గల్లంతు

హాంకాంగ్, నవంబరు 27: హాంకాంగ్‌లోని బహుళ అంతస్తుల భవన సముదాయంలో నెలకొన్న భారీ అగ్ని ప్రమాద ఘటనలో లారెన్స్ లీ అనే బాధితుడు వ్యక్తం చేసిన ఆవేదన ఇది. అగ్ని ప్రమాద ఘటనలో మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. వందల మంది ఆచూకీ తెలియకపోవడం మరింత ఆందోళన కలిగిస్తోంది. థాయ్ పో జిల్లాలోని న్యూ టెరిటరిస్ ఎనిమిది భారీ అపార్ట్‌మెంట్‌ల సముదాయంలో స్థానిక కాలమానం ప్రకారం బుధవారం మధ్యాహ్నం 2.50 గంటలకు మంటలు చెలరేగాయి. క్షణాల్లో ఏడు అపార్ట్‌మెంట్లకు అగ్ని కీలలు వ్యాపించాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 36 మంది మృతిచెందగా.. రెండోరోజు మృతుల సంఖ్య 83కు పెరిగింది. ఈ ప్రమాదంలో 70 మంది గాయపడ్డారు. మృతుల్లో ఒకరు, క్షతగాత్రుల్లో 10మంది అగ్నిమాపకదళానికి చెందిన వారు ఉన్నారు. ఈ భవన సముదాయంలోని 2వేల ఫ్లాట్లలో 4,800 మంది నివసిస్తున్నారు. ప్రమాదం సంభవించిన రాత్రే 900మందిని అపార్ట్‌మెంట్ల నుంచి సురక్షితంగా పునరావాస కేంద్రాలకు తరలించారు. కాగా భవన సముదాయంలోని 300 మందికిపైగా ఆచూకీ తెలియడం లేదు. ఒకవైపు మృతుల సంఖ్య పెరుగుతుండగా ప్రమాదం జరిగిన 24 గంటల తర్వాత ఓ అపార్ట్‌మెంట్ 16వ అంతస్తులోని ఫ్లాట్ నుంచి గురువారం సాయంత్రం ఓ వ్యక్తిని సహాయక సిబ్బంది ప్రాణాలతో బయటకు తీయడం గమనార్హం.



ట్యాపింగ్ ఆదేశాలను మీరే చేరవేసేవారా?

» నాటి సీఎం కేసీఆర్ ఏం చెప్పేవారు? మీరేం చేసేవారు?

» ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్ ఓఎస్డీ రాజశేఖర్‌రెడ్డిని విచారించిన సిట్

» టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు వాంగ్మూలం ఆధారంగా ప్రశ్నలు



హైదరాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ సీఎం కేసీఆర్ ఓఎస్డీ రాజశేఖర్‌రెడ్డిని సిట్ అధికారులు గురువారం విచారించారు. జూబ్లీహిల్స్ పోలీసుస్టేషన్‌లోని సిట్ ఆఫీసులో సుమారు రెండు గంటల పాటు వివిధ అంశాలపై ప్రశ్నించారు. ఈ కేసులో అరెస్టైన అప్పటి టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్‌రావు, విచారణ ఎదుర్కొంటున్న ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావులను ప్రశ్నించినప్పుడు వెలుగుచూసిన అంశాల ఆధారంగా రాజశేఖర్‌రెడ్డిని విచారించినట్లు సమాచారం. రాధాకిషన్‌రావు తన వాంగ్మూలంలో మాజీ సీఎం కేసీఆర్ పేరును పలుమార్లు పేర్కొన్న విషయం తెలిసిందే. తనకు సీఎం కార్యాలయం నుంచి ఆదేశాలు అందేవని, ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్‌రావు, ఆయన బృందం ఇచ్చే సూచనల మేరకు తాను బీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్న వారిపై నిఘా పెట్టేవాడినని ఆయన వాంగ్మూలంలో వెల్లడించారు. ఈ క్రమంలో సిట్ అధికారులు రాజశేఖర్‌రెడ్డిని వివిధ అంశాలపై ప్రశ్నించారు. "ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్‌రావు నియామకం నిబంధనల మేరకు జరిగిందా? మీ ద్వారానే ఫోన్ ట్యాపింగ్ చేయాల్సిన ఫోన్ నంబర్లు, లేదా వ్యక్తుల పేర్లు ఎస్ఐబీకి అందేవా? నాటి సీఎం కేసీఆర్‌తో అధికారులు నేరుగా మాట్లాడే అవకాశాలు తక్కువ కాబట్టి.. కేసీఆర్ ఆదేశాలను మీరే అధికారులకు చేరవేసేవారా? అధికారులు ఇచ్చిన సమాచారాన్ని కేసీఆర్‌కు మీరే అందించేవారా? నిబంధనల ప్రకారం సీఎం ఓఎస్డీగా ఉన్నవారు ఏవైనా ఆదేశాలుంటే ఆయా శాఖల ఉన్నతాధికారులకు చెప్పాల్సి ఉంటుంది. ఆ లెక్కన మీరు అప్పటి సీఎం కేసీఆర్ ఆదేశాలను నేరుగా నాటి డీజీపీ లేదా కమిషనర్‌కే చెప్పేవారా? లేక నేరుగా ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్‌రావుతో మాట్లాడేవారా?" అని సిట్ అధికారులు ఆరా తీసినట్టు సమాచారం. అయితే తాను కేవలం ఉద్యోగినేనని, నిబంధనల ప్రకారమే వ్యవహరించానని రాజశేఖరరెడ్డి బదులిచ్చినట్టు సమాచారం. ఇక ప్రభాకర్‌రావు నియమాకానికి సంబంధించిన జీవో, నోట్ ఫైల్ కోసం అధికారులు ఆరా తీసినట్టు తెలిసింది.

మీ జనాభా ఎంత?

» మీ కుటుంబానికి మూడు ఎంపీ పదవులెందుకు?

» కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌కు బీజేపీ నేత లక్ష్మణ్ సూటిప్రశ్న



హైదరాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిత్ నా ఆబాదీ.. ఉత్ నా హిస్సా. (ఎంత జనాభాకు అంత వాటా) ఇవ్వాలంటున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, ముందు తన సామాజికవర్గ జనాభా ఎంతో స్పష్టం చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ డిమాండ్ చేశారు. 'మీ కుటుంబ సభ్యులు ఎంతమంది? మీకు మూడు ఎంపీ పదవులు ఎందుకు?' అని నిలదీశారు. రూ. 200 కోట్లు ఖర్చుచేసి రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కులగణన కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా మారిందని విమర్శించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామంటూ బిల్లులు, ఆర్డినెన్సులు.. జీవోల పేరుతో బీసీలను మభ్యపెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం చివరికి వారిని వెన్నుపోటు పొడిచిందని మండిపడ్డారు. కాకా కలేల్కర్ కమిషన్ నివేదికను నెహ్రూ వ్యతిరేకించిన మాట వాస్తవం కాదా? అని సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ప్రశ్నించారు. మోసానికి ప్రతిరూపం కాంగ్రెస్ పార్టీ అని, కామారెడ్డి డిక్లరేషన్ పేరిట బీసీలను బురిడీ కొట్టించిందని ఆరోపించారు. అడుగడుగునా బీసీలను దగా చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని లక్ష్మణ్ దుయ్యబట్టారు. 1988లో ఎన్టీఆర్ బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే, కాంగ్రెస్ పార్టీ దానిని 17 శాతానికి పరిమితం చేసిందని మండిపడ్డారు. బీఆర్ఎస్ కూడా బీసీలను మోసం చేసిందని ఆరోపించారు. పార్టీ గుర్తులేకుండా జరుగుతున్న పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు పార్టీపరంగా 42 శాతం సీట్లు ఇస్తామని ఎవరిని మభ్యపెడుతున్నారని, డెడికేటెడ్ కమిషన్ నివేదికను ఎందుకు బహిర్గతం చేయడం లేదని సీఎం రేవంత్‌ను ప్రశ్నించారు. 2026లో కేంద్ర హోంమంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో జరిగే కులగణన ద్వారా మాత్రమే బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. కులగణన చేయడానికి ఏ రాష్ట్ర ప్రభుత్వానికీ అధికారం లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతున్నవన్నీ కాకి లెక్కలేనని విమర్శించారు. బీసీ రిజర్వేషన్ల పెంపు అంశాన్ని 9వ షెడ్యూల్‌లో చేర్చడం శాశ్వత పరిష్కారం కాదన్నారు. బీసీలకు జరుగుతున్న అన్యాయం తెలిసి కూడా టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ఆత్మవంచన చేసుకుంటున్నారని వ్యాఖ్యానించారు.

పిల్లల ఎదుగుదలపై వాతావరణ ప్రభావం!

» బరువు తక్కువగా ఉండే అవకాశం 25% అధికం

న్యూఢిల్లీ, నవంబరు 27: వాతావరణ మార్పులు పిల్లల ఎదుగుదలపై ప్రభావం చూపుతాయని తాజా అధ్యయనం గుర్తించింది. సాధారణ ప్రాంతాల్లో నివసించే పిల్లలతో పోలిస్తే.. తుఫానులు, వరదలు, వేడిగాలులు వంటి తీవ్రమైన వాతావరణ ప్రభావాలకు గురయ్యే జిల్లాల్లో నివసిస్తున్న పిల్లలు బరువు తక్కువగా ఉండే అవకాశం 25 శాతం అధికమని ఈ అధ్యయనం గుర్తించింది. వాతావరణ మార్పులకు గురయ్యే జిల్లాలు ఆరోగ్య లక్ష్యాలను సాధించడంలో వెనకబడ్డాయని ఢిల్లీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎకనామిక్ గ్రోత్ పరిశోధకులు నిర్వహించిన అధ్యయనంలో గుర్తించారు. ఈ అధ్యయనం 'పీఎల్‌వోఎస్ జర్నల్‌'లో ప్రచురితమైంది. తీవ్రమైన వాతావరణ మార్పుల వల్ల కలిగే ప్రమాదాలు సుస్థిరాభివృద్ధి లక్ష్యాల (ఎస్‌డీజీ)ను దెబ్బతీస్తాయని ఈ అధ్యయనం పేర్కొంది.

పీపుల్స్‌వార్ మాజీ నేత సిద్దయ్య దారుణ హత్య

» జగిత్యాలలోని అగ్రహారం గుట్టల్లో ఘటన

» యూ-ట్యూబ్ ఇంటర్వ్యూ పేరిట ఆహ్వానం

» ఆపై మందు తాగించి.. బండతో మోదీ హత్య

» జగిత్యాల పోలీస్ స్టేషన్‌లో నిందితుడు సంతోష్ లొంగుబాటు

వేములవాడ టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తన తండ్రి హత్యకు ప్రతీకారంగా పీపుల్స్‌వార్ మాజీ దళ కమాండర్ సిద్దయ్య అలియాస్ బాపురెడ్డిని యూ-ట్యూబ్ ఇంటర్వ్యూ పేరిట జగిత్యాలలోని అగ్రహారం గుట్టల్లోకి పిలిచిన సంతోష్ అనే వ్యక్తి దారుణ హత్య చేసిన ఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. హత్య చేసిన తర్వాత నిందితుడు నేరుగా జగిత్యాల పోలీస్ స్టేషన్‌కెళ్లి లొంగిపోయాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాలలో పీపుల్స్‌వార్ దళ కమాండర్‌గా ఉన్న సిద్దయ్య అలియాస్ బాపురెడ్డి అలియాస్ బల్లెపు నర్సయ్య.. 1997లో సంతోష్ తండ్రిని హత్య చేశాడు. తర్వాత 20 ఏళ్ల క్రితం పోలీసులకు లొంగిపోయినప్పటి నుంచి తంగళ్లపల్లి మండలం గండి లచ్చక్కపేటలో వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్న సిద్దయ్య.. ఇటీవల ఓ యూ-ట్యూబ్ చానెల్‌కిచ్చిన ఇంటర్వ్యూలో పీపుల్స్‌వార్ దళ నాయకుడిగా తన కార్యకలాపాలను వెల్లడిస్తూ 1997లో జగిత్యాలలో సంతోష్ తండ్రిని మట్టుపెట్టిన సంగతి చెప్పాడు. ఈ వీడియో చూసిన సంతోష్ ప్రతీకారం తీర్చుకోవాలని తలపోశాడు. గురువారం ఇంటర్వ్యూ పేరిట అగ్రహారం గుట్టలపైకి సిద్దయ్యను సంతోష్ పిలిపించి మద్యం తాగించాడు. అటుపై బండతో మోది సిద్దయ్య అలియాస్ బాపురెడ్డిని దారుణంగా హత్య చేశాడని తెలుస్తోంది. ఆ తర్వాత నేరుగా జగిత్యాల పోలీస్ స్టేషన్‌లో సంతోష్ లొంగిపోయాడు. సిద్దయ్య హత్య సమాచారాన్ని వేములవాడ పోలీసులకు జగిత్యాల పోలీసులు చెప్పారు. వేములవాడ సీఐ వీర ప్రసాద్, ఎస్ఐ రామ్మోహన్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఖర్చు ఎక్కువైనా కట్టాల్సిందే!

(మొదటి పేజీ తరువాయి)

థర్మల్ విద్యుత్ దేశ ఉత్పాదక సామర్థ్యంలోకి చేరకపోతే గ్రిడ్ నిర్వహణ ప్రశ్నార్థకంగా మారుతుందని హెచ్చరించింది.

ఏటేటా పెరుగుతున్న థర్మల్ వ్యయం

తెలంగాణ ప్రభుత్వం నిర్మిస్తున్న 4 వేల మెగావాట్ల సామర్థ్యంగల యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంటులో 2014లో ఒక మెగావాట్ నిర్మాణ అంచనా వ్యయం రూ.4.25 కోట్లు. 2017 నాటికి అది రూ.7.49 కోట్లకు చేరింది. ప్రస్తుతం నిర్మాణం పూర్తయ్యే నాటికి మెగావాట్‌కు రూ.10 కోట్లు కానుంది. రామగుండంలో నిర్మిస్తున్న 800 మెగావాట్ల సూపర్ థర్మల్ క్రిటికల్ విద్యుత్ కేంద్రంలో ఒక మెగావాట్‌కు రూ.14.6 కోట్లు ఖర్చవుతుందని ఎన్టీపీసీ అంచనా వేయగా, రూ.13.6 కోట్లు అవుతుందని జెన్‌కో లెక్కలు వేసింది. ఆర్థిక, పర్యావరణ కోణంలో చూస్తే థర్మల్ పవర్ ప్లాంట్లు ఏమాత్రం మంచివి కావని చెబుతున్నా.. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా వాటి ఏర్పాటు అనివార్యమని సీఈఏ చెబుతోంది. సౌర విద్యుత్ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకే ఉంటుంది. పవన విద్యుత్ గాలి ఉంటే తప్ప లభించదు. జలవిద్యుత్ వానాకాలంలోనే అధికంగా అందుబాటులో ఉంటుంది. ఇక పంప్ స్టోరేజీ కూడా నిర్ణీత సమయానికే దొరుకుతుంది. థర్మల్ విద్యుత్ మాత్రం కచ్చితంగా 24 గంటలపాటు లభిస్తుంది. తెలంగాణలో విద్యుత్ డిమాండ్ అనూహ్యంగా పెరుగుతోంది. 2014-15లో రోజుకు 6,755 మెగావాట్ల డిమాండ్ ఉండగా, ప్రస్తుతం 17,162 మెగావాట్లకు చేరింది. 2034-35 నాటికి 31,809 మెగావాట్లకు చేరుతుందని సీఈఏ అంచనా వేసింది. ఈ నేపథ్యంలో మొత్తం విద్యుత్ ఉత్పత్తిలో కనీసం 40 శాతం థర్మల్ విద్యుత్ లేకపోతే గ్రిడ్‌ను కాపాడుకోవడం అసాధ్యమని నిపుణులు చెబుతున్నారు. గత ఏప్రిల్ 28వ తేదీన యూరప్‌లో గ్రిడ్ కుప్పకూలి స్పెయిన్, పోర్చుగల్, దక్షిణ ఫ్రాన్స్‌లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మళ్లీ గ్రిడ్ పునరుద్ధరణకు 12-16 గంటల సమయం పట్టింది. ఇలాంటి అనుభవాల దృష్ట్యా థర్మల్ విద్యుత్‌కు ప్రోత్సాహం ఇవ్వక తప్పదని అంటున్నారు.



రామగుండం, పాల్వంచ ప్లాంట్లు కీలకమే..

రాష్ట్రంలోని రామగుండం, పాల్వంచలో నిర్మిస్తున్నవి పిట్‌హెడ్ (బొగ్గు గని ఉపరితల భాగం) ప్లాంట్లే. దేశంలో పిట్‌హెడ్ ప్లాంట్ల వల్లే తక్కువ ధరకు కరెంట్ లభిస్తుందని నిపుణులు చెబుతున్నారు. పాల్వంచలో ఇంకా 800 మెగావాట్ల ప్లాంటు నిర్మాణానికి అవకాశం ఉంది. ఇక్కడ ప్రస్తుతం 1,800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 4 యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. గతంలో 30 ఏళ్ల దాటిన ప్లాంట్లను మూసివేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించటంతో పాల్వంచలో 720 మెగావాట్ల సామర్థ్యంగల యూనిట్లను మూసేశారు. కేటీపీఎస్‌లో మూసేసిన కేంద్రాలన్నీ 40 ఏళ్లపాటు విద్యుత్‌ను ఉత్పత్తి చేశాయి. ఒక కేంద్రం 53 ఏళ్ల పాటు నడిచింది. రామగుండంలో ఆర్‌టీఎస్-బీ థర్మల్ కేంద్రాన్ని గతంలోనే మూసేశారు. రామగుండం విద్యుత్ కేంద్రం నిర్మాణానికి రూ.10,893.05 కోట్లు ఖర్చవుతుందని తెలంగాణ జెన్‌కో అంచనా వేసింది. ఈ లెక్కన ఒక మెగావాట్‌కు రూ.13.62 కోట్లు వ్యయం అవుతుంది. ఈ మొత్తం వ్యయంలో 75 శాతాన్ని పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ)/ రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ (ఆర్‌ఈసీ) నుంచి రుణంగా, మరో రూ.2,723.26 కోట్లను ప్రభుత్వం ఈక్విటీ గా సమకూర్చాల్సి ఉంటుంది. ఈ కేంద్రం అందుబాటులోకి వస్తే యూనిట్ విద్యుత్ రూ.7.97లకు లభిస్తుందని అంచనా వేస్తున్నారు. ఈ ప్లాంటుకు ఏటా 3.053 మిలియన్ మెట్రిక్ టన్నుల బొగ్గు అవసరం ఉంటుందని లెక్కకట్టారు. రానున్న రోజుల్లో ఏర్పడే విద్యుత్ డిమాండ్ తీర్చాలంటే ఈ కేంద్రం నిర్మాణం విధిగా చేపట్టాల్సిందేనని జెన్‌కో ప్రభుత్వానికి గుర్తు చేసింది.

సౌర, థర్మల్ కలిస్తే తక్కువ ధరకే విద్యుత్..

ప్రస్తుతం దేశంలో సౌర విద్యుత్ ఒక యూనిట్ రూ.2.40 నుంచి రూ.2.90లకు లభిస్తోంది. థర్మల్ విద్యుత్ రూ.4 నుంచి రూ.6లకు దొరుకుతోంది. వినియోగంలో 60 శాతాన్ని సోలార్/పవన విద్యుత్‌తో తీర్చి... మిగిలిన 40 శాతాన్ని విధిగా థర్మల్ విద్యుత్‌ను తీసుకుంటే విద్యుత్ యూనిట్ సగటు ధరను తగ్గించుకోవచ్చని నిపుణులు అంటున్నారు. రాష్ట్ర అవసరాలు, గ్రిడ్ సుస్థిరత కోసం విధిగా జెన్‌కో ఆధ్వర్యంలో ప్లాంట్లు నిర్మించాలని సూచిస్తున్నారు.

చెల్లింపుల సమస్యకూ చెక్..

లేట్ పేమెంట్ సర్‌చార్జీ (ఎల్‌పీఎస్) నిబంధనల ప్రకారం విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు చేసుకున్న డిస్కమ్‌లు చెల్లింపుల్లో ఆలస్యం చేస్తే, వాటికి విద్యుత్ సరఫరా నిలిపివేసే అధికారం ఎన్టీపీసీకి ఉంది. అదే జెన్‌కోలు ప్లాంట్లు నిర్మిస్తే వెసులుబాటును బట్టి చెల్లింపులు చేసే అవకాశం ఉంటుంది. గత పదేళ్లలో రాష్ట్రానికి ఎన్టీపీసీ విద్యుత్ సరఫరాను నిలిపివేసిన సందర్భాలు ఉన్నాయి. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో విద్యుత్ కొనుగోలు చేయాలంటే ముందుగానే డబ్బు డిపాజిట్ చేయాలి. ఇలాంటి ఇబ్బందులు ఉండరాదంటే జెన్‌కోనే స్వయంగా విద్యుత్ కేంద్రాలు నిర్మించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

జడ్చర్ల పోలీస్‌స్టేషన్లో కాంగ్రెస్ నేతల హల్‌చల్

» ఎస్ఐ, కానిస్టేబుళ్లపై దాడికి యత్నం

జడ్చర్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఓ రోడ్డు ప్రమాదంలో పరిహారం విషయమై కాంగ్రెస్ పార్టీ భూత్పూర్ మండల నేతలు మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పోలీస్‌స్టేషన్లో హల్‌చల్ చేశారు. ఎస్ఐ, కానిస్టేబుళ్లతో వాగ్వాదానికి దిగి, దాడికి యత్నించారు. ఈ నెల 16న భూత్పూర్ మండలానికి చెందిన చెన్నకేశవులు కారును ఓ ట్యాంకర్ ఢీకొనడంతో కారు దెబ్బతింది. ఘటనపై జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు కాగా, పరిహారంపై ఇరువర్గాలు మాట్లాడుకోవాలని పోలీసులు సూచించారు. కొత్త కారు ఇవ్వాలని, లేదా రూ.4లక్షల పరిహారం ఇవ్వాలని కారు యజమానితో పాటు కాంగ్రెస్ నేతలు ట్యాంకర్ యజమానిపై ఒత్తిడి చేశారు. రూ. 50 వేలు ఇవ్వగలనని, ఇన్సూరెన్సు క్లైమ్ చేసుకోవాలని ట్యాంకరు యజమాని స్పష్టం చేశారు. దీంతో కాంగ్రెస్ భూత్పూర్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి గురువారం జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఎస్ఐలు మల్లేశ్, జయప్రసాద్, కానిస్టేబుళ్లు భీమయ్య, లక్ష్మప్పలతో దురుసుగా వ్యవహరించి దాడికి యత్నించారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి స్టేషన్‌కు చేరుకుని పరిస్థితి అదుపులోకి తెచ్చారు. ఘటనపై విచారణ జరపాలని ఎమ్మెల్యే.. డీఎస్పీకి సూచించి వెళ్లిపోయారు. విచారణ జరిపి ఏస్పీకి నివేదిక అందజేస్తామని డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ కమలాకర్ తెలిపారు.

శ్రీలక్ష్మిపై కేసు కొట్టివేయొద్దు

» నేరం విచారణలోనే తేలుతుంది: హైకోర్టులో సీబీఐ వాదన

హైదరాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఏపీ మాజీ సీఎం జగన్ అక్రమాస్తుల వ్యవహారంలో భాగమైన పెన్నా సిమెంట్ కేసులో నిందితురాలిగా ఉన్న సీనియర్ ఐఏఎస్ శ్రీలక్ష్మిపై కేసు కొట్టివేయవద్దని హైకోర్టుకు సీబీఐ విన్నవించింది. ఆమె నేరం చేశారా? లేదా? అనే అంశం సీబీఐ కోర్టులో జరిగే విచారణలోనే తేలుతుందని, అందువల్ల ఈ దశలో కేసు కొట్టివేయరాదని కోరింది. శ్రీలక్ష్మి దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ ధర్మాసనం గురువారం మరోసారి విచారణ చేపట్టింది. సీబీఐ తరఫున స్పెషల్ పీపీ శ్రీనివాస్ కాపాటి వాదనలు వినిపిస్తూ పిటిషనర్ కం నిందితురాలిని ప్రాసిక్యూట్ చేయడానికి కేంద్రం (డీవోపీటీ) అనుమతి మంజూరు చేసిందని గుర్తు చేశారు. డీవోపీటీ అనుమతి ఇచ్చిందా? లేదా? అనే అంశం ముఖ్యమని, ఎప్పుడు అనుమతి ఇచ్చారనేది సమస్య కాదన్నారు. ఈ కేసులో లంచం డిమాండ్.. స్వీకరణ అన్న అంశం లేదని ఆమె అంటున్నారని, అది ఇక్కడ అప్రస్తుతమని చెప్పారు. ఈ కేసు నేరుగా లంచం తీసుకోవడానికి సం బంధించినది కాదని, నేరపూరిత దుష్ప్రవర్తనకు సంబంధించినదన్నారు. శ్రీలక్ష్మి తరఫున సీనియర్ న్యాయవాది వివేక్‌రెడ్డి వాదిస్తూ ఈ కేసులో చాలా లోపాలు ఉన్నాయని చెప్పారు. పాత నేరానికి కొత్తగా వచ్చిన అవినీతి నిరోధక సవరణ చట్టం ప్రకారం డీవోపీటీ అనుమతి ఇవ్వడం చెల్లదని పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. తదుపరి విచారణను డిసెంబర్ 4కు వాయిదా వేసింది.

అధికారుల చుట్టూ తిరిగేకన్నా.. చావే మేలు

» కలెక్టర్ ఆదేశించినా సమస్య పరిష్కారం కాలేదు

» వికారాబాద్ కలెక్టరేట్ ప్రధాన గేటుకు ఉరేసుకునేందుకు యువ రైతు యత్నం



రైతు శ్రీనివాస్

వికారాబాద్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): "రైతుగా పుట్టి ప్రభుత్వ అధికారుల చుట్టూ తిరగడం కన్నా.. చావే మేలు. రైతునైన నాకు అడుగడుగునా కష్టాలే. దేశానికి రైతే వెన్నెముక అంటారు. కానీ ఆ రైతు కష్టాలను ఎవరూ లెక్కచేయరు, పట్టించుకోరు." అని ఓ యువ రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. అధికారుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా.. తన సమస్య పరిష్కారం కావడం లేదని వికారాబాద్ కలెక్టరేట్ ప్రధాన గేటు వద్ద ఉరేసుకునేందుకు యత్నించాడు. గమనించిన పోలీసులు అతడిని అడ్డుకున్నారు. తన చావుకు కొడంగల్ ఎఫ్ఆర్వో, డీఎఫ్‌వోలే కారణని పేర్కొంటూ బాధితుడు లేఖ రాశాడు. తన 24 గుంటల భూమిని సర్వే చేసి ఇవ్వాలని అటవీ అధికారుల చుట్టూ తిరుగుతున్నానని కొడంగల్ నియోజకవర్గం చిట్లపల్లికి చెందిన శ్రీనివాస్ తెలిపాడు. ఏడాదిన్నరగా మొర పెట్టుకుంటున్నా పట్టించుకోవడం లేదని చెప్పాడు. కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదేశించినా సమస్యను పరిష్కరించడం లేదని వాపోయాడు. సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గంలోనే తనకు న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. తనకు భూమి ఉన్నట్టు రెవెన్యూ రికార్డు ఉందని, అటవీ శాఖ నుంచే ఇబ్బంది ఉందన్నారు. కార్యాలయాల చుట్టూ తిరిగి విసిగిపోయాని, ఇప్పటి వరకు 11 సార్లు కలెక్టరేట్‌కు వచ్చానని పేర్కొన్నారు. తన వద్ద చార్జీలకు డబ్బులేక అప్పు చేసి వస్తున్నానని శ్రీనివాస్ వాపోయాడు.

ఇకపై ఫీజు కడితేనే గ్రేస్ మార్కులు!

» జేఎన్‌టీయూలో కొత్త రకం దోపిడీ

» విద్యార్థులపై ఏటా రూ.4 కోట్ల భారం

హైదరాబాద్ సిటీ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ పరీక్షల విభాగంలో కొత్త రకం దోపిడీకి రంగం సిద్ధమైందా అంటే.. అవుననే అంటున్నాయి విద్యార్థి సంఘాలు.. విద్యార్థులకు ఉచితంగా అందే సేవలకు ప్రాసెసింగ్ ఫీజుల పేరిట గతంలో ఎన్నడూ లేని విధంగా పెనుభారం మోపుతున్న వర్సిటీ ఉన్నతాధికారుల తీరును తీవ్రంగా ఆక్షేపిస్తున్నాయి. తాజాగా డబ్బులిస్తేనే గ్రేస్ మార్కులు వేస్తామంటూ జేఎన్‌టీయూ పరీక్షల విభాగం సర్క్యులర్ జారీ చేసింది. యూనివర్సిటీ ఏర్పడినప్పటి నుంచి రుసుము లేకుండానే.. అర్హులైన విద్యార్థుల వినతి మేరకు గ్రేస్ మార్కులను కలిపి డిగ్రీలు జారీ చేసేవారు. అయితే, ఇకపై రూ.2 వేలు చెల్లించని పక్షంలో సదరు విద్యార్థి గ్రేస్ మార్కులకు అర్హుడైనప్పటికీ, డిగ్రీ పట్టా ఇచ్చే ప్రసక్తే లేదు. డిసెంబరు 1 నుంచి గ్రేస్ మార్కులు కావాలన్నా, సబ్జెక్టుల మినహాయింపు కావాలన్నా ఒక్కో విద్యార్థి రూ.2 వేలు చొప్పున చెల్లించాల్సిందేనని వర్సిటీ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఏటా సుమారు 20 వేల మంది బీటెక్, బీఫార్మసీ, మేనేజ్‌మెంట్ తదితర కోర్సులు చదివిన విద్యార్థులు గ్రేస్ మార్కులు, సబ్జెక్టుల మినహాయింపునకు దరఖాస్తు చేసుకుంటారు. ఆయా సేవలకు ఒక్కో విద్యార్థి నుంచి రూ.2 వేలు ఫీజును వసూలు చేయాలని జేఎన్‌టీయూ నిర్ణయించడంతో వారిపై ఏటా రూ.4 కోట్ల భారం పడుతుందని అంచనా. ఇప్పటికే కామన్ సర్వీసు ఫీజు పేరిట రూ.వేలకు వేలు వసూలు చేస్తున్న జేఎన్‌టీయూ అధికారులు, సబ్జెక్టుల మినహాయింపు, ఉదారంగా ఇచ్చే గ్రేస్ మార్కులకు డబ్బు చెల్లించాలనడం దుర్మార్గమని స్టూడెంట్ ప్రొటెక్షన్ ఫోరం కన్వీనర్ జవ్వాజి దిలీప్ మండిపడ్డారు. కొత్తగా తెచ్చిన ప్రాసెసింగ్ ఫీజును రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

పని పెరగడంతో ఫీజులు తప్పలేదు..

గ్రేస్ మార్కులు, సబ్జెక్టుల మినహాయింపు సేవల కోసం రోజూ వందల సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నాయని.. పరీక్షల విభాగంలో పని పెరిగిందని జేఎన్‌టీయూ పరీక్షల విభాగం డైరెక్టర్ కృష్ణమోహనరావు అన్నారు. దీంతో ఆ మేర ఉద్యోగులను పెంచి వారికి వేతనాలు చెల్లిస్తుండటంతోనే కొత్త ఫీజులు వసూలు చేయాలని నిర్ణయించినట్లు వివరించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మళ్లీ శాంతి దౌత్యాలు

రేపోమాపో ఉక్రెయిన్ యుద్ధం ఆగిపోతుందంటూ మళ్ళీ హడావుడి మొదలైంది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తిరిగి తీవ్రంగా శాంతి ప్రయత్నాలు ఆరంభించారు. ట్రంప్ విరచిత ఒప్పందానికి ఇప్పటికే ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సరేనన్నారనీ, రష్యా అధినేత పుతిన్‌కూడా తలూపారని ప్రచారం జరుగుతోంది. చర్చలు జరపడానికి అభ్యంతరం అక్కరలేదని అంటూనే, ఉక్రెయిన్ ఏమాత్రం తలెగరేసినా యుద్ధక్షేత్రంలో జవాబు చెప్పడానికి తాను సర్వసన్నద్ధంగా ఉంటానని పుతిన్ అంటున్నారు. ట్రంప్ మధ్యవర్తిత్వంలో, మార్గదర్శకత్వంలో తయారైన శాంతిముసాయిదా ఉభయపక్షాల మధ్య చర్చలకు ఉపకరిస్తుందే తప్ప, అదే పునాది కాబోదని కూడా పుతిన్ అంటున్నారు. అక్రమంగా ఉక్రెయిన్ అధ్యక్షుడైన జెలెన్‌స్కీతో ఒకవేళ తాను ఒప్పందం కుదుర్చుకుంటే అది సక్రమమెలా అవుతుందని కూడా పుతిన్ అడుగుతున్నారు. గతంలో శ్వేతసౌధంలో ఇదేవ్యాఖ్యతో అవమానించిన జెలెన్‌స్కీనే ఈమారు ట్రంప్ శాంతిసాధనకోసం ఎక్కువగా నమ్ముకున్నారు.

రేపోమాపో యుద్ధం ఆగుతుందన్న స్థాయిలో ట్రంప్ వ్యాఖ్యలు ఉంటాయి. పుతిన్ మాత్రం ఎప్పటిలాగానే చిరునవ్వుతోనే తాను అన్నదీ, అనుకున్నదే చేస్తారు. ఉక్రెయిన్ బలగాలు తాము ఉన్న, తమ అధీనంలో ఉన్న ప్రాంతాలను విడిచిపెట్టిపోతేనే యుద్ధం ఆగుతుందంటున్నారు పుతిన్. యుద్ధక్షేత్రంలో రష్యా సాధించిన విజయాలు, రేపటిరోజుల్లో దాని ప్రయోజనాల పరిరక్షణ పునాదిగానే ఒప్పందం ఉండాలన్నారు ఆయన. ఒప్పందం కుదరకపోతే ఎంతకాలమైనా చక్కగా యుద్ధం చేసుకుంటానని ఆ వ్యాఖ్యల సారాంశం. ట్రంప్ కొత్త ప్రణాళికకు ఉక్రెయిన్ అంగీకరించిందనీ, ఏవో కొన్ని చిన్నచిన్న అంశాలు తేలడమే మిగిలిందని అమెరికన్ మీడియా అంటోంది. అమెరికాతో చర్చలు జరుగుతున్నాయని, ట్రంప్ కృషి అభినందనీయమైదని జెలెన్‌స్కీ కృతజ్ఞతలు కూడా చెప్పారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో అమెరికా, రష్యా బృందాల మధ్య చర్చలు విజయవంతమైనాయని, ముసాయిదాలో ఉన్న కొన్ని అంశాలమీద ఉక్రెయిన్ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకొని మార్పుచేర్పులు కూడా జరిగాయనీ వార్తలు వచ్చాయి. వ్యవహారం ముందుకు కదులుతోందని అనుకుంటున్న తరుణంలో ఒక వార్తాసంస్థ వదిలిన కథనం శాంతిప్రణాళికమీద కొత్త వివాదాన్ని రేపింది. ట్రంప్ ప్రతిపాదిత 28 పాయింట్ల ప్రణాళిక సృష్టికర్త రష్యా అనీ, పుతిన్ సన్నిహితుడైన కిరిల్ దిమిత్రివ్ దీని రచయితనీ ఆ కథనం సారాంశం. ఉక్రెయిన్‌తో యుద్ధం ఆపాలంటే ఈ షరతులకు అంగీకరించాల్సిందేనంటూ అక్టోబర్‌లో అమెరికాకు రష్యా అందించినపత్రంలో ఉన్నవే ఈ ప్రణాళికలో చేరాయన్న ఆ కథనాన్ని అమెరికా ఖండించినప్పటికీ, ముసాయిదా పూర్తిగా రష్యాకు అనుకూలంగా ఉన్నదన్న యూరప్ దేశాల విమర్శల నేపథ్యంలో, ఓ తొమ్మిది అంశాలనైతే అందులోనుంచి తొలగించిందట. అయినాకూడా ఇంకా అది రష్యా పక్షానే తూగుతోందని, దానికే తలూపాలంటూ ఉక్రెయిన్ అధ్యక్షుడిని ట్రంప్ ఒత్తిడిచేస్తున్నారని వార్తలు వస్తున్నాయి.

ఉక్రెయిన్ మిలటరీ గుప్పిట్లో ఉన్న చిన్నాచితకా ప్రదేశాలతో సహా మొత్తం డాన్బాస్ ప్రాంతాన్ని రష్యాకు వదులుకోవడం ఈ ప్రణాళికలో ప్రధానం. ఉక్రెయిన్ సైనికబలం కూడా గతంలో మాదిరిగా కాక పరిమితికి లోబడి ఉంటుంది. లాంగ్‌రేంజ్ మిసైల్స్ వంటి మారణాయుధాలు ఇకమీదట ఉక్రెయిన్ కొనకూడదు, వాడకూడదు. అన్నింటికంటే ముఖ్యంగా, ఎట్టిపరిస్థితుల్లోనూ ఉక్రెయిన్ నాటోలో చేరకూడదు. తదనుగుణంగా ఆ దేశం రాజ్యాంగాన్ని సవరించుకోవాలి, అంతర్జాతీయ సమాజానికి హామీ పడాలి. యుద్ధం మొదలవడానికి అసలు కారణం ఇదే కనుక రష్యా ఈ విషయంలో పట్టుదలపట్టడంలో ఆశ్చర్యమేమీ లేదు. మూడుదశాబ్దాల క్రితం ఇచ్చిన హామీని వమ్ముచేస్తూ నాటో అతివేగంగా తన చుట్టూ విస్తరించడం రష్యాకు అభద్రతను పెంచింది, అవమానం కలిగించింది. ఉక్రెయిన్ అధ్యక్షుడిగా జెలెన్‌స్కీ రాక, పశ్చిమదేశాల తోడ్పాటుతో అతడి వీరంగాలు ఒకదశదాటి సహించలేక రష్యా కయ్యానికి కాలుదువ్వింది. ఇకపై విస్తరించనని నాటో మాట ఇస్తే, రష్యా కూడా అందరి క్షేమానికీ హామీ పడుతుందని పుతిన్ అంటున్నారు. యుద్ధక్షేత్రంలో సాధించిన విజయాలను నిలుపుకోవడంతోపాటు, భవిష్యత్తులో పశ్చిమదేశాలనుంచి తనకు ఏ ప్రమాదమూ ఉండదన్న భరోసా ఏర్పడినప్పుడే రష్యా ఏ ఒప్పందానికైనా సిద్ధపడుతుంది. ఈ విషయంలో ట్రంప్ ముసాయిదా రష్యా పక్షాన ఎంతమేరకు తూగిందన్నది ప్రధానం.


తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన పథకాలు బీసీ వర్గాల పిల్లలకు జీవితంలో ఎవరితోనైనా సమానంగా పోటీ చేసే అవకాశాన్ని కల్పిస్తాయి. కులం ఎవరి కలలకు అడ్డురాకూడదని మా ప్రభుత్వం అభిమతం. పూలే అందించిన స్ఫూర్తితో మనమంతా విద్యా విప్లవంలో భాగస్వాములమై ఆయన ఆశయాలను కొనసాగిద్దాం.

'విద్యా వెలుగుల'తోనే సామాజిక సమానత్వం

"వేయి ఏళ్ల చీకటిని ఓ దీపం పారద్రోలి వేయగలదు." తెలంగాణ మట్టిలో శతాబ్దాలుగా అణగారిన వర్గాలు ఈ మాటను నమ్మి బ్రతికాయి. ఆ దీపం పేరు 'విద్య'. కానీ ఆ వెలుగును అందుకోవడం ఎంత కఠినమో మన సామాజిక చరిత్ర చెబుతున్నది. కులం పేరుతో అణచివేత, వివక్ష, పేదరికం... ఇవన్నీ తరతరాలుగా బడుగు, బలహీనవర్గాల జీవితాల్లో చెప్పలేనంత గాయాలు మిగిల్చాయి. వీటన్నిటికీ విరుగుడుగా మహాత్మా జ్యోతిరావ్ పూలే చూపిన మార్గమే యథార్థ విముక్తి– "ఎడ్యుకేషన్ ఈజ్ ది ఓన్లీ లిబరేషన్".

ఒకే సమాజంలో, కొందరు ఆకాశాన్ని అందుకునే అవకాశాలతో జీవిస్తుంటే, మరికొందరు కులం అనే కటకటాల్లో చిక్కుకుని, వెనుకబాటు గోడల మధ్య జీవితాన్ని గడిపేస్తున్నారు. శతాబ్దాలుగా జరిగిన ఈ అన్యాయాన్ని చూసి, తన జీవితాన్నే పణంగా పెట్టి పోరాడిన మహనీయుడు, భారత తొలి సామాజిక సంఘసంస్కర్త మహాత్మా జ్యోతిరావుపూలే. నవంబర్ 28న ఆయన వర్ధంతి. ఈ సందర్భంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, అణగారిన వర్గాలు, పేదలంతా పూలే సమాజానికి అందించిన సేవలను స్మరించుకొని, ఆయన ఆశయ సాధన దిశగా మరింత ముందుకువెళ్లాల్సిన అవసరం ఉంది. "కుల అణచివేతను చెరిపేసే దిశగా– విద్యా వెలుగులతో బీసీ సంక్షేమానికి కొత్త దిశ"... ఇది కేవలం మాటలు కాదు, ఒక సామాజిక విప్లవానికి రూపకల్పన! ఈ సందేశం చదివిన ప్రతి ఒక్కరూ, వారిలోని అసమానతలపై ఆలోచించకుండా ఉండలేరు. ఎందుకంటే, ఇది మన సమాజంలో దాగిన గాయాలను తెరిచి, విద్య అనే మందును పూస్తుంది.

తరతరాలుగా కులం పేరుతో బడుగు, బలహీన వర్గాలు అణచివేతకు గురవుతున్నాయి. వెనుకబాటు, వివక్ష వారి జీవితాల్లో చేదు అనుభవాలుగా మారిపోయాయి. ఈ వర్గాల శ్రమతో దేశం ముందుకు దూసుకెళ్తున్నా, అభివృద్ధి ఫలాలు మాత్రం వారి దరిచేరడం లేదు. ఇది ఎంతో బాధాకరం. మహాత్మా పూలే వర్ధంతి సందర్భంగా మనందరం ఈ అన్యాయాన్ని సమూలంగా అంతం చేయాలనే ధ్యేయాన్ని కలిగివుండాలి. ప్రతి వెనుకబడిన కుటుంబానికి గౌరవం, అవకాశాలు, హక్కులు– ముఖ్యంగా విద్య– అందేలా చేయడం తమ జీవిత లక్ష్యమని ఆయన తెలిపారు. కులం కాదు, చదువే భవితవ్యాన్ని నిర్ణయిస్తుందని ఆయన నమ్మకం... అది సమాజానికి ఒక కొత్త దిశను చూపుతోంది.



కుల ఆధారంగా శతాబ్దాలుగా జరిగిన అణచివేతను తుడిచిపెట్టే శక్తి ఒక్క 'విద్య'కు మాత్రమే ఉంది. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విషయాన్ని గ్రహించి, బీసీ వర్గాల పిల్లలకు సమగ్ర విద్యా అవకాశాలు కల్పించేందుకు కీలక నిర్ణయాలు తీసుకుంటున్నది. ఎవరైనా తమ జీవితాన్ని మార్చుకునే తలుపు 'చదువే' అనే ఆలోచనతో, పేదవారి పిల్లలు వెనుకడుగు వేయకుండా నాణ్యమైన విద్య అందుకునేలా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తున్నది. అధునాతన పాఠశాలలు, కళాశాలలు, వసతిగృహాలు, ప్రత్యేక శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయడం ద్వారా, చదువు ఒక ఆయుధంగా మారుతుంది. అందుకు ప్రభుత్వం చర్యలను తీసుకుంటున్నది. తెలంగాణలో బీసీ విద్యార్థుల కోసం రూపకల్పన చేస్తున్న పథకాలు కేవలం సంక్షేమ కార్యక్రమాలు కావు, అవి సామాజిక మార్పుకు పునాదులు. మోడల్ బీసీ రెసిడెన్షియల్ స్కూళ్లు, ఆధునిక ప్రయోగశాలలు, డిజిటల్ క్లాస్‌రూములు, అంతర్జాతీయ ప్రమాణాల హాస్టళ్లు, ఉచిత కౌన్సెలింగ్, కెరీర్ గైడెన్స్ సెంటర్లు– ఇవన్నీ బీసీ పిల్లలకు సమాన పోటీ సామర్థ్యాన్ని అందిస్తున్నాయి.

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఈ పథకాలు బీసీ వర్గాల పిల్లలకు జీవితంలో ఎవరితోనైనా సమానంగా పోటీ చేసే అవకాశాన్ని కల్పిస్తాయి. కులం ఎవరి కలలకు అడ్డురాకూడదని మా ప్రభుత్వం అభిమతం. పిల్లలు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు సరైన వేదికలు కల్పించడం బాధ్యత అని మేము భావిస్తున్నాం. కుటుంబాల పేదరికం, సామాజిక వెనుకబాటు పిల్లల భవిష్యత్‌ను నిర్ణయించే పరిస్థితి ఉండకూడదని పూలే అభిప్రాయపడ్డారు. తెలంగాణలో బీసీలు శ్రమజీవులు, ఉత్పత్తిదారులు, సేవకులు. అలాంటి వర్గాలు అణగారిపోవడం సమాజానికే నష్టం. కాబట్టి, బీసీ వర్గాల గౌరవాన్ని, హక్కులను, అవకాశాలను కాపాడటం కేవలం పరిపాలనా నిర్ణయం కాదు– అది సామాజిక న్యాయం.

విద్య ద్వారా బీసీలను శక్తివంతం చేయడం, కుల అణచివేతను వ్యవస్థ నుంచి తొలగించడం, ప్రతి బీసీ కుటుంబంలో కనీసం ఒక ఉన్నత విద్యావంతుడిని తయారుచేయడం, ఉద్యోగాలు, వ్యాపారాలు, నైపుణ్యాభివృద్ధి ద్వారా ఆర్థిక స్థిరత్వం కల్పించడం, బీసీ పిల్లలు దేశం నడిపే స్థాయికి చేరేలా చేయడం. సమానత్వం కోసం పోరాటం... ఇవన్నీ మా ప్రభుత్వ లక్ష్యాలు. బీసీల వెలుగుల భవిష్యత్ కోసం ప్రణాళికలు రూపొందుతున్నాయి. ప్రతి పేదవాడి ఇంట్లో 'చదువు' వెలిగే వరకు ప్రభుత్వం అండగా ఉంటుంది. మహాత్మా పూలే చెప్పినట్లు– "తలచుకోలేని పేదరికం కన్నా, చదువుకోలేని అజ్ఞానం పెద్ద శత్రువు." ఈ అజ్ఞానాన్ని మట్టుపెట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం అడుగులు వేస్తోంది.

తెలంగాణ బీసీల ఆత్మవిశ్వాసం నిండిన రేపటి పునాది– విద్య. ఆ పునాదిని బలపర్చడం కోసం, సమాజంలో కొత్త ఉత్సాహాన్ని నింపడం కోసం మన ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తున్నది. మహాత్మా పూలే ఆశయాలను సాకారం చేసే ఈ ప్రయత్నాలు, తెలంగాణను సమానత్వ సమాజంగా మార్చే దిశలో ముందుకు తీసుకెళ్తాయి. ఇలాంటి కార్యక్రమాలు మాత్రమే కుల వివక్షలను తుడిచిపెట్టి, ఒక ఏకీకృత సమాజాన్ని నిర్మిస్తాయి. "విద్య విజ్ఞానాన్ని అందిస్తుంది. విజ్ఞానం విచక్షణను అందిస్తుంది. తద్వారా సామాజిక సమానత్వం, రాజ్యాధికారం వస్తుంది. పూలే అందించిన స్ఫూర్తితో మనమంతా విద్యా విప్లవంలో భాగస్వాములమై ఆయన ఆశయాలను కొనసాగిద్దాం.



• పొన్నం ప్రభాకర్‌గౌడ్
బీసీ సంక్షేమం, రవాణాశాఖ మంత్రి

(నేడు మహాత్మా జ్యోతిరావ్ పూలే వర్ధంతి)

బంధమా, బతుకా.. దాంపత్యంలో ఏది ముఖ్యం?

ప్రయాగ్‌రాజ్ (అలహాబాద్) హైకోర్టు ఇటీవల ఇచ్చిన ఒక తీర్పు హిందూ మహిళలకు భారత రాజ్యాంగ నీతి పూర్తిగా వర్తించే స్థితి ఇంకా ఏర్పడలేదని చాటుతున్నది. వివాహబంధంలో ఉండగా భర్త నుంచి విడిపోయి వేరొక పురుషునితో సహజీవనం చేస్తున్న మహిళకు ఆ మాజీ భర్త నుంచి, అతడి తరఫు పోలీసు జోక్యం నుంచి రక్షణ కల్పించడానికి తిరస్కరిస్తూ నవంబర్ 15న ప్రయాగ్‌రాజ్ హైకోర్టు తీర్పు చెప్పింది. పురుషాధిక్య ఆధిపత్య భావజాల స్ఫూర్తితో రూపొందిన 1955 నాటి హిందూ వివాహ చట్టాన్ని ఉల్లంఘించడం సాధ్యం కాదని ఈ తీర్పు అర్థం. భర్తల దుర్మార్గం నుంచి రక్షణ కోసం, వైవాహిక 'జైలు' నుంచి తప్పించుకొని పారిపోయేవారిని మెడపట్టుకొని తిరిగి ఆ జైలుకే పంపించడం మానవీయమా?

"వర్గానికి వర్గానికి మధ్య, స్త్రీ పురుషుల మధ్య (జెండర్ల మధ్య) అసమానత హిందూ సమాజం ఆత్మ. దానిని విడిచిపెట్టి ఆర్థిక సమస్యలకు సంబంధించిన చట్టాలు చేసుకొంటూపోవడం రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడమే. పేడకుప్ప పైన మేడ కట్టడమే," అని అంబేడ్కర్ తన హిందూ కోడ్ బిల్లును పార్లమెంట్ తిరస్కరించినప్పుడు మంత్రి పదవి నుంచి తప్పుకొంటూ సమర్పించిన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. మహిళను విముక్తం చేయడమన్న తన లక్ష్యం నెరవేరనందుకు నిరసనగానే అంబేడ్కర్ రాజీనామా చేశారు.

సంప్రదాయ హిందూ సమాజంలో మహిళది రెండవ స్థాయి పౌరసత్వమే. దాని నిర్మాణం ప్రకారం ఆమె బతుకు ఆశయం పురుషుడి అడుగులకు మడుగులొత్తడమే. మన దేశాన్ని ఇప్పుడు పరిపాలిస్తున్న శక్తుల గురువైన ఆరెస్సెస్ సంస్థ అధినేత మోహన్ భగవత్ చెప్పిన ధర్మ సూత్రమూ ఇదే. భర్తకు సేవ చేయడమే భార్య పని అని 2013 జనవరిలో ఆయన స్పష్టంగా చెప్పారు. పురుషునితో ఆమెకు గల సామాజిక ఒప్పందం ప్రకారం ఆమె ఇంటి పనులకి పరిమితం కావాలి. పురుషుడు బయటి బాధ్యతలు చూసుకుంటూ ఉండాలి. ఇలా ఇంటి ఇంతిగా ఆమె అతడిని సంతృప్తిపరచడంలో విఫలమైన వెంటనే ఆమె పోషణ బాధ్యత నుంచి అతడు తప్పుకోవచ్చని, అక్కడితో భార్య భర్తల మధ్య సామాజిక కాంట్రాక్టు ముగిసిపోతుందని భగవత్ అభిప్రాయపడ్డారు. ఆడవారిపై లైంగిక అత్యాచారాలు దేశంలోని గ్రామీణ ప్రాంతాలలో అరుదుగాను, పట్టణ ప్రాంతాలలో తరచుగానూ సంభవిస్తున్నాయని ఆయన అంతకు ముందు అన్నారు. అంటే సంప్రదాయ సమాజం గట్టిగా వేళ్లూనుకుని ఉన్న గ్రామాల్లోనే మహిళ సురక్షితంగా బతుకుతున్నదని, ఆధునిక పురోగామి పట్టణ సమాజంలోనే ఆమెకు భద్రత కరువైందని ఆయన నొక్కి వక్కాణించారన్నమాట. పురాతన హిందూ సమాజం ఈ విలువలనే ఇప్పటికీ పాటిస్తున్నది. హిందూ వివాహచట్టంలోని 9వ సెక్షన్ ఈ పునాదుల పైనే నిర్మితమైంది.



AKBAR

భార్య, భర్త విడిపోయిన తర్వాత ఒకరిపై ఒకరు దాంపత్య హక్కుల పునరుద్ధరణను కోరుతూ కోర్టుకు వెళ్లే అవకాశాన్ని హిందూ వివాహ చట్టంలోని 9వ సెక్షన్ ఉభయులకూ కల్పిస్తున్నది. ఆయా పరిస్థితులను పరిశీలించి కోర్టు ఆ హక్కును పునరుద్ధరించవచ్చునని పేర్కొంటున్నది. వైవాహిక అక్రమ వర్తనకు పాల్పడి భాగస్వామికి దూరంగా బతుకుతుంటే అటువంటి భార్య లేదా భర్తపై తనకుగల లైంగికత సహా సంపూర్ణ దాంపత్య హక్కును తిరిగి కల్పించాలని కోరుతూ జిల్లా కోర్టుకు వెళ్లే హక్కును 9వ సెక్షన్ కల్పిస్తున్నది. ఇది నిజానికి భార్యా భర్తా సమానులన్న అభిప్రాయం నుంచి ఉత్పన్నమైనది. కానీ వాస్తవంలో ఇప్పటికీ భర్తది పైచేయి, భార్యది కింది చేయిగానే ఉన్నది. భర్తతో బాటు అతడి తల్లి, తండ్రి, సోదరులు, ఆడపడుచులు కూడా ఆమెపై పెత్తనాన్ని, హింసాయుతమైన అణచివేతను అమలు చేస్తున్నారు. అందుచేత భార్య తనకు దూరమైన తన భర్తను తిరిగి తన దగ్గరకు చేర్చుకొనేలా దాంపత్య హక్కు పునరుద్ధరణను అర్థించడానికి, అదే పనిని భర్త స్థానంలోని వ్యక్తి చేయడానికి చాలా తేడా ఉంది.

రాజ్యాంగం హామీ ఇస్తున్న వ్యక్తిగత, జీవన స్వేచ్ఛలు తిరుగులేనివి కావని, విడాకులు తీసుకోనందున ఆమెపై తన మాజీ భర్తకు ఇంకా హక్కు ఉంటుందని అలహాబాద్ తీర్పు స్పష్టం చేసింది. మహిళ తాను కోరుకొన్నట్టు వేరొకరితో ఉండాలీ అనుకొంటే భర్త నుంచి విడాకులు తీసుకోవాలని ఆ మహిళకు దిక్కు చూపింది. హిందూ వివాహ చట్టం 9వ సెక్షన్ మహిళకు శాపం వంటిదని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.ఎ.చౌదరి 1983 జూలైలో చలన చిత్ర నటి సరిత, వెంకటసుబ్బయ్య కేసులో తీర్పు ఇచ్చారు. ఈ సెక్షన్‌ను రద్దు చేస్తూ, ఇది జంటల వ్యక్తిగత గోప్యత హక్కును కాలరాస్తున్నదని, వివాహ బంధాన్ని కాపాడే నెపంతో పౌరుల ప్రాథమిక హక్కులను హరిస్తున్నదని జస్టిస్ చౌదరి తన తీర్పులో స్పష్టం చేశారు. అయితే జస్టిస్ చౌదరి విప్లవాత్మక తీర్పును సుప్రీంకోర్టు ఆ తర్వాత రద్దు చేసింది. అప్పటి నుంచి వివిధ కోర్టులు వివాహిత మహిళలకు విషం వంటి ఈ 9వ సెక్షన్‌ను ఆమె చేత బలవంతంగా తాగిస్తున్నాయి.

పెళ్లి అనే వ్యవస్థను కాపాడాలని, భార్యాభర్తలు ఆ బంధానికి జీవిత కాలమంతా కట్టుబడి ఉండాలని 9వ సెక్షన్ కోరుతున్నది. కాని మహిళ అక్షరాస్యతలోనే కాదు విద్యాబుద్ధులు, ఆధునిక నిపుణతలలోనూ పురుషునితో సమానమైన స్థాయికి చేరుకొంటున్న వర్తమానంలో ఇష్టంలేని మగవానితో కలిసి కాపురం చేయవలసిన అగత్యాన్ని ఆమె ధైర్యంగా ఎదిరిస్తోంది. అసలు పెళ్లినే కాదని ఇష్టపూర్వక సహజీవనాన్ని సాగించే జంటల సంఖ్య పెరుగుతున్నది. చదువుకున్న, స్వతంత్ర వ్యక్తిత్వమూ చైతన్యమూ గల పలువురు స్త్రీలు సంప్రదాయ వివాహ వ్యవస్థను తృణీకరిస్తున్నారు. ఒంటరి జీవనాన్ని కోరుకొనే మహిళలు ఎక్కువవుతున్నారు. వివాహేతర సహజీవన బంధం అక్రమమైనది, న్యాయవిరుద్ధమైనది కాదని కూడా సుప్రీంకోర్టు నిర్ధారించింది. సహజీవన జంటలకు పుట్టే పిల్లలకు ఆస్తి హక్కు ఉంటుందని ప్రకటించింది. అందుచేత ఇష్టపూర్వక సహజీవన స్వేచ్ఛకు గల సంకెళ్లను పటాపంచలు చేయాలి. మన సంపూర్ణ ప్రజాస్వామిక లక్ష్యాన్ని, లక్షణాన్ని కాపాడుకోవాలి.


> **పెళ్లి అనే వ్యవస్థను కాపాడాలని, భార్యాభర్తలు ఆ బంధానికి జీవిత కాలమంతా కట్టుబడి ఉండాలని 9వ సెక్షన్ కోరుతున్నది. కాని మహిళ అక్షరాస్యతలోనే కాదు విద్యాబుద్ధులు, ఆధునిక నిపుణతలలోనూ పురుషునితో సమానమైన స్థాయికి చేరుకొంటున్న వర్తమానంలో ఇష్టంలేని మగవానితో కలిసి కాపురం చేయవలసిన అగత్యాన్ని ఆమె ధైర్యంగా ఎదిరిస్తోంది.**

▪ గార శ్రీరామమూర్తి
సీనియర్ జర్నలిస్ట్

వాలిడేషన్ బిల్లుతో పెన్షనర్లకు వేదన

మనదేశంలో ప్రభుత్వ ఉద్యోగులు పదవీ విరమణ అనంతరం పొందే పెన్షన్ వారి జీవిత భద్రతకు, గౌరవానికి ఆధారం. ఇది కేవలం ఒక ఆర్థిక లావాదేవీ కాదు; ప్రభుత్వ సేవకు అంకితమైన జీవితానికి గుర్తింపు. కానీ గత 21 సంవత్సరాలుగా పెన్షన్ వ్యవస్థలో సంభవించిన మార్పులు ఉద్యోగులలో గందరగోళాన్ని, అస్థిరతను కలిగించాయి. నేడు పాత పెన్షన్ పద్ధతి (ఓపీఎస్), కాంట్రిబ్యూటరీ పెన్షన్ (సీపీఎస్) గ్యారెంటీడ్ పెన్షన్ (జీపీఎస్) అనే మూడు వ్యవస్థలు వర్తిస్తున్నాయి. ఇప్పటికే మూడు రకాల పెన్షన్ వ్యవస్థలు ఉన్న ఈ సమయంలో, కేంద్రం కొత్తగా 'వ్యాలిడేషన్ సిస్టమ్' (పెన్షన్లకు సంబంధించి ప్రభుత్వం చేసిన చట్టాలపై కోర్టులు తీర్పులు ఇస్తాయి. ఆ తీర్పుల ఆధారంగా ఆ చట్టం అమలులో ఉండే లోపాలను కొత్త చట్టం ద్వారా సరిదిద్దుకుని, ఆ గత చర్యలను కూడా ప్రభుత్వం చట్టబద్ధం చేసే విధానం)ను ప్రవేశపెట్టడం పాత పెన్షన్ కింద ఉన్న పెన్షనర్లపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతోంది. అసమానతలను మరింత పెంచుతోంది. పెన్షనర్లు ప్రస్తుతం కూడా డియర్‌నెస్ రిలీఫ్ (DRs) సకాలంలో అందుకోలేకపోతున్నారు.

1982లో వచ్చిన 'డి.ఎస్ నకరా వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో సుప్రీంకోర్టు స్పష్టంగా పేర్కొంది: 'పెన్షన్ ఉద్యోగి హక్కు; దానిని ఎలాంటి యాదృచ్ఛిక వర్గీకరణ ద్వారానూ తగ్గించరాదు. ఒకే సేవలో ఉన్నవారికి ఒకే పెన్షన్ విధానం ఉండాలి.' వ్యాలిడేషన్ బిల్లు ద్వారా ఈ తీర్పు సూత్రాలను పక్కన పెట్టడం, వృద్ధుల హక్కులను మళ్లీ ప్రభుత్వం హరించడం అవుతుంది. పే రివిజన్ కమిషన్ (పీఆర్సీ) బకాయిలు కూడా విడుదల కాకపోవడంతో వృద్ధులు ఆవేదనకు గురవుతున్నారు.



బకాయిల చెల్లింపుల్లో ఆలస్యం, పెన్షన్ విధానాల అసమానతలు, ఇటీవల ప్రవేశపెట్టిన వ్యాలిడేషన్ బిల్లు వృద్ధుల జీవితంలో మరింత అనిశ్చితిని సృష్టిస్తున్నాయి. వారు ప్రతి నెలా ఖజానా కార్యాలయాల చుట్టూ తిరుగుతూ తమ హక్కుల కోసం పోరాడాల్సి వస్తోంది. ఈ ఆలస్యాలు కేవలం ఆర్థిక ఇబ్బందులు మాత్రమే కాదు; మానసిక వేదనకు ప్రధాన కారణం. పెరుగుతున్న జీవన వ్యయం, వైద్య ఖర్చులు, కుటుంబ బాధ్యతలు... ఇవన్నీ వారి జీవన నాణ్యతను దెబ్బతీస్తున్నాయి. వృద్ధులలో మానసిక ఒత్తిడి, నిస్పృహను పెంచుతున్నాయి.

2025 మార్చి 25న లోక్‌సభలో ఆమోదించిన 'సెంట్రల్ సివిల్ సర్వీసెస్ (పెన్షన్) నియమాలు, పెన్షన్ బకాయిల వ్యయానికి సంబంధించిన సూత్రాల చట్టం' వృద్ధుల హక్కులపై పెద్ద ఆందోళన కలిగించింది. ఈ చట్టం ప్రకారం పాత కేసుల బకాయిల చెల్లింపుల్లో ప్రభుత్వం 'గత నిబంధనల ప్రకారం' వేర్వేరు వర్గీకరణ చేయవచ్చు. ఇది 'సమాన సేవకు సమాన పెన్షన్' అనే సూత్రానికి విరుద్ధం. అంటే, ఒకే పదవిలో, ఒకే స్థాయిలో పనిచేసిన ఇద్దరు ఉద్యోగులు పదవీ విరమణ తేదీ ఆధారంగా వేర్వేరు పెన్షన్లను పొందడం చట్టపరంగా సమర్థించబడుతోంది. ఫలితంగా పాత పెన్షన్‌దారులు తక్కువ మొత్తాలు, కొత్త వర్గం ఎక్కువ మొత్తాలు పొందడం ద్వారా అసమానత మరింత పెరిగిపోతోంది. పెన్షన్ ఆలస్యం వలన వైద్య చికిత్సలు ఆగిపోవడం, కుటుంబ అవసరాలు సరిగా తీర్చలేకపోవడం వంటి సమస్యలు పెరుగుతున్నాయి. తమపై ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించడం వృద్ధులను వేధిస్తోంది.

పెన్షనర్లను ప్రభుత్వం భారంగా కాకుండా దేశసేవకు జీవితం అంకితం చేసిన పునాది శిలలుగా చూడాలి. వారి హక్కులను ఆలస్యం చేయడం న్యాయ విరుద్ధం మాత్రమే కాదు, మానవతా విలువలకు విరుద్ధం కూడా. పెన్షన్ బకాయిలు, సమాన పెన్షన్ హక్కు, డి.ఎస్ నకరా తీర్పును అమలు చేస్తే వృద్ధుల ఆవేదనకు ఉపశమనం కలుగుతుంది. ప్రభుత్వాలు పెన్షన్ ఖర్చును 'భారంగా కాకుండా న్యాయబద్ధమైన బాధ్యత'గా చూడాలి.

– టి.ఎం.బి.బుచ్చిరాజు

42శాతం స్ఫూర్తితో బీసీలను గెలిపించాలి!

డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ 1949 నవంబర్ 25న రాజ్యాంగ సభలో రాజ్యాంగ ముసాయిదా సమర్పించి, తుది రూపానికి ఆమోదముద్ర వేసేముందు చేసిన ప్రసంగంలో 'జనవరి 26, 1950న మనం వైరుధ్యాల జీవితంలోకి ప్రవేశించబోతున్నాం. రాజకీయాలలో ప్రతి ఒక్కరూ ఓటు వేసే విధంగా మనకు సమానత్వం ఉంటుంది. కానీ సామాజిక, ఆర్థిక జీవితంలో మనకు అసమానత ఉంటుంది. మనం ఈ వైరుధ్యాన్ని వీలైనంత త్వరగా తొలగించాలి. లేకుంటే అసమానతతో బాధపడేవారు ఈ అసెంబ్లీ ఎంతో కష్టపడి నిర్మించిన రాజకీయ ప్రజాస్వామ్య నిర్మాణాన్ని పేల్చివేస్తారు' అని హెచ్చరించారు.

రాజ్యాంగం అమలులోకి రాకముందే కొన్ని దక్షిణాది రాష్ట్రాలలో బీసీ రిజర్వేషన్లు ఉన్నాయి. ఈ రిజర్వేషన్లు దేశవ్యాప్తంగా కల్పించాలనే డిమాండ్ వచ్చిన నేపథ్యంలో, యావత్ భారతదేశంలో సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల స్థితిగతులను పరిశీలించేందుకు ప్రభుత్వం జనవరి 29, 1953న కాకా కాలేల్కర్ కమిషన్‌ను నియమించింది. మార్చి 30, 1955న ఈ కమిషన్ తన నివేదిక అందజేసింది. కమిషన్ ఛైర్మన్ నివేదికతో పాటు ఒక ఉత్తరాన్ని జతపరిచి రాష్ట్రపతికి అందజేశారు. ఈ నివేదిక కులానికి ప్రాధాన్యత ఇచ్చిందని, ఇది సమాజానికి దేశానికి శ్రేయస్కరం కాదని, దీనిని తిరస్కరించాలని ఆ లేఖలో కోరారు. కుల ప్రాతిపదికను మొదటి కమిషన్ వ్యతిరేకిస్తే, కులాన్ని ఒక సూచికగా తీసుకోవాలని ఉన్నత న్యాయస్థానం మండల్ కమిషన్ తీర్పులో స్పష్టం చేసింది. 1992లో ఇందిరా సహాని కేసులో సుప్రీంకోర్టు మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదని ఇచ్చిన తీర్పు ఫలితంగా తమిళనాడు సహా ఎన్నో రాష్ట్రాలలో ప్రతిష్టంభన ఏర్పడింది. చివరికి ఇందిరా సహాని కేసు కూడా అగ్నిపరీక్ష ఎదుర్కొంది. తమిళనాడు 69శాతం రిజర్వేషన్లు కల్పించినప్పటికీ సుప్రీంకోర్టు విధించిన పరిధి వల్ల సందిగ్ధత ఏర్పడింది. దీంతో అసెంబ్లీలో ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చి, 69శాతం రిజర్వేషన్లు అమలయ్యేటట్టు, సుప్రీంకోర్టు విధించిన 50శాతం పరిధి నుండి రక్షణ పొందడానికి రాజ్యాంగం 9వ షెడ్యూల్లో చేర్చేట్టుగా అప్పటి ముఖ్యమంత్రి జయలలిత పావులు కదిపారు. ఇనుమును వంచాలంటే అది వేడిగా ఉన్నప్పుడే దెబ్బకొట్టాలన్న నానుడిని ఆచరణలో చూపించారు. 2019లో పార్లమెంటు ఆమోదించిన 103వ రాజ్యాంగ సవరణ చట్టంలో 'ప్రస్తుత రిజర్వేషన్లతో పాటు' ఆర్థికంగా బలహీనవర్గాలకు గరిష్టంగా 10 శాతం రిజర్వేషన్ అందిస్తుంది" అని ఉంది. ఈ పదబంధం మరొకసారి 50శాతం పరిమితి నిబంధనపై సందేహాలను రేకెత్తిస్తుందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు తెలంగాణ ప్రభుత్వం పాత రిజర్వేషన్లతోనే పంచాయతీ ఎన్నికలకు పోక తప్పలేదు. మరొకవైపు శాసనసభలో చేసిన తీర్మానాలకు కట్టుబడి, 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలుకు రక్షణ కల్పించేలా 9వ షెడ్యూల్‌ను ఆశ్రయించాలనే ఉద్యమం కొనసాగుతోంది. ప్రచార ప్రసార సాధనాల పుణ్యమా అని దీనికి సంబంధించిన అన్ని అంశాలు మారుమూల ప్రాంతాలకు కూడా చేరాయి.

> **రాబోయే జనగణనలో కులగణనను చేర్చాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన రాజకీయ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ నిర్ణయించింది. రిజర్వేషన్లపై ప్రధానమంత్రి వైఖరి ఎస్సీ వర్గీకరణలో ఇదివరకే స్పష్టమైంది. చట్టపరంగా బీసీలకు 27శాతం రిజర్వేషన్లు ఉన్నప్పటికీ గత 30 సంవత్సరాలకు పైగా ఆశించిన ప్రయోజనం చేకూరడం లేదు.**



2003లో అచ్చయిన 'భారతదేశం యొక్క శాంతియుత విప్లవం – ఉత్తర భారత రాజకీయాల్లో తక్కువ కులాల పెరుగుదల' పుస్తకంలో, రచయిత క్రిస్టోఫ్ జాఫ్రెలట్ మండల్ కమిషన్ తదితర పరిణామాల గురించి సవివరంగా రాశారు. చట్టసభలలో ఓబీసీ కులాల సంఖ్య పెరగడాన్ని గణాంకాల ద్వారా వివరించారు. ఇందులోని ప్రతి అంశాన్ని ప్రజలు, రాజకీయ పార్టీలు తప్పకుండా విభిన్నమైన దృక్పథాలతో చూస్తారు. ప్రాస కోసం మండల్‌కు వ్యతిరేకంగా బీజేపీ కమండల్ ఉద్యమాన్ని ప్రారంభించిందని చేసిన అభియోగాలను బీజేపీ పటాపంచలు చేసింది. రాజకీయ కార్యక్రమాలతో పాటు సామాజిక కార్యక్రమాలతో, ముఖ్యంగా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ పరివారానికి చెందిన సేవాభారతి అట్టడుగుస్థాయి ప్రజలను ఏ విధంగా ఆకర్షిస్తున్నదో, బీజేపీ అంచలవారీగా ఉన్నత వర్గాల వారికి చట్టసభల్లో స్థానాలు తగ్గించి, బీసీ వర్గాలకు స్థానాలు పెంచడం వల్ల సామాజిక సమరసతతో పాటు బీసీ నాయకులను ఎన్నికలలో గెలిపించిన చరిత్ర ఈ తరం వారు తెలుసుకోవాల్సిన అవసరం ఉంది.

రాబోయే జనగణనలో కులగణనను చేర్చాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన రాజకీయ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ నిర్ణయించింది. రిజర్వేషన్లపై ప్రధానమంత్రి వైఖరి ఎస్సీ వర్గీకరణలో ఇదివరకే స్పష్టమైంది. చట్టపరంగా బీసీలకు 27శాతం రిజర్వేషన్లు ఉన్నప్పటికీ గత 30 సంవత్సరాలకు పైగా ఆశించిన ప్రయోజనం చేకూరడం లేదు.

మధ్యప్రదేశ్ ప్రభుత్వంలో ఉన్నతాధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్న తెలుగుబిడ్డ పి.నరహరి (ఐఏఎస్) రాసిన 'ఓబీసీల పోరుబాట' పుస్తకం అందరినీ ఆలోచింపచేస్తుంది. అందులో రచయిత 08-08-2022న లోక్‌సభ ప్రశ్న నెంబర్ 3660కు భారత ప్రభుత్వ విద్యామంత్రిత్వశాఖ ఇచ్చిన జవాబు ఆధారంగా ముద్ర యోజన రుణాల పంపిణీలో అసమానతలను వివరించారు. ఓబీసీ-జనరల్ కోటాలో మంజూరైన ఆ రుణాల వివరాలు సంవత్సరాల వారీగా, శాతాలవారీగా ఈ విధంగా ఉన్నాయి. 2015-16లో జనరల్ 63శాతం- ఓబీసీ 22.4శాతం, 2016-17లో జనరల్ 62.2- ఓబీసీ 24.4, 2017-18లో జనరల్ 64.5- ఓబీసీ 20.7, 2018-19లో జనరల్ 68.6- ఓబీసీ 18.7, 2019-20లో జనరల్ 66, ఓబీసీ 19.4, 2020-21లో జనరల్ 65.5, ఓబీసీ 19.1. మండల్ కమిషన్ ఓబీసీలకు 27శాతం రిజర్వేషన్లు కల్పించినా, భారత జనాభాలో ఓబీసీల వాటా ఎక్కువగా ఉన్నప్పటికీ రుణం పొందడంలో మాత్రం తక్కువగా ఉంది. సమాజంలో అట్టడుగు స్థాయి వరకు కారణాలను వెతికి, సవాళ్లను ఎదుర్కోవడానికి నిరంతర అవగాహన, సమైక్య పోరాటం అనివార్యం.

తెలంగాణ శాసనసభలో చేసిన ఏకగ్రీవ తీర్మాణాలకు అనుగుణంగా అన్ని రాజకీయ పార్టీలు 42శాతం రిజర్వేషన్ల స్ఫూర్తితో బీసీ సభ్యులను గెలిపించుకోవాలి. పంచాయతీ ఎన్నికలలో సర్పంచ్ ఎన్నికకు పార్టీ గుర్తు ఉండదన్న నెపంతో వీరిని కటీ పతంగులుగా చేస్తే అసెంబ్లీ తీర్మానాలకు విలువ ఉండదు.



◆ సీహెచ్. విద్యాసాగర్‌రావు
మహారాష్ట్ర మాజీ గవర్నర్

పట్టాల పంపిణీకి వేళాయె...

- నేడు వరంగల్ నిట్ 23వ స్నాతకోత్సవం
- ఓవరాల్ టాపర్‌గా సీఎస్ఈ విద్యార్థి శ్రీసత్య నవీన్
- 1913 మందికి పట్టాలు, 14 మందికి బంగారు పతకాలు
- ముఖ్య అతిథిగా మైక్రాన్ ఇండియా ఎం.డి. ఆనంద రామమూర్తి
- సర్వాంగ సుందరంగా ముస్తాబైన క్యాంపస్

7


ఎన్నికలు ప్రశాంతంగా జరుపుకోవాలి

- పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్
- కేశవపూర్‌లో నామినేషన్ల కేంద్రం పరిశీలన



కేశవపూర్‌లో నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీపీ సన్‌ప్రీత్ సింగ్

ఎల్కతుర్తి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ అన్నారు. గురువారం ఎల్కతుర్తి మండలం కేశవపూర్ గ్రామంలో మొదటి విడత పంచాయతీ ఎన్నికల నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. నామినేషన్ల ప్రక్రియ, పరిసరాలు, వసతులను ఆయన పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీపీ సన్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణ సజావుగా జరిగేందుకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లాల సరిహద్దుల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎవరు ఉల్లంఘించినా కఠిన చర్యలు తప్పవన్నారు. పోలింగ్ బూత్ నుంచి 100మీటర్ల దూరం లోపు వాహనాలు నిలపడం, ప్రచారం చేయడం ఉండకూడదన్నారు. ర్యాలీలు తీయరాదన్నారు. ఎలాంటి అనుమతులనైనా తహసీల్దార్ నుంచి తీసుకోవాలని సూచించారు. సమస్యాత్మకమైన గ్రామాల్లో అదనపు బలగాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాజీపేట ఏసీపీ పింగిళి ప్రశాంత్‌రెడ్డి, ఎస్సై అకినేపల్లి ప్రవీణ్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



- ఆసక్తికరంగా మారుతున్న పంచాయతీ పోరు
- సర్పంచ్ స్థానాల్లో పాగాకు పార్టీల తహతహ
- తమ మద్దతుదారులను గెలిపించుకునేందుకు వ్యూహాలు
- ప్రభుత్వ సంక్షేమ పథకాలపైనే కాంగ్రెస్ ఆశలు
- ఇందిరమ్మ చీర కానుక కలిసి వస్తుందనే నమ్మకం
- బీసీ ఓట్లపై ప్రతిపక్షాల గురి
- 42 శాతం రిజర్వేషన్లపై కాంగ్రెస్ మాట తప్పిందని ప్రచారం
- కాంగ్రెస్‌కు సవాల్.. బీఆర్‌ఎస్‌కు జీవన్మరణం..

ఎవరి ఎ'జెండా' వారిదే..

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

పంచాయతీ ఎన్నికల్లో గెలుపు ప్రధాన పార్టీలకు సవాల్‌గా మారింది. పార్టీలకతీతంగా జరిగే పల్లె పోరులో పార్టీ జెండా ఎగురవేయాలని తహతహలాడుతున్నాయి. తమ పార్టీ మద్దతుదారులను బరిలో దించేందుకు గ్రామాల్లో నేతలు మంతనాలు జరుపుతున్నారు. ప్రజల్లో పలుకుడి, ఆర్థిక స్థోమత ఉన్న అభ్యర్థుల కోసం వెతుకుతున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి నినాదంగా పల్లెల్లో పాగా వేసేందుకు అధికార కాంగ్రెస్ పావులు కదుపుతుండగా, బీసీ జెండానే ఎజెండాగా ప్రతిపక్షాలు పల్లె పోరులో కాంగ్రెస్‌ను ఢీకొనేందుకు సిద్ధమవుతున్నాయి. వచ్చే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని, పార్టీ పునాదులను పటిష్ఠం చేసుకునే దిశగా అన్ని పార్టీలు ఈ ఎన్నికలను సవాల్‌గా తీసుకుంటున్నాయి.

పార్టీల ఫోకస్

పంచాయతీ ఎన్నికలు పార్టీలకు అతీతంగా నిర్వహిస్తున్నారు. పార్టీ గుర్తులు, రాజకీయ హామీలు లేకుండా.. సర్పంచ్, వార్డు స్థానాలకు అభ్యర్థులు బరిలో దిగుతున్నారు. అయితే పల్లెపోరులో పైచేయి సాధించేందుకు ఆయా పార్టీల నేతలు తమ మద్దతుదారులను బరిలో దించుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 1,708గ్రామ పంచాయతీలు, 15,006 వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు.

గత సర్పంచ్ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో మెజార్టీ స్థానాలను అప్పటి అధికార పార్టీ బీఆర్‌ఎస్ కైవసం చేసుకుంది. ఏ పార్టీ మద్దతు లేకుండా స్వతంత్రంగా గెలిచిన సర్పంచ్‌లు కూడా అభివృద్ధి కోసం గులాబీ కారెక్కారు. ప్రస్తుతం జనగామ మినహా అన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలే ఉన్నారు. దీంతో మెజార్టీ పంచాయతీలను హస్తగతం చేసుకునేందుకు కాంగ్రెస్ పార్టీ రాజకీయ వ్యూహాలను అమలు చేస్తుంది. ఇప్పటికే పోటీ లేని చోట నామినేషన్లు వేసుకునేందుకు అభ్యర్థులకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, యశస్వినిరెడ్డి, రేవూరి ప్రకాష్‌రెడ్డి, మాదవరెడ్డి, కేఆర్ నాగరాజు తదితరులు తమ నియోజకవర్గాల్లో అభ్యర్థులను ఖరారు చేసే పనిలో ఉన్నారు. పోటీ ఎక్కువగా ఉన్న గ్రామాల్లో పోటీదారుల మధ్య రాజీ ప్రయత్నాలు చేస్తున్నారు. సర్పంచ్ పదవి పోటీ నుంచి తప్పుకుంటే ఎంపీటీసీకి అవకాశం ఇస్తామని కొన్ని చోట్ల హామీలు ఇస్తున్నారు.

మరోవైపు కాంగ్రెస్ అభ్యర్థులకు దీటుగా బరిలో దించేందుకు బీఆర్‌ఎస్ కూడా ఆర్థికంగా బలమైన నేతలను, పార్టీకి నమ్మకంగా ఉన్నవారిని గుర్తించి టికెట్ల కేటాయిస్తున్నారు. పాలకుర్తి, వర్ధన్నపేట నియోజకవర్గాల్లో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, జనగామలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి, నర్సంపేట పెద్ది సుదర్శన్‌రెడ్డి, భూపాలపల్లిలో గండ్ర వెంకటరమణారెడ్డి, పరకాలలో చల్లా ధర్మారెడ్డి ఇప్పటికే మండలాల వారీగా సమావేశాలు నిర్వహించి, అభ్యర్థులను ఎంపిక చేసే ప్రక్రియలో ఉన్నారు.

అయితే బీజేపీ స్థానిక ఎన్నికల్లో పోటీకి సిద్ధంగా ఉన్నప్పటికీ నేతల మధ్య సమన్వయం లేదనే టాక్ వినిపిస్తుంది. పోటీ చేసే అభ్యర్థుల ఎంపికతో పాటు

(మిగతా 7లో..)

నామినేషన్ల పర్వం షురూ..



ఎల్కతుర్తిలో నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

- మొదటి రోజు సర్పంచులకు 86, వార్డు సభ్యులకు 61 దాఖలు
- పోలింగ్ కేంద్రాలను సందర్శించిన కలెక్టర్
- నామినేషన్ల దాఖలు సరళి పరిశీలన
- 52 పంచాయతీలు సమస్యాత్మకమైనవిగా గుర్తింపు

హనుమకొండ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గ్రామ పంచాయతీలు, వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్ల దాఖలు పర్వం గురువారం ప్రారంభమైంది. తొలివిడత భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, కమలాపూర్ మండలాల పరిధిలోని 69 గ్రామ పంచాయతీలు, 658 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి. గురువారం ఈ మూడు మండలాల్లో మొత్తంగా 86 సర్పంచు, 61 వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో భీమదేవరపల్లి మండలంలో 30 సర్పంచు, 22 వార్డు సభ్యులకు, ఎల్కతుర్తి మండలంలో 20 సర్పంచు, 5 వార్డు సభ్యులకు, కమలాపూర్‌లో 36 సర్పంచు, 34 వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్లు పడ్డాయి.

ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల మధ్య అభ్యర్థులు ఒక్కొక్కరుగా తమ మద్దతుదారులతో వచ్చి తమకే కేటాయించిన క్లస్టర్ కేంద్రాల్లో నామినేషన్లు వేశారు. మొదటి రోజు నామినేషన్ల దాఖలు కొంత మందకొడిగానే జరిగింది. శుక్ర, శనివారాల్లో ఎక్కువ మంది నామినేషన్లు దాఖలు చేసే అవకాశం ఉంది. మొదటి విడత ఎన్నికల నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ

(మిగతా 8లో..)

పంచాయతీ ఎన్నికల నామినేషన్ కౌంటర్ — మొదటి రోజు 27-11-25

మండలం పేరు	మొత్తం సర్పంచ్ స్థానాలు	దాఖలైన నామినేషన్లు	మొత్తం వార్డు సభ్యులు	దాఖలైన నామినేషన్లు
భీమదేవరపల్లి	25	30	232	22
ఎల్కతుర్తి	20	20	103	05
కమలాపూర్	24	36	246	34

నేను దమ్మున్న నాయకుడిని..

- అయ్య పేరు చెప్పుకొని రాజకీయాలు చేయడం లేదు
- బలుపుతో మాట్లాడితే పెద్ద నాయకుడు కాలేరు
- ఫిరాయింపులను ప్రోత్సహించింది మీరు కాదా..
- కేటీఆర్‌పై ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఫైర్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అహంకారం, బలుపుతో మాట్లాడితే పెద్ద నాయకుడిని అవుతానని కేటీఆర్ అనుకోవడం అవివేకమని, అయ్య పేరు, కుటుంబం పేరు చెప్పుకొని తాను రాజకీయాలు చేయడం లేదని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ధ్వజమెత్తారు. స్టేషన్‌ఘన్‌పూర్ లోని క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. తాను దమ్మున్న నాయకుడినని, అయ్య అండ, అయ్య పేరు చెప్పుకొని రాజయాల్లోకి రాలేదన్నారు. తాను స్వతహాగా ఎదిగివచ్చిన నాయకుడినని తెలిపారు. 'కేసీఆర్ లేకుంటే నీ అడ్రస్ ఎక్కడ..? అసలు నీ గుర్తింపు ఏమిటి..?' అని కేటీఆర్‌ను ఉద్దేశించి ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ పదేళ్లలో 36మంది ఎమ్మెల్యేలను పార్టీలోకి తీసుకొని, ఇద్దరిని మంత్రులను చేసినప్పుడు గుర్తురాని నీతీ నిజాయితీ... కడియం విషయంలో గుర్తుకు వస్తోందా అని నిలదీశారు. అప్పుడు ఫిరాయింపుల విషయం గుర్తు రాలేదా, అప్పుడు ఏం చేశావు.. అని కేటీఆర్‌పై

(మిగతా 6లో..)

ఎన్నికల్లో సత్తా చాటాలి..

- రిజర్వేషన్ల పేరిట బీసీలను మోసం చేసిన కాంగ్రెస్
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



మాట్లాడుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

ఐనవోలు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తా చాటాలని బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఐనవోలులో బీఆర్‌ఎస్ మండల ఎన్నికల సన్నాహక సమావేశం మండల కన్వీనర్ తంపుల మోహన్ అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరగా కండువా కప్పి ఆహ్వానించారు.

ముఖ్య అతిథిగా పాల్గొన్న దయాకర్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీలను అమలు పరుచడంలో విఫలమైందన్నారు. సర్వేలన్నీ బీఆర్‌ఎస్ వైపే ఉన్నాయని, ఈ ఎన్నికల్లో 90 శాతం బీఆర్‌ఎస్ అభ్యర్థులు గెలవడం ఖాయమని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ రిజర్వేషన్ల పేరిట బీసీలను మోసం చేసిందన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో ప్రతీ కార్యకర్తను కలుపుకొని పనిచేసి పార్టీ అభ్యర్థి గెలుపునకు కష్టపడి పనిచేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పేరిట ప్రభుత్వం పేదలను మోసం చేస్తుందన్నారు. బతుకమ్మ చీరలను బంద్ పెటి ఇందిరమ్మ చీరల పేరిట ఆడబిడ్డలను మోసం చేస్తుందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ మహిళలందరికి బతుకమ్మ చీరలు ఇస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం సంఘాల్లో ఉన్న మహిళలకే ఇస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు మెట్టు శ్రీనివాస్, గుజ్జ గోపాల్‌రావు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ టి.చందర్‌రావు, ఎన్నికల మండల ఇన్‌చార్జి పోలేపల్లి రాంమూర్తి, మాజీ సర్పంచ్‌లు పల్లకొండ సురేష్, ఉస్మాన్‌అలీ, కంజర్ల రమేష్, ఇన్‌చార్జిలు జయపాల్‌రెడ్డి, క్రాంతి, వేణు తదితరులు పాల్గొన్నారు.



డ్రైవర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆర్‌ఎం డి.విజయభాను, అధికారులు

మేడారం రద్దీకి అనుగుణంగా బస్సులు

ఆర్‌ఎం డి.విజయభాను

హనుమకొండ టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాబోయే మేడారం జాతరకు ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ వరంగల్ ఆర్‌ఎం డి.విజయభాను అధికారులను కోరారు. గురువారం వరంగల్ రీజినల్ కార్యాలయంలో డిపో మేనేజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయభాను మాట్లాడుతూ.. 2026 జనవరి 25 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు జాతర నిర్వహిస్తారని ఈ జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ సుమారుగా 3800 బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రయాణికుల సౌకర్యాలు, ట్రాఫిక్ సమస్యలు , నిర్లక్ష్య డ్రైవింగ్ వల్ల జరిగే నష్టాలపై అధికారులతో ఆర్‌ఎం చర్చించారు. భక్తులకు సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు తీసుకోవల్సిన జాగ్రత్తలను డిపో మేనేజర్లకు సూచించారు. శీతాకాలంలో డ్రైవర్లు ఆరోగ్య పరిరక్షణకు జాగ్రత్తలపై కరపత్రాన్ని ఆర్‌ఎం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌ఎం భానుకిరణ్, డిపో మేనేజర్లు, ట్రాఫిక్ సూపర్‌వైజర్లు, మెకానికల్ సూపర్‌వైజర్లు, అకౌంట్స్ ఆఫీసర్స్ తదితరులు పాల్గొన్నారు.

భూ భారతి రిజిస్ట్రేషన్లకు బ్రేక్

ఖిలావరంగల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఖిలావరంగల్ తహసీల్దార్ కార్యాలయంలో భూ భారతికి బ్రేక్ పడింది. భూముల అమ్మకాల కోసం స్లాట్ బుక్ చేసుకున్న రైతులకు వారం రోజులుగా రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. కార్యాలయంలో భూ భారతి (ధరణి) ఆపరేటర్ కరీంనగర్‌కు బదిలీ కావడమే ఇందుకు కారణమని తెలిసింది. ఆయన స్థానంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేకపోవడంతో క్రయవిక్రయాల రిజిస్ట్రేషన్లు సాగడం లేదని రైతులు అంటున్నారు. గత వారం రోజులుగా ఇదే పరిస్థితి వుందని వారు చెబుతున్నారు. అయితే ఈ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని తహసీల్దార్ ఇక్బాల్ తెలిపారు.

రేపు దివ్యాంగులకు క్రీడా పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): డిసెంబరు 3న అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 29న జేఎన్‌ఎస్ వేదికగా జిల్లా స్థాయి దివ్యాంగుల క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి జయంతి తెలిపారు. జూనియర్స్ విభాగంలో 10నుంచి 18ఏళ్ల దివ్యాంగులకు ఒక బ్యాచ్‌గా పోటీలు ఉంటాయన్నారు. అదే విధంగా 18ఏళ్ల నుంచి 54వయస్సు వారికి వేరు వేరుగా ఒక్క రోజు పాటు పోటీలు నిర్వహిస్తామన్నారు. ఇందులో పాల్గొనే దివ్యాంగులకు పరుగుపందెం. షాట్‌పుట్, జావెలిన్‌త్రో, క్యారమ్స్, చెస్ క్రీడాంశాల్లో పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన దివ్యాంగ క్రీడాకారులు తమ వయస్సు ధ్రువీకరణ, అంగవైకల్య ధ్రువీకరణ పత్రాలను వెంట తీసుకొని ఈ నెల 29న ఉదయం 8గంటలకు జేఎన్‌ఎస్‌లో రిపోర్టు చేయాలని జయంతి కోరారు.

నర్సింగ్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్

ప్రైవేట్ కళాశాలల నుండి భారీగా వసూళ్లు

సెంటర్‌కు తాళం వేసి మరీ పరీక్షలు రాయిస్తున్న వైనం



వరంగల్ మెడికల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ (జీఎన్ఎం) వార్షిక పరీక్షల్లో మాస్ కాపీంగ్ జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రి ప్రాంగణంలోని స్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో గురువారం నుండి జీఎన్ఎం పరీక్షలు మొదలయ్యాయి. మొదటి, రెండవ, మూడవ సంవత్సరం విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారు. నగరంలో 9 ప్రైవేట్ కళాశాలల నర్సింగ్ విద్యార్థులు కూడా ఇక్కడే పరీక్షలు రాస్తున్నారు. ఈ పరీక్షల్లో అక్రమాలు పెద్దఎత్తున జరగడం ప్రతీ ఏడాది రివాజుగా మారిందనే ఆరోపణలున్నాయి. నగరంలోని పలు ప్రైవేట్ జీఎన్ఎం కళాశాలల్లో ఎలాంటి క్లాసులు వినకుండానే నర్సింగ్ విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారు. ఈ కళాశాలల్లో చేరే విద్యార్థులు.. తాము పరీక్షలకు మాత్రమే హాజరవుతామని, క్లాసులకు హాజరుకాలేమనే ఒప్పందంతో కళాశాలలో చేరుతారు. ఎలాగైనా తమని పాస్ చేయించే బాధ్యత కూడా కళాశాల నిర్వాహకులకే అప్పగిస్తారు. ప్రైవేట్ ఆసుపత్రులలో, ఇతరత్రా ప్రైవేట్ ఉద్యోగాలలో కొనసాగుతూ పరీక్షలకు హాజరవుతారు. ఇలాంటి విద్యార్థులు పాస్ అయ్యేలా సహకరించేందుకు ప్రభుత్వ జీఎన్ఎమ్ కళాశాల ఉద్యోగులు భారీ మొత్తంలో ముడుపులు స్వీకరిస్తున్నట్లు

(మిగతా 6లో..)

పెద్ద వాహనాలకు షెడ్యూల్ రూపొందించాలి

కమిషనర్‌తో కలిసి వెహికిల్ షెడ్డును పరిశీలించిన మేయర్

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగర పరిధిలోని 66 డివిజన్‌లలో జేసీబీలు, సక్కింగ్ మిషన్ల వినియోగానికి షెడ్యూల్ రూపొందించాలని మేయర్ గుండు సుధారాణి అధికారులకు సూచించారు. గురువారం బాలసముద్రంలోని బల్దియా నిర్వహిస్తున్న వెహికిల్ షెడ్డును కమిషనర్ చహత్ బాజ్‌పాయ్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. పారిశుధ్య నిర్వహణలో భాగంగా బల్దియా పరిధిలోని రెండు సర్కిళ్ల వారీగా ఆరు జేసీబీ వాహనాలు అందుబాటులో ఉంచామన్నారు. ప్రతీ 15 రోజులకు ఒక సారి ఒక డివిజన్‌లో వినియోగించేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్పొరేటర్ల వారీగా డివిజన్‌లలో శానిటేషన్ పనుల నిర్వహణకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. వాహనాలకు షెడ్యూల్ రూపొందించి నీరు నిలిచి ఉండే ప్రాంతాల్లో ఈ యంత్రాల ద్వారా తొలగింపు చేపట్టాలన్నారు.

ఈ వాహనాల కదలికలు ఐసీసీసీకి అనుసంధానం చేయాలన్నారు. డంపింగ్ యార్డ్, ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లలో పంచర్ యూనిట్లు ఏర్పాటు చేయాలన్నారు. చెత్త తరలింపు వాహనాలు ఎక్కడైనా అకస్మాత్తుగా బ్రేక్ డౌన్ ఐతే వాటిని మరమ్మతులు చేయడానికి ఒక మొబైల్ వాహనాన్ని ఏర్పాటు చేయాలన్నారు. స్వచ్ఛ ఆటోలకు మైక్‌సెట్లు లేవని వెంటనే మైకులు అమర్చి కాలనీల్లో తిరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎస్ఈ సత్యనారాయణ, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్‌వో రాజేశ్, ఈఈలు మహేందర్, రవికుమార్, మాధవీలత, డీఈలు రాజ్‌కుమార్, శ్రీకాంత్, శానిటరీ సూపర్‌వైజర్లు శ్రీను, ఏఈవో ఫణీ పాల్గొన్నారు.

కుటుంబ నియంత్రణలో పురుషులు ముందుండాలి

డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య

హసన్‌పర్తి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): శాశ్వత కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించడంలో పురుషులు ముందుండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ.అప్పయ్య అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత శ్రేణి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎన్ఎస్‌వీ ఆపరేషన్ క్యాంపును గురువారం డీఎంహెచ్‌వో ఆకస్మికంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. వేసెక్టమీ పక్షోత్సవాలలో భాగంగా నవంబరు 21 నుంచి డిసెంబరు 4వ తేదీ వరకు పురుషులకు కుట్టులేని ఎన్ఎస్‌వీ ఆపరేషన్ల పట్ల అవగాహన కల్పించడంతో పాటు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

అంతేకాకుండా తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతులైన అంతర ఇంజక్షన్, కాపర్టీ, నోటి మాత్రలు, నిరోధ్ గురించి అర్హులైన దంపతులకు అవగాహన కల్పిస్తున్న ట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌వీ సర్జన్ డాక్టర్ కృష్ణారావు 21 మందికి వేసెక్టమీ ఆపరేషన్లు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాతా శిశు సంక్షేమ ప్రోగ్రాం అధికారి డాక్టర్ మంజుల, స్టాటిస్టికల్ అధికారి డాక్టర్ జి.ప్రసన్నకుమార్, ఫార్మసిస్టు అజిత, సబ్ యూనిట్ ఆఫీసర్ మాధవరెడ్డి, హెచ్‌వీ రూతమ్మ, హెల్త్ సూపర్‌వైజర్లు సీతల్‌సింగ్, లచ్చులునాయక్, హెల్త్ అసిస్టెం ట్లు కందుకూరి సంతోష్‌కుమార్, ఇంద్రారెడ్డి, ఉదయవరులు, నాగయ్య, సతీష్, మోసిన్ తదితరులు పాల్గొన్నారు.

నేను దమ్మున్న నాయకుడిని..

(5వ పేజీ తరువాయి)

మండిపడ్డారు. కేటీఆర్ నాయకత్వంలో పని చేయలేమనే కవిత దూరమైందని, హరీష్‌రావు బాధపడుతున్నాడన్నారు.

హరీష్‌రావు సమయం కోసం చూస్తున్నాడని, కేసీఆర్ ఉన్నాడని ఆగుతున్నారని, కేసీఆర్ ఉన్నన్ని రోజులు మాత్రమే పార్టీ ఉంటుందని, తర్వాత ముక్కలు చెక్కలు అవుతుందని జోస్యం చెప్పారు. ఇప్పటికే కేటీఆర్ పైన ఫోన్ ట్యాపింగ్ కేసు, కారు రేసింగ్ కేసులు ఉన్నాయని, ఎప్పుడు జైలుకు వెళ్తాడో తెలియదన్నారు. కేటీఆర్ చరిత్ర అందరికీ తెలుసని, నాయకుడే గోకుడు, గీకుడు చేస్తున్నాడని విమర్శించారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడమే కాంగ్రెస్ విధానమని, రిజర్వేషన్లపై అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపితే కేంద్రం పైన ఒత్తిడి తేవాల్సిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు.. అసత్య ఆరోపణలు చేస్తున్నారని కడియం ఆరోపించారు. బీజేపీకి బీసీల పైన ప్రేమ ఉంటే వెంటనే బీసీ రిజర్వేషన్లు అమలు చేసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు జూలకుంట్ల శిరీష్ రెడ్డి, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలిపాక సతీష్, పీఏసీఎస్ చైర్మన్ తీగల కరుణాకర్‌రావు, అన్నం బ్రహ్మారెడ్డి, తెల్లాకుల రామకృష్ణ, కత్తుల కట్టయ్య, కందుల గట్టయ్య, ఎల్లయ్య పాల్గొన్నారు.

శాస్త్రవేత్తలుగా ఎదగడానికి సైన్స్ ఫెయిర్లు దోహదం

● డీఈవో రంగయ్య నాయుడు ● ఆకట్టుకున్న విద్యార్థుల ఎగ్జిబిట్లు ● 395 ఆర్బీవీపీ, 164 ప్రాజెక్టుల ప్రదర్శన

కరీమాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు భవిష్యత్ శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు సైన్స్‌ఫెయిర్లు దోహదం చేస్తాయని డీఈవో రంగయ్య నాయుడు అన్నారు. గురువారం నగరంలోని ఉర్సు గుట్ట బైపాస్ రోడ్డులో గల తాళ్ల పద్మావతి ఇంటర్నేషనల్ స్కూల్లో వరంగల్ జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ మనక్, ఆర్బీవీపీ సైన్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. సైన్స్ వరంగల్ జిల్లా అధికారి డాక్టర్ సట్ల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఈవో రంగయ్య నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ నూతన ఆవిష్కరణలకు బీజం వేసేది నేటి బాలలేనని అన్నారు. విద్యార్థులు సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలను చేసేలా చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండాలన్నారు.



ఎగ్జిబిట్ వివరాలను తెలుసుకుంటున్న ఆర్జేడీ, తదితరులు

జిల్లా సైన్స్ అధికారి సట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ ఆర్బీవీపీ 395 ఎగ్జిబిట్లు, ఇన్‌స్పైర్‌వి 164 ప్రాజెక్టులను విద్యార్థులు గైడ్ టీచర్ల సహకారంతో ప్రదర్శిస్తున్నారని తెలిపారు. 'స్టెమ్ ఫర్ వికసిత్, అమృత భారత్' అను ప్రధాన అంశంతో సైన్స్‌ఫెయిర్‌ను నిర్వహిస్తున్నామని, ఏడు ఉప అంశాల్లో పోటీలు ఉంటాయన్నారు. ప్రదర్శనలో విద్యార్థులకు రెండో రోజు 28వ తేదీన 'ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించడం' అనే అంశంతో సెమినార్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. విద్యార్థులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ లేదా చార్టులతో సెమినార్ పేపర్‌ను సమర్పించాలని సూచించారు. సెమినార్లో పాల్గొనే విద్యార్థులు రెండోరోజు ఉదయాన్నే వేదిక పాఠశాల వద్ద తమ పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమ వ్యాఖ్యాతగా టి.శ్రీధరాచార్యులు వ్యవహరించారు. గురువారం ప్రదర్శనను 2 వేల మంది విద్యార్థులు సందర్శించారు. యూనివర్సిటీ డిగ్రీ కళాశాలల లెక్చరర్లు జడ్జిలుగా వ్యవహరించారు. నేడు విద్యార్థులను అధిక సంఖ్యలో సైన్స్‌ఫెయిర్‌ను తిలకించడానికి తీసుకురావాలని డీఈవో రంగయ్య నాయుడు, సైన్స్ జిల్లా అధికారి కట్ల శ్రీనివాస్ కోరారు.

సైన్స్‌ఫెయిర్‌ను సందర్శించిన ఆర్జేడీ

ఈ సైన్స్‌ఫెయిర్‌ను విద్యాశాఖ ఆర్‌జేడీ సత్యనారాయణ రెడ్డి సందర్శించారు. విద్యార్థుల ఎగ్జిబిట్లను ఆసక్తిగా పరిశీలించి వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రదర్శిస్తున్న ఎగ్జిబిట్లు వినూత్నంగా ఉన్నాయన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో రంగయ్య నాయుడు

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

కార్యక్రమం ప్రారంభోత్సవంలో చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లి జడ్పీ పాఠశాల, తాళ్ల పద్మావతి ఇంటర్నేషనల్ స్కూల్, కేజీబీవీ ఖానాపూర్ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారులు ఉండ్రాతి సుజన్ తేజ, కొల్లూరి ఫ్లోరెన్స్, విజయ్‌కుమార్, డీసీఈబీ సెక్రటరీ గారె కృష్ణమూర్తి, ఏసీజీఈ అరుణ, ఎంఈవో ప్రసాద్, తాళ్ల పద్మావతి విద్యాసంస్థల అధినేత తాళ్ల మల్లేశం, డైరెక్టర్లు వంశీ, వరుణ్, రాహుల్, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, 18 కమిటీల కన్వీనర్లు, కో-కన్వీనర్లు, సభ్యులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యం

ప్రైవేట్ కళాశాల వద్ద ఆందోళన

కరీమాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా కాజీపేట మండలం 44వ డివిజన్ భట్టుపల్లి ప్రధాన రోడ్డుపై ఉన్న సిగ్మా జూనియర్ కళాశాల గురుకులంలో విద్యార్థి అదృశ్యమయ్యాడు. ఈ విషయాన్ని కళాశాల యాజమాన్యం విద్యార్థి కుటుంబ సభ్యులకు తెలుపగా వారు, విద్యార్థి సంఘాలు కళాశాలకు చేరుకొని ఆందోళన చేపట్టారు. గూడెప్పాడ్‌కు చెందిన విద్యార్థి శివరాంరెడ్డి సిగ్మా కళాశాలలో సీఈసీ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. ఈ విద్యార్థి గురువారం ఉదయం 5 గంటల నుంచి కళాశాలలో కనిపించకుండా వెళ్లాడు. తమ కుమారుడి ఆచూకీ తెలపాలని విద్యార్థి కుటుంబ సభ్యులు యాజమాన్యాన్ని నిలదీశారు. కళాశాల ఫర్నిచర్, కంప్యూటర్లను ధ్వంసం చేశారు. దీంతో కళాశాల వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. విషయం తెలుసుకున్న మడికొండ పోలీసులు కళాశాల వద్దకు చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. శివరాం కుటుంబ సభ్యులు ఫిర్యాదుతో దర్యాప్తు చేస్తున్నట్లు మడికొండ సీఐ పుల్యాల కిషన్ తెలిపారు.

ఎన్నికలకు పకడ్బందీ బందోబస్తు చేపట్టాలి

రౌడీషీటర్లు, నేరస్థులను బైండోవర్ చేయాలి

సమీక్షా సమావేశంలో సీపీ సన్‌ప్రీత్‌సింగ్

వరంగల్‌క్రైం, నవంబరు27 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ఆయా పోలీస్‌స్టేషన్ల అధికారులు పకడ్బందీగా బందోబస్తు ఏర్పాట్లు చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ పోలీస్ అధికారులను ఆదేశించారు. గురువారం కమిషనరేట్ పరిధిలోని ఈస్ట్, సెంట్రల్, వెస్ట్‌జోన్‌లోని పోలీస్ అధికారులతో గురువారం నెలవారీ సమీక్షా సమావేశం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మూడు విడతల్లో జరగనున్న పంచాయతీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై చర్చించారు. పోలీస్‌స్టేషన్ల వారీగా ఎన్నికలు జరిగే గ్రామపంచాయతీల వివరాలతో పాటు సమస్యాత్మక, అతి సమస్యాత్మక కేంద్రాల వివరాలు సీపీ అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీపీ సన్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ.. స్టేషన్ పరిధిలో లైసెన్స్ కలిగిన ఆయుధాలను పోలీస్‌స్టేషన్‌లో డిపాజిట్ చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రౌడీషీటర్లతో పాటు గత ఎన్నికల సమయంలో నేరాలకు పాల్పడిన నేరస్థులను, అనుమానితులను బైండోవర్ చేయాలన్నారు. ఈ సమావేశంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్‌కుమార్, సెంట్రల్ జోన్ డీసీపీ కవిత, వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్, ఏఎస్పీలు శుభం, చైతన్య, అదనపు డీసీపీలు రవి, ప్రభాకర్, బాలస్వామి, సురేష్‌కుమార్, శ్రీనివాస్, ఏసీపీలు, ఇన్స్‌పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.



నేర సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సీపీ సన్‌ప్రీత్‌సింగ్

నిబంధనలను గాలికొదిలేశారా..?

అధికారులు, నిర్వాహకులపై కలెక్టర్ సీరియస్ ● ఏపీఎం, సెంటర్ ఇన్‌చార్జికి షోకాజ్ నోటీసు



కొనుగోలు కేంద్రం నిర్వాహకులను ప్రశ్నిస్తున్న కలెక్టర్ స్నేహ శబరీష్

శాయంపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): 'వారం రోజుల క్రితం కొనుగోలు కేంద్రం ప్రారంభించి ధాన్యం సేకరిస్తున్నా కనీసం ట్యాబ్ ఎంట్రీ చేయడం లేదు... ఏపీఎం వేణుగోపాల్, సెంటర్ ఇన్‌చార్జి నిరోషాకు షోకాజ్ నోటీసు ఇచ్చి, నాకు కాపీ పంపండి' అని కలెక్టర్ స్నేహ శబరీష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శాయంపేట మండలం పత్తిపాక గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాన్ని గురువారం కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ క్రమంలో సెంటర్‌లో ట్యాబ్ లేకపోవడంతో విస్మయానికి గురయ్యారు. ట్యాబ్ లేకుండా సెంటర్ ఎలా నడుపుతున్నారని, 35 మంది రైతులకు సంబంధించిన ధాన్యం సేకరణ పూర్తయినా ట్యాబ్ ఎంట్రీ చేయకపోవడంతో రైతులకు డబ్బులు ఎలా జమ అవుతాయని, అసలు కొనుగోలు కేంద్రాన్ని పట్టించుకుంటున్నారా..? లేక గాలికొదిలేశారా..? అని అధికారులపై సీరియస్ అయ్యారు.

ట్యాబ్ తెప్పించుకుని ఎంట్రీ చేయమనగా నిర్వాహకులు సక్రమంగా చేయకపోవడం, సాంకేతిక సమస్య చెప్పడంతో అసలు ఇక్కడ ఏం జరుగుతుందని, నిర్వాహకులకు ఏం చెప్పారని, సమస్య ఉంటే ముందే సరిదిద్దుకోరా.. అంటూ ఏపీఎం వేణుగోపాల్, సీసీ మంజులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గన్నీ బ్యాగులు ఎక్కడ ఉన్నాయని, సెంటర్‌లో కనీసం నీడ కోసం టెంట్ కూడా వేయలేదు, రైతులకు కుర్చీలు ఏర్పాటు చేయలేదని, ఫ్లెక్సీ పెట్టలేదని, కమీషన్ తీసుకుంటున్నారు కదా.. చేతనైతే చేయండి లేకుంటే మానేయండి, వేరేవారు చేస్తారని, రైతులను ఇబ్బందులు పెట్టొద్దని అసహనం వ్యక్తం చేశారు. ఎంపీడీవో ఫణిచంద్ర దగ్గరుండి సెర్ప్ అధికారులతో ప్రొక్యూర్‌మెంట్‌ను వెంటనే ట్యాబ్ ఎంట్రీ చేయించాలని లేకుంటే చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆర్.ప్రవీణ్‌కుమార్, ఇన్‌చార్జి ఏవో శ్రీనివాస్, మండల గిర్దావర్ రమేష్, ఎంపీవో రంజిత్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థిని ఆకస్మిక మృతి

స్కూల్‌కు నడుచుకుంటూ వస్తూనే అనంత లోకాలకు..

కన్నీటి పర్యంతమైన విద్యార్థులు, కుటుంబ సభ్యులు



మృతి చెందిన విద్యార్థిని దివిజశ్రీ

హనుమకొండ టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సుబేదారి పోలీసు స్టేషన్ పరిధిలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని దివిజశ్రీ(14) ఆకస్మికంగా మృతి చెందింది. గురువారం సుబేదారి సీఐ మేకల రంజిత్ తెలిపిన వివరాల ప్రకారం... నాయుడు పెంట్రోల్ బంక్ వినాయకనగర్ కాలనీకి చెందిన సూరారపు క్రాంతికుమార్ - కల్యాణి దంపతులకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. క్రాంతికుమార్ మామునూరు ఫోర్త్ బెటాలియన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు.

పెద్ద కూతురు దివిజశ్రీ హనుమకొండలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతోంది. ఉదయం స్కూల్ వ్యాన్‌లో స్కూల్‌కు వచ్చింది. స్కూల్ లోనికి నడుచుకుంటూ వెళ్తూ కిందపడి పోయినట్లు తెలిపారు. పాఠశాల సిబ్బంది వెంటనే తల్లిదండ్రులకు సమాచారం అందించి హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి దివిజశ్రీని తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలపడంతో తోటి విద్యార్థులు, పాఠశాల యాజమాన్యం, తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. అప్పటిదాక నడుచుకుంటూ అందరితో మాట్లాడిన దివిజశ్రీ ఆకస్మిక మృతి చెందడంతో పాఠశాలలో విషాదం నెలకొంది. కాగా, దివిజశ్రీ తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఎంజీఎంలో పోస్టుమార్టం నిర్వహించినట్లు సీఐ మేకల రంజిత్‌కుమార్, ఎస్సైలు మహేందర్‌రెడ్డి, ఫణిలు తెలిపారు. కాగా, విద్యార్థిని దివిజశ్రీ మృతికి గుండెపోటు కారణమని వైద్యులు చెబుతున్నారు.

నర్సింగ్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్

(5వ పేజీ తరువాయి)

తెలుస్తుంది. ప్రధాన గేటుకు తాళం వేసి డబ్బులు ముట్టిన కళాశాలల నర్సింగ్ విద్యార్థులను ఒక చోట, డబ్బులివ్వని విద్యార్థులను మరోచోట సీటింగ్ అరెంజ్‌మెంట్ చేసి పరీక్షలు రాయిస్తున్నట్టు తెలిసింది. దీంతో కష్టపడి చదివిన నర్సింగ్ విద్యార్థులకు అన్యాయం జరుగుతోందనే విమర్శలున్నాయి. మాస్ కాపీయింగ్ వల్ల వారు తక్కువ మార్కులు పొందుతున్నట్లు చెబుతున్నారు. ఇప్పటికైనా వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని, ఎగ్జామినేషన్ సెంటర్ సూపరింటెండెంట్‌తోపాటు ఇన్విజిలేటర్‌లను ప్రతీ రోజు మార్చాలని నర్సింగ్ విద్యార్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

ఎల్కతుర్తి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎల్కతుర్తి మండల పరిధిలో సర్పంచ్ నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను గురువారం కలెక్టర్ స్నేహ శబరీష్ పరిశీలించారు. ఎల్కతుర్తి, దామెర, గోపాల్‌పూర్ క్లస్టర్లను సందర్శించారు. ఈ సందర్భంగా నామినేషన్ స్వీకరణ కేంద్రాల్లో ఎలక్షన్ నోటీస్, ఓటర్ల జాబితా, హెల్ప్ డెస్క్‌లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. నామినేషన్ల ప్రక్రియను అధికారులు జాగ్రత్తగా నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. హనుమకొండ జిల్లా పరిధిలోని ఎల్కతుర్తి, భీమదేవరపల్లి, కమలాపూర్ మండలాల్లో సర్పంచ్, వార్డు స్థానాలకు మొదటి విడతలో ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. జిల్లా వ్యాప్తంగా 210 గ్రామ పంచాయతీలు, 1986 వార్డు స్థానాలకు మూడు విడతల్లో ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. మొదటి విడతగా ఎల్కతుర్తి, భీమదేవరపల్లి, కమలాపూర్ మండలాల్లో ఎన్నికలు నిర్వహిస్తున్నందున క్లస్టర్ల వారీగా నామినేషన్ స్వీకరణ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఎల్కతుర్తి, భీమదేవరపల్లి, కమలాపూర్ మండలాల పరిధిలో 24 క్లస్టర్లు ఉన్నాయని చెప్పారు. జిల్లాలో మొత్తంలో 74 క్లస్టర్లు ఉన్నట్లు తెలిపారు.

ఎన్నికల నియమావళి మేరకు ప్రభుత్వ, ప్రైవేటు స్థలాల్లో ఎలాంటి రాజకీయ పార్టీల హోర్డింగ్‌లు, బ్యానర్లు, గోడ ప్రతులు, రాతలు ఉండకూడదన్నారు. ప్రైవేటు స్థలాల్లో ఎలాంటి వాటిని ఏర్పాటు చేయాలకున్న ప్రభుత్వ అనుమతి తప్పక తీసుకోవాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ప్రారంభోత్సవాలు చేయరాదన్నారు. నోడల్ అధికారి ఆత్మారాం, జడ్పీ సీఈవో రవి, తహసీల్దార్ ప్రసాద్‌రావు, ఎంపీడీవో విజయ్‌కుమార్, ఎంపీవో రవి పాల్గొన్నారు.

ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలి

● జిల్లా ఎన్నికల పరిశీలకుడు శివకుమార్ నాయుడు

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ జిల్లా గ్రామ పంచాయతీ ఎన్నికలను సాఫీగా నిర్వహించేందుకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాటు చేయాలని గ్రామ పంచాయతీ ఎన్నికల పరిశీలకుడు, ఐఏఎస్ అధికారి కిల్లు శివకుమార్‌నాయుడు అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణపై జిల్లా కలెక్టర్ స్నేహశబరీష్, జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, ఇతర అధికారులతో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం శివకుమార్ నాయుడు, వ్యయ పరిశీలకుడు దేవేందర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శివకుమార్ నాయుడు మాట్లాడుతూ.. నామినేషన్ కేంద్రాల ఏర్పాటు, నామినేషన్ల స్వీకరణ సందర్భంగా పాటించాల్సిన నియమ నిబంధనలు, ఎన్నికల సంబంధిత అంశాలపై చర్చించారు. ఎన్నికల నిబంధనలను పక్కాగా పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్నేహశబరీష్ మాట్లాడుతూ..మూడు దశల్లో పంచాయతీ ఎన్నికలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, సిబ్బంది నియామకం, బ్యాలెట్ బాక్సుల రవాణా, జోన్‌లు, రూట్, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. ఎన్నికలు పూర్తి స్థాయి పారదర్శకతతో జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని శివకుమార్ నాయుడికి కలెక్టర్ వివరించారు.

నామినేషన్ కేంద్రాల పరిశీలన

వరంగల్, కలెక్టరేట్ నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలు సజావుగా సాగేందుకు కృషి చేయాలని ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకురాలు, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాల మాయాదేవి పేర్కొన్నారు. గురువారం వర్ధన్నపేట, రాయపర్తి, పర్వతగిరి మండలాల్లోని పలు నామినేషన్ కేంద్రాలను కలెక్టర్ సత్యశారద, వ్యయ పరిశీలకురాలు సునాయన చౌహాన్‌తో కలిసి ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడి నామినేషన్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరుగకుండా చూడాలన్నారు. అవసరమైన ధ్రువపత్రాలను గురించి అభ్యర్థులకు అర్థమయ్యేలా వివరించాలని సూచించారు. నామినేషన్ల పారాల్లో తప్పులు ఉంటే అభ్యర్థులకు సహకరించాలని ఆదేశించారు. ఎన్నికల ఖర్చుల వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించారు. పోటీ చేసే అభ్యర్థులు ప్రత్యేక బ్యాంకు ఖాతా ఉండాలని, నిబంధనలకు అనుగుణంగానే ఖర్చు చేయాలని వెల్లడించారు. సోషల్ మీడియా పోస్టులపై నిఘా ఉంచి, ఎన్నికల ప్రవర్తన నియమావళిని అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జడ్పీసీఈవో రామిరెడ్డి, డీపీవో కల్పన, ఆర్డీవో సుమ, తహసీల్దార్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.



రాయపర్తిలో అధికారులకు సూచనలిస్తున్న బాల మాయాదేవి

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	6980	6300
మక్కలు	1855	1521
కందులు	----	----
పెసళ్లు	----	----
పల్లికాయ (సూక)	7610	3500
పల్లికాయ (పచ్చిది)	6000	3890
పసుపు (కాడి)	12222	12222
పసుపు (గోల)	11709	11709
తేజ మిర్చి	----	----
తేజ మిర్చి ఏసీ	14700	14700
వండర్‌హాట్	----	----
వండర్‌హాట్ ఏసీ	18500	12000
యూఎస్341ఏసీ	17500	9000
దీపిక	----	----
సింగిల్‌పట్టి ఏసీ	----	----
తాలు మిర్చి	6000	4000

- వరంగల్ వ్యవసాయం

పట్టాల పంపిణీకి వేళాయె..

- నేడు వరంగల్ నిట్ 23వ స్నాతకోత్సవం
- ఓవరాల్ టాపర్‌గా సీఎస్ఈ విద్యార్థి శ్రీసత్య నవీన్
- 1913 మందికి పట్టాలు, 14 మందికి బంగారు పతకాలు
- ముఖ్య అతిథిగా మైక్రాన్ ఇండియా ఎం.డి. ఆనంద రామమూర్తి
- సర్వాంగ సుందరంగా ముస్తాబైన క్యాంపస్



స్నాతకోత్సవంలో పట్టాలు అందుకునేందుకు వచ్చిన విద్యార్థులతో నిట్‌లో నెలకొన్న సందడి

హనుమకొండ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నిట్ 23వ స్నాతకోత్సవం శుక్రవారం జరగనుంది. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. క్యాంపస్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. అంబేడ్కర్ లెర్నింగ్ సెంటర్ (ఏఎల్‌సీ)లో జరిగే వేడుకకు ఈ సారి ముఖ్య అతిథిగా మైక్రాన్ ఇండియా, మైక్రాన్ టెక్నాలజీ ఆపరేషన్ ఇండియా ఎల్ఎల్‌పీ వైస్ ప్రెసిడెంట్, మేనేజింగ్ డైరెక్టర్ ఆనంద రామమూర్తి హాజరవుతున్నారు. గౌరవ అతిథులుగా సియాంట్ లిమిటెడ్ వ్యవస్థాపక చైర్మన్, మాజీ మేనేజింగ్ డైరెక్టర్, ఐఐటీ హైదరాబాద్, ఐఐటీ రూర్కీ బోర్డ్ ఆఫ్ గవర్నర్ డాక్టర్ బీవీఆర్ మోహన్ రెడ్డి, డిపార్టుమెంట్ ఆఫ్ డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (డీఆర్‌డీ) సెక్రెటరీ, డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీవో) చైర్మన్ కూడా అయిన డాక్టర్ వి.సమీర్ కామత్ హాజరవుతున్నారు.

1913 మందికి పట్టాలు

నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి గురువారం బోస్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ సారి మొత్తం 1913 మంది విద్యార్థులకు పట్టాలను అందజేయనున్నట్టు తెలిపారు. వీరిలో 953 మంది బీటెక్, 556 మంది ఎంటెక్, 149 మంది ఎంఎస్సీ, 38 మంది ఎంబీఏ, 56 మంది ఎంసీఏ విద్యార్థులు, 142 మంది పీహెచ్‌డీ స్కాలర్లు, 19 మంది బీఎస్ సీ, బీఎస్సీ (హానర్స్), ఇంజనీరింగ్‌లో పీజీ డిప్లొమా విద్యార్థులు ఉన్నారని తెలిపారు.

ఉత్తమ బీటెక్ ప్రాజెక్టు అవార్డు విజేత
మీర్ రహమాన్ (ఎంటెక్, సస్టేనబుల్ ఎనర్జీ జనరేషన్ అండ్ స్టోరేజీ టెక్నాలజీస్)

బెస్ట్ ఎంటెక్ డిసెర్టేషన్ అవార్డు విజేత
ఆయేషా డాంగే (ఎంటెక్, సస్టేనబుల్ ఎనర్జీ జనరేషన్ అండ్ స్టోరేజ్ టెక్నాలజీస్)

ఉత్తమ పీహెచ్‌డీ థీసిస్ అవార్డు విజేత
డాక్టర్ నిఖిల్ భరత్ (మెకానికల్ ఇంజనీరింగ్)

14 మందికి బంగారు పతకాలు

ప్రతీ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లో బీటెక్‌లో టాపర్‌గా నిలిచిన 14 మంది విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ ప్రదానం చేయనున్నట్టు తెలిపారు. ఈసారి ముగ్గురు విద్యార్థులు డైరెక్టర్ గోల్డ్ మెడల్స్ అందుకోబోతున్నట్టు తెలిపారు. వీరిలో ఓవర్ ఆల్ టాపర్‌గా పాలచర్ల శ్రీ సత్య నవీన్ నిలిచారు. ఆయన అన్ని బీటెక్ ప్రోగ్రాముల్లో అత్యున్నతంగా నిలిచి కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్‌లో ఇన్‌స్టిట్యూషనల్ గోల్డ్ మెడల్ (డైరెక్టర్స్ గోల్డ్ మెడల్) అందుకోబోతున్నారన్నారు. దీంతో పాటు ఆయన రోల్ ఆఫ్ హానర్ గోల్డ్ మెడల్‌ను కూడా స్వీకరించబోతున్నారు. అలాగే అన్ని ఎంటెక్ ప్రోగ్రాములలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినిగా కొండ సౌమ్య కూడా డైరెక్టర్ గోల్డ్ మెడల్ స్వీకరించనున్నట్టు చెప్పారు. ఎంబీఏ, ఎంసీఏ, ఎంఎస్సీ కోర్సుల్లో కూడా అందరికన్నా టాపర్‌గా నిలిచిన రోహన్ గుప్తాకు కూడా డైరెక్టర్స్ గోల్డ్ మెడల్ ప్రదానం చేయనున్నట్టు తెలిపారు. బీటెక్ ప్రాజెక్టు అవార్డును మీర్ రహమాన్, ఎంటెక్ డిసెర్టేషన్ అవార్డు ఆయేషా దాంగే, పీహెచ్‌డీ థీసిస్ అవార్డు డాక్టర్ నిఖిల్ భరత్ అందుకోబోతున్నట్టు వెల్లడించారు.



మా అమ్మ ప్రోత్సాహం మరువలేను

వరంగల్ నిట్‌లో బిటెక్ (కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్)లో ఓవరాల్ టాపర్‌గా డైరెక్టర్ గోల్డ్ మెడల్ (ఇన్‌స్టిట్యూషన్)తో పాటు అందరికన్నా ఎక్కువ మార్కులు తెచ్చుకున్నందుకు రోల్ ఆఫ్ హానర్ గోల్డ్ మెడల్ లభించినందుకు ఆనందంగా ఉంది.ఈ విజయంలో మా అమ్మ సునీత దేవి ప్రోత్సాహం ఎంతో ఉంది. మాది తూర్పుగోదావరి జిల్లా మండపేట మండలం అచ్యుతాపురం గ్రామం. రైతు కుటుంబం.

\- పాలచెర్ల శ్రీ సత్య నవీన్, రెండు బంగారు పతకాల విజేత



గోల్డ్‌మెడలిస్టులతో నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాదర్ సుబుధి

ఇద్దరికి అత్యున్నత పురస్కారాలు

వరంగల్ నిట్ చరిత్రలో మొదటి సారిగా ఇద్దరికి అత్యున్నత పురస్కారాలను ప్రదానం చేస్తున్నట్టు డైరెక్టర్ తెలిపారు. సాయుధ దళాల కోసం దేశావాళీ రక్షణ వ్యవస్థలను, అధునాతన సాంకేతికతలను అభివృద్ధి చేయడంలో విశేషంగా కృషి చేసినందుకు గుర్తింపుగా డీఆర్‌డీవో చైర్మన్ వి సమీర్ కామత్‌కు గౌరవ డాక్టరేట్‌ను, అలాగే దేశానికి భద్రత, సస్టేనబుల్ ఎనర్జీ ట్రాన్స్‌ఫార్మేషన్‌లో కీలక భూమిక పోషించినందుకుగాను గుర్తింపుగా ఎన్. వేణుకు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (హానరీస్ కాసా) ప్రదానం చేస్తున్నట్టు తెలిపారు.

డైరెక్టర్ గోల్డ్ మెడల్ విజేతలు :

- పాలచర్ల శ్రీ సత్య నవీన్, బీటెక్ (కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్)
- కొండా సౌమ్య, ఎంటెక్ (పవర్ సిస్టమ్స్ ఇంజనీరింగ్)
- రోహన్ గుప్తా ఎంఎస్సీ (ఆర్గానిక్ కెమిస్ట్రి)

రోల్ ఆఫ్ హానర్ గోల్డ్ మెడల్ విజేతలు:

- పెరవాలి సుధీర్ కుమార్ (సివిల్ ఇంజనీరింగ్)
- ఉకాలే అశుతోష్ అనిల్ కుమార్ (ఎలక్ట్రికల్ అండ్ ఎకానమిక్స్ ఇంజనీరింగ్)
- దేశ్‌పాండే శ్రేయాస్ (మెకానికల్ ఇంజనీరింగ్)
- మండపాక వెంకట శివ శ్రీమంత్ (ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్)
- కరుపర్తి నాగసాయి కార్తీక్ (మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్)
- పాడి తేజేశ్వర్ రావు (కెమికల్ ఇంజనీరింగ్)
- పాలచర్ల శ్రీ సత్య నవీన్ (కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్)
- శానిక నిఖిల్ కన్‌హేర్ (బయోటెక్నాలజీ).



దేవస్థానంలో నిరుపయోగంగా ఉన్న వాటర్ ప్లాంట్



కూల్చివేస్తున్న దేవస్థానం పరిసరాల్లోని షాపింగ్‌కాంప్లెక్స్

జాతర సమీపిస్తున్నా అదే తీరు

- మేడారంలో మెరుగుపడని సౌకర్యాలు
- ముందస్తు మొక్కులకు వస్తున్న భక్తులకు ఇబ్బందులు

తాడ్వాయి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మేడారం సమ్మక్క-సారలమ్మలను దర్శించుకోవడానికి తరలివస్తున్న భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. మహాజాతర సమీపిస్తున్నా ఇంకా సౌకర్యాలు మెరుగుపడలేదు. దీంతో ముందస్తుగా వనదేవతలను దర్శించుకోవడానికి వస్తున్న వారు సమస్యలతో సతమతం కావాల్సి వస్తోంది. ముఖ్యంగా ఇక్కడ తాగునీటి కొరత తీవ్రంగా ఉంది. ఓ భక్తుడు ఇటీవల బహూకరించిన ఆర్వో వాటర్ ప్లాంట్ పనిచేయడం లేదు. ఈ ప్లాంట్ కోసం దేవాదాయ శాఖ అధికారులు రూ.3లక్షలు ఖర్చు చేసి బోరు బావి, షెడ్ నిర్మించారు. ఈ ప్లాంట్ కొన్ని రోజులు ఉపయోగంలోనే ఉంది. సంవత్సర కాలంగా అధికారులు, సిబ్బంది పటించుకోకపోవడంతో రిపేర్‌కువచ్చింది. 2026 మహా జాతరకు సమయం దగ్గర పడుతున్న క్రమంలో ముందస్తుగావస్తున్న భక్తులకు నీటిసౌకర్యం కరువైంది.తల్లుల దర్శనం అయ్యేంత వరకు చుక్క నీరు కూడా తాగకుండా ఉండాల్సి వస్తోంది.

షాపింగ్ కాంప్లెక్స్ కూల్చివేత

మేడారం మాస్టర్ ప్లాన్‌లో భాగంగా దేవస్థానం పరిసరాల్లోని షాపింగ్ కాంప్లెక్స్‌ను కూల్చి వేస్తున్నారు. దీంతో చిరు వ్యాపారులు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. 2018లో ఐటీడీఏ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో రూ. 4కోట్లతో 27 షాప్‌లను నిర్మించారు. మేడారం దేవస్థానం వందల సంవత్సరాలు శాశ్వతంగా నిలిచేలా ప్రభుత్వం ప్రతిష్టాత్మకం గా రూపొందించిన మాస్టర్ ప్లాన్ నిర్మాణాలకు అడ్డుగా ఉందని దీన్ని తొలగించారు. దీంతో తాము జీవనోపాధిని కోల్పోయామని చిరువ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ప్రత్యామ్నాయంగా శాశ్వతంగా అధిక సంఖ్యలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి తమకు ఉపాధి కల్పించాలని కోరుతున్నారు.

పడకేసిన పారిశుధ్యం

మేడారం వనదేవతలను దర్శించుకోవడానికి తరలివస్తున్న భక్తులు అక్కడి అటవీ ప్రాంతంలో విడిది చేస్తుంటారు. పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో ఆ ప్రదేశమంతా వ్యర్థాలతో నిండిపోయాయి. భక్తులు చెట్ల కింద శుభ్రం చేసుకొని సేద తీరాల్సి వస్తోంది. మేడారం నుంచి తాడ్వాయి వెళ్లే రహదారిలో సుమారు ఐదు కిలో మీటర్ల మేర చెత్త, వ్యర్థాలు పేరుకు పోయాయని, అయినా అధికారులు పారిశుధ్య పనులు చేపట్టడం లేదని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యర్థాలను పాడి పశువులు, దుక్కిటెద్దులు, పందులు, మేకలు, గొర్రెలతోపాటు వణ్యప్రాణులు తింటూ మృత్యువాత పడుతున్నాయని అంటున్నారు. వెంటనే మేడారం పరిసరాలోని అటవీ ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని కోరుతున్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ పనులు ప్రారంభం

మహాజాతర నేపథ్యంలో భక్తకోటికి సౌకర్యాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 150 కోట్లు మంజూరు చేసిన విషయం విదితమే. ఇందులో భాగంగా ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో పలు పనులు ప్రారంభమయ్యాయి. ముఖ్యంగా భక్తులకు తాత్కాలిక మరుగుదొడ్లు, తాగునీరు తదితర సౌకర్యాల కోసం టెండర్లను ఆహ్వానించగా ఆయా పనులు గురువారం ప్రారంభమయ్యాయి.

ముందస్తుగా తరలివస్తున్న భక్తులు

తాడ్వాయి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో రద్దీ పెరుగుతోంది. వనదేవతలకు మొక్కులు చెల్లించుకోవడానికి భక్తులు ముందస్తుగా తరలివస్తున్నారు. వివిధ ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి వచ్చి సమ్మక్క- సారలమ్మలను దర్శించుకుంటున్నారు. ఈ క్రమంలో గురువారం 10వేల మందికి పైగా తరలివచ్చారని దేవస్థానం అధికారులు తెలిపారు. 2026 జనవరి 28 నుంచి 31 వరకు మహా జాతర జరగనుంది. ఈ క్రమంలో భక్తులు ముందస్తుగా కుటుంబ, బంధుమిత్రులతో కలిసి వచ్చి దేవతలకు మొక్కులు సమర్పించుకున్నారు. అనంతరం మేడారం గ్రామ పరిసరాల్లోని అటవీ ప్రాంతంలో విడిది చేసి సాయంత్రానికి తిరుగు ప్రయాణం చేశారు.



వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు



01: మీడియా సెంటర్‌ను ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

కలెక్టరేట్‌లో మీడియా సెంటర్ ప్రారంభం

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో మీడియా సెంటర్‌ను జిల్లా ఎన్నికల అధికారి హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహశబరీష్ గురువారం ప్రారంభించారు. మీడియా సెంటర్‌లో గ్రామ పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్, ఎన్నికల సంఘం నియమ నిబంధనలు జిల్లాలో మండలాల వారీగా మూడు విడతల్లో జరుగనున్న గ్రామ పంచాయతీల ఎన్నికల షెడ్యూల్ వివరాలు, ఓటర్ల వివరాలు, పోలింగ్ కేంద్రాల వివరాలు అందుబాటులో ఉంచారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియా సెంటర్ ద్వారా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు అందించాలని సూచించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఎంసీఎంసీ సెల్ ద్వారా చెల్లింపు వార్తలను గుర్తించడం సకాలంలో ప్రచార ప్రకటనలకు సంబంధించిన అనుమతులు మంజూరి చేయాలని సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే పోస్టులను గమనిస్తూ ఉండాలని ఎన్నికల ప్రవర్తన నియమావళి అతిక్రమించిన పోస్టులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. పారదర్శకంగా నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించడానికి మీడియా సహకారం అందించాలని కలెక్టర్ కోరారు. మీడియా సెంటర్‌ను కలెక్టర్ పరిశీలించి డీఆర్‌డీవో మేన శ్రీను, ఇన్‌చార్జి డీపీఆర్‌వో అయూబ్‌అలీలు కలెక్టర్‌కు వివరించారు.

టీఈ-పోల్ యాప్‌లో సమస్త సమాచారం



టీఈ-పోల్ యాప్ చిత్రం

వరంగల్ కలెక్టరేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికల సమాచారాన్ని సులభంగా అందించేందుకు రూపొందించిన టీఈ-పోల్ (తెలంగాణ ఎలక్షన్స్) మొబైల్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఆమె విలేకరులతో మాట్లాడారు. ఓటర్లకు పోలింగ్ కేంద్రాల వివరాలు, సంబంధిత సమాచారాన్ని తెలియపరిచేందుకు యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. గూగుల్ స్టోర్ నుంచి టీఈ-పోల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఈ యాప్ ద్వారా ఓటర్లు తమ పోలింగ్ కేంద్రం వివరాలు, ఓటర్ స్లిప్ నమోదు సమాచారం తదితర ముఖ్య సమాచారం సులభంగా తెలుసుకోవచ్చన్నారు. ఓటర్లు స్వేచ్ఛగా ఓటెయ్యాలని కోరారు. ప్రతి ఒక్కరూ టీఈ-పోల్ యాప్‌ను ఉపయోగించడంతో పాటు ఓటింగ్‌లో పాల్గొనాలని కలెక్టర్ కోరారు.

నామినేషన్ వేస్తున్నారా...

పంచాయతీ అభ్యర్థులు పాటించాల్సిన నిబంధనలివే...

వరంగల్ సిటీ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల సందడి మొదలైంది. సర్పంచ్, వార్డు మెంబర్‌గా పోటీ చేసేందుకు ఉత్సాహంగా ఉన్నారు. నామినేషన్లకు మూడు రోజులు మాత్రమే గడువు ఉంది. ఎన్నికల అధికారులు నిబంధనలకు అనుగుణంగా పలు రకాల ధ్రువ పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. వాటిని ముందుగానే సిద్ధం చేసుకుని తీసుకెళ్లాలి. ఈ విషయం తెలియక పోటీ చేయడానికి ఉత్సాహంగా ముందుకెళ్లినా సరైన పత్రాలు సమర్పించకుంటే పోటీ నుంచి తప్పుకోవాల్సి వస్తుంది. సర్పంచ్, వార్డు మెంబర్‌గా పోటీ చేయాలంటే నామినేషన్ వేసే సమయానికి ముందు అభ్యర్థులు తెలుసుకోవాల్సినవి/ చూసుకోల్సిన పత్రాల వివరాలు..

- పోటీ చేసే అభ్యర్థి వయస్సు 21 సంవత్సరాలు ఉండాలి.
- సంబంధిత ఓటరు లిస్టులో ఓటరుగా నమోదై ఉండాలి.
- ఎస్సీ, ఎస్టీ, బీసీలు కుల ధ్రువీకరణ పత్రం జతపరచాలి.
- నేర చరిత్ర, స్థిర, చరాస్తుల వివరాలు, విద్యార్హతలతో కూడిన అఫిడవిట్, ఇద్దరు సాక్షులతో సంతకాలు పెట్టించి ఇవ్వాలి.
- ఎన్నికల ఖర్చు లెక్క అప్పగిస్తానని డిక్లరేషన్ ఇవ్వాలి.
- ఏ స్థానం నుంచి పోటీ చేస్తున్నారో.. ఆ స్థానం నుంచి ఓటరు మాత్రమే ప్రతిపాదకుడిగా ఉండాలి.
- అభ్యర్థులు ఎన్నికల ఖర్చు సర్పంచ్‌లకు రూ. 1,50,000, వార్డు మెంబర్లకు రూ.30,000 పరిమితి ఉంది.

నామినేషన్ పత్రంలో...

పార్ట్ 1లో ప్రతిపాదకుడు, పార్ట్ 2లో అభ్యర్థి, పార్ట్ 3లోనూ అభ్యర్థి, పార్ట్ 4లో ఆర్వో, పార్ట్ 5లో (రిజెక్టెడ్ నామినేషన్స్ రీజన్స్)లో ఆర్వో, పార్ట్ 6లో (రశీదు)లో ఆర్వో, అఫిడవిట్‌లో ఇద్దరు సాక్షుల సంతకాలు ఉండాలి. అలాగే ఖర్చు డిక్లరేషన్‌లో అభ్యర్థి సంతకం ఉండాలి.

నామినేషన్ పత్రంతో జత పరచాల్సినవి

నాలుగు ఫొటోలు, నామినేషన్ డిపాజిట్ రశీదు (జిరాక్స్), స్వీయ ప్రకటన (అఫిడవిట్), డిపాజిట్, పంచాయతీ నుంచి నో డ్యూ సర్టిఫికెట్, బ్యాంక్ ఖాతా జిరాక్స్ ఆధార్, ఓటరు కార్డు జిరాక్స్‌లు పోటీ చేసేవారివి, బలపరిచే వారివి కుల ధువీకరణ పత్రాలు.

నామినేషన్ డిపాజిట్ వివరాలు

పదవి పేరు	జనరల్ అభ్యర్థులు	ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు
సర్పంచ్	రూ. 2000	రూ. 1000
వార్డ్ మెంబర్	రూ. 1000	రూ. 500

సర్పంచ్, వార్డు ఎన్నికల వ్యయ వివరాలు ఇవే..

మహబూబాబాద్ రూరల్, నవంబరు27 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్, వార్డు అభ్యర్థుల ఎన్నికల్లో నిబంధనావళి ప్రకారం ఖర్చుచేసే వివరాలను రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని ప్రకటించారు. 2011 జనాభా ప్రకారం 5 వేల పైగా జనాభా ఉన్న గ్రామ సర్పంచ్ అభ్యర్థులు ఇప్పటి పంచాయతీ ఎన్నికల్లో రూ.2.50 లక్షలు ఖర్చు చేయవచ్చనన్నారు. 5 వేలోపు జనాభా పంచాయతీల్లో రూ.1.50 లక్షలు ఖర్చు చేయాలని నిబంధన ఉంది. ఇక వార్డుల విషయానికొస్తే 5వేల జనాభా కంటే ఎక్కువగా ఉన్న గ్రామాల్లో వార్డు సభ్యుడిగా పోటీచేసే అభ్యర్థి రూ.50వేలు, 5వేల లోపు జనా భా ఉన్న గ్రామాల్లో వార్డు సభ్యుడిగా పోటీచేసే వ్యక్తి రూ.30 వేలు ఖర్చు చేసుకోవాలని ఎన్నికల సంఘం నిబంధనలు విధించింది.

'బ్రాండ్' మారింది గురూ..!

చిన్నబోతున్న చీప్ లిక్కర్



లింగాలఘణపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇన్నాళ్లు దిగువ శ్రేణి వర్గం చేరదీసిన 'చీప్' లిక్కర్ గ్రామపంచాయతీ ఎన్నికల పరంపరలో పడి చిన్నబోతోంది. పొద్దుందాకా కాయకష్టం చేసిన జనం సాయంత్రం కాగానే శరీర అలసటను మర్చిపోయేందుకు ఊరి పొలిమేరలో అందుబాటులో ఉన్న బెల్ట్‌షాప్‌లో దూరి కాసింత చీప్ లిక్కర్‌ను పుచ్చుకునే బడుగులు ఇప్పుడు బ్రాండ్ మార్చి కొత్తదనపు రుచులను ఆస్వాదిస్తున్నారు. ఎలక్షన్ల జోరులో చీప్ లిక్కర్ జోలికెళ్లి చీప్ అవ్వడమెందుకు అనుకుంటున్నారో ఏమో గానీ.. నిన్న మొన్నటి దాకా తక్కువ ధరల మద్యం సేవించిన వాళ్లంతా ఇప్పుడు బ్రాండ్ మార్చి ఖరీదైన మద్యానికే జైకొడుతున్నారు.

జిల్లాలో మొదటి విడత ఎన్నికలు జరిగే పంచాయతీల్లో గురువారం నామినేషన్ల పర్వం మొదలు కాగా అభ్యర్థుల వెంట వచ్చిన అనుచరగణమంతా చౌకధరల మద్యానికి పాతరేసి ఖరీదైన బ్లెండర్ ప్రైడ్, సిగ్నేచర్, 100పైపర్, టీచర్స్ మద్యాన్ని సెలెక్ట్ చేసుకుంటుడం గమనార్హం. సొమ్ము మనది కాకపోతే మనకంటే సోగ్గాడు ప్రపంచంలోనే లేడన్నట్లు తయారవుతున్నారు.

'కాళోజీ' వర్సిటీలో అక్రమ నియామకం

నెలకు రూ. 90వేల వేతనం

వరంగల్ మెడికల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వరంగల్ కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయంలో సివిల్ ఇంజనీర్ నియామకాన్ని అక్రమంగా చేపట్టినట్లు ఆరోపణలు వస్తున్నాయి. నెలకు రూ. 90వేలు చెల్లించే విధంగా నియామకం చేపట్టినట్టు తెలుస్తోంది. విశ్వవిద్యాలయంలో ఉద్యోగాల భర్తీ చేయాలంటే ప్రభుత్వ అనుమతితో పాటు నోటిఫికేషన్ జారీ చేయాలి. కానీ ఇందుకు విరుద్ధంగా నెల రోజుల క్రితం విశ్వవిద్యాలయ కీలక అధికారి ఓ సివిల్ ఇంజనీర్‌ను కాంట్రాక్ట్ పద్ధతిపై నియమించినట్లు తెలుస్తోంది. ఇతడికి ప్రతీ నెల రూ.90వేల వేతనం ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు సమాచారం. సివిల్ ఇంజనీర్ గత నెల రోజులుగా ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి పీఏ నంటూ చెప్పుకొంటున్నట్లు ఉద్యోగులు చెబుతున్నారు.

ఎంజీఎంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి తొలగింపు

వరంగల్ మెడికల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఎంజీఎం ఆస్పత్రిలో పొరుగు సేవల ఉద్యోగి (ఔట్ సోర్సింగ్)ని సర్వీస్ నుంచి తొలగించారు. ఈ మేరకు ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీష్ చంద్రారెడ్డి గురు వారం ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీకి లేఖ రాశారు. బుధవారం రాత్రి గాయపడ్డ రోగికి వెంట్రుకలు తొలగించేందుకు బార్బర్ శ్రీనివాస్ డబ్బులు డిమాండ్ చేశారు. ఈ తతంగాన్ని రోగి బంధువులు వీడియోలో బంధించి సూపరింటెండెంట్‌కు సాక్ష్యంతో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. వెంటనే సదరు బార్బర్ శ్రీనివాస్‌ను ఉద్యోగం నుంచి తొలగిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

ఎవరి ఎ'జెండా' వారిదే...

(5వ పేజీ తరువాయి)

ఖర్చులు, పోల్‌మేనేజ్‌మెంట్ విషయంలో ఆ పార్టీలో స్పష్టత లేదనే ప్రచారం జరుగుతోంది. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో భారీగా ఓట్లు పోలైన పరకాలతో పాటు భూపాలపల్లి, వర్ధన్నపేట, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గాలపై కమలం పార్టీపై ప్రత్యేక దృష్టి పెట్టింది.

ఎజెండా ఇలా..

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండేళ్లవుతున్న నేపథ్యంలో జరుగుతున్న ఎన్నికలు కావటంలో ఆ పార్టీ ప్రజాతీర్పును తమకు అనుకూలంగా వచ్చేలా ప్రయత్నాలు చేస్తోంది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు గ్యాస్ సబ్సిడీ, 200యూనిట్ల ఫ్రీ విద్యుత్ తదితర సంక్షేమ పథకాలతో తమను ప్రజలు ఆదరిస్తారనే ఆశతో కాంగ్రెస్ శ్రేణులు ఉన్నాయి. సన్న బియ్యం, సన్న వడ్లకు రూ.500 సబ్సిడీ కూడా ఓట్లు రాలుస్తాయనే ధీమాతో కాంగ్రెస్ ఉంది. అన్నింటికి మించి ఇందిరమ్మ చీర కానుకతో పల్లెపోరులో మహిళలు మద్దతుగా నిలుస్తారని కాంగ్రెస్ అంచనా వేస్తోంది.

ఇక ప్రతిపక్షాలు ప్రధానంగా బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్‌ను ఇరకాటంలో పెట్టేందుకు ప్రయత్నిస్తున్నాయి. కామారెడ్డి డిక్లరేషన్‌లో 42శాతం రిజర్వేషన్ల అమలుపై కాంగ్రెస్‌ను నిలదీస్తున్నాయి. బుధవారం వరంగల్ పర్యటనలో కేటీఆర్ బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ మోసం చేశారని ధ్వజమెత్తారు. 42శాతం అని హామీ ఇచ్చి, కనీసం 17శాతం కూడా రిజర్వేషన్లు బీసీలకు ఇవ్వటం లేదని ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి.

ఎంతో కీలకం

గ్రామ పంచాయతీ ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి ప్రతిష్టాత్మకంగా మారగా, బీఆర్ఎస్‌కు జీవన్మరణ సమస్యగా మారాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్ల కావస్తున్న క్రమంలో జరుగుతున్న ఎన్నికలు కావటంతో గెలుపు ఆ పార్టీకి ప్రతిష్టాత్మకంగా మారింది. ప్రభుత్వం, ఎమ్మెల్యేల పనితీరుపై ప్రజలు ఇచ్చే తీర్పుగా భావించే అవకాశం ఉంది. దీంతో మెజార్టీ సర్పంచ్ స్థానాలను గెలవటం ఆ పార్టీకి సవాల్‌గా మారింది. బీఆర్ఎస్‌కు కూడా స్థానిక ఎన్నికలు జీవన్మరణ సమస్యగానే మారుతున్నాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల ఓటమి తరువాత వరుసగా వస్తున్న అన్ని ఎన్నికల్లో ఓటమిని ఎదుర్కొంది. ఉమ్మడి జిల్లాలో బలమైన నేతలు, క్యాడర్ ఉన్నప్పటికి పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమిని గులాబీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నారు. అలాగే వరంగల్, నల్గొండ,ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఓటమి గులాబీ తమ్ముళ్లను నిరాశకు గురి చేసింది. ఆ తరువాత రాష్ట్రంలో పలుచోట్ల జరిగిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే ఉప ఎన్నికల్లో వరుస ఓటములు గులాబీని కుంగతీశాయి. దీంతో సర్పంచ్ ఎన్నికల్లో గెలిస్తేనే క్యాడర్ కారులోనే ప్రయాణించే అవకాశం ఉందని, లేదంటే ప్రత్యామ్నాయం చూసుకునే అవకాశం లేకపోలేదనే ఆందోళన గులాబీ నేతల్లో వ్యక్తం అవుతోంది. సర్పంచ్ ఎన్నికల్లో గెలుపు ఆ పార్టీకి జీవన్మరణంగా మారిందనే టాక్ వినబడుతోంది. ఇక బీజేపీ గతంలో కూడా గ్రామాల్లో పెద్దగా సర్పంచ్‌లను గెలిపించుకున్న దాఖలాలు లేవు. అయితే ఈసారి ఉనికి చాటుకునే ప్రయత్నాలు చేస్తోంది.

పారిశుధ్య సిబ్బందికి త్వరలో స్వెట్టర్లు

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పారిశుధ్య సిబ్బందికి త్వరలో స్వెట్టర్లు అందిస్తామని వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. గురువారం తెల్లవారుఝామున స్వీపింగ్ యంత్రాల పని తీరుతో పాటు శానిటేషన్ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. హనుమకొండ చౌరస్తా, పోచమ్మమైదాన్ కూడలి ప్రాంతాల్లో శానిటేషన్ సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. సిబ్బంది స్వీపింగ్ నిర్వహణ తీరు బాగుందని ప్రశంసించారు. గత సంవత్సరం మాదిరిగా ఈ సంవత్సరం కూడా చలికాలంలో సిబ్బందికి స్వెట్టర్లు, పీపీ కిట్లను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్, జవాన్లు క్రాంతి, నవనీత, మల్లిఖార్జున్, మధు పాల్గొన్నారు.



కార్మికులతో మాట్లాడుతున్న మేయర్



బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హెచ్‌డీఎఫ్‌సీ రక్తదాన బుక్‌లెట్ ఆవిష్కరణ

హనుమకొండ సిటీ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించే రక్తదాన కార్యక్రమాలకు సంబంధించిన బుక్‌లెట్‌ను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆవిష్కరించారు. గురువారం హనుమకొండలోని క్యాంపు కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. వరంగల్ క్లస్టర్ హెచ్ ప్రదీప్‌శర్మ, బ్రాంచ్ మేనేజర్ రవిబాబు తదితర బ్యాంక్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చిట్‌ఫండ్స్ నిర్వాహకులపై కేసు నమోదు

కాటారం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలోని భవితశ్రీ చిట్ ఫండ్స్ బ్రాంచి నిర్వాహకులపై కేసు నమోదైంది. ఈ మేరకు ఎస్సై శ్రీనివాస్ గురువారం వెల్లడించారు. 2022లో రూ.5లక్షల చిట్టీ వేసిన తాము డబ్బులు కట్టినప్పటికీ ఎత్తిన డబ్బులు నిర్వాహకులు చెల్లించలేదని, పైగా తమను బెదిరింపులకు గురిచేస్తున్నారని దామెరకుంటకు చెందిన రజని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కాటారంలో ఉన్న భవితశ్రీ చిట్‌ఫండ్స్ బ్రాంచ్‌ను ఎత్తేయగా హనుమకొండలోని మెయిన్ బ్రాంచ్‌కు వెళ్లగా డబ్బులు ఇస్తామని చెప్పి సంవత్సరాలు తిప్పించుకున్నారని బాధితులు పేర్కొన్నారని తెలిపారు. చివరకు ఇటీవల డబ్బులు ఇచ్చేది లేదని బెదిరించారని ఫిర్యాదు చేయడంతో చిట్‌ఫండ్స్ చైర్మన్ ప్రకాశ్‌రావు, ఎండీ శ్రీనివాస్, ఈడీ నాగరాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

రైల్వే కమ్యూనిటీ హాల్‌లో గ్రీవెన్స్ సెల్

పలు వినతులు అందజేసిన రైల్వే ఉద్యోగులు



వినతులు అందజేస్తున్న రిటైర్డ్ రైల్వే ఉద్యోగులు

కాజీపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కాజీపేట రైల్వే కమ్యూనిటీ హాల్‌లో గురువారం రైల్వే ఉద్యోగులకు, రిటైర్డ్ రైల్వే ఉద్యోగులకు రైల్వే అధికారులు గ్రీవెన్స్ సెల్ నిర్వహించారు. రైల్వే జనరల్ ఇనిస్టిట్యూట్ కమిటీ ఆధ్వర్యంలో డివిజనల్ పర్సనల్ అధికారి జీ.ఆర్.సుధీర్‌కుమార్, కాజీపేట వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్ సీవీవీ రెడ్డి, డీఎంఈ ఖాడె అనికేత్ తాత్య సాహెబ్‌లు హాజరై క్యాంపును ప్రారంభించారు. అనంతరం ఉద్యోగుల నుంచి వినతులు స్వీకరించారు. ఐడీ కార్డ్స్, ఉమిద్ కార్డ్స్, తదితర ఇతరత్రా సమస్యలపై సుమారు 164 మంది వినతిపత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో ఇనిస్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్, వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్లు బి.గణేశ్‌కుమార్, కె.చంద్రశేఖర్, చీఫ్ ఓఎస్‌లు కె.శ్రీధర్, ఎస్.వేలుతోపాటు ఇనిస్టిట్యూట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బీసీలకు రిజర్వేషన్ల కేటాయింపులో అన్యాయం

బీసీ ఐక్య సంఘర్షణ సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి రాజమొగిలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏదునూరి రాజమొగిలి

సుబేదారి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బీసీలకు రిజర్వేషన్ల కేటాయింపులో అన్యాయం జరిగిందని బీసీ ఐక్య సంఘర్షణ సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి ఏదునూరి రాజమొగిలి అన్నారు. గురువారం సుబేదారిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయిస్తామని హామీ ఇచ్చి చట్టబద్ధంగా రావాల్సిన 23 శాతం రిజర్వేషన్లను ప్రకటించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని దుయ్యబట్టారు. బీసీ జాక్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల పట్ల బీజేపీ, బీఆర్ఎస్‌లు ఎందుకు తమ వైఖరిని ప్రకటించడం లేదని ప్రశ్నించారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బుట్టి శ్యాం యాదవ్, బీసీ జాక్ జిల్లా కన్వీనర్ దారబోయిన సతీష్, బీసీ నాయకులు చిన్నాల యశ్వంత్ యాదవ్, పిట్టల శ్రీను, మురారి రమేష్, చుంచు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులు ఉల్లాసమైన జీవితం గడపాలి

బ్లూచిప్ వరంగల్ ఏరియా మేనేజర్ రఘుపతి

వడ్డేపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగులు ప్రశాంతమైన, ఉల్లాసమైన జీవితం గడపడానికి రిక్రియేషన్ క్లబ్‌లు ఎంతగానో దోహదపడుతాయని బ్లూచిప్ వరంగల్ ఏరియా మేనేజర్ లింగాల రఘుపతి అన్నారు. హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని తెలంగాణ స్టేట్ గవర్నమెంట్ విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన రిక్రియేషన్ క్లబ్‌ను ఆయనతోపాటు విశ్రాంత ఉద్యోగుల సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కుందూరు గోపాల్‌రెడ్డి, ప్రముఖ ఆర్థో ఫిజీషియన్ డాక్టర్ ఎ.పట్టాభిరామయ్య గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులకు మానసిక ప్రశాంతతను కల్పించేందు కోసం ఆటలు, పాటలు, సాహిత్యం ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. విశ్రాంత ఉద్యోగులు తమ శేష జీవితాన్ని సామాజిక సేవా కార్యక్రమాలకు అంకితం చేయాలని కోరారు.

కార్యక్రమంలో రిక్రియేషన్ క్లబ్ కన్వీనర్ కామినేని సుభాష్‌చంద్రబోస్, బ్లూచిప్ హనుమకొండ మేనేజర్ రాజ్‌కుమార్, యూఎస్ఐ అడిషనల్ రీజినల్ మేనేజర్ రవికుమార్, విశ్రాంత ఉద్యోగుల సంఘం హనుమకొండ యూనిట్ అధ్యక్షుడు మాదిరెడ్డి మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి కందుల సంజీవరెడ్డి, జిల్లా నాయకులు ఖాజా మొహినొద్దీన్, శ్రీరాములు, ముదిగంటి వెంకట్‌రెడ్డి, జగదీష్‌చంద్రారెడ్డి, శ్రీరాములు, సమ్మయ్య, సత్యనారాయణ, రంగాచారి, పైండ్ల వెంకటయ్య, శివానందం, సరళ, పద్మావతి, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగమే దేశంలో అత్యున్నత చట్టం

ప్రిన్సిపల్ డిస్ట్రిక్టు సెషన్స్ జడ్జి డాక్టర్ పట్టాభి రామారావు



మాట్లాడుతున్న జడ్జి పట్టాభి రామారావు

కేయూ క్యాంపస్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : దేశంలో రాజ్యాంగమే అత్యున్నత చట్టమని జిల్లా ప్రిన్సిపాల్, సెషన్స్ జడ్జి డాక్టర్ కె.పట్టాభి రామారావు అన్నారు. గురువారం రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని యూనివర్సిటీ న్యాయ కళాశాల, కొండూరు సరస్వతి మార్కండేయా ఫౌండేషన్ సహకరంతో లా విద్యార్థులకు వక్తృత్వం, వ్యాచ రచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియంలో వర్సిటీ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నిమ్మ సుదర్శన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జడ్జి పట్టాబి రామారావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాజ్యాంగ నిర్మాతలు అనేక చట్టాలను, రాజ్యాంగాలను అధ్యయనం చేసి మన దేశానికి అనుగుణంగా రాజ్యాంగాన్ని రూపొందించారని చెప్పారు. రాజ్యాంగం పట్ల అందరూ అవగాహన పెంచుకోవాలని, స్ఫూర్తిని, ఆదర్శాలను కొనసాగించాలని అన్నారు. కేయూ వీసీ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. హక్కులను అనుభవిస్తూ విధులను కూడా తప్పనిసరిగా పాటించాలని అన్నారు. లా డీన్ ప్రొఫెసర్ ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ.. న్యాయ విద్య విద్యార్థులు రాజ్యాంగంతో పాటు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. రాజ్యాంగ దినోత్సవ పోటీలలో విజేతలకు బహుమతులు ప్రశంస పత్రాలను అందచే శారు. ఈ సమావేశంలో హనుమకొండ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, కేఎస్ఎం వ్యవస్థాపకులు కేపీ ఈశ్వర్‌నాథ్, ఏఆర్ డాక్టర్ కోలా శంకర్, లా కళాశాల అధ్యాపకులు డాక్టర్ పి.సుజాత పాల్గొన్నారు.

ఫార్మసీ కళాశాలలో...

కేయూ క్యాంపస్‌లోని ఫార్మసీ కళాశాలలో ఫార్మసీ డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య నేతృత్వంలో భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో రాజ్యాంగ పీఠికను చదివించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జనవరి 25న వివేకానంద, చంద్రబోస్ జయంతి ఉత్సవాలు

కేయూ క్యాంపస్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : తెలుగు వెలుగు సాహితీ వేదిక నేతృత్వంలో స్వామి వివేకనంద, నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి ఉత్సవాలను జనవరి 25న నిర్వహించనున్నారు. ఈ మేరకు గురువారం కేయూ అర్థశాస్త్ర విభాగంలో డీన్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, వేదిక రాష్ట్ర అధ్యక్షుడు పొడిశెట్టి విష్ణువర్ధన్‌లు జయంతి ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. జయంతి ఉత్సవాల వేదికను తర్వాత ప్రకటిస్తామని వెల్లడించారు. తమ సంస్థ మహనీయుల జయంతి ఉత్సవాలతో పాటు పలు సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలోజు రాజ్‌కుమార్, వేముల తిరుపతిరెడ్డి, బోనగాని యాదగిరి గౌడ్, సుద్దాల విద్యాసాగర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై దృష్టి సారించండి

- మేయర్ గుండు సుధారాణి
- బల్దియా ఉన్నతాధికారులతో సమావేశం

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారులు దృష్టి సారించాలని వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. గురువారం వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని మేయర్ కాన్ఫరెన్స్ హాల్‌లో బల్దియా వింగ్ అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ.. డిసెంబరు 31 వరకు స్మార్ట్ సిటి పనుల గడువు ముగుస్తుందని మిగిలిన పెండింగ్ పనులను పూర్తి చేయాలని అన్నారు. అంతే కాకుండా వరంగల్ నగరంలో శానిటేషన్, టౌన్ ప్లానింగ్ విభాగాలపై అధికారులు దృష్టి సారించి పనుల్లో వేగం పెంచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్, ఎస్ఈ సత్యనారాయణతో పాటు సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, హెచ్‌వో రమేష్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

యువత సమస్యలపై సమరశీల పోరాటాలు



మాట్లాడుతున్న విద్యార్థి జేఏసీ చైర్మన్ తిరుపతి

కేయూ క్యాంపస్, నవంబరు 27 (ఆం ధ్రజ్యోతి) : యువత సమస్యలపై సమర శీల పోరాటాలు చేస్తామని కేయూ జేఏసీ చైర్మన్ బొచ్చు తిరుపతి అన్నారు. గురు వారం కేయూ లైబ్రరీ ఎదుట ఏబీఎస్ఎఫ్, బీసీ విద్యార్థి సంఘం, బీఎస్ఎఫ్, ఎంఎస్ఎఫ్, ఎస్ఎస్‌యూ, డీఎస్‌ఏ, ఎస్ ఎస్‌బీఎం, డీఎస్‌యూ, సేవలాల్ విద్యార్థి సేన, మాదిగ విద్యార్థి వేదికల నేతృత్వంలో కేయూ నూతన జేఏసీని ఎన్నుకున్నారు.

ఈ సందర్భంగా నూతన విద్యార్థి జేఏసీ చైర్మన్‌గా బయోటెక్నాలజీ విభాగం స్కాలర్ బొచ్చు తిరుపతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా తిరుపతి మాట్లాడుతూ.. విద్యార్థులు, నిరుద్యోగుల సంక్షేమం కోసం జేఏసీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కేయూలో అనేక సమస్యలున్నాయని అన్నారు. వర్సిటీ అధికారులు వెంటనే సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నూతన జేఏసీ వైస్ చైర్మన్‌గా కామగాని శ్రావన్‌కుమార్, కన్వీనర్‌గా బొట్ల మనోహర్, కో కన్వీనర్‌గా ఎల్తూరి సాయికుమార్, పెండ్యాల రాకేశ్‌లను ఎన్నుకున్నారు. గతంలో ఉన్న జేఏసీలను రద్దు చేసినట్లు ప్రకటించారు. ప్రస్తుత జేఏసీ కొనసాగుతోందని స్పష్టం చేశారు.

విద్యుత్ కార్మికులతో సమానంగా వేతనాలు అందించాలి

మేయర్‌కు వినతి పత్రం అందించిన కార్మికులు

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తాము చాలా కాలంగా గ్రేటర్ పరిధిలో వాటర్ సప్లై కార్మికులుగా పని చేస్తున్నామని, తమకు కూడా విద్యుత్ కార్మికులతో సమానంగా పెంచిన వేతనాలు అందించాలని బల్దియా వాటర్ సరాఫరా కార్మికుల డిమాండ్ చేశారు. గురువారం జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలోని మేయర్ చాంబర్‌లో మేయర్ గుండు సుధారాణిని కలిసి వినతి పత్రం అందించారు. తాము ఆరుగాలం కష్టపడి వరంగల్ నగర ప్రజలకు సురక్షిత మంచి నీరు అందిస్తున్నా తమ సమస్యలు పట్టించుకోవడం లేదని వాపోయారు. డిసెంబరు 1న జరిగే కౌన్సిల్ సమావేశంలో తమకు జీతాలు పెంచుతూ తీర్మానం చేసి నిధులు విడుదల చేయాలన్నారు. మేయర్‌ను కలిసిన వారిలో సుద్దాల కుమారస్వామి, అభిషేకం, రవి, సాంబయ్య, రమేష్, రాజా, మురళీ, శ్రీకాంత్, శ్రీనివాస్, నరేష్, అర్జున్, సాయిలో ఉన్నారు.

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సమావేశం వాయిదా

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సమావేశం వాయిదా వేశారు. హనుమకొండ జిల్లా శాఖ సర్వసభ్య సమావేశం డిసెంబరు 3న జరగాల్సి ఉంది. జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఎన్నికల నేపథ్యంలోవాయిదా వేసినట్లు తెలిపారు. సవరించిన ప్రకారం సర్వసభ్య సమావేశం డిసెంబరు 23న జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ అధ్యక్షతన రెడ్ క్రాస్ సంస్థ సమావేశం నిర్వహించడం జరుగుతుందని పాలక మండలి సభ్యులు తెలిపారు.

నామినేషన్ల పర్వం షురూ

(5వ పేజీ తరువాయి)

ఈనెల 29సాయంత్రం 5గంటల వరకు. ఈనెల 30ననామినేషన్ల పరిశీలన, ఆదే రోజు నామినేషన్లు చెల్లిన అభ్యర్థుల జాబితా, డిసెంబరు 1న అప్పీల స్వీకరణ, 2వ తేదీన పరిష్కరణ, 3న నామినేషన్ల ఉపసంహరణ, అదే రోజు పోటీలో ఉన్న అభ్యర్థుల ప్రకటన ఉం టాయి. డిసెంబరు 11న పోలింగ్ జరుగుతంది. కాగా, నామినేషన్ల దాఖలు సందర్భంగా క్లస్టర్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తు ఏర్పా టు చేశారు. పోలీసులను పెద్ద సంఖ్యలో మోహరించారు. క్లస్టర్ కేంద్రాల్లో దాని పరిధిలోని పంచాయతీలకు సంబంధించిన కౌంటర్లను ఏర్పాటుచేశారు. అభ్యర్థులు కౌంటర్లలో నామినేషన్లు దాఖలు చేశారు. మూడుమండలాల్లో 24 క్లస్టర్లను ఏర్పాటు చేశారు.

కలెక్టర్ పరిశీలన

కలెక్టర్ స్నేహ శబరీష్ ఆయా క్లస్టర్లను సందర్శించి నామినేషన్ల స్వీకరణను పరిశీలించారు. క్లస్టర్ కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలించారు.

ఎల్కతుర్తి మండలం క్లస్టర్ గ్రామ పంచాయతీ కార్యాలయాలైన ఎల్కతుర్తి, దామెర, గోపాల్‌పూర్ పంచాయతీ కార్యాలయాలలో కస్టర్ పరిధిలోని ఆయా గ్రామాల సర్పంచు, వార్డు స్థానాలకు నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను తనిఖీ చేశారు. నామినేషన్ స్వీకరణ కేంద్రాల వద్ద ఎలక్షన్ నోటీసు, ఓటర్ల జాబితా, హెల్ప్ డెస్క్‌లను కలెక్టర్ పరిశీలించి అధికారుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను అధికారులు జాగ్రత్తగా నిర్వహించాలని సూచించారు. ఎన్నికల నియమ నిబంధలను తప్పనిసరిగా పాటించాలన్నారు.

సమస్యాత్మక పంచాయతీలు

జిల్లాలో 210 గ్రామ పంచాయతీల్లో 52 పంచాయతీలను సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రశాంతంగా పోలింగ్ నిర్వహణకు అదనంగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. మైక్రో అబ్జర్లను కూడా నియమించారు.



జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న మార్నేని రవీందర్‌రావు

మార్నేని జన్మదిన వేడుకలు

హనుమకొండ సిటీ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): టెస్కాబ్, వరంగల్ డీసీసీ బ్యాంకు చైర్మన్ మార్నేనీ రవీందర్‌రావు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. గురువారం హనుమకొండలోని డీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో బ్యాంకు అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో వేడుక నిర్వహించారు. కేక్ కట్ చేసిన రవీందర్‌రావుకు సీఈవో వజీర్ సుల్తాన్ తదితరులు శుభాకాంక్షలు తెలియచేశారు.

వడ్డేపల్లి బండ్ పనులు వేగంగా పూర్తి చేయండి

జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): వడ్డేపల్లి బండ్‌పై కొన సాగుతున్న పనులను వేగంగా పూర్తి చేయాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. గురువారం వరంగల్, హను మకొండ నగరంలోని పలు ప్రాంతాలతో పాటు వడ్డేపల్లి బండ్‌పై జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వడ్డేపల్లి బండ్‌పై జరుగుతున్న పనులు నత్తనడకన జరుగుతున్నాయని కాంట్రాక్టర్ పద్ధ తి మార్చుకోవాలని హెచ్చరించారు. కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. డిసెంబర్‌లోగా స్మార్ట్‌సిటీ పనులు ముగుస్తున్నం దున బండ్‌పై జరుగుతున్న పనులు పూర్తి చేయాలన్నారు. అనంతరం కరీమాబాద్, శాంతినగర్ ప్రాంతంలోని గ్రేన్‌యార్డ్‌లో నిర్మించిన సీపీ రోడ్డు, టాయి లెట్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్ఈ సత్యనారాయణ, సీహెచ్‌వో రమేష్, ఈఈ సంతోష్‌బాబు, డీఈలు రవికుమార్, రంగారావు, సారంగం, ఏఈ సౌజన్యతో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ కలలను సాకారం చేయాలి



డ్రాయింగ్ పోటీలో పాల్గొన్న విద్యార్థులు

కరీమాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రైల్వేగేటు పెరుకవాడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల సోషల్ స్కూల్ అసిస్టెంట్, బీసీటీయూ వరంగల్ జిల్లా అధ్యక్షుడు పెరుమాండ్ల సాంబమూర్తి ఆధ్వర్యంలో విద్యార్థులు వ్యాసరచన, ఉపన్యాసం, డ్రాయింగ్, క్విజ్ ప్రతిభా పాటవ పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హెచ్ఎం జి.ప్రభాకర్ మాట్లడుతూ రాజ్యాంగ ఆశయాలను సాధించేలా విద్యార్థులు సర్వతోముఖాభివృద్ధి చెందాలన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ కలలను సాకారం చేయాల్సిన బాధ్యత విద్యార్థులపైన ఉందన్నారు. అంతకుముందు ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవి, కల్పన, సృజన, విద్యార్థులు పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షుడికి అభినందనల వెల్లువ



ఇనుగాలను అభినందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాజీపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నూతనంగా నియామకం జరిగిన డీసీసీ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రాంరెడ్డిని గురువారం గృహంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిశారు. ఆయనకు శాలువా కప్పి, బొకే ఇచ్చి అభినందించారు. ఇనుగాలను కలిసిన వారిలో జాతీయ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి తక్కళ్లపల్లి సాగరిక రమాకాంత్ రెడ్డి, నాయకులు పసునూరి మనోహర్, గబ్బెట ఎల్లేశ్, కె.శ్రీనివాస్, కడిపికొండ గ్రామ శాఖ అధ్యక్షుడు కట్కూరి రమేశ్, బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు నర్మెట వెంకటరమణ గౌడ్ ఉన్నారు.

- మడికొండ(ఆంధ్రజ్యోతి) : హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా నియమితులైన కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డిని పలువురు గురువారం హనుమకొండ టీచర్స్ కాలనీలోని నివాసంలో కలిశారు. మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు భైరి లింగమూర్తి కలిసి పుష్పగుచ్చం అందజేసి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.
- హనుమకొండ చౌరస్తా : 10వ డివిజన్ కార్పొరేటర్, కాంగ్రెస్ పార్టీ జీబ్ల్యూఎంసీ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లను కుడా చైర్మన్, హనుమకొం డ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రామిరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. హ నుమకొండ పద్మాక్షీ కాలనీ లోని ఆయన నివాసాకి వెళ్లి భేటీ అయ్యారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు రమాకాంత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మహిపాల్‌రెడ్డి, శోభనబోయిన కుమార్‌యాదవ్, తోట వినయ్, తోట సుకాంత్, బొంత రామకృష్ణ, సైండ్ల శ్రీకాంత్ పాల్గొన్నారు.
- వడ్డేపల్లి(ఆంధ్రజ్యోతి) : హనుమకొండ టీచర్స్ కాలనీ ఫేజ్-1లోని నివాసంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నేత రూపిరెడ్డి సాయిరెడ్డి, హనుమకొండ బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు నర్మెట వెంకటరమణ గౌడ్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో టీపీసీసీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కందుకూరి పూర్ణచందర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కట్కూరి రమేష్, నర్మెట సుధాకర్ గౌడ్, బత్తిని విజ్ఞగిరి, నర్మెట వేణుగోపాల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చింతన



ధ్యానం దేనికోసం?

మనం నివసిస్తున్న ఈ ఆధునిక ప్రపంచంలో ఒత్తిడి విడదీయలేని ఒక భాగమైపోయింది. ప్రాణం పోయడానికి చికిత్స చేస్తున్న సర్జన్‌కి అయినా, క్షణం తీరుబడిలేని సీఈఓకి అయినా, క్లాసులో విద్యార్థులకు పాఠం చెప్పే టీచర్‌కి అయినా, ఇంట్లో గృహిణికి అయినా ఒత్తిడి తప్పదు. కొన్ని వేల ఏళ్ల క్రితం మనిషి జీవితం చాలా సరళంగా... సరళరేఖలో సాగేది. వేటాడి ఆహారాన్ని సంపాదించుకోవడం, ప్రకృతి నుంచి రక్షించుకోవడం... ఈ రెండే ప్రాధామ్యాలుగా ఉండేవి. అప్పుడప్పుడు క్రూర మృగాలు ఎదురయినప్పుడు, లేదా ఏవైనా ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు మాత్రమే ఒత్తిడి ఉండేది. ఈ ఒత్తిడి సమయంలో శరీరం- దాన్ని ఎదుర్కోవడానికి లేదా తప్పించుకొని పారిపోవడానికి వీలుగా హార్మోన్లు ఉత్పత్తి చేసేది. (దీనినే 'ఫ్లైట్ ఆర్ ఫైట్ సిద్ధాంతం' అంటారు). అంటే ఆ సమయంలో ఒత్తిడి ఒక అరుదైన విషయం.

అందరికీ అవసరం

మానవ పరిణామ క్రమంలో అనేక మార్పులు వచ్చాయి. ఉదయం లేచిన దగ్గర నుంచి రాత్రి దాకా అందరూ ఎన్నో సవాళ్లు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఒకప్పుడు ఈ హార్మోన్లు ఏడాదిలో పది పదిహేనుసార్లు విడుదలయితే- ఇప్పుడు ప్రతిరోజూ 20,30 సార్లు విడుదలవుతున్నాయి. వీటి వల్ల బీపీ, షుగర్ లాంటి అనేక జబ్బులు వస్తున్నాయి. జన్యుపరివర్తనలు కూడా జరుగుతున్నాయి. వ్యాధులున్నప్పుడు మనం తీసుకొనే నిర్ణయాలు స్పష్టంగా ఉండవు. మన చుట్టూ ఉన్న ప్రపంచగమనాన్ని మార్చలేం కాబట్టి... మనం ఒత్తిడి నుంచి తట్టుకోవటానికి సిద్ధంగా ఉండటానికి మనకు ఉన్న ఏకైక సాధనం ధ్యానం. చాలామంది ధ్యానాన్ని ఒత్తిడిని తగ్గించుకోవటానికి ఉన్న ప్రత్యామ్నాయంగా లేదా ఆధ్యాత్మిక మార్గంలో ప్రయాణించడానికి తొలి మెట్టుగా భావిస్తారు. కానీ ప్రస్తుతం ధ్యానం అందరికీ ఒక అవసరం. మానసిక పరిశుభ్రతకు అవసరమైన ఒక సాధనం. ప్రతి రోజు మనం స్నానం చేస్తే శారీరక మలినాలు తొలగిపోతాయి. అలాగే ధ్యానం చేయటం వల్ల మన ఆలోచనల వల్ల.. భావోద్వేగాల వల్ల కలిగే మలినాలను తొలగించుకోగలుగుతాం. అవి తొలగితే మన జీవితానికి అవసరమైన ప్రాధమ్యాలు మనకు స్పష్టంగా కనిపిస్తూ ఉంటాయి. ఈ అంశంపై ఇప్పటి దాకా అనేక శాస్త్రీయ పరిశోధనలు జరిగాయి. క్రమం తప్పకుండా ధ్యానం చేయటం వల్ల ఒత్తిడి తగ్గుతుందని, ఏకాగ్రత పెరుగుతుందని, ఆత్మనిర్భరత మెరుగుపడుతుందని.. భావోద్వేగాలు నియంత్రణలోకి వస్తాయని, మెదడు పనితీరు బాగుపడుతుందని ఈ పరిశోధనలలో తేలింది.

హార్ట్‌ఫుల్‌నెస్...

ఒక వైద్యుడిగా 365 రోజులూ నేను ఒత్తిడిలో పనిచేస్తూ ఉంటాను. వందల మంది రోగుల ప్రాణాలు నా చేతుల్లో ఉంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఉండే నాకు- ధ్యానం ఒక అనుభవం కాదు, నిత్యావసరం. ప్రస్తుతం మనకు అనేక రకాలైన ధ్యానపద్ధతులు అందుబాటులో ఉన్నాయి. 15 ఏళ్ళ క్రితం నేను 'హార్ట్‌ఫుల్‌నెస్' మార్గాన్ని ఎంచుకున్నాను. ఈ మార్గంలో మనం మంత్రాలు ఉచ్చరించాల్సిన అవసరం ఉండదు. ఉచ్ఛ్వాస, నిశ్వాసలను నియంత్రించనక్కరలేదు. క్లిష్టమైన క్రతువులు చేయాల్సిన అవసరం ఉండదు. ఎటువంటి జడ్జిమెంట్ లేకుండా ఆలోచనలను గమనించి, నిశ్చల స్థితికి చేరుకోవటమే హార్ట్‌ఫుల్‌నెస్ సిద్ధాంతం. 15 ఏళ్ళ క్రితం ఆ సిద్ధాంతాన్ని అనుసరిస్తూ మొదలైన నా ప్రయాణం నేటికీ సాగుతూనే ఉంది. హార్ట్‌ఫుల్‌నెస్ నా జీవితానికి ఒక చుక్కానిగా మారింది. దైనందిన జీవితంలో ఎదురయ్యే సమస్యలకు నా ప్రతిస్పందనల తీరులో మార్పు వచ్చింది. నాలో పేరుకున్న కొన్ని భయాలు తొలగిపోయాయి. అత్యంత క్లిష్టమైన సర్జరీలు చేసే సమయంలో ఎటువంటి సందిగ్ధత లేకుండా నిర్ణయాలు తీసుకొనే శక్తి పెరిగింది. నా ఉద్దేశంలో - ఎగుడుదిగుడుల మన జీవితాలకు ఒక చుక్కాని తప్పనిసరిగా కావాలి. అది మన జీవితాలను ముందుకు నడపడంతో పాటుగా మనను ఆధ్యాత్మిక కాంతివైపు కూడా నడిచేలా చేయాలి. దీనికి హార్ట్‌ఫుల్‌నెస్ ఒక ఉత్తమమైన మార్గం.



డాక్టర్ శరత్‌రెడ్డి
క్లినికల్ డైరక్టర్, మెడికవర్ హాస్పటల్స్
9440087532

విశేషం



భగవద్గీత... అన్ని ఉపనిషత్తుల సారం. 'వీటన్నిటినీ శ్రీకృష్ణుడు యుద్ధభూమిలో అర్జునుడికి ఎందుకు చెప్పాడు?' అనే సందేహం వస్తుంది. అర్జునుడు అడిగిన ప్రశ్నలు అలాంటివి. అతడు క్షత్రియుడిగా తన ధర్మాన్ని ఆచరించాల్సిన సమయంలో... 'అలా ఆచరించడం వల్ల గొప్ప పాపానికి ఒడిగడుతున్నానేమో?' అనే సంశయం వచ్చింది. దానికి అనుబంధంగా నరకం, స్వర్గం... ఇలాంటి ప్రశ్నలు ఎన్నో వేశాడు. కాబట్టి అర్జునుడికి పుణ్య పాపాల గురించి ఒక సంగ్రహ స్వరూపాన్ని ఇవ్వడం కృష్ణుడి బాధ్యత అయింది. ఇప్పుడు భగవద్గీత ఎందుకు ఆధునికమో పరిశీలిద్దాం.

విశ్వ శాంతి మార్గం
గీతా సందేశం

భగవద్గీతను 'గీతాశాస్త్రం'గా ప్రాచీనులు వర్ణించారు. శాస్త్రం అంటే హేతుబద్ధమైన పరిశీలనతో నిర్మించుకున్న లేదా ఏర్పడిన కొన్ని నిర్ణయాలను లేదా విశేషాలను తెలియజేసేది. పరిశీలించే విషయం ఏదైనా కావచ్చు. సైన్సులో ముఖ్యంగా మనం మనకు ఎదురుగా కనిపించే ప్రపంచంలోని విషయాలను పరిశీలిస్తాం. వాటి గురించి ఫిజిక్స్, కెమిస్ట్రీ తదితర శాస్త్రాలను చదువుతాం. వీటి విషయంలో ఎలాంటి అభిప్రాయ భేదాలు ఉండవు. ఒకవేళ... ఈ రోజు పరిశీలించిన విషయం తదుపరి పరిశోధనల్లో తప్పు అని తెలిసినప్పుడు... ఎలాంటి అభ్యంతరం లేకుండా అంగీకరిస్తాం. కానీ దేవుడు అనే విషయాన్ని విశ్వాసం పరిధిలోకి మనం నెట్టివేశాం. అలాంటి విశ్వాసానికి ఎలాంటి భంగం కలిగించకూడదనే భయంకరమైన నియమాన్ని పెట్టాం. మన సమాజంలో దేవుళ్ళకు సంబంధించి ఎన్నో సంప్రదాయాలు ఉన్నాయి. ఆ సంప్రదాయాలకు చెందినవారు ఆ దేవుడే గొప్ప అని భావిస్తూ ఉంటారు. ప్రపంచంలోని పెద్ద మతాలన్నిటి విషయంలోనూ అదే పరిస్థితి. ఒకానొక సమయంలో ఒకానొక వ్యక్తి... దేవుడి దగ్గర నుంచి ఒక సందేశాన్ని పొందానని తన అనుచరులకు చెప్పి, దాన్ని ప్రచారం చేయడం ద్వారా ఆ మతం వ్యాప్తి చెందుతుంది. దీనికి భిన్నంగా... 'దేవుడు' అనే విషయంలో శాస్త్రీయమైన విచారణ ఎక్కడైనా జరిగిందా? అని పరిశీలిస్తే... దాన్ని ముఖ్యంగా భారతీయ తత్త్వవేత్తలే చేశారని ఆధునిక వేదాంత గురువులైన వివేకానందుడి లాంటి వారు రాసిన పుస్తకాలను చదివితే తెలుస్తుంది. ఈ విధంగా పరిశీలించిన విషయాలే వేదాల్లోని చివరి భాగాలైన ఉపనిషత్తుల్లో ఉన్నాయి.

అన్నీ పరబ్రహ్మ రూపాలే...

విశ్వాసం, శాస్త్రీయ పరిశీలన అనే రెండూ సమాజంలో అనాదిగా సమాంతరంగా వస్తూనే ఉన్నాయి. దేవుడి విషయంలో కూడా అంతే. వైష్ణవం, శైవం, శాక్తేయం తదితర సంప్రదాయాలు ఎన్నో ఉన్నప్పటికీ... వాటికి సమాంతరంగా 'ఉపనిషత్తులు' అనే ఆలోచనా ధార కూడా వచ్చింది. వేదాంత శాస్త్రం రెండు స్థాయిల్లో మాట్లాడుతుంది. ఒకటి శాస్త్రీయమైన స్థాయి. రెండోది సామాన్యమైన మనిషి స్థాయి. శాస్త్రీయ స్థాయిలో దేవుడు అంటే ఒక వ్యక్తి కాదు. విశ్వాన్ని మించి అనంతంగా వ్యాపించి ఉన్న ఒక చైతన్యం, ఒక తత్త్వం అని చెప్పారు. దానినే 'పరమాత్మ' లేక 'పరబ్రహ్మం' అంటాం. ఆ చైతన్యమే ప్రపంచ రూపంలో కనిపిస్తుంది. అనేక రకాలైన నామరూపాలలో కనిపిస్తుంది. సమాజంలో ఉన్న సంప్రదాయాలను ఈ ఆలోచనాధార నిరాకరించలేదు. వాటిని కూడా సమన్వయం చేయడానికి పూనుకుంది. విష్ణువు, శివుడు, శక్తి, గణేశుడు... వీరందరూ ఆ పరబ్రహ్మలో మనం భావించుకున్న రూపాలేననేది ఉపనిషత్తుల సిద్ధాంతం.

ఉన్నది ఒకే చైతన్యం

దీనిలో ఆధునికత ఏముంది? ఆధునిక విజ్ఞాన శాస్త్రంలో కూడా శాస్త్రవేత్తల ఎదుట ఉన్న ప్రశ్న ఇదే. 'చైతన్యం మొదట వచ్చిందా? లేదా జడమైన ప్రపంచం, జడమైన పరమాణువుల నుంచి చైతన్యం వచ్చిందా? లేదా ఆ రెండూ వేరువేరుగా, స్వతంత్రంగా ఉన్నాయా?' అని శాస్త్రవేత్తలు ప్రాచీనకాలం నుంచి ఆలోచిస్తూ వచ్చారు. ఇటీవలి గతితార్కిక భౌతికవాదంలో కూడా దీన్నే విచారించారు. కానీ వారు విశ్వాసం స్థాయిలో సమాజంలో ఉన్న సంప్రదాయాలను పూర్తిగా నిరాకరించారు. వేదాంత శాస్త్రం అలా చేయలేదు. 'ఉన్నది ఒక్కటే. దాన్ని మీరు ఏ రూపంలోనైనా భావించుకోవచ్చు'అని స్వేచ్ఛను ఇచ్చింది. ఉపనిషత్తులు అన్నిటిలో ఉన్న ఈ విషయాన్ని.... దాదాపుగా వేదాంతంలో చెప్పినట్టు 'ఒకే చైతన్యం ప్రపంచంలో ఉంది' అనే విషయానికి దగ్గరగా ఆధునిక విజ్ఞాన శాస్త్రం మాట్లాడుతోంది. దేవుడు ఒక మనిషి కాడని, స్వర్గం అనే లోకంలో ఉండే ఒకానొక వ్యక్తి కాడని చెప్పడం వల్ల సామాజికమైన లాభం ఏమిటి? మనకు ఇష్టమైన సంప్రదాయాన్ని అనుసరించే స్వేచ్ఛను భగవద్గీత ఇస్తుంది. "దేవుణ్ణి నీవు ఏ రూపంలో, ఏ పేరుతో భావించుకుంటే... ఆ రూపంలో, ఆ పేరుతోనే ఆ పరమాత్మ అనుగ్రహిస్తుంది" (7-21) అని చెబుతుంది. "విశాల బుద్ధితో నన్ను కాకుండా వేరే ఏ దేవుణ్ణి పూజించినా నన్ను పూజించినట్టే (9-23) అని కూడా చెబుతుంది. కాబట్టే మన ఋషులు, శంకరాచార్యులు లాంటి గురువులు వివిధ సంప్రదాయాలను సమన్వయం చేసి, శాంతిని నెలకొల్పారు.

> **అదే ఆత్మజ్ఞానం**
>
> దేవుడు అనేది ఒక అనంతమైన తత్త్వం అయినప్పుడు... మనిషి స్వరూపం ఏమిటి? కేవలం మనిషే కాకుండా ప్రతి ప్రాణి పరమాత్మ స్వరూపం అని చెప్పడం మరో విషయం. ఏ వస్తువూ అనంతానికి బయట ఉండదు కదా! దాన్ని తెలుసుకోవడమే 'ఆత్మజ్ఞానం' అంటారు. దీన్ని సిద్ధాంత రూపంలో తెలుసుకోవడం చాలా సులభమే కానీ... ఆ భావనలో ఉండడానికి ఎంతో నిష్ఠ అవసరం. ఆ నిష్ఠను సాధించడానికి ఎంతో కృషి చేయాలి. ఆ నిష్ఠను పొందిన వ్యక్తి... సమాజం తనకు ఇచ్చిన సంకుచితమైన ఐడెంటిటీని వదిలేస్తాడు. తనను తాను ఎంత ప్రేమించుకుంటాడో విశ్వంలో ప్రతి ప్రాణినీ అంతే ప్రేమగా చూస్తాడు. భగవద్గీతలో ఈ విషయాన్నే శ్రీకృష్ణుడు చెప్పాడు.

గుణప్రధానంగా...

హిందూమతం అంటే కులం అనే భావనను మన మనసులో బలంగా రుద్దడం జరిగింది. ఉపనిషత్తుల్లో, భగవద్గీతలో నాలుగు వర్ణాలు అనే ప్రసక్తి ఉంది గానీ సమాజంలో ఉన్న వేల కొద్దీ కులాలను ఎవరూ నిర్మించలేదు. ఎవరూ ఏ పుస్తకంలోనూ చెప్పలేదు. భగవద్గీతను పాఠంగా చెప్పే ఆచార్యులు ఈ విషయం వివరిస్తూనే ఉన్నారు. నాలుగు వర్ణాల ప్రస్తావన సృష్టిలో ఉన్న విభిన్న వ్యక్తిత్వాలమీద ఆధారపడినదే. ఈనాడు మనస్తత్వ శాస్త్రవేత్తలు మనుషులను వారి స్వభావాన్ని బట్టి విభజించినట్టే... మన ఋషులు కూడా ఒక వ్యక్తిలో సత్వ గుణం, రజోగుణం, తమోగుణం అనే గుణాల ప్రాధాన్యాన్ని బట్టి ఆ వ్యక్తి వర్ణాన్ని గురించి చెప్పారు. ఈ ప్రస్తావన కూడా 'విశ్వంలో ప్రతి ప్రాణీ పరమాత్మ రూపమే' అని చెప్పే సందర్భంలో చేసినదే తప్ప... మనుషులను విభజన చేయాలని చెప్పినది కాదు. భగవద్గీత శాస్త్రీయతను, ఆధునికతను, అవసరాన్ని గురించి తెలుసుకోవాలంటే... దానిపై ఉన్న వ్యాఖ్యలతో పాటు ఆచార్యుల ప్రసంగాలను వినాలి. మన సమాజంలోనే కాదు... మొత్తం ప్రపంచంలో శాంతిని నెలకొల్పడానికి గీతా సందేశం చాలా అవసరం. ముఖ్యంగా యువత దీని గురించి తెలుసుకోవాలి.



కె.అరవిందరావు

సహజయోగ

ఉన్నతిని పొందాలంటే

లోక సంక్షేమం కోసం అమృతమథనంలో సముద్రం నుంచి లక్ష్మీదేవి ఆవిర్భవించింది. రాజ్యలక్ష్మిగా, గృహలక్ష్మిగా రూపాంతరం చెందింది. మానవులు సామూహికతలో ఆనందిస్తూ, ఉన్నతిని పొందడానికి కారణం... వారి కుడి పార్శ్వంలో ఉన్న రాజ్యలక్ష్మి ఆశీస్సులే. ప్రజా సంక్షేమం కోసం, ప్రజా సౌకర్యం కోసం రాజ్యలక్ష్మి శక్తి పని చేస్తుంది. ఆ శక్తి మనలోనే ఉంది. 'రాజ్య' అంటే రాజ్యం లేదా రాజసం. రాజ్యలక్ష్మి పాలనకు అధిదేవత. సుగుణాలు లేని పాలకులు ప్రజల బాగోగులు చూడలేరు. మన పూర్వ పాలకుల్లో ఎందరో గొప్పవారు కనిపిస్తారు. వారు రాజ్యలక్ష్మి తత్త్వంతో నిండి ఉంటారు. పాలకులైనప్పటికీ ఎంతో నిరాడంబరంగా జీవిస్తూ ఉంటారు.

నచికేతుడికి జ్ఞానోదయం

జనక మహారాజు పాలకుడు కాబట్టి ఆభరణాలు, అందమైన వస్త్రాలు ధరించి హుందాగా ఉండేవాడు. నచికేతుడు అనే ముని తన గురువు ఆదేశం మేరకు జనకుడి దగ్గరకు వచ్చాడు. ఆయనను చూసి ఆశ్చర్యపడి 'అలంకారాలు చేసుకొని, ఆభరణాలు ధరించిన ఈ మహారాజుని కలవాలని నా గురువు నాకెందుకు చెప్పారు? ఈ జనకుణ్ణి గమనిస్తే తన స్వపరివారంతో కలిసి నాట్య ప్రదర్శనను తిలకించడంలో నిమగ్నమై ఉన్నాడు. ఇతను భాగవతోత్తముడు కానేకాదు. మరి నా గురువు ఈ రాజు పాదాలకు ఎందుకు ప్రణమిల్లుతున్నారో అర్థం కావడం లేదు. ఇతను సాధారణమైన రాజు మాత్రమే' అని అనుకున్నాడు. నచికేతుడి మనోభావాలను జనక మహారాజు చదవగలిగాడు. "నచికేతా! నీకు ఇక్కడికి ఎందుకు వచ్చావు?" అని ప్రశ్నించాడు. "ఆత్మ సాక్షాత్కారం పొందడానికి" అని నచికేతుడు సమాధానం ఇచ్చాడు. "కావాలంటే నా సమస్త రాజ్యాన్నీ నీవు తీసుకో. కానీ ఆత్మసాక్షాత్కారం కలుగజెయ్యడం అంత సులభం కాదు" అన్నాడు జనకుడు. "ఆత్మసాక్షాత్కార సాధన కోసం మీరు ఏది చెబితే అది చేస్తాను" అన్నాడు నచికేతుడు పట్టుదలగా. అప్పుడు అతణ్ణి ఒక నది దగ్గరకు జనకుడు తీసుకువెళ్ళి "ఈ నీటిలో ప్రవేశించు. స్నానం చేద్దాం" అని చెప్పాడు. ఇద్దరూ నదిలోకి దిగారు. ఇంతలో రాజభటులు కొందరు అక్కడికి వచ్చి... అగ్నిప్రమాదం కారణంగా మంటలు వ్యాపిస్తున్నాయనీ, ప్రజలందరూ పారిపోతున్నారనీ



చెప్పారు. జనకుడు మాత్రం ప్రశాంతంగా ధ్యానావస్థలో ఉన్నాడు. నచికేతుడు ఆందోళనకు గురయ్యాడు. ఈలోగా మరికొందరు వచ్చి మంటలు అక్కడికి కూడా వ్యాపిస్తున్నాయని హెచ్చరించారు. వెంటనే నచికేతుడు స్వీయరక్షణ కోసం దూరంగా పరుగెత్తాడు. ఇంత జరుగుతున్నా జనక మహారాజు ధ్యానంలోనే కూర్చున్నాడు. నది బయటకు వచ్చిన నచికేతుడు... అక్కడ ఏ విధమైన మంటలూ లేవనీ, అదంతా కల్పన అని గ్రహించాడు. తనలో లోపమేమిటో గుర్తించాడు. జనకుడి భగవత్ శక్తులను అతను అనుమానించాడు. కానీ జనకుడు మహారాజైనా తన అధికార శక్తుల గురించి పట్టించుకోలేదు. 'పరమభాగవతోత్తముడైన ఆయనకు రాజుననే అహంకారం లేదు, అంతర్గతంగా ఆయన ఒక పుణ్య పురుషుడు, ఆత్మజ్ఞాని' అని నచికేతుడు గ్రహించాడు.

సామూహికత దిశగా...

రాజ్యలక్ష్మిని పూజిస్తే అహంకారాన్ని సులభంగా అదుపులో ఉంచుకోవచ్చు. ఆమె సమతుల్యత ప్రసాదిస్తుంది. మనిషిని మర్యాదస్తుడిగా మారుస్తుంది, హుందాతనాన్ని ఇస్తుంది. అలాంటి వ్యక్తిత్వం ఉన్నవారు ఇతరుల పట్ల ప్రేమతో, దయతో వ్యవహరిస్తారు. ఇతరుల నుంచి ఏదీ ఆశించరు. భౌతికమైన వస్తువులకు ఆశపడేవారు ఆమె అనుగ్రహానికి అర్హులు కారు. ఇతరుల క్షేమాన్ని ఆకాంక్షించడం, తన దగ్గరకు వచ్చినవారి పట్ల శ్రద్ధగా వ్యవహరించడం లాంటి గుణాలు చాలా ముఖ్యం. బద్ధకస్తుల దగ్గర రాజ్యలక్ష్మి నిలబడదు. ఆమె ధర్మాన్ని ఆధారంగా చేసుకొని ఉంటుంది. అధర్మపరులకు ఆమె ఆశీస్సులు ఉండవు. ధర్మపరులకు ఆమె రక్షణ లభిస్తుంది. రాజ్యలక్ష్మి ఏనుగును అధిరోహించి ఉంటుంది. ఏనుగు అన్ని జంతువులలో ఎత్తయినది. దానిలో క్షమాగుణం, జ్ఞాపకశక్తి ఉంటాయి. రాజ్యలక్ష్మీతత్త్వంతో ఉన్నవారు స్వార్థపరులుగా ఉండరు. తమ గురించి ప్రచారం చేసుకోరు. మనలో రాజ్యలక్ష్మిని మేలుకొలిపినప్పుడు... మన ఆలోచనలు సొంత విషయాలకే పరిమితం కాకుండా, సామూహికత దిశగా సాగుతాయి. మొత్తం ప్రపంచం గురించి ఆలోచించడం మొదలుపెడతాం. మానవ అంతర్గత సూక్ష్మ శరీరంలో నాభీచక్రానికి ఎడమవైపు గృహలక్ష్మి, కుడివైపు రాజ్యలక్ష్మి ఆసీనులై ఉంటారు. సహజయోగ ధ్యాన సాధన ద్వారా కుండలినీ శక్తి ఊర్ధ్వ ముఖంగా ప్రయాణించి, సహస్రారాన్ని చేరుకొనే ప్రయాణంలో... అది నాభీచక్రం దగ్గర గుడి పార్శ్వాన్ని తాకినప్పుడు... ఆ చక్రం పరిశుద్ధం అవుతుంది. అక్కడ ఉన్న రాజ్యలక్ష్మీతత్త్వం మేలుకొని మనలో స్థిరపడుతుంది. తద్వారా మనం ఉన్నతిని సాధించగలం.




డాక్టర్ పి. రాకేష్
8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్',
తెలంగాణ

దైవమార్గం

క్రిస్మస్ పండుగ రావడానికి ముందు... నాలుగు వారాల కాలాన్ని క్రైస్తవులు ఆగమన కాలంగా పాటిస్తారు. ఆ పండుగ కోసం మానసికంగా సిద్ధపడే ఈ రోజులను 'ఆయత్త దినాలు' అని కూడా అంటారు. ఈ రోజులలో నాలుగు కొవ్వొత్తులను వెలిగించి.. ప్రభువు రాకకోసం ఎదురుచూస్తారు. ఈ నాలుగు కొవ్వొత్తులు చాలా ముఖ్యమైనవి ఒకటి ఆశతో కూడిన నిరీక్షణకు, రెండోది శాంతి సమాధానాలకు, మూడోది ప్రేమ జ్వాలకు, నాలుగోది సంతోషానికి, ఉత్సాహానికి సంకేతాలు.

ఆగమన కాలం

ఈ అందమైన విశ్వాన్ని దేవుడు ఎంతో శ్రద్ధగా మలిచాడు. జగత్తు మొత్తానికి ఎలా ఉండాలో నేర్పాడు. కానీ అది దారి తప్పి, అపమార్గంలో పయనించడం గమనించి, భక్తులు, ప్రవక్తలు విలపించడం చూసి... తను తప్పక వస్తానని దేవుడు వాగ్దానం చేశాడు. ఆయన మాట తప్పడనే విశ్వాసంతో ఆయన రాకకోసం ఎంతగానో నిరీక్షించారు. అది మొదటి కొవ్వొత్తి. తమను సాతాను వెంటాడుతూ పన్నిన సమస్యల వలయంలో చిక్కుకొని, అలజడి చెందిన సమయంలో... దేవునికోసం శాంతి సమాధానాల కోసం జనం ఎదురు చూశారు. ఆ శాంతి సమాధానాలను ఆశించడమే రెండో కొవ్వొత్తి. మనిషిని మనిషి ద్వేషించడం,



హింసించుకోవడం మొదలైంది. ఆ దశలో... "నిన్ను నువ్వు ప్రేమించుకున్నట్టే నీ పొరుగువారిని ప్రేమించాలి" అనే దేవుని ఆనతి ఉల్లంఘనకు గురైంది. తోటి సమాజాన్ని ప్రేమిస్తూ, సాటి మానవుల పట్ల ప్రేమ ద్వారా దైవ ప్రేమను సంపాదించుకోవడానికి ప్రయత్నించాలి. అదే మూడో కొవ్వొత్తి. హృదయాల్లో కక్షలు, కార్పణ్యాల చీకట్లను తొలగించుకొని, వెలుగు నింపుకొన్న, ముఖాలతో, ఉత్సాహంతో, ఉల్లాసంతో ప్రభువు రాకకోసం నిరీక్షిస్తూ వెలిగేది నాలుగో కొవ్వొత్తి.

ఈ నాలుగు కొవ్వత్తులు ప్రతి క్రైస్తవ కుటుంబంలో వెలిగే నిరీక్షణా దీపాలు. నాలుగు వారాల పాటు (నవంబర్ 30నుంచి డిసెంబర్ 24 వరకూ) వేకువ జామునుంచి ప్రార్థనలతో ఆరాధనలు చర్చిల ప్రాంగణాల్లో జరుగుతాయి. వాస్తవానికి క్రిస్మస్ పండుగ అనేది ఈ ఆయత్త దినాల్లోనే జరిగిపోతుంది. పండుగలు అనేవి మనిషి తనలోని మాలిన్యాన్ని తొలగించుకోవడానికి, మనసులో ప్రేమభావం పెంచుకోవడానికి, కక్షలను మరచిపోయి... సమైక్యంగా జీవనం గడపడానికి ఉద్దేశించినవి. అందుకు మానసికంగా సిద్ధం కావడానికి ఈ ఆయత్త దినాలు దోహదం చేస్తాయి.

• **డాక్టర్ యం. సోహినీ బెర్నార్డ్**, 9866755024

తెలుసుకుందాం

అచలం, చలం, చలాచలం

ప్రతిమ, విగ్రహం, బింబం, బేరం, మూర్తి... ఇవన్నీ సమానార్థకాలు. ఆలయంలోని దేవతామూర్తిని వివిధ సందర్భాల్లో అనేక పేర్లతో పిలుస్తారు. దేవతా ప్రతిమలలో అచలం, చలం, చలాచలం అనే మూడు రకాలు ఉన్నాయి. అంటే కదలనివి, కదిలేవి, కదలీకదలనివి.

అచల బింబాలు: దేవాలయ గర్భగృహంలో విగ్రహాలను స్థిరంగా ప్రతిష్ఠిస్తారు. అవి కదలకుండా విగ్రహానికి, పీఠానికి మధ్య అష్టబంధనద్రవ్యంతో బిగిస్తారు. ఈ విగ్రహాలను 'అచల బింబాలు' అని అంటారు. పెద్ద పెద్ద బండలపై చెక్కిన విగ్రహాలను, మట్టి, సున్నంతో చేసి, కదలడానికి వీలులేకుండా చేసిన విగ్రహాలను కూడా 'అచల విగ్రహాలు' అని పిలుస్తారు.

చల బింబాలు: ఆలయంలో విగ్రహం స్థిరంగా ఉంటే... ఉత్సవ సమయాల్లో వాహనాల మీద మాడ వీధుల్లోకి, గ్రామ, పుర వీధుల్లోకి భక్తులను అనుగ్రహించడానికి వచ్చేవి ఉత్సవ మూర్తులు. ఈ ఉత్సవ విగ్రహాలకు 'చల బింబాలు' అని పేరు.

చలాచల బింబాలు: 'చలాచలం' అంటే 'కదలీకదలనివి' అని అర్థం. 'అలాంటి విగ్రహాలు కూడా ఉంటాయా?' అనే సందేహం, కాస్త ఆశ్చర్యం కలగడం సహజం. కొన్ని ఆలయాలలో ప్రత్యేకించి ఉత్సవ విగ్రహాలు ఉండవు. గర్భాలయంలో స్థిరంగా ఉండి పూజలు అందుకొనే మూల విగ్రహాలనే... ఉత్సవ సమయంలో ఆలయం బయటికి తీసుకువచ్చి ఊరేగిస్తారు. ఉత్సవం ముగిశాక.. ఆ విగ్రహాలు మళ్ళీ గర్భాలయంలోకి వెళ్ళి, మూల స్థానంలో స్థిరంగా నిలిచి... నిత్య పూజలు అందుకుంటాయి. అలాంటి విగ్రహాలకు 'చలాచల బింబాలు' అని పేరు. పూరీలోని జగన్నాథస్వామి, బలదేవుడు, సుభద్రాదేవి విగ్రహాలు దీనికి చక్కని ఉదాహరణ.



ఇక దేవతా విగ్రహాలు వాటి ఆకృతిని బట్టి సాత్త్వికాలు, రాజసాలు, తామసాలు అని మూడు రకాలుగా ఉంటాయి. ఎత్తు ప్రకారం కూడా వాటిని మూడు రకాలుగా విభజించారు. ఏడు తాళాల (ఏడు అరచేతి హస్తాల పరిమాణం) వరకూ ఉన్న వాటిని 'వామనములు' అని, ఎనిమిది తాళాల వరకూ ఉన్న వాటిని 'మానుషములు' అని, తొమ్మిది తాళాలు, అంతకన్నా ఎక్కువ ఎత్తు ఉన్న వాటిని 'దైవికములు' అని చెప్పారు. విగ్రహాలను ఏ ద్రవ్యాలతో తయారు చేస్తే ఏ ఫలితాలను ఇస్తాయో 'అగ్ని పురాణం' వివరిం చింది.

మృన్మయాద్దారుజే పుణ్యం దారుజాదిష్టకోద్భవే
ఇష్టకోత్థాచ్ఛైలజే స్యాద్ధేమాదేరధికం ఫలమ్

మట్టితో చేసిన ప్రతిమకన్నా దారువుతో (కర్రతో) చేసిన ప్రతిమ శ్రేష్ఠం. దారువుతో చేసిన దానికన్నా ఇటుకతో చేసినది, ఇటుకతో చేసిన దానికన్నా రాయితో చేసినది, రాతితో చేసిన దానికన్నా సువర్ణాది లోహాలతో చేసిన ప్రతిమలు శ్రేష్ఠమైన ఫలితాలను ఇస్తాయి.

• **డి.యన్.వి. ప్రసాద్**, స్థపతి
9440525788

గ్రూప్-2 ఉద్యోగులకు ఊరట

- 2015 నోటిఫికేషన్ ఫలితాలు కొట్టివేతపై హైకోర్టు డివిజన్ బెంచ్ స్టే
- జవాబు పత్రాల ట్యాంపరింగ్ జరిగినట్టు కేసు

హైదరాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 ఉద్యోగులకు గురువారం హైకోర్టులో ఊరట లభించింది. 2015 నాటి నోటిఫికేషన్‌కు సంబంధించిన ఫలితాలను కొట్టివేస్తూ ఈనెల 18న సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పుపై డివిజన్ బెంచ్ మధ్యంతర స్టే విధించింది. దీంతో 2015లో నోటిఫికేషన్ ప్రకారం పరీక్షలు రాసి, 2019లో నియామకమై, ఇప్పటికే విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు అలాగే కొనసాగనున్నారు. తదుపరి విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది. అప్పటివరకు మధ్యంతర ఉత్తర్వులు అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది.

గ్రూప్-2 సర్వీసుల్లో 1,032 పోస్టుల భర్తీకి టీజీపీఎస్సీ 2015లో నోటిఫికేషన్ జారీ చేసింది. ఆ తర్వాత 2016లో అనుబంధ నోటిఫికేషన్ జారీ చేయగా, నవంబర్‌లో పరీక్షలు నిర్వహించారు. ఎంపికైన అభ్యర్థులకు 2019లో నియామకపత్రాలు జారీచేశారు. అయితే ఓఎంఆర్ షీట్‌లోని పార్ట్- బీలో ఎరేజర్, వైట్‌నర్, బ్లేడ్ ఉపయోగించి దిద్దిన వారిని కూడా ఎంపిక చేశారని, పరీక్షల్లో అక్రమాలు జరిగాయని పేర్కొంటూ హైకోర్టులో వేర్వేరుగా ఆరు పిటిషన్‌లు దాఖలయ్యాయి. వీటిపై విచారణ చేపట్టిన జస్టిస్ నగేశ్ భీమపాక ధర్మాసనం.. ఫలితాలను కొట్టివేస్తూ ఈనెల 18న తీర్పు ప్రకటించింది. తప్పులు చేసిన వారిని తొలగించి, మళ్లీ సమాధాన పత్రాలను మూల్యాంకనం చేయాలని టీజీపీఎస్సీకి ఆదేశాలు జారీచేసింది.

సింగిల్ జడ్జి తీర్పును సవాల్ చేస్తూ రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ డిప్యూటీ తహసీల్దార్ క్రాంతికుమార్ తదితరులు హైకోర్టులో అప్పీల్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. అప్పీలుదారుల తరఫు న్యాయవాది వాదిస్తూ.. ట్యాంపరింగ్, వైట్‌నర్, ఎరేజర్‌ల వినియోగించినట్లు తేలిందని చెబుతూ మొత్తం నియామకాలను రద్దు చేయడం సరికాదన్నారు. అలా ఉల్లంఘనకు పాల్పడిన వారి పత్రాలను తొలగించినట్లు కమిషన్ పేర్కొన్నా ఆ వాదనను సింగిల్ జడ్జి పరిగణనలోకి తీసుకోలేదన్నారు. ప్రతివాదుల తరఫు న్యాయవాదులు వాదిస్తూ ఓఎంఆర్ షీట్లలో వైట్‌నర్, ఎరేజర్‌లు వినియోగించిన అభ్యర్థుల పత్రాలను మూల్యాంకనం చేయడం చట్టవిరుద్ధమన్నారు. హైకోర్టు డివిజన్ బెంచ్ తీర్పునకు, టెక్నికల్ కమిటీ సూచనలకు విరుద్ధంగా ట్యాంపరింగ్ జరిగిన జవాబు పత్రాలను మూల్యాంకనం చేశారని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం.. సింగిల్ జడ్జి తీర్పుపై స్టే విధిస్తూ మధ్యంతర ఆదేశాలు జారీచేసింది. టీజీపీఎస్సీ, ఇతర ప్రతివాదులకు నోటీసులు జారీచేసింది. కౌంటర్‌లు దాఖలు చేయాలని పేర్కొంటూ విచారణను ఆరువారాలకు వాయిదా వేసింది.

జాతీయ క్రీడాకారులకు స్పోర్ట్స్ కోటాపై స్టే

- సింగిల్ జడ్జి ఆదేశాల నిలిపివేత

హైదరాబాద్, నవంబర్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నియామకాల్లో అంతర్జాతీయ క్రీడలతో పాటు జాతీయ క్రీడల్లోనూ పాల్గొన్న వారికి స్పోర్ట్స్ కోటా వర్తింపజేయాలంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను గురువారం చీఫ్ జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్ సారథ్యంలోని ధర్మాసనం నిలిపివేసింది. ప్రాథమికంగా పిటిషన్లను అనుమతిస్తూ తదుపరి విచారణను జనవరి 12కు వాయిదా వేసింది. స్పోర్ట్స్ కోటా కింద అంతర్జాతీయ క్రీడల్లో పాల్గొన్న వారినే పరిగణనలోకి తీసుకుంటూ జాతీయ క్రీడాకారులకు వర్తింపజేయకపోవడాన్ని సవాల్ చేస్తూ పలు నియామకాల అభ్యర్థులు 25 రిట్ పిటిషన్లు దాఖలు చేశారు. వాదనలు విన్న సింగిల్ జడ్జి.. స్పోర్ట్స్ కోటా కింద ఖాళీల భర్తీకి మార్గదర్శకాలను జారీ చేశారు. జాతీయ క్రీడలు, అఖిల భారత విశ్వవిద్యాలయ ఈవెంట్లలో పాల్గొన్న క్రీడాకారులకూ 2 శాతం స్పోర్ట్స్ కోటా వర్తింపజేయాలని టీజీపీఎస్సీను ఆదేశించారు. వాటిపై తాజాగా డివిజన్ బెంచ్ స్టే విధించింది.

కోర్టులో ఓ మూలన నిలబెడతాం

(మొదటిపేజీ తరువాయి)

మినహాయింపు కోరడమే హైకోర్టు ఆగ్రహానికి కారణం. అంబర్‌పేట్‌లోని బతుకమ్మ కుంటకు సంబంధించిన భూవివాదంలో స్టేటస్‌కో (యథాతథ స్థితి) ఉన్నప్పటికీ పనులు చేశారంటూ హైకోర్టులో కోర్టు ధిక్కరణ వ్యాజ్యం దాఖలైంది. ఈ పిటిషన్‌లో ఏవీ రంగనాథ్ వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలని గతంలో హైకోర్టు ఆదేశించింది. జస్టిస్ మౌషమీ భట్టాచార్య, జస్టిస్ మధుసూదన్‌రావు ధర్మాసనం ముందుకు ఆ పిటిషన్ గురువారం విచారణకు వచ్చింది. అయితే, హైడ్రా కమిషనర్ రంగనాథ్ వ్యక్తిగతంగా కోర్టు విచారణకు హాజరు కాలేదు. అంతే కాక, వ్యక్తిగత హాజరు నుంచి తనకు మినహాయింపు ఇవ్వాలని పిటిషన్ దాఖలు చేశారు. 'నా హాజరు ద్వారా కోర్టును ఇబ్బంది పెట్టదల్చుకోలేదు. విపత్తు నివారణకు సంబంధించిన పనులకు సంబంధించి ఇప్పటికే షెడ్యూల్ ఉన్నందున విచారణకు రాలేకపోతున్నాను. గురువారంతోపాటు భవిష్యత్తు ప్రొసీడింగ్స్ నుంచి కూడా నాకు మినహాయింపు ఇవ్వగలరు' అని ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్ ధర్మాసనానికి తీవ్ర ఆగ్రహం తెప్పించింది.



కోర్టు ప్రొసీడింగ్స్, కోర్టు ఉత్తర్వుల పట్ల గౌరవ మర్యాదలతో ఉండటం నేర్చుకోవాలని గట్టి హెచ్చరిక జారీ చేసింది. "తన హాజరు వల్ల కోర్టును ఇబ్బంది పెట్ట దల్చుకోలేదు అంటూ రంగనాథ్ కోర్టు పట్ల సానుభూతి చూపుతున్నారు. కోర్టు అనుకుంటే కోర్టు ధిక్కరణదారులను సాయంత్రం వరకు కోర్టులోనే నిలబెట్టగలదు. కానీ అలాంటి చర్యలు తీసుకోవడం మా ఉద్దేశం కాదు. అవసరమైతే ఇక తప్పదు. భవిష్యత్తులో కూడా హాజరు నుంచి మినహాయింపు ఇస్తామని ఆయన ఎలా ఊహించుకుంటున్నారు?' అని ప్రభుత్వ న్యాయవాదిని ధర్మాసనం ప్రశ్నించింది. ఏవీ రంగనాథ్ డిసెంబరు 5న వ్యక్తిగతంగా హాజరు కాకపోతే నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేస్తామని హైకోర్టు ధర్మాసనం హెచ్చరించింది.

పంచాయతీలోనూ 'నోటా'!

తొలిసారి గ్రామీణ ఓటర్లకు అవకాశం.. టీఈ-పోల్ యాప్‌తో సమగ్ర సమాచారం

- ప్రజల్లో విద్వేషాలు పెంచడమూ అవినీతే
- అలాంటి వారు గెలిచినా సభ్యత్వం రద్దే!
- ఎన్నికల నేరంగా పరిగణిస్తే మూడేళ్ల జైలు
- ఎన్నికల సంఘం నిబంధనల్లో స్పష్టీకరణ



హైదరాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో సరికొత్త సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. బ్యాలెట్ ద్వారా నిర్వహిస్తున్న సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల్లోనూ ఓటర్లకు 'నన్ ఆఫ్ ద అబౌ(నోటా)' అవకాశాన్ని కల్పిస్తున్నారు. బ్యాలెట్ పత్రంపై అభ్యర్థుల గుర్తులతోపాటు నోటా గుర్తును కూడా ముద్రిస్తున్నారు. అభ్యర్థుల్లో ఎవరికీ ఓటు వేసేందుకు సిద్ధంగా లేకపోతే ఓటరు నోటాకు వేయొచ్చు. అలాగే ఓటర్లకు సమాచారం కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) టీఈ-పోల్ మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ యాప్ ద్వారా ఓటరు స్లిప్ డౌన్‌లోడ్ చేసుకోవడం, పోలింగ్ కేంద్రం చిరునామా తెలుసుకోవడం, పోలింగ్ ప్రక్రియపై ఫిర్యాదులు చేయడం, వాటి పరిష్కార ప్రగతిని పరిశీలించడం వంటివి చేయొచ్చు. ఎన్నికల నియమావళి ప్రకారం.. రాష్ట్ర మంత్రులు గ్రామాల్లో ఎన్నికల ప్రచారానికి వెళ్లాల్సి వస్తే అధికారిక వాహనాలు వాడరాదు. సొంత వాహనాలనే తీసుకెళ్లాలి. ప్రభుత్వ సిబ్బందిని సైతం వారితో తీసుకెళ్లకూడదు. కొత్త ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేయరాదు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, మేయర్లు, సర్పంచ్‌లు, ప్రభుత్వోద్యోగులు పోలింగ్ లేదా కౌంటింగ్ ఏజెంట్లుగా ఉండకూడదు. సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీలో ఉన్న అభ్యర్థులకు ప్రచారానికి వారం రోజులే కేటాయించారు. పోలింగ్ ముగియడానికి నిర్దేశించిన సమయానికి 44 గంటల ముందు ప్రచారం ఆపేయాలని ఎస్ఈసీ మార్గదర్శకాల్లో స్పష్టం చేసింది. పంచాయతీ ఎన్నికల్లో లబ్ధి కోసం అభ్యర్థి, వారి తరఫున ఎవరైనా కులం, మతం, జాతి, వర్గం, భాషా ప్రాతిపదికన ప్రజల మధ్య విభేదాలు, విద్వేషాలు రెచ్చగొట్టొద్దని ఎస్ఈసీ నిబంధనల్లో పేర్కొంది. ప్రజల్లో విద్వేషాలు పెంచడాన్ని అవినీతి చర్యగానే పరిగణిస్తామని, విద్వేషాలతో రెచ్చగొట్టినవారు గెలిచినా వారి సభ్యత్వం రద్దు చేస్తామని వెల్లడించింది. దాన్ని ఎన్నికల నేరంగా పరిగణిస్తే మూడేళ్ల వరకు జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉందని తెలిపింది. ఓటర్లకు తాయిలాలు ఇవ్వజూపడం, బెదిరించడం, భయపెట్టడం, దొంగ ఓట్లను ప్రోత్సహించేలా వ్యవహరించడం వంటివి చేయరాదు.

ముందస్తు అనుమతి ఉండాల్సిందే..

రాజకీయపార్టీల పరంగా అధికారంలో ఉన్నవారు తాము చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రజలకు హామీలు వంటి సందేశాలతో ప్రకటనలు ఇవ్వాలంటే ముందస్తు అనుమతి తప్పనిసరని ఎస్ఈసీ తెలిపింది. వార్తాపత్రికలు, ప్రసార మాధ్యమాల్లో ప్రకటనలు ఇవ్వాలన్నా అనుమతి తీసుకోవాల్సిందే. రాష్ట్రస్థాయిలో అయితే సీఎస్ నేతృత్వంలోని ఎన్నికల ప్రవర్తనా నియమావళి(ఎంసీసీ) కమిటీ, జిల్లా స్థాయిలో అయితే కలెక్టర్ నేతృత్వంలోని కమిటీ అనుమతి పొందాలి. ఇదిలా ఉంటే.. సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేసే అభ్యర్థులు తమ ప్రచారానికి ఉపయోగించే కరపత్రాలు, పోస్టర్లు వంటివాటి ముద్రణపైనా ఎస్ఈసీ ఆంక్షలు విధించింది. వాటి ముద్రణదారుల వివరాలు, చిరునామా వంటివి తప్పకుండా వాటిపై పేర్కొనాలని స్పష్టం చేసింది. 5 వేల కంటే తక్కువ జనాభా ఉన్న పంచాయతీల్లో వార్డు సభ్యులు రూ.30 వేల వరకు, సర్పంచ్ అభ్యర్థి గరిష్ఠంగా 1.5 లక్షల వరకే ఖర్చు చేయాలి. 5 వేల కంటే ఎక్కువ జనాభా ఉన్న పంచాయతీలో వార్డు సభ్యులు రూ.50వేలు, సర్పంచ్ అభ్యర్థులు గరిష్ఠంగా రూ.2.5లక్షల దాకా ఖర్చు చేయాలి.

స్ర్కీనింగ్ కమిటీ ఏర్పాటు

ఎన్నికలకోడ్ అమలు పరిశీలనకు రాష్ట్ర ప్రభుత్వం స్ర్కీనింగ్ కమిటీని ఏర్పాటుచేసింది. సీఎస్ రామకృష్ణారావు కమిటీ చైర్మన్‌గా ఉంటారు. సభ్యులుగా సాధారణ పరిపాలనాశాఖ ముఖ్యకార్యదర్శి, పంచాయతీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి ఉంటారు. నియమావళికి సంబంధించిన అంశాలు, ప్రతిపాదనలను ఎస్ఈసీకి పంపే ముందు ఈ కమిటీ పరిశీలిస్తుంది.

237 మంది సాక్షులను విచారించి ఏం కనుక్కున్నారు?

- సిగాచి పరిశ్రమలో భారీ పేలుడుకు కారకులు ఎవరో తేల్చలేకపోయారా?
- దర్యాప్తు తీరుపై హైకోర్టు ఆగ్రహం

హైదరాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సిగాచి పరిశ్రమలో భారీ పేలుడు కేసులో ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. దాదాపు 54 మంది సిబ్బంది, కార్మికులు మృత్యువాతపడ్డ ఈ విస్ఫోటం కేసులో 237 మంది సాక్షులను ప్రశ్నించామని పేర్కొంటున్న పోలీసులు.. ఎలాంటి అభిప్రాయానికి రాకపోవడాన్ని హైకోర్టు తప్పుబట్టింది. డిసెంబరు 9న దర్యాప్తు అధికారి తమ ఎదుట వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశాలు జారీ చేసింది. సిగాచి పరిశ్రమలో పేలుడు కేసులో దర్యాప్తు వేగవంతంగా జరగడం లేదని, బాధిత కుటుంబాలకు పరిహారం అందడం లేదని పేర్కొంటూ విశ్రాంత శాస్త్రవేత్త కలపల బాబూరావు హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్ గురువారం మరోసారి చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఎలాంటి పురోగతి లేకపోవడంపై ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. 'ఎవరెవరికి ఎంత పరిహారం అందజేశారు? సిగాచి పరిశ్రమ ప్రకటించిన విధంగా మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం అందించారా? మృతులకు, గాయపడిన కార్మికులకు చట్ట ప్రకారం ఎంత పరిహారం ఇచ్చారు? దర్యాప్తులో పురోగతి ఎంతవరకు వచ్చింది? వివరాలు తెలియజేయాలని ఈ నెల 4న స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం. దర్యాప్తు బృందం ఇప్పటి వరకు 237 మంది సాక్షులను విచారణ చేసిందని ప్రభుత్వం చెప్తోంది. దర్యాప్తు ఇంకా కొనసాగుతోందని, ఇంకా 15 మందిని సాక్షులను ప్రశ్నించాల్సి ఉందని చెప్తున్నారు. ఆ తర్వాత ఛార్జిషీట్ దాఖలు చేస్తామంటున్నారు. దాదాపు 54 మంది చనిపోయిన తీవ్రమైన ప్రమాదానికి సంబంధించిన కేసులో దర్యాప్తు అధికారులు తీవ్ర జ్యాపం చేస్తున్నారు. 237 మంది సాక్షులను ప్రశ్నించి పోలీసులు ఏం కనిపెట్టారు? ఇంతమందిని ప్రశ్నించిన తర్వాత కూడా ఒక అభిప్రాయానికి రాలేకపోయారా? ఘటనకు కారకులు ఎవరో తేల్చలేకపోయారా? సిగాచి పరిశ్రమ నుంచి ఇంతవరకు ఎవర్నీ ప్రశ్నించకపోవడానికి కారణం ఏంటి?' అని ధర్మాసనం ప్రశ్నించింది. మరోవైపు నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదికను డీఎస్పీ స్థాయి అధికారి నేతృత్వం వహిస్తున్న దర్యాప్తు బృందానికి అప్పగించామని, దానిపై దర్యాప్తు బృందం చర్యలు తీసుకుంటోందని ప్రభుత్వ న్యాయవాది తెలియజేశారు. వాదనలు విన్న ధర్మాసనం.. అన్ని రికార్డులు, కేసు డైరీతో తమ ఎదుట హాజరుకావాలని దర్యాప్తు అధికారికి ఆదేశాలు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేయడానికి సిగాచి పరిశ్రమకు రెండు వారాల సమయం ఇస్తున్నట్లు పేర్కొంది. తదుపరి విచారణను డిసెంబరు 9కి వాయిదా వేసింది.

చిత్రజ్యోతి ★ SINCE 1965 ★

కథ బాగుంటేనే ఆదరిస్తున్నారు

- మంచు మనోజ్



'ఈ రోజు చిన్న సినిమా, పెద్ద సినిమా అని లేదు. కథాంశం బాగున్న చిత్రాలనే ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. అలాంటి చిత్రాలు భాషలకు అతీతంగా దేశవ్యాప్తంగా ఆడుతున్నాయి. 'వానర' టీజర్ బాగుంది. అవినాశ్ కష్టపడి తీస్తోన్న ఈ సినిమా విజయవంతం కావాలి' అని ఆకాంక్షించారు హీరో మంచు మనోజ్. అవినాశ్ తిరువీధుల కథానాయకుడిగా స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తోన్న చిత్రం 'వానర'. సిమ్రాన్ చౌదరి హీరోయిన్. శంతను పత్తి సమర్పణలో అవినాశ్ బుయానీ, ఆలపాటి రాజా, సి.అంకిత్‌రెడ్డి నిర్మిస్తున్నారు. గురువారం నిర్వహించిన వేడుకలో టీజర్‌ను మంచు మనోజ్ విడుదల చేశారు. అవినాశ్ తిరువీధుల మాట్లాడుతూ 'విష్వక్సేన్ గారు వాయిస్ ఓవర్ ఇచ్చారు. సినిమాను త్వరలో విడుదల చేస్తాం' అని అన్నారు.

జాతిరత్నం నోట మాస్ గీతం



ఇప్పటికే పలువురు టాలీవుడ్ హీరోలు తమ సినిమాల్లోని పాటలను పాడుకొని గాయకులుగానూ అభిమానులను ఎంటర్‌టైనర్ చేశారు. తాజాగా ఈ జాబితాలో నవీన్ పొలిశెట్టి చేరారు. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'అనగనగా ఒకరాజు'. మారి దర్శకత్వంలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రం నుంచి తొలి గీతాన్ని యూనిట్ విడుదల చేసింది. 'భీమవరం బల్మా' అంటూ సాగే ఈ గీతాన్ని గాయని నూతన మోహన్‌తో కలసి హీరో నవీన్ పొలిశెట్టి స్వయంగా పాడడం విశేషం. గాయకుడిగా తన తొలి ప్రయత్నంలోనే ఆయన ఆకట్టుకున్నారు. అలాగే ఈ మాస్ గీతంలో కథానాయిక మీనాక్షి చౌదరితో కలసి ఆయన వేసిన స్టెప్పులూ అలరించాయి. ఈ గీతానికి చంద్రబోస్ సాహిత్యం అందించగా, మిక్కీ జే మేయర్ స్వరాలు సమకూర్చారు. సినిమాటోగ్రఫీ: జే యువరాజ్

అందర్నీ ఆకట్టుకునేలా...



'మత్తు వదలరా' ఫేమ్ నరేశ్ అగస్త్య హీరోగా చైతన్య గండికోట దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. జీసీ ప్రొడక్షన్స్ బేనర్‌పై డా.ఎమ్ రాజేంద్ర ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రేయ రుక్మిణి హీరోయిన్ గురువారం ఈ సినిమాను ప్రారంభించారు. హీరో శ్రీవిష్ణు క్లాప్ కొట్టారు. నటుడు రఘుబాబు కెమెరా స్విచ్ఛాన్ చేయగా, దర్శకుడు బీ గోపాల్ ముహూర్తపు సన్నివేశానికి గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా అగస్త్య మాట్లాడుతూ 'ఈ చిత్రం అద్భుతమైన కథాకథనాలతో సాగుతుంది. హృదయానికి హత్తుకునే భావోద్వేగాలు, వినోదంతో నిండిఉండే ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులనూ ఆకట్టుకుంటుంది' అని అన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: కోటగిరి వేంకటేశ్వర రావు, డీఓపీ: విద్యాసాగర్ చింతా, సంగీతం: మిక్కీ జే మేయర్.





టాలీవుడ్ గాయకుడు రాహుల్ సిప్లిగంజ్ ఓ ఇంటివాడయ్యారు. ప్రేయసి హరిణ్యరెడ్డితో ఆయన వివాహం గురువారం హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి రిసెప్షన్ వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

జయకృష్ణ 'శ్రీనివాస మంగాపురం'



సూపర్ స్టార్ కృష్ణ మనవడు, దివంగత రమేశ్ బాబు కుమారుడు జయకృష్ణ ఘట్టమనేని హీరోగా అజయ్ భూపతి దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును వైజయంతీ మూవీస్ అశ్వనిదత్ సమర్పణలో చందమామ కథలు బేనర్‌పై పి. కిరణ్ నిర్మిస్తున్నారు. గురువారం ఈ సినిమా టైటిల్‌ను ప్రీ లుక్ పోస్టర్ ద్వారా మేకర్స్ ఆవిష్కరించారు. ఈ చిత్రానికి 'శ్రీనివాస మంగాపురం' అనే పేరు పెట్టారు. పోస్టర్‌లో హీరో చేతులు, అతని ప్రేమికురాలి చేతులు ఒక రస్టిక్ గన్ పట్టుకొని ఉండటం ఆసక్తిగా ఉంది. కథలో రొమాన్స్, భారీ యాక్షన్‌ని ఈ పోస్టర్ సూచిస్తోంది. కాగా, ఈ చిత్రంలో బాలీవుడ్ నటి రాషా తడాని కథానాయికగా నటిస్తున్నారు. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు.

ట్రెండ్‌కు తగ్గ సినిమా

-రఘురామకృష్ణ రాజు



'మరువ తరమా' సినిమా విజువల్స్ అద్భుతంగా ఉన్నాయి. ప్రస్తుత ట్రెండ్‌కు తగ్గ కథ. యూత్‌తో పాటూ కుటుంబ ప్రేక్షకులనూ ఆకట్టుకుంటుంది. ఈ చిత్రం ఘనవిజయం సాధించాలి' అని ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు ఆకాంక్షించారు. హరీశ్ ధనుంజయ, అవంతిక ప్రధాన పాత్రధారులుగా చైతన్య వర్మ నడింపల్లి తెరకెక్కించిన చిత్రం 'మరువ తరమా'. నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకకు ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు, హీరో నారా రోహిత్, శ్రీవిష్ణు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో నారా రోహిత్ మాట్లాడుతూ 'కంటెంట్ ఫ్రెష్‌గా అనిపిస్తోంది. మంచి సినిమాను ప్రేక్షకులు కచ్చితంగా ఆదరిస్తారు. ఈ చిత్రం కూడా అలాంటిదే' అని చెప్పారు. 'ఈ చిత్రంలోని మాటలు కూడా పాటల్లాగా ఉంటాయి. సినిమా అందరికీ నచ్చుతుంది' అని హీరో శ్రీవిష్ణు తెలిపారు.

బిజినెస్

వరంగల్ ● శుక్రవారం 28 నవంబరు 2025

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,27,750 ▼	1,17,100 ▼	1,80,000 ▲
విజయవాడ	1,30,000 ▲	1,22,000 ▲	1,67,600 ▲
విశాఖపట్నం	1,29,930 ▲	1,17,250 ▲	1,80,000 ▲
రాజమండ్రి	1,27,750 ▼	1,17,100 ▼	1,64,000 ▲
ప్రొద్దుటూరు	1,25,500 ▼	1,15,460 ▼	1,67,200 ▲
ముంబై	1,26,057 ▼	1,15,468 ▼	1,62,667 ▲

కుప్పంలో రూ.305 కోట్లతో డెయిరీ ప్లాంట్

ఏస్ ఇంటర్నేషనల్

హైరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రముఖ పాడి ఉత్పత్తుల సంస్థ ఏస్ ఇంటర్నేషనల్ తన వ్యాపార కార్యకలాపాలను విస్తరిస్తోంది. ఇందులో భాగంగా 3.5 కోట్ల డాలర్ల (సుమారు రూ.305 కోట్లు) పెట్టుబడితో ఆంధ్రప్రదేశ్‌లోని కుప్పం వద్ద ప్రత్యేక యూనిట్ ఏర్పాటు చేస్తోంది. కంపెనీ ఈ నిధులను నెదర్లాండ్ కేంద్రంగా పనిచేసే కొన్ని ఆర్థిక సంస్థలు, ప్రైవేట్ ఈక్విటీ సంస్థల నుంచి సమీకరించింది. కుప్పం వద్ద ఏర్పాటు చేసే ప్లాంటులో పెద్దలు, చిన్న పిల్లల ఆరోగ్యం, పోషణకు దోహదం చేసే పాడి ఉత్పత్తులు, ఇతర ఆహార ఉత్పత్తులు తయారు చేయాలని కంపెనీ భావిస్తోంది. ఏస్ ఇంటర్నేషనల్ ఇప్పటికే ఉత్తర ప్రదేశ్‌లో రోజుకు ఐదు లక్షల లీటర్ల ప్రాసెసింగ్ సామర్థ్యం ఉన్న డెయిరీ ప్లాంటును నిర్వహిస్తోంది. ఈ ప్లాంటులో తయారయ్యే ఉత్పత్తులను కంపెనీ దేశీయ మార్కెట్‌తో పాటు విదేశాలకూ ఎగుమతి చేస్తోంది. కుప్పం ప్లాంటులో ఉత్పత్తి చేసే పాల ఉత్పత్తులనూ విదేశాలకు ఎగుమతి చేయనుంది.

రూ.900 కోట్లతో రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ విస్తరణ

ముంబై: హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ పెద్దఎత్తున కార్యకలాపాలు విస్తరించేందుకు రెడీ అవుతోంది. ఇందులో భాగంగా 2029 మార్చి నాటికి రూ.900 కోట్ల పెట్టుబడితో కొత్తగా 900 పడకలను అందుబాటులోకి తీసుకురానుంది. ప్రధానంగా ఉత్తరాది మార్కెట్లో కార్యకలాపాల విస్తరణకు ఈ పెట్టుబడులు పెట్టనుంది. కొత్త పడకలతో హాస్పిటల్ మొత్తం పడకల సామర్థ్యం 3,165కి చేరుతుందని రెయిన్‌బో వెల్లడించింది. విస్తరణకు అవసరమైన నిధులను పూర్తిగా అంతర్గత వనరుల ద్వారానే సమకూర్చుకోనున్నట్టు తెలిపింది. ఒకవేళ ఏదైనా పెద్ద హాస్పిటల్‌ను టేకోవర్ చేయాల్సి వస్తే మాత్రం రుణ సేకరణకు వెళ్లే అవకాశం ఉందని పేర్కొంది.

విందు.. మహా పసందు!

బయట బాగా లాగించేస్తున్న భారతీయులు

2030 నాటికి రూ.11.25 లక్షల కోట్లకు దేశీయ ఆహార సేవల మార్కెట్

స్విగ్గీ, కియర్నీ సంయుక్త నివేదిక అంచనా



న్యూఢిల్లీ: వచ్చే ఐదేళ్లలో (2030 నాటికి) భారత ఆహార సేవల మార్కెట్ 12,500 కోట్ల డాలర్ల (సుమారు రూ.11.25 లక్షల కోట్లు) స్థాయికి చేరుకోవచ్చని ఒక నివేదిక అంచనా వేసింది. అలాగే, సంఘటిత ఆహార సేవల విభాగ పరిమాణం ఐదేళ్లలో రెట్టింపు కానుందని, అసంఘటిత విభాగాన్ని మించిపోనుందని అంటోంది. 'హౌ ఇండియా ఈట్స్' పేరుతో ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ స్విగ్గీ, అమెరికన్ గ్లోబల్ కన్సల్టింగ్ కంపెనీ కియర్నీ సంయుక్తంగా ఈ నివేదికను గురువారం విడుదల చేశాయి. 2019లో 4,900 కోట్ల డాలర్ల స్థాయిలో ఉన్న భారత ఆహార సేవల మార్కెట్ 2025లో 7,800 కోట్ల డాలర్ల (రూ.6.97 లక్షల కోట్లు) స్థాయికి చేరి ఉండవచ్చని రిపోర్టు అంచనా. నివేదికలోని మరిన్ని విషయాలు..

- వచ్చే ఐదేళ్లలో ఆహార సేవల మార్కెట్ మొత్తం వృద్ధిలో సంఘటిత విభాగ వాటా 60 శాతానికి మించిపోనుంది. తద్వారా అసంఘటిత విభాగ స్థాయిని అధిగమించనుంది.
- తలసరి ఆదాయంతో పాటే దేశవాసులు ఆహార సేవల కోసం వెచ్చించే మొత్తం కూడా పెరగనుంది. వచ్చే 7 ఏళ్ల పాటు ఈ ఖర్చులో అధిక వృద్ధి నమోదు కానుంది.
- భారత జీడీపీలో ఆహార సేవల మార్కెట్ వాటా కేవలం 1.9 శాతమే. ప్రస్తుతం చైనాలో ఈ వాటా 5 శాతంగా, బ్రెజిల్‌లో 6 శాతంగా ఉంది. కాబట్టి, ముందుముందు భారత్‌లో ఈ మార్కెట్ వృద్ధికి బోలెడు అవకాశాలున్నాయి.
- క్లౌడ్ కిచెన్లు, క్విక్ సర్వీస్ రెస్టారెంట్లు (క్యూఎస్ఆర్), డెజర్ట్ పార్లర్లు సగటు కంటే అధిక వృద్ధిని నమోదు చేయనున్నాయి.
- భారత కస్టమర్ వినూత్న వంటకాల ఆర్డర్లు 20 శాతానికి పైగా, రెస్టారెంట్ నుంచి ఆర్డర్లు 30 శాతం వృద్ధి చెందాయి. మొత్తం ఆర్డర్లతో పోలిస్తే, ఆరోగ్యకరమైన ఆహార పదార్థాల ఆర్డర్లు 2.3 రెట్లు పెరుగుతున్నాయి.
- భారతీయులు దేశీయ సంప్రదాయ వంటకాలతో పాటు విదేశీ వంటకాలనూ ఇది వరకెన్నడూ లేనంతగా ఆస్వాదిస్తున్నారు.
- ప్రధాన వంటకాల కంటే గోవా, బిహారీ, పహారీ వంటకాలకు గిరాకీ 2-8 రెట్ల మేర పెరుగుతోంది. అదే సమయంలో కొరియా, వియత్నాం, మెక్సికన్ వంటకాలకు డిమాండ్ వరుసగా 17, 6, 3.7 రెట్ల చొప్పున పెరుగుతోంది.
- దేశీయ పానీయాలైన బటర్‌మిల్క్, షర్బత్‌కు డిమాండ్ మొత్తం పానీయాలతో పోలిస్తే 4-6 రెట్లకు పైగా పెరుగుతోంది. బొబా టీ, మచ్చా టీ విక్రయాలు వరుసగా 11, 4 రెట్లు పెరిగాయి.
- గడిచిన దశాబ్దానికి పైగా కాలంలో ఈ విభాగం అసమాన పరిణామాన్ని చూసింది. ఒకవైపు వినియోగదారులు భారత, ఇటాలియన్ వంటకాల్లో అందుబాటు ధరల కోసం చూస్తున్నారు. మరోవైపు బొబా, మచ్చా టీలను ఇదివరకెన్నడూ లేనంతగా సేవిస్తున్నారని స్విగ్గీ ఫుడ్ మార్కెట్‌ప్లేస్ సీఈఓ రోహిత్ కపూర్ అన్నారు.
- దేశంలోని 8 ప్రధాన నగరాలతో పోలిస్తే, మిగతా నగరాల్లో బయట భోజనం చేయడం రెండు రెట్ల స్థాయిలో ఉందని కియర్నీ ప్రతినిధి రజత్ తులి అన్నారు. ప్రధానంగా కార్పొరేట్, పారిశ్రామిక, విద్య, పర్యాటక హబ్‌లలో ఇది అధికమన్నారు. రెస్టారెంట్లలో భోజనం చేసేవారిలో జెన్ జెడ్ అధికమని, మిగతా వయసువాళ్లతో పోలిస్తే 3 రెట్ల చొప్పున పెరుగుతున్నారని తులి పేర్కొన్నారు.

వచ్చే ఏడాది 5,000 డాలర్లకు గోల్డ్

డబ్ల్యూజీసీ సీఈఓ డేవిడ్ టైట్ అంచనా

దుబాయ్: బంగారం పరుగు ఇప్పట్లో ఆగదని ఇప్పటికే పలు ఆర్థిక సంస్థలు, విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. తాజాగా ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) సీఈఓ డేవిడ్ టైట్ కూడా ఇదే మాట అంటున్నారు. అంతర్జాతీయ మార్కెట్లో, ఈ అక్టోబరులో 4,381 డాలర్ల వద్ద ఆల్‌టైం రికార్డు గరిష్ఠాన్ని నమోదు చేసిన ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ రేటు.. ప్రస్తుతం 4,150 డాలర్ల ఎగువన కదలాడుతోంది. ముందుముందు మరింత పెరిగి వచ్చే ఏడాదిలో 5,000 డాలర్లకు చేరుకోవచ్చని దుబాయ్‌లో జరిగిన ప్రీషియస్ మెటల్ కాన్ఫరెన్స్‌లో డేవిడ్ టైట్ అభిప్రాయపడ్డారు. ఫెడ్ రేట్ల తగ్గుదల, అమెరికా క్రమంగా ఆర్థిక సంక్షోభంలోకి కూరుకుపోతుండటం, సెంట్రల్ బ్యాంక్‌ల పసిడి కొనుగోళ్లు, జపాన్‌లో అధిక ద్రవ్యోల్బణం వంటి అంశాలు బులియన్ ధరలను మరింత ఎగదోయనున్నాయని ఆయన పేర్కొన్నారు. కాగా, గోల్డ్‌మన్ శాక్స్, జేపీ మోర్గాన్, బ్యాంక్ ఆఫ్ అమెరికా వంటి అంతర్జాతీయ ఆర్థిక సేవల దిగ్గజాలు సైతం వచ్చే ఏడాదిలో గోల్డ్ 5,000 డాలర్లకు చేరుకోవచ్చని ఇదివరకే అంచనాలను విడుదల చేశాయి.

త్వరలో బంగారం రుణాల్లోకి పిరామల్ ఫైనాన్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): పిరామల్ ఫైనాన్స్ లిమిటెడ్.. బంగారం రుణాల విభాగంలోకి అడుగు పెట్టేందుకు రెడీ అవుతోంది. ఇప్పటి వరకు పిరామల్ ప్రధానంగా గృహ, ఎంఎస్ఎంఈ రంగాల కోసం రుణాలను అందిస్తుండగా.. త్వరలోనే పసిడి రుణాల విభాగంలోకి ప్రవేశించనుందని సంస్థ సీఈఓ (రిటైల్ లెండింగ్) జగ్‌దీప్ మల్లారెడ్డి గురువారం నాడిక్కడ తెలిపారు. పిరామల్ ఫైనాన్స్ ప్రస్తుతం దేశవ్యాప్తంగా 428 నగరాల్లో 517 శాఖలను నిర్వహిస్తోందన్నారు. ఇందులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లోని 50కి పైగా పట్టణాలు, నగరాల్లో 59 శాఖలు ఉన్నాయని ఆయన చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) సెప్టెంబరు త్రైమాసికం ముగిసే నాటికి నిర్వహణలో ఉన్న ఆస్తుల విలువ (ఏయూఎం) రూ.91,477 కోట్లకు చేరుకుందని ఆయన వివరించారు. కాగా ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి సంస్థ ఏయూఎం రూ.లక్ష కోట్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు జగ్‌దీప్ చెప్పారు.

ఐటీ చేతిలో బడా బాబుల విదేశీ రహస్య ఆస్తుల చిట్టా

త్వరలో 24,678 మందికి ఈ-మెయిల్స్, ఎస్ఎంఎస్‌లు

న్యూఢిల్లీ: విదేశాల్లో రహస్యంగా కూడబెట్టిన బడా బాబుల గుట్టు రట్టవుతోంది. సప్త సముద్రాల ఆవల కూడబెట్టిన ఈ ఆస్తుల వివరాలను సైతం ఆదాయ పన్ను (ఐటీ) శాఖ వెలికి తీస్తోంది. స్విట్జర్లాండ్‌తో సహా పలు దేశాలతో కుదిరిన పరస్పర సమాచార మార్పిడి (ఏఈఓఐ) ఒప్పందం ఇందుకు ఎంతగానో ఉపయోగపడుతోంది. ఇలా విదేశాల నుంచి అందిన సమాచారాన్ని 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఫైల్ చేసిన ఐటీ రిటర్న్‌లను పోల్చి చూసి విదేశాల్లోని తమ ఆస్తుల వివరాలు వెల్లడించని 24,678 మంది బడా బాబుల జాబితాను ఐటీ శాఖ సిద్ధం చేసింది. విదేశాల్లో వీరు కూడబెట్టిన ఆస్తుల విలువ ఎంత లేదన్నా రూ.29,208 కోట్ల వరకు ఉంటుందని అంచనా. ఈ ఆస్తులకు తోడు వీరు తమ ఐటీ రిటర్న్‌ల్లో వెల్లడించని విదేశీ ఆదాయం రూ.1,089.88 కోట్ల వరకు ఉంటుందని అంచనా.

డిసెంబరు వరకే గడువు: ఈ ఏడాది చివరికల్లా ఈ రహస్య ఆస్తుల వివరాలతో సవరించిన ఐటీ రిటర్న్‌లు ఫైల్ చేస్తారా? లేక కొరడా ఝుళిపించమంటారా? అని ఐటీ శాఖ త్వరలో వీరికి ఎస్ఎంఎస్‌లు, ఈమెయిల్స్ పంపనుంది. అప్పటికే వినకపోతే 30 శాతం పన్నుతో పాటు ఆ చెల్లించాల్సిన పన్నుపై రూ.10 లక్షల జరిమానా తప్పదని ఐటీ అధికారులు హెచ్చరించనున్నారు. విదేశాల్లో ఇలా రహస్యంగా ఆస్తులు కూడబెట్టిన వారిలో ప్రముఖ కంపెనీలకు చెందిన ఉన్నతోద్యోగులు కూడా ఉన్నట్టు సమాచారం.

సరికొత్త గరిష్ఠాలకు సూచీలు

ఇంట్రాడేలో 86,000 పైకి సెన్సెక్స్

ముంబై: భారత స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు గురువారం ఆరంభ ట్రేడింగ్‌లో సరికొత్త జీవితకాల గరిష్ఠాలకు చేరాయి. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాలు, విదేశీ సంస్థాగత పెట్టుబడుల దన్నుతో సెన్సెక్స్ ఒక దశలో 446.35 పాయింట్లు ఎగబాకి 86,055.86 వద్ద, నిఫ్టీ 105.15 పాయింట్ల వృద్ధితో 26,310.45 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డులను నమోదు చేశాయి. అయితే, గరిష్ఠాల వద్ద మదుపరులు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో మధ్యాహ్నం సెషన్‌లో సూచీలు మళ్లీ కిందికి జారాయి. ఒక దశలో నష్టాల్లోకి మళ్లినప్పటికీ, మళ్లీ కాస్త తేరుకున్న సెన్సెక్స్.. చివరికి 110.87 పాయింట్ల లాభంతో 85,720.38 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 10.25 పాయింట్ల పెరుగుదలతో 26,215.55 వద్ద ముగిసింది. 2024 సెప్టెంబరు 27న సెన్సెక్స్ 85,978.25 వద్ద, నిఫ్టీ 26,277.35 వద్ద గత ఇంట్రాడే రికార్డులను నమోదు చేశాయి. అంటే, సూచీలు 14 నెలల తర్వాత మళ్లీ రికార్డు గరిష్ఠాలకు చేరాయి. ఈ ఏడాదిలో ఇప్పటివరకు సెన్సెక్స్ 7,581.37 పాయింట్లు (9.70 శాతం), నిఫ్టీ 2,570.75 పాయింట్లు (10.87 శాతం) పెరిగాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



28వ తేదీ			
హైదరాబాద్	630	విజయవాడ	640
వరంగల్	632	గోదావరి	615
చిత్తూరు	673	విశాఖపట్నం	610
		డజను గుడ్లు రూ. 90	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	100	విజయవాడ	103
వరంగల్	100	గుంటూరు	108
కరీంనగర్	100	ఒంగోలు	108
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	100
కర్నూలు	100	నెల్లూరు	105
విశాఖపట్నం	100	అనంతపురం	105
గోదావరి	103		

మార్కెట్లోకి మహీంద్రా ఎక్స్‌ఈవీ 9ఎస్



ప్రారంభ ధర రూ.19.95 లక్షలు

బెంగళూరు: దేశీయ ఆటో దిగ్గజాల్లో ఒకటైన మహీంద్రా అండ్ మహీంద్రా కొత్త విద్యుత్ కారు ఎక్స్‌ఈవీ 9ఎస్‌ను మార్కెట్లోకి తెచ్చింది. ఏడు సీట్లుండే ఈ కారు ప్రారంభ ధర రూ.19.95 లక్షలు కాగా టాప్ ఎండ్ వేరియెంట్ ధర రూ.29.45 లక్షలు. ఇంగ్లో ఎలక్ట్రిక్ వేదికపై అభివృద్ధి చేసిన ఈ కారు ప్రయాణికులు మరింత సౌకర్యంగా కూర్చుకునేందుకు అవసరమైన ప్రదేశం కలిగి ఉంటుందని కంపెనీ ప్రెసిడెంట్ (ఆటోమోటివ్ బిజినెస్) ఆర్.వేలుసామి చెప్పారు. 2027-2028 నాటికి మొత్తం అమ్మకాల్లో ఈవీల వాటా 25 శాతానికి పెంచుకోవాలన్నది తమ లక్ష్యమని ఆయన తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం చివరి నాటికి విద్యుత్ కార్ల తయారీ సామర్థ్యాన్ని నెలకి 8 వేల యూనిట్లకు, విక్రయాలను 7 వేలకు పెంచాలనుకుంటున్నట్లు ఆటో, వ్యవసాయ విభాగం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సీఈఓ రాజేష్ జెజూరికర్ తెలిపారు. ఎక్స్‌ఈ-9వీకి చెందిన అన్ని వేరియెంట్లకు ప్రభుత్వ ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం కింద ప్రోత్సాహకాలు పొందే అర్హత కలిగి ఉందని అన్నారు.

స్పోర్ట్స్

మనోళ్లకు మరో గెలుపు

కివీస్‌పై భారత్ విజయం

అజ్లాన్ షా హాకీ

ఇఫో (మలేసియా): హోరాహోరీగా సాగిన మ్యాచ్ చివర్లో సెల్వం కార్తీ చేసిన గోల్‌తో భారత హాకీ జట్టు ఉత్కంఠ విజయాన్ని నమోదు చేసింది. సుల్తాన్ అజ్లాన్ షా కప్‌లో గురువారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 3-2తో న్యూజిలాండ్‌పై గెలిచింది. టీమిండియా తరపున అమిత్ రోహిదాస్ (4వ నిమిషం), సంజయ్ (32వ), సెల్వం (54వ) గోల్స్ చేయగా.. కివీస్ ఆటగాడు జార్జ్ బాకర్ (42వ, 48వ) రెండు గోల్స్ సాధించాడు. శనివారం జరిగే మ్యాచ్‌లో కెనడాతో భారత్ తలపడనుంది.

ప్రస్తుతానికి గౌతీ సేఫ్!

గంభీర్‌కు అండగా బీసీసీఐ



న్యూఢిల్లీ: దక్షిణాఫ్రికా చేతిలో భారత్ వైట్‌వాష్ కావడంతో హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌పై విమర్శలు వెల్లువెత్తాయి. అయితే బీసీసీఐ గంభీర్‌పై పూర్తి విశ్వాసం వ్యక్తం చేసింది. గంభీర్‌పై హడావుడిగా ఎటువంటి చర్యలూ తీసుకోబోమని బోర్డు కార్యదర్శి దేవజిత్ సైకియా చెప్పాడు. రోహిత్, కోహ్లీ, అశ్విన్ రిటైర్మెంట్‌తో జట్టు సంధి దశలో ఉందని.. మళ్లీ పుంజుకోవడానికి సమయం పడుతుందని అన్నాడు. ఆటగాళ్లు ఎటువంటి పిచ్‌ల పైనైనా ఆడే విధానాన్ని అలవర్చుకోవాలని సూచించాడు. కాగా గంభీర్‌కు సునీల్ గవాస్కర్ మద్దతుగా నిలిచాడు. జట్టు ఓటమిపాలైతే కోచ్‌ను ఎందుకు టార్గెట్ చేస్తున్నారని ప్రశ్నించాడు. గెలిచినప్పుడు అతడికి క్రెడిట్ ఇవ్వనప్పుడు.. ఓటమికి విమర్శలెందుకు చేస్తున్నారో వివరించాలని సన్నీ కోరాడు.

మంధాన కోసం బిగ్‌బాష్‌కు దూరం

జెమీమా నిర్ణయం

ముంబై: జెమీమా రోడ్రిగ్స్ మహిళల బిగ్‌బాష్ లీగ్‌కు దూరమైంది. తన క్లోజ్‌ఫ్రెండ్, సహచర క్రికెటర్ స్మృతి మంధాన వివాహం కోసం భారత్‌కు వచ్చిన తను తిరిగి లీగ్‌లో ఆడేందుకు ఆసీస్‌కు వెళ్లాలనుకోవడం లేదు. ఇటీవలే మంధాన వివాహం అర్థంతరంగా ఆగిపోగా.. ఈ కష్ట సమయంలో తన స్నేహితురాలికి అండగా ఉండాలని జెమీమా నిర్ణయించుకుంది.

రెజ్లర్ నిఖిల్‌కు స్వర్ణం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఖేలో ఇండియా వర్సిటీ క్రీడల్లో తెలుగు క్రీడాకారులు పతకాల మోత మోగించారు. గురువారం బికనీర్‌లో జరిగిన ఈ పోటీల్లో ఫ్రీస్టయిల్ రెజ్లింగ్ 65 కిలోల విభాగంలో నిఖిల్ యాదవ్ (ఉస్మానియా) స్వర్ణం సాధించాడు. 25 మీటర్ల ర్యాపిడ్ పిస్టల్ ఫైర్‌లో తనిష్క, నాగసాయి, ముఖేష్ (కేఎల్‌వర్సిటీ) త్రయం రజతం అందుకుంది. వెయిట్‌లిఫ్టింగ్ 79 కిలోల విభాగంలో గణేష్ (ఎల్‌పీయూ) కాంస్యం నెగ్గాడు.



మీ విజయం భావి తరాలకు స్ఫూర్తి

అంధుల క్రికెట్ జట్టుతో ప్రధాని మోదీ ఇష్టాగోష్ఠి

న్యూఢిల్లీ: మహిళల అంధుల టీ20 ప్రపంచకప్ నెగ్గిన భారత జట్టు విజయం భావితరాలకు స్ఫూర్తిదాయకంగా చరిత్రలో నిలిచిపోతుందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. గురువారం న్యూఢిల్లీలో మోదీని భారత జట్టు సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సుమారు 45 నిమిషాల పాటు జరిగిన ఇష్టాగోష్ఠిలో భారత కెప్టెన్, అనంతపురం అమ్మాయి దీపిక, పాడేరు యువ క్రికెటర్ కరుణ కుమారి.. మోదీతో ముచ్చటించారు. దీపిక పాటలు బాగా పాడుతుందని తెలిసి ఆమెను మోదీ ఒక పాట పాడాలని అడిగారు. దాంతో దీపిక శివుడి భక్తి గీతం ఆలపించగా.. ఆమెను మోదీ అభినందించారు. చివర్లో జట్టు సభ్యులు సంతకం చేసిన బ్యాట్‌ను మోదీకి దీపిక బహూకరించింది. కొన్ని క్రికెట్ బంతులపై జట్టు సభ్యులు మోదీ సంతకాలు తీసుకున్నారు.

దీప్తి ధమాకా

రూ.3.20 కోట్లకు యూపీ కొనుగోలు



- అలీసా హీలీకి నిరాశ
- మహిళల ప్రీమియర్ లీగ్ వేలం

న్యూఢిల్లీ: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) నాలుగో సీజన్ కోసం గురువారం అట్టహాసంగా మెగా వేలం జరిగింది. స్టార్ ఆటగాళ్లతో పాటు అన్‌క్యాప్‌డ్ ప్లేయర్ల కోసం ఐదు ఫ్రాంచైజీలు పోటీపడ్డాయి. 73 స్లాట్లకు జరిగిన వేలం కోసం 277 మంది రిజిష్టర్ చేసుకున్నారు. ఎక్కువగా విదేశీ ఆటగాళ్లవైపు ఆయా జట్లు మొగ్గు చూపినా.. ఈసారి వేలంలో అత్యధిక ధర మాత్రం భారత క్రికెటర్‌దే కావడం విశేషం. స్టార్ ఆల్‌రౌండర్ దీప్తి శర్మకు జాక్‌పాట్ తగిలింది. వన్డే వరల్డ్‌కప్ ఫైనల్లో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టి జట్టును విజేతగా నిలిపిన దీప్తి ఏకంగా రూ.3.20 కోట్ల ధర పలికింది. ఈ ఏడాది యూపీ వారియర్స్ కెప్టెన్‌గా వ్యవహరించిన దీప్తిని తొలుత ఆ జట్టు రిటైన్ చేసుకోలేదు. కానీ రైట్ టు మ్యాచ్ (ఆర్‌టీఎం) ద్వారా రికార్డు ధరతో తిరిగి యూపీనే సొంతం చేసుకుంది. వాస్తవానికి కనీస ధర రూ.50 లక్షలకే దీప్తిని ఢిల్లీ క్యాపిటల్స్ సొంతం చేసుకోగా, ఏ జట్టూ పోటీ పడలేదు. అయితే గతంలో తమ జట్టు తరఫున ఆడిన ప్లేయర్లను తిరిగి సొంతం చేసుకునే ఆర్‌టీఎంను ఉపయోగించాలని యూపీ నిర్ణయం తీసుకుంది. దీంతో ఇదే అదనుగా డీసీ తమ బిడ్‌ను ఏకంగా రూ.3.20 కోట్లకు పెంచగా.. ఏమాత్రం ఆలస్యం చేయకుండా యూపీ ఓకే చెప్పి దీప్తిని సొంతం చేసుకుంది. మరోవైపు డబ్ల్యూపీఎల్‌లో స్మృతి మంధాన (రూ.3.40 కోట్లు, ఆర్‌సీబీ) తర్వాత అత్యధిక ధర పలికిన రెండో భారత ప్లేయర్‌గా దీప్తి నిలిచింది. ఇదిలావుండగా వేలంలో అందరికంటే ఎక్కువగా రూ.14.50 కోట్ల పర్స్‌తో యూపీ వారియర్స్ అడుగుపెట్టింది. దీంతో సహజంగానే మిగతా జట్లతో పోలిస్తే వీరి హడావిడి ఎక్కువగా కనిపించింది. వేలంలో అందరికంటే పిన్న వయస్కురాలిగా 16 ఏళ్ల దియా యాదవ్ (రూ.10 లక్షలు, ఢిల్లీ) నిలిచింది.

రూ.3 కోట్లతో ముంబైకి అమేలీ కెర్



విదేశీ ప్లేయర్ల హవా

వేలంలో అన్ని జట్లు కూడా భారత ప్లేయర్లకంటే విదేశీ క్రికెటర్ల వైపు మొగ్గు చూపాయి. ముంబై జట్టు కివీస్ ఆల్‌రౌండర్ అమేలీ కెర్‌ను రూ.3 కోట్లకు తిరిగి తీసుకుంది. తాజా వేలంలో విదేశీ ఆటగాళ్లలో కెర్‌దే అధిక మొత్తం. 2023, 2025 సీజన్లలో ముంబైని చాంపియన్‌గా నిలపడంలో కెర్‌ది కీలక పాత్ర. అంతేకాకుండా గుజరాత్ జెయింట్స్ సోఫీ డివైన్‌ను రూ.2 కోట్లకు, మెగ్ లానింగ్‌ను యూపీ వారియర్స్ రూ.1.90 కోట్లకు తీసుకున్నాయి. దక్షిణాఫ్రికా కెప్టెన్ వోల్వార్ట్ రూ.1.10 కోట్లకు డీసీ కొనుగోలు చేయగా.. విండీస్ పేసర్ చినెల్లె హెన్రీని రూ.1.30 కోట్లకు ఢిల్లీ తీసుకుంది. అలాగే ఇంగ్లండ్ స్పిన్నర్ సోఫీ ఎకెల్‌స్టోన్‌ను రూ.80 లక్షలకు ఆర్‌టీఎం ద్వారా యూపీ సొంతం చేసుకుంది. అయితే ఆసీస్ కెప్టెన్ అలీసా హీలీతో ఈ వేలం ఆరంభం కాగా.. తనను మాత్రం ఏ జట్టూ కొనుగోలు చేయకపోవడం గమనార్హం.

శిఖాకు అనూహ్య ధర

రూ.40 లక్షల కనీస ధరతో వేలంలోకి అడుగుపెట్టిన 36 ఏళ్ల వెటరన్ పేసర్ శిఖా పాండే అనూహ్య ధర పలికింది. రెండేళ్ల క్రితం భారత్ తరపున చివరి టీ20 ఆడిన ఆమె కోసం యూపీ, ఆర్‌సీబీ హోరాహోరీగా పోటీపడడం ఆశ్చర్యపరిచింది. చివరికి రూ.2.4 కోట్ల అధిక ధరకు యూపీ దక్కించుకుంది. ఈ వేలంలో ఇది మూడో అత్యధిక ధర. అలాగే భారత్ నుంచి ప్రతీకా (రూ.50 లక్షలు), రాజేశ్వరి గైక్వాడ్ (రూ.40 లక్షలు), హేమలత (రూ.30 లక్షలు), హర్లీన్ (రూ.40 లక్షలు), యాస్తిక (రూ.50 లక్షలు), క్రాంతి గౌడ్ (రూ.50 లక్షలు), స్నేహ్ రాణా (రూ.50 లక్షలు) బరిలోకి దిగనున్నారు.

జనవరి 9 నుంచి పోటీలు

వచ్చే ఏడాది జనవరి 9 నుంచి మహిళల ప్రీమియర్ లీగ్ నాలుగో సీజన్ జరుగనుంది. మ్యాచ్‌లన్నీ నవీ ముంబై, వడోదరలో నిర్వహించనున్నారు. సహజంగా ఫిబ్రవరి-మార్చిలో డబ్ల్యూపీఎల్ జరుగుతుంటుంది. కానీ ఈసారి స్వదేశంలోనే ఫిబ్రవరి 7 నుంచి పురుషుల టీ20 వరల్డ్‌కప్ ఉండడంతో లీగ్‌ను ముందుకు జరిపారు.

'సిరి' చరణి



వేలంలో తెలుగు క్రికెటర్లు కూడా బెర్త్ దక్కించుకున్నారు. ముఖ్యంగా మహిళల వన్డే వరల్డ్‌కప్‌లో విశేషంగా రాణించిన ఆంధ్ర స్పిన్నర్ శ్రీచరణి రూ.1.30 కోట్ల ధర పలకడం విశేషం. తన కనీస ధర రూ.30 లక్షలే అయినప్పటికీ యూపీ వారియర్స్‌తో ఎదురైన తీవ్ర పోటీని అధిగమించి ఢిల్లీ క్యాపిటల్స్ తీసుకుంది. గత సీజన్‌లోనూ తను ఢిల్లీకే ఆడింది. ఇక ఇతర తెలుగు క్రికెటర్లలో అరుంధతి రెడ్డిని రూ.75 లక్షలకు ఆర్‌సీబీ, క్రాంతి రెడ్డిని ముంబై రూ.10 లక్షలకు, మడివాల మమతను ఢిల్లీ రూ.10 లక్షలకు, గొంగడి త్రిషను రూ.10 లక్షలకు యూపీ జట్టు తీసుకున్నాయి.

వేలంలో వెలుగులు

పేరు	ధర	జట్టు
దీప్తి శర్మ	రూ.3.20 కోట్లు	యూపీ వారియర్స్ (ఆర్‌టీఎం)
అమేలీ కెర్	రూ.3 కోట్లు	ముంబై ఇండియన్స్
శిఖా పాండే	రూ.2.40 కోట్లు	యూపీ వారియర్స్
సోఫీ డివైన్	రూ.2 కోట్లు	గుజరాత్ జెయింట్స్
మెగ్ లానింగ్	రూ.1.90 కోట్లు	యూపీ వారియర్స్
శ్రీచరణి	రూ.1.30 కోట్లు	ఢిల్లీ క్యాపిటల్స్
చినెల్లె హెన్రీ	రూ.1.30 కోట్లు	ఢిల్లీ క్యాపిటల్స్
లిచ్‌ఫీల్డ్	రూ.1.20 కోట్లు	యూపీ వారియర్స్
లారా వోల్వార్ట్	రూ.1.10 కోట్లు	ఢిల్లీ క్యాపిటల్స్
ఆశా శోభన	రూ.1.10 కోట్లు	యూపీ వారియర్స్
జార్జియా వేర్‌హామ్	రూ.1 కోటి	గుజరాత్ జెయింట్స్



స్వదేశంలో మరో టైటిల్ కోసం..

చిలీతో భారత్ ఆరంభ మ్యాచ్ నేడు

జూనియర్ హాకీ ప్రపంచ కప్

చెన్నై: పురుషుల జూనియర్ వరల్డ్ కప్ హాకీ టోర్నీ శుక్రవారం ఇక్కడ ప్రారంభం కానుంది. తొమ్మిదేళ్ల తర్వాత స్వదేశంలో టైటిల్ అందుకోవడమే లక్ష్యంగా ఆతిథ్య భారత్ బరిలోకి దిగుతోంది. ఈక్రమంలో శుక్రవారం జరిగే ఆరంభ మ్యాచ్‌లో చిలీతో తలపడుతోంది. 2016లో లఖ్‌నవూ వేదికగా జరిగిన ఈ చాంపియన్‌షిప్‌లో చివరిసారి భారత్ టైటిల్ దక్కించుకుంది. పూల్ 'బి'లో చిలీ, ఒమన్, స్విట్జర్లాండ్‌తో కలిసి భారత్ అదృష్టాన్ని పరీక్షించుకుంటోంది. వాస్తవంగా ఈ పూల్‌లో పాకిస్థాన్ కూడా ఉంది. కానీ భద్రతా కారణాలతో ఆ జట్టు వైదొలగడంతో ఒమన్‌కు స్థానం కల్పించారు. చెన్నై, మదురైలలో జరిగే ఈ టోర్నమెంట్‌లో మొత్తం 24 జట్లు తలపడుతున్నాయి.

ఒకుహారాకు తన్వీ షాక్

సయ్యద్ మోదీ బ్యాడ్మింటన్

లఖ్‌నవూ: ప్రపంచ జూనియర్ చాంపియన్‌షిప్స్ రజత పతక విజేత తన్వీ శర్మ తన కెరీర్‌లోనే గొప్ప విజయం సాధించింది. సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ టోర్నీలో ప్రపంచ మాజీ చాంపియన్ నవోమి ఒకుహారాకు తన్వీ షాకిచ్చింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో 16 ఏళ్ల తన్వీ 13-21, 21-16, 21-19తో రెండో సీడ్ ఒకుహారా (జపాన్)ని చిత్తు చేసింది. 19 ఏళ్ల మన్‌రాజ్.. ప్రణయ్‌ని కంగుతినిపించి రౌండ్-8కి చేరాడు. మరో మ్యాచ్‌లో కిడాంబి శ్రీకాంత్-సనీత్ దయానంద్‌ని ఓడించి క్వార్టర్స్‌లో ప్రవేశించాడు. ఆరోసీడ్ తరుణ్ మన్నేపల్లి 16-21, 21-17, 17-21తో మిథున్ మంజునాథ్ చేతిలో ఓడాడు. పురుషుల డబుల్స్‌లో అర్జున్/హరిహరన్, మహిళల డబుల్స్‌లో గాయత్రి/ట్రీసా జంటలు కూడా క్వార్టర్‌ఫైనల్లోకి అడుగుపెట్టాయి.

ఇదో చెత్త అనుభవం



ఎయిరిండియాపై సిరాజ్ ఫైర్

న్యూఢిల్లీ: ఎయిరిండియాపై టీమిండియా పేసర్ మహ్మద్ సిరాజ్ తీవ్ర అసహనం వ్యక్తంజేశాడు. బుధవారం రాత్రి 7.25కి ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ (ఐఎక్స్ 2884) విమానంలో గువాహటినుంచి అతడు హైదరాబాద్ వెళ్లాల్సి ఉంది. అక్కడి నుంచి 4 గంటలపాటు వేచి చూసినా..పలుమార్లు విచారించినా..విమానం ఆలస్యానికి సంబంధించి ఎయిరిండియా ఎలాంటి సమాధానమూ ఇవ్వలేదని సిరాజ్ మండిపడ్డాడు. దాంతో తీవ్ర అసహనానికి లోనైన హైదరాబాదీ తనకిది చెత్త విమాన ప్రయాణ అనుభవమని తేల్చాడు. అంతేకాదు..ఈ ఎయిర్‌లైన్స్ విమానం ఎక్కొద్దని సూచించాడు. ఎయిరిండియా..జరిగిన అసౌకర్యానికి సిరాజ్‌కు క్షమాపణ చెప్పింది. ఊహించని కార్యాచరణ సమస్యల వల్ల విమానం రద్దయిందని వివరణ ఇచ్చింది.

బీసీల గొంతు కోసింది బీఆర్‌ఎస్సే..

- స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లు తగ్గించింది ఆ ప్రభుత్వమే
- పార్టీ పరంగా 42% ఇచ్చేందుకు సిద్ధమా?: సీతక్క



హైదరాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతంగా ఉన్న రిజర్వేషన్లను.. 2019లో 22 శాతానికి తగ్గించి ఆ వర్గాల గొంతు కోసింది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క విమర్శించారు. ఈ అన్యాయాన్ని రాష్ట్రంలోని బీసీ ప్రజలు ఎన్నటికీ మర్చిపోరని అన్నారు. బీసీ రిజర్వేషన్లపై బీఆర్‌ఎస్ నేత కేటీఆర్ అసత్య ప్రచారాన్ని ఆ వర్గాలు నమ్మబోరని పేర్కొన్నారు. ప్రజాభవన్‌లో గురువారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికల్లో పార్టీ పరంగా బీసీలకు 42 శాతం సీట్లు ఇచ్చేందుకు బీఆర్‌ఎస్ పార్టీ సిద్ధమా? అని సవాల్ విసిరారు. 2019 స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రం యూనిట్‌గా రిజర్వేషన్ విధానాన్ని ఖరారు చేస్తే.. సుప్రీంకోర్టు తప్పు పట్టిందని గుర్తుచేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకే సర్పంచ్ రిజర్వేషన్లను మండలం యూనిట్‌గా, వార్డు సభ్యుల రిజర్వేషన్ను గ్రామ పంచాయతీ యూనిట్‌గా పరిగణనలోకి తీసుకున్నామని, భద్రాచలం, ములుగు, ఆదిలాబాద్ వంటి ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులకు 100 శాతం రిజర్వేషన్ కేటాయించామన్నారు. బీఆర్‌ఎస్ నేతలు రాజకీయ ప్రయోజనాల కోసం కులాల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

చెల్లెలికి జవాబు చెప్పలేని దద్దమ్మ కేటీఆర్

- అహంకారంతో మాట్లాడితే పెద్ద నాయకుడు కాలేరు
- కేసీఆర్ లేని రోజు బీఆర్‌ఎస్ ముక్కలుచెక్కలు: కడియం



స్టేషన్‌ఘన్‌పూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ లేని రోజున బీఆర్‌ఎస్ ముక్కలు, చెక్కలు కావడం ఖాయమని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. చెల్లెలు కవితకు సమాధానం చెప్పలేని దద్దమ్మ కేటీఆర్ అని విమర్శించారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లోని క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. వరంగల్ పర్యటనలో కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై కడియం ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్ మాదిరిగా తండ్రి అండ చూసుకొని, తండ్రి పేరు చెప్పుకొని తాను రాజయాల్లోకి రాలేదని వ్యాఖ్యానించారు. కేసీఆర్ లేకుంటే కేటీఆర్ అడ్రస్ ఎక్కడ? అసలు ఆయనకు గుర్తింపు ఏంటి? అని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ హయాంలో 36మంది ఎమ్మెల్యేలను పార్టీలోకి తీసుకొని ఇద్దరిని మంత్రులు చేసినప్పుడు గుర్తు రాని నీతి, నిజాయతీ... తన విషయంలో గుర్తొచ్చిందా? అని నిలదీశారు. అహంకారం, బలుపుతో మాట్లాడితే పెద్ద నాయకుడిని అవుతానని కేటీఆర్ అనుకోవడం అవివేకమని అన్నారు. కేటీఆర్‌ది ఐరన్‌లెగ్ అని, ఆయన నాయకత్వంలో పని చేయలేకనే కవిత దూరమైందని, హరీశ్‌రావు సైతం సమయం కోసం చూస్తున్నారని తెలిపారు.

మధిర-గుడివాడ రైల్వేలైన్ సర్వేకు నిధులివ్వాలి

- రాంచందర్‌రావుకు ఏపీ,తెలంగాణ జేఏసీ నేతల వినతి

హైదరాబాద్ సిటీ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా మధిర నుంచి ఏపీలోని కృష్ణా జిల్లా గుడివాడ వరకూ కొత్త రైల్వే లైను ఏర్పాటు చేయాలని బీజేపీ తెలంగాణ శాఖ అధ్యక్షుడు రామచందర్‌రావును ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఐక్య కార్యాచరణ వేదిక (జేఏసీ) నేతలు కోరారు. వచ్చే ఆర్థిక సంవత్సర కేంద్ర బడ్జెట్‌లో ఈ రైలు మార్గం సర్వేకు నిధులు కేటాయించేలా చూడాలని కోరుతూ గురువారం వినతిపత్రం సమర్పించారు. బందరు పోర్టుతో అనుసంధానమయ్యే ఈ కొత్త రైల్వే లైనుతో తెలంగాణకు లబ్ధి చేకూరుతుందని జేఏసీ నేత చాట్రాయి రామకృష్ణ వివరించారు. ఆయనను కలిసిన వారిలో జేఏసీ తెలంగాణ నేతలు జీవీ చలపతిరావు, జి.అనిల్ కుమార్, సోమాసి శ్రీనివాస్, పాలడుగు కళ్యాణ చక్రవర్తి తదితరులు ఉన్నారు.

స్థానికఎన్నికల్లో సమన్వయంతో పోటీ చేద్దాం

- సీపీఐ, సీపీఎం నిర్ణయం

హైదరాబాద్, నవంబరు27 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో ఒకరిపై ఒకరు పోటీ చేయకుండా సమన్వయంతో పోటీ చేయాలని సీపీఐ, సీపీఎం పార్టీలు పరస్పర అవగాహనకు వచ్చాయి. సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల్లో ఇరుపార్టీల నుంచి ఒకరి మీద ఒకరు పోటీ లేకుండా సమన్వయంతో పని చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చాయి. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ హైదరాబాద్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు ప్రకటన చేశారు. పంచాయతీ ఎన్నికల్లో సాధ్యమైన మేర కాంగ్రెస్, సీపీఐ అవగాహనతో పోటీ చేస్తాయని కూనంనేని తెలిపారు. హిడ్మా ఎన్‌కౌంటర్‌కు వ్యతిరేకంగా ఢిల్లీలో ఆందోళన చేపట్టిన విద్యార్థులపై ఉపా చట్టం కింద పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కాగా, డిసెంబరు 26న ఖమ్మంలో నిర్వహించ తలపెట్టిన సీపీఐ శత వార్షికోత్సవ బహిరంగ సభను 2026 జనవరి 18కి వాయిదా వేసినట్లు కూనంనేని సాంబశివరావు తెలిపారు. పంచాయతీ ఎన్నికల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు.

బీసీలను దగా చేస్తున్న పాలకులు

- బీసీ హక్కుల సాధన సమితి

తెలంగాణ పాలకులు బీసీలను నిలువునా దగా చేస్తున్నారని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజయ నాయుడు ధ్వజమెత్తారు. బీసీ నేతలతో కలిసి హైదరాబాద్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం బీసీ బిల్లుకు అడ్డుపడిందని ఆక్షేపించారు. అఖిలపక్ష పార్టీలను ప్రధాన మంత్రి వద్దకు తీసుకెళ్లి ఒత్తిడి చేయాల్సిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవ తీసుకోవడం లేదన్నారు.

కేసీఆర్ బాటా? ప్రజల బాటా? మీరే తేల్చుకోండి

- సీఎం రేవంత్‌రెడ్డికి జస్టిస్ చంద్రకుమార్ సూచన
- ప్రభుత్వం నుంచి హామీ రాలేదన్న కోదండరాం

పంజాగుట్ట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): 'పదేళ్లు మోసగించిన బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను ప్రజలు గద్దె దించి.. మిమ్మల్ని గెలిపించారు. కేసీఆర్ బాట పడుతారో.. ప్రజల బాట పడుతారో తేల్చుకోవాలి' అని సీఎం రేవంత్ రెడ్డికి తెలంగాణ ప్రజల పార్టీ అధ్యక్షుడు జస్టిస్ బి. చంద్రకుమార్ స్పష్టం చేశారు. 'ఉద్యమ కారులు, పౌర సమాజం మద్దతు లేకుండా మీరు గెలిచేవారా?' అని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమ కారులకు ఇచ్చిన హామీలను డిసెంబర్ 9 లోపు అమలు చేయాలని కోరుతూ సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో గురువారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఉద్యమకారుల డిమాండ్లపై మేధావులతో చర్చించాలని చంద్రకుమార్ కోరారు. శ్రీకాంతాచారి వర్ధంతి సందర్భంగా 3న ఎల్బీనగర్‌లోని శ్రీకాంతా చారి విగ్రహం వద్ద కలుద్దామన్నారు. కోదండరాం మాట్లాడుతూ ఎమ్మెల్సీగా తాను ఈ విషయమై మండలిలో మాట్లాడానని గుర్తు చేశారు. డిమాండ్లపై సీఎం, మంత్రులకు వినతి పత్రాలు ఇద్దామని, సంఘటితంగా పోరాడుదామన్నారు.

బనకచర్ల వాస్తవ స్థితిగతులను తెలియజేయండి

- ఏపీకి గోదావరి బోర్డు లేఖ

హైదరాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)తయారీపై వాస్తవ స్థితిగతులను వారం రోజుల్లోపు నివేదిక అందించాలని ఏపీ ప్రభుత్వాన్ని గోదావరి నది యాజమాన్య బోర్డు(జీఆర్‌ఎంబీ) కోరింది. ఈ మేరకు ఏపీ జల వనరులశాఖ ఈఎన్‌సీ(ఇరిగేషన్)కి, బోర్డు మెంబర్ రంగసామి అలగేషన్ లేఖ రాశారు.



సంగారెడ్డి జిల్లా కందిలోని రైతు వేదికలో సెల్‌ఫోన్ వెలుతురులో నామినేషన్లు దాఖలు చేస్తున్న అభ్యర్థి

సెల్‌ఫోన్ల లైటే వెలుతురుగా

సంగారెడ్డి జిల్లా కందిలో రైతువేదికలో ఏర్పాటు చేసిన కేంద్రంలో తొలి విడత పంచాయతీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్లను స్వీకరించారు అక్కడ విద్యుత్తు సౌకర్యం సరిగా లేక చీకట్లు కమ్ముకున్నాయి. నామినేషన్లు సమర్పించే ప్రదేశంలో బల్బులను ఏర్పాటు చేయలేదు. వెలుతురు లేకపోవడంతో అభ్యర్థిని ప్రతిపాదించేందుకు వచ్చినవారే తమ సెల్‌ఫోన్ లైట్లను ఆన్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ వెలుగులోనే నామినేషన్ పత్రాలపై అభ్యర్థులు సంతకాలు పెట్టారు. ఈ కౌంటర్‌లో చాలా మంది నామినేషన్లను దాఖలు చేయడానికి రాగా టోకెన్లు ఇచ్చి లోనికి పిలిచారు. సాయంత్రం 6గంటలకల్లా చీకటి పడడంతో సెల్‌ఫోన్లను వినియోగించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

రూకగ్రీవాలు

(మొదటిపేజీ తరువాయి)

చెల్లిస్తానని చెప్పడంతో ఊర్లో వారంతా కొత్త సర్పంచ్‌గా ఆయనకే ముక్తకంఠంతో మద్దతు పలికినట్లు తెలుస్తోంది. గట్టు మండలం గొర్లఖాన్ దొడ్డిలో సర్పంచ్ పదవి రూ. 53 లక్షలు పలికింది. అయితే ఈ వేలం పాట పాడిన వ్యక్తికి కుటుంబసభ్యుల నుంచి అభ్యంతరం రావడంతో ప్రస్తుతం వారిని గ్రామపెద్దలు ఒప్పించే పనిలో పడినట్లు తెలుస్తోంది. ఇదే మండలంలోని అంతపల్లి గ్రామంలో ఓ నాయకుడు రూ. 23 లక్షలకు వేలం పాట పాడారు. అయితే మాజీ సర్పంచ్ తన పాత బిల్లులు ఇస్తేనే ఇందుకు ఒప్పుకొంటానని చెప్పారని, దీనికి వేలం పాట పాడిన వ్యక్తి అంగీకరించకపోవడంతో ప్రక్రియ తాత్కాలికంగా నిలిచిపోయినట్లు తెలుస్తోంది. వీటితో పాటు ధరూర్ మండలం చిన్న పాడు, వామనపల్లి గ్రామాల్లో ఎవరైతే స్మశానానికి ఎకరం భూమి విరాళంగా ఇస్తారో వారే సర్పంచ్ అవుతారని చర్చలు చేస్తున్నారు. జాంపల్లి గ్రామంలో కూడా వేలంపాట వేసినట్లు తెలుస్తోంది. మొదటి విడత ఎన్నికల్లో భాగంగా శనివారం సాయంత్రం వరకు మరికొన్ని గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం వైపు అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. వికారాబాద్ జిల్లా యాలాల పరిధిలో కొత్తగా ఏర్పడిన పేర్కంపల్లితండా పంచాయతీ ఏకగ్రీవమైంది. గ్రామాభివృద్ధి కోసం రూ.3 లక్షలు ఇస్తానని తండాకు చెందిన ఈర్యానాయక్ ముందుకు రావడంతో ఆయన్నే సర్పంచ్‌గా ఎన్నుకొనేందుకు గ్రామస్థులు ఓకే చెప్పారు. సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలంలోని బీజీ వెంకటాపూర్ సర్పంచ్ పదవి కోసం ఐదుగురి మధ్య పోటాపోటీగా వేలం పాట సాగింది. ఒకరు రూ.13.6 లక్షలకు పాడగా.. అంత ఇచ్చుకోలేమంటూ మిగతా ఇద్దరు నామినేషన్లు వేసేందుకు మండల కార్యాలయానికి వెళ్లారు. ఇదే మండలంలోని మాందాపూర్‌లో సర్పంచ్ పదవి రూ.10.75 లక్షలకు ఏకగ్రీవం అయినట్లు తెలిసింది. కాగా రాష్ట్రవ్యాప్తంగా అభ్యర్థులు తొలిరోజు గురువారం ఉత్సాహంగా నామినేషన్లు వేశారు. ఖమ్మం జిల్లాలో 7 మండలాల్లోని 192 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ పదవులకు 99, వార్డు మెంబర్ల కోసం 49నామినేషన్లు దాఖలయ్యాయి. కొత్తగూడెం జిల్లా సర్పంచ్ పదవులకు 82, వార్డుల మెంబర్ల కోసం 87 నామినేషన్లు దాఖలయ్యాయి.

ఇంటింటికీ ఉచిత మినరల్ వాటర్

ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం మూటాపురంలో రావెళ్ల కృష్ణారావు అనే అభ్యర్థి గ్రామ ప్రజలను హామీల వెల్లువలో ముంచెత్తారు. తనను సర్పంచ్‌గా గెలిపించినా, ఏకగ్రీవం చేసినా ఊరి కోసం ఫలానా ఫలానా పనులు చేస్తానంటూ ఏకంగా కోటి రూపాయలతో మేనిఫెస్టో విడుదల చేశారు. సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న ఆ మేనిఫెస్టోలోని వివరాల ప్రకారం.. గ్రామంలోని వీరన్న స్వామి ఆలయం కోసం ఎకరం భూమి విరాళంగా ఇస్తానని కృష్ణారావు ప్రకటించారు. తాను పదవిలో కొనసాగిన ఐదేళ్లపాటు ఊర్లోని అందరి ఇంటి బిల్లులు, నల్లా బిల్లులు తానే కడతానని పేర్కొన్నారు. సొంత ఖర్చుతో ఊర్లో గ్రంథాలయం భవనాన్ని కట్టిస్తానని.. ప్రతినెలా ఉచిత వైద్య శిబిరాలు పెట్టించి.. ఉచితంగా మందులను పంపిణీ చేయిస్తానని చెప్పారు. మినరల్ వాటర్ ప్లాంటును ఏర్పాటు చేసి ప్రతి ఇంటికీ ఉచితంగా మినరల్ వాటర్‌ను పంపిణీ చేయిస్తానని హామీ ఇచ్చారు. పెళ్లిళ్లు, జాతరలకు డీజేలు ఏర్పాటు చేయిస్తానని.. పేద కుటుంబాల్లోని ఆడ పిల్లల పెళ్లిళ్లకు చీర, సారె కానుకగా అందజేస్తానని, వికలాంగులకు ఉచితంగా ట్రైసైకిళ్లు ఇస్తానని, ఊర్లోని దేవాలయాలకు, చర్చి, మసీదుకు యేటా రూ.50వేల చొప్పున ఇస్తానని, వినాయక చవితికి అన్ని ఉత్సవ కమిటీలకు విగ్రహాలను ఉచితంగా ఇస్తానని మాటిచ్చారు. ఆగస్టు 15, జనవరి 26న స్కూళ్లలో నిర్వహించే జెండా వందనం కార్యక్రమాల్లో పిల్లలకు బహుమతులు ఇస్తానని, ప్రతి తరగతిలో బాగా చదివే ఇద్దరిని ఎంపిక చేసి ఏటా రూ.2వేల చొప్పున స్కాలర్‌షిప్ అందజేస్తానని చెప్పారు. బయటి పాఠశాలల్లో చదివే గ్రామానికి చెందిన విద్యార్థుల్లో ఏటా పది మంది చొప్పున ఎంపిక చేసి సైకిళ్లను ఇస్తానని, సంక్రాంతి పండుగకు ముగ్గుల పోటీలు నిర్వహించి.. బహుమతుల కింద రూ.5వేలిస్తానని అయ్యప్ప మాలధారులకు నిత్యాన్నదానం చేస్తాననిప్రతి దసరాకు 100మంది పేదలకు దుస్తులు, 10మంది మహిళలకు కుట్టు మిషన్లు అందజేస్తానని ప్రకటించారు. చావులకు డెడ్‌బాడీ ఫ్రీజర్‌ను ఉచితంగా అందజేయడంతో పాటు వైకుంఠరథం ఏర్పాటు చేస్తానని చెప్పారు.

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

పంచాయతీ ఖాతాల్లో కాసుల వర్షం!

ఊరూరా వసూలవుతున్న బకాయిలు

లింగాలఘణపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గడిచిన రెండేళ్లుగా నిధులు లేక నిస్తేజంగా ఉన్న గ్రామ పంచాయతీ ఖాతాల్లో స్థానిక సంస్థల ఎన్నికల కారణంగా కాసుల వర్షం కురుస్తోంది. జనగామ జిల్లాలోని పంచాయతీల్లో ఇన్నాళ్లుగా పేరుకుపోయిన మొండి బకాయిలు.. నామినేషన్ల ఘట్టం మొదలవగానే గంపగుత్తగా వసూలవుతున్నాయి. ఎన్నికల నియమావళి ప్రకారం, నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థితో పాటుగా అతడిని ప్రతిపాదించే వ్యక్తులు కూడా గ్రామపంచాయతీకి ఎలాంటి బకాయిలు ఉండకూడదనే నిబంధన అమలులో ఉంది. దీంతో, సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేయాలనుకునే అభ్యర్థులు తమ ఇంటిపన్నులు, నల్లా పన్నులతో పాటు ఇతర బకాయిలు ఏమైనా ఉంటే వాటిని చెల్లించేందుకు పంచాయతీ కార్యాలయాల వద్ద క్యూ కట్టారు. గతంలో ఎన్నిసార్లు నోటీసులు ఇచ్చినా స్పందించని అభ్యర్థులు, ఎన్నికల్లో పోటీ చేసే అర్హత కోల్పోకుండా ఉండేందుకు హడావుడిగా వచ్చి పన్నులు చెల్లిస్తున్నారు.

మళ్లీ సర్పంచ్ పదవా.. వద్దే వద్దు!

- మరోసారి పోటీచేస్తే నా బతుకు ఆగమవడం ఖాయం
- సొంత డబ్బులతో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, సీసీ రోడ్లు నిర్మించాను
- ఐదేళ్లలో పైసా రాలేదు.. అట్రాసిటీ సహా 14 కేసులు పెట్టారు
- రూ.50లక్షల అప్పులు మిగిలాయి.. ఓ తాజా మాజీ సర్పంచ్ ఆవేదన



మాజీ సర్పంచ్ కాట్న రాజు

కొత్తూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఒక సారి గెలిచి.. ఐదేళ్లు సర్పంచ్‌గా పనిచేసిన వారిలో ఎంతమంది మళ్లీ పోటీ చేయాలని అనుకుంటున్నారు? తాజా మాజీల్లో ఎవరైనా పోటీకి ఆసక్తి చూపుతున్నారా? ఏమో గానీ ఓ తాజా మాజీ చెబుతున్న సంగతులు మాత్రం సర్పంచ్‌లుగా పనిచేసిన వారికి ఎదురైన రకరకాల ఇబ్బందులను తేటతెల్లం చేసేలా ఉన్నాయి. "సర్పంచ్ పదవి అంటే గౌరవమర్యాదలు దక్కుతాయని అనుకున్నాను. గ్రామాభివృద్ధి కోసం ఎంతో చేశాను. చివరికి నాకు 14పోలీసు కేసులు, రూ.50లక్షల అప్పు బహుమానంగా మిగిలాయి" అని రంగారెడ్డి జిల్లా కొత్తూర్ మండల పరిధిలోని మక్తగూడకు చెందిన తాజా మాజీ సర్పంచ్ కాట్న రాజు ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్ పదవులు అలంకార ప్రాయంగా మారాయని.. మరోసారి సర్పంచ్ పదవా? వద్దు బాబోయ్ వద్దు.. మళ్లీ పోటీచేస్తే నా బతుకు ఆగమవడం పక్కా అని వణికిపోతున్నారాయన. రంగారెడ్డి జిల్లా కొత్తూర్ మండల పరిధిలోని మక్తగూడ గ్రామపంచాయతీ 2019లో కొత్తగా ఏర్పడింది. అప్పటి ఎన్నికల్లో గ్రామానికి చెందిన కాట్న రాజు సర్పంచ్‌గా గెలుపొందారు. గ్రామపంచాయతీ భవనం, డంపింగ్ యార్డు, స్మశానవాటిక, పల్లె ప్రకృతి వనాన్ని ఆయన నిర్మించారు. అయితే, ప్రభుత్వ స్థలాల కబ్జాను ప్రశ్నించిన తనపై అట్రాసిటీ కేసు సహా 14 కేసులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి నిధులొస్తాయనే నమ్మకంతో సొంతంగా రూ.50లక్షలు వెచ్చించి భూగర్భ మురుగునీటి కాలువల నిర్మాణాలు, సీసీ రోడ్లు పూర్తి చేశానని.. ఖర్చు చేసిన డబ్బులో పైసా కూడా రాలేదని రాజు చెప్పారు. బిల్లుల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఎన్నికలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు.

పరిశీలించి ఉత్తర్వులిస్తాం

- రిజర్వేషన్లు తగ్గించారంటూ దాఖలైన పిటిషన్లపై హైకోర్టు ధర్మాసనం
- వరంగల్ జిల్లా మహమూద్‌పట్నం పంచాయతీ ఎన్నికపై స్టే



హైదరాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు తగ్గించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లలో ఎంతవరకు జోక్యం చేసుకోగలమో పరిశీలించి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేస్తామని హైకోర్టు పేర్కొంది. గ్రామ పంచాయతీల్లో రిజర్వేషన్లకు సంబంధించి ఈ నెల 23న జారీ చేసిన గెజిట్‌ను రద్దు చేయాలని కోరుతూ లంచ్‌మోషన్ రూపంలో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లపై జస్టిస్ మాధవీదేవి గురువారం మధ్యాహ్నం విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరఫున న్యాయవాది సామల రవీందర్, ఇతరులు వాదనలు వినిపిస్తూ.. 'బీసీలకు 23శాతం కూడా పంచాయతీ స్థానాలు కేటాయించలేదు. కొన్ని జిల్లాల్లో 13 శాతమే రిజర్వు చేశారు. ఓసీ, ఎస్సీ, ఎస్టీల కంటే బీసీల సంఖ్య ఎక్కువ ఉన్నా స్థానాలు తక్కువే కేటాయించారు. ఓ గ్రామంలో 2014లో ఎస్టీ మహిళ, 2019లో జనరల్ మహిళ, ఇప్పుడు ఎస్టీలకు రిజర్వు చేశారు. వాస్తవానికి ఆ ఊరిలో బీసీల సంఖ్య ఎక్కువ. ప్రభుత్వ జీవో, షెడ్యూల్ నిబంధనలకు విరుద్ధం' అని పేర్కొన్నారు. ప్రభుత్వం తరఫున స్పెషల్ జీపీ రాహుల్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. 'చట్టప్రకారం 50 శాతానికి మించకుండా రిజర్వేషన్ల మేరకు పంచాయతీ స్థానాలు కేటాయించాం. ముందు ఎస్టీకి, తర్వాత ఎస్సీకి, అనంతరం బీసీలకు రిజర్వేషన్లు కేటాయింపు ఉంటుంది. సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకే రిజర్వేషన్లు ఇచ్చాం' అని నివేదించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ తరఫున సీనియర్ న్యాయవాది విద్యాసాగర్ వాదనలు వినిపిస్తూ.. 'ఎస్సీ ఎస్టీలకు జనాభా ప్రాతిపదికన కేటాయించిన తర్వాతే 50శాతంలో మిగిలిన స్థానాలు బీసీలకు కేటాయించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. బీసీలకు 23శాతం ఇవ్వాలని చట్టంలో లేదు' అని పేర్కొన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. తొలుత ఈ పిటిషన్లు సీజే ధర్మాసనం ముందు ఉంచితే బాగుంటుందేమోనని అభిప్రాయపడ్డారు. జీవో మేరకే ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేస్తుందని, ఈసీని నిందించకూడదని సూచించారు. కోర్టులో రిజర్వేషన్ల పిటిషన్ విచారణ ఇప్పటికే పెండింగ్‌లో ఉన్నందున సింగిల్ జడ్జిగా ఈ అంశంలో ఎంతవరకు జోక్యం చేసుకోవచ్చో పరిశీలన జరిపి.. శుక్రవారం ఉత్తర్వులు జారీ చేస్తామని పేర్కొన్నారు. మరోవైపు వరంగల్ జిల్లా కేసముద్రం మండలం మహమూద్‌పట్నం పంచాయతీ ఎన్నికపై హైకోర్టు స్టే విధించింది. కేవలం ఆరుగురు మాత్రమే ఎస్టీలు ఉన్న ఆ పంచాయతీని ఎస్టీలకు రిజర్వు చేయడంపై పిటిషన్ దాఖలైంది. దీనిపై శుక్రవారం వివరణ ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు.

వేలం, బెదిరింపులతో 'ఏకగ్రీవం' చెల్లదు!

అభ్యంతరాలు, ఫిర్యాదులు వాస్తవమైతే రద్దే.. పర్యవేక్షక కమిటీలు పరిశీలించాకే ఏకగ్రీవానికి ఆమోదం

- అభ్యర్థుల నుంచి అఫిడవిట్ తీసుకోవాలి
- ఏకగ్రీవాలపై ఎస్ఈసీ మార్గదర్శకాలు
- పంచాయతీ నామినేషన్లు షురూ
- సర్పంచులకు 3242, వార్డులకు 1821 నామినేషన్లు

హైదరాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పలు గ్రామాల్లో సర్పంచులు, వార్డు సభ్యుల ఏకగ్రీవాల ప్రక్రియ కొనసాగుతోంది. పంచాయతీ ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో ఈ ఏకగ్రీవాలపై రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) దృష్టి సారించింది. ఏకగ్రీవ ఎన్నికల విషయంలో మోసాలు, వేలంపాటలు, బలవంతపు ఉపసంహరణలు జరుగుతున్నాయనే ఫిర్యాదులు రావడంతో ఏకగ్రీవాలకు సంబంధించిన విధివిధానాలపై ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేసింది. జిల్లా కలెక్టర్లు, పంచాయతీ అధికారులు, ఎంపీడీవోలకు సూచనలు చేస్తూ ఎస్ఈసీ కార్యదర్శి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వేలంపాట, బెదిరింపులకు పాల్పడితే అలాంటి ఏకగ్రీవ ఎన్నిక చెల్లదని తెలిపారు. తెలంగాణ పంచాయతీరాజ్ (ఎన్నికల నిర్వహణ) చట్టం-2018లోని 15వ నిబంధన ప్రకారం.. ఒక స్థానంలో పోటీలో ఒక్కరే ఉన్నప్పుడు ఎన్నికల ఫలితాన్ని వెంటనే ప్రకటించాలి. అయితే, గ్రామ ప్రజలను ప్రలోభాలకు గురి చేసి.. ఒక్కరే పోటీలో ఉండడం, అవతలి వ్యక్తిని భయపెట్టడం లేదా మోసానికి పాల్పడడం వంటివి జరగకుంటేనే ఏకగ్రీవంగా ప్రకటించాలని సూచించారు. ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించడానికి ముందు, రిటర్నింగ్ అధికారి నిబంధనలు పాటించారా? లేదా? అన్నదానిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని తెలిపారు. ఏకగ్రీవాల ప్రకటన కోసం జిల్లాల్లో ప్రత్యేక పర్యవేక్షక విభాగాలను నియమించాలన్నారు. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం 2018లోని సెక్షన్ 211 ప్రకారం గ్రామపంచాయతీ ఎన్నికల్లో జరిగే వేలం పాట, ప్రలోభాలు, బెదిరింపులు, ఇతర దుశ్చర్యలకు సంబంధించిన ఫిర్యాదులను ప్రత్యేక పర్యవేక్షక విభాగాల ద్వారా స్వీకరించాలని తెలిపారు. ఫిర్యాదులు లిఖితపూర్వకంగా, వాట్సాప్ ద్వారా, మౌఖికంగా లేదంటే వార్తాపత్రికల క్లిప్పింగ్‌ల రూపంలో కూడా ఉండొచ్చని పేర్కొన్నారు.

అభ్యర్థుల నుంచి డిక్లరేషన్

సర్పంచ్, వార్డు స్థానానికి ఏకగ్రీవమైతే అభ్యర్థుల నుంచి డిక్లరేషన్ తీసుకోవాలి. ఎలాంటి బెదిరింపులు, ఒత్తిళ్లు, ప్రలోభాలకు గురికాకుండా స్వచ్ఛందంగా నామినేషన్ ఉపసంహరించుకుంటున్నట్లు అభ్యర్థులతో ధ్రువీకరణ పత్రం తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అదేసమయంలో పోటీలో ఉన్న ఒకే ఒక్క అభ్యర్థి నుంచి కూడా తాను ప్రత్యర్థుల ఉపసంహరణ కోసం డబ్బు ఎర చూపలేదని, వేలంపాటలో పాల్గొనడం, బెదిరింపులకు పాల్పడడం వంటివి చేయలేదని ధ్రువీకరించే పత్రాన్ని తీసుకోవాలని తెలిపారు. అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు నిర్ధారణకు వస్తే.. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిన వెంటనే రిటర్నింగ్ అధికారులు నిర్దేశిత నమూనాలో ఎన్నిక పత్రాన్ని అందజేయాలి. ప్రత్యేక పర్యవేక్షక విభాగం నుంచి వచ్చిన నివేదికలను జిల్లా కలెక్టర్ పూర్తిగా పరిశీలించిన తర్వాతే ధ్రువీకరించి, వాటిపై ఫిర్యాదులు, అభ్యంతరాలు లేకుంటేనే ఏకగ్రీవాన్ని ఆమోదించాలి. అదే సమయంలో ఈ ఫలితం సమాచారంతో ఓ నివేదికను రూపొందించి, రాష్ట్ర ఎన్నికల సంఘానికి పంపాలని పేర్కొన్నారు. గ్రామంలో ఇబ్బందికర పరిస్థితులు ఎదురైనట్లు గుర్తిస్తే.. ఏకగ్రీవ ఎన్నిక ఫలితాన్ని రద్దు చేయాలని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు.

పంచాయతీ నామినేషన్లు షురూ

పంచాయతీ ఎన్నికలకు గురువారం నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. తొలివిడత ఎన్నికలు జరిగే 189 మండలాల్లో 4,236 సర్పంచ్, 37,440 వార్డు సభ్యుల స్థానాలకు ఈ నెల 29 వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. తొలిరోజు సర్పంచ్ స్థానాలకు 3242 మంది, వార్డు సభ్యులకు 1821 మంది నామినేషన్లు దాఖలు చేశారు. ఈ నెల 30న నామినేషన్లను పరిశీలించి, అదేరోజు సాయంత్రం చెల్లుబాటయ్యే నామినేషన్ల జాబితాను వెల్లడిస్తారు. వాటిపై ఏవైనా అభ్యంతరాలుంటే డిసెంబరు 1న అప్పీలు చేసుకుంటే 2న పునఃపరిశీలన చేస్తారు. 3న మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంది. ఆ తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు.

బ్యాంకు ఖాతాల్లేక వెనక్కి..?


తొలివిడత ఎన్నికల్లో భాగంగా సర్పంచ్, వార్డుసభ్యుల స్థానాలకు నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్ దాఖలు చేయదలచిన అభ్యర్థులు ఎన్నికల వ్యయాన్ని నిర్ధారించే విధంగా తాజగా బ్యాంకు ఖాతాను తెరవాలన్నది ఎస్ఈసీ నిబంధన. అయితే నూతన బ్యాంక్ ఖాతా ఉండాలని అధికారులు సూచించడంతో చాలామంది నామినేషన్లు దాఖలు చేయకుండానే వెనక్కి వెళ్లారు. ఇప్పటికే బ్యాంకుల్లో ఖాతా ఉన్నవారు కొత్తగా ఖాతా తెరిచేందుకు మరో బ్యాంకును సంప్రదిస్తున్నట్లు సమాచారం.

బీసీలు పోరాడాల్సింది బీజేపీతోనే..

- బీసీ బిల్లును పార్లమెంటులో అడ్డుకుంటోంది ఆ పార్టీనే: పొన్నం

హైదరాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని బీసీ సంఘాల నేతలు పోరాటం చేయాల్సింది కాంగ్రెస్ ప్రభుత్వంపై కాదని.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లులను పార్లమెంటులో అడ్డుకుంటున్న బీజేపీ నేతలతోనని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈడబ్ల్యూఎస్.. పది శాతం రిజర్వేషన్లను పార్లమెంటులో ఆమోదించుకున్న బీజేపీ.. బీసీ బిల్లును మాత్రం ఎందుకు అడ్డుకుంటోందని ప్రశ్నించారు. దీనికి ఆ పార్టీ నేతలే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బీజేపీ గెలిస్తే బీసీ నేతనే సీఎంగా చేస్తామని ప్రకటించిన ఆ పార్టీకి రాష్ట్ర అధ్యక్షుడిగా, శాసనసభా పక్ష నేతగా అగ్రకులాల వారే ఉన్నారని విమర్శించారు. గురువారం గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో మంత్రి కొండా సురేఖతో కలిసి ఆయన మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించే అంశానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందన్నారు. రెండేళ్లుగా సర్పంచ్ ఎన్నికలు జరగకపోవడంతో కేంద్రం నుంచి నిధులు రావట్లేదని, అందుకే ఎన్నికలకు వెళ్లాల్సి వస్తుందని వివరించారు. సర్పంచ్ ఎన్నికల్లో బీసీలకు తక్కువ సీట్లు ఇచ్చారంటూ కొందరు కావాలని తప్పుడు లెక్కలను ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న బీసీ బిల్లులను కేంద్రమంత్రి బండి సంజయ్ ఆమోదించుకుని వస్తే.. హిందువులకు వంద శాతం న్యాయం జరుగుతుందని సూచించారు. కాగా, రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం శక్తికి మించి పనిచేసిందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్‌గౌడ్ అన్నారు. కేంద్రంలోని బీజేపీ ఈ ప్రయత్నాలకు అడ్డుకట్ట వేసిందని ఆరోపించారు.

పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి: డీజీపీ



హైదరాబాద్, నవంబర్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జరుగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేలా చూడాలని పోలీస్ యంత్రాంగాన్ని డీజీపీ శివధర్ రెడ్డి ఆదేశించారు. ఎన్నికల నిర్వహణపై గురువారం రాష్ట్ర వ్యాప్తంగా పోలీసు అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్ కమిషనరేట్ మినహా ఇతర జిల్లాల కమిషనర్లు, ఎస్పీలు, స్టేషన్ హౌజ్ ఆఫీసర్లు ఈ సమీక్షలో పాల్గొన్నారు. ఎన్నికల సమయంలో శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సమావేశంలో శాంతి భద్రతల విభాగం అదనపు డీజీపీ మహేష్ భగవత్, మల్టీజోన్ 2 ఏడీజీ డీఎస్ చౌహాన్, ఐజీ చంద్రశేఖర్ రెడ్డి, ఏఐజీ రమణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



గాంధీభవన్‌లో వినతులు స్వీకరిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ఇండస్ట్రియల్ ల్యాండ్ పాలసీ కొత్తదేం కాదు

- బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే దీనిపై చర్చ జరిగింది
- విద్యుత్ కేంద్రాల నిర్మాణంలో అవినీతి లేదు: మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఇండస్ట్రియల్ ల్యాండ్ పాలసీ తమ ప్రభుత్వం కొత్తగా తెచ్చింది కాదని, దీనిపై గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే చర్చ జరిగిందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. దీనిని కాంగ్రెస్ ప్రభుత్వం పనిగట్టుకొని తెచ్చినట్టుగా ప్రతిపక్షాలు గొడవ చేస్తున్నాయని విమర్శించారు. మంత్రితో ముఖాముఖి కార్యక్రమంలో భాగంగా గురువారం గాంధీభవన్‌లో ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తల నుంచి ఆయన వినతిపత్రాలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ.. హైదరాబాద్‌ను కాలుష్య రహితంగా, ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకే పరిశ్రమలను నగరం బయటకు పంపుతున్నట్లు చెప్పారు. ఇండస్ట్రియల్ పాలసీ అత్యంత పారదర్శకంగా ఉందని, ఎలాంటి కుంభకోణానికి అస్కారం లేదని మంత్రి ఉత్తమ్ స్పష్టంచేశారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నేతలకు ఈ పాలసీ అర్థం కాలేదని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తే ఈ విధానాన్ని రద్దు చేస్తామని ఆ పార్టీ నేతలు మాట్లాడుతున్నారని, ఆ పార్టీ మళ్లీ అధికారంలోకి వచ్చేదీ లేదు.. పాలసీని మార్చేదీ లేదని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నట్లుగా.. విద్యుత్ కేంద్రాల నిర్మాణంలో ఎలాంటి అవినీతి జరగలేదని స్పష్టంచేశారు. బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన భద్రాద్రి కొత్తగూడెం పవర్ ప్రాజెక్టే పెద్ద కుంభకోణమని ఆరోపించారు. ఇండియా బుల్ అనే కంపెనీ నుంచి ఉపయోగంలో లేని పరికరాలు కొనుగోలు చేసి సబ్ క్రిటికల్ సాంకేతిక పరిజ్ఞానంతో ఈ కేంద్రాన్ని నిర్మించారని, ఇప్పుడు అది ఎందుకూ ఉపయోగించలేని పరిస్థితి ఉందని చెప్పారు.

రోడ్ల అభివృద్ధికి సహకరించండి

- కేంద్ర మంత్రి గడ్కరీకి మంత్రి తుమ్మల లేఖ

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో రహదారుల అభివృద్ధికి సహకరించాలని కేంద్ర రహదారులు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి గురువారం రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖ రాశారు. అనంతరం కేంద్ర మంత్రితో ఫోన్లో మాట్లాడిన తుమ్మల పలు రహదారుల పరిస్థితిని వివరించారు. అవసరమైన అనుమతులు, నిధులు వెంటనే మంజూరు చేసి తక్షణమే పనులు ప్రారంభించాలని కోరారు. తుమ్మల వినతికి కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. తక్షణమే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

డిసెంబరు 19 నుంచి 'హైదరాబాద్ బుక్ ఫెయిర్'

- లోగో ఆవిష్కరించిన మంత్రి జూపల్లి



హైదరాబాద్, నవంబర్ 27 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో 38వ పుస్తక ప్రదర్శనను డిసెంబర్ 19 నుంచి 29వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బుక్ ఫెయిర్‌కు సంబంధించిన లోగోను పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు గురువారం రవీంద్రభారతిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సామాజిక రుగ్మతలను రూపుమాపి ప్రజల్లో పరివర్తన తీసుకువచ్చేందుకు సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో 'ప్రభాతభేరి' కార్యక్రమాన్ని చేపట్టినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంపై అందరిలో అవగాహన కల్పించేలా బుక్ ఫెయిర్‌లో ప్రత్యేక స్టాల్, హోర్డింగ్ ఏర్పాటుచేయాలని నిర్వాహకులకు మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో బుక్ ఫెయిర్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ కవి యాకూబ్, కార్యదర్శి వాసు, ఉపాధ్యక్షులు మలుపు బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు

సాగర్‌పై సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించండి

- ఏపీ సర్కారుకు కృష్ణా బోర్డు లేఖ

హైదరాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయానికి కుడి వైపున ఏపీ భూభాగం పరిధిలో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసే విషయమై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తన వైఖరిని పునరాలోచించాలని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) కోరింది. పునరాలోచించిన తర్వాత తుది నిర్ణయాన్ని వెల్లడించాలని సూచించింది. ఏపీ వైపు సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయడానికి తమ ఇంజనీర్లు, సిబ్బందిని అనుమతించాలని కృష్ణా బోర్డుకు తెలంగాణ విజ్ఞప్తి చేసింది. దీంతో డిసెంబరు 31 వరకూ ఏపీ వైపు ఉన్న డ్యామ్‌పైకి తెలంగాణ అధికారులకు అనుమతినిచ్చిన కృష్ణా బోర్డు.. ఈ మేరకు రిజర్వాయర్‌పై బందోబస్తు బాధ్యతలు నిర్వహిస్తున్న సీఆర్‌పీఎఫ్ కమాండింగ్ అధికారికి లేఖ రాసింది. కానీ, ఏపీ సర్కారు సహాయ నిరాకరణతో పనులు ప్రారంభించ లేదు. సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయడానికి గత జనవరి 21న జరిగిన బోర్డు సమావేశంలో ఏపీ అంగీకరించిన సంగతిని ప్రస్తావిస్తూ ఏపీ జల వనరులశాఖ ఈఎన్‌సీకి ఈ నెల 26న లేఖ రాసిన కృష్ణా బోర్డు.. సీసీటీవీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలని కోరింది.

'టీటీడీ'లో తొలి అరెస్టు

- కల్తీ నెయ్యి కేసులో అప్పటి ప్రొక్యూర్‌మెంట్ జీఎం సుబ్రమణ్యం అదుపులోకి..

తిరుపతి/తిరుపతి(నేరవిభాగం), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కల్తీ నెయ్యి కేసులో టీటీడీలో తొలి అరెస్టు చోటుచేసుకుంది. టీటీడీ ప్రొక్యూర్‌మెంట్ విభాగం జనరల్ మేనేజర్‌గా పనిచేసిన ఆర్ఎస్ఎస్వీ సుబ్రమణ్యాన్ని (58) సిట్ అధికారులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. ఏసీబీ కోర్టు డిసెంబరు 10వ తేదీ వరకూ ఆయనకు రిమాండు విధించింది. ఈ కేసులో సిట్ అధికారులు సుబ్రమణ్యంను ఏ29గా రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. ఆయన ప్రస్తుతం టీటీడీలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా ఉన్నారు. తిరుపతి ఎన్‌జీవో కాలనీలోని ఆయన నివాసం నుంచి గురువారం మధ్యాహ్నం సిట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. సాయంత్రానికి నెల్లూరు ఏసీబీ కోర్టుకు తరలించారు. కోర్టు 14 రోజుల పాటు రిమాండ్ విధించడంతో నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు.

చిలుకూరు ఎస్సైపై అట్రాసిటీ కేసు పెట్టాలి

- కర్ల రాజేశ్ మృతికి ఎస్సై కారణమంటూ ఇంటెలిజెన్స్ చీఫ్‌కు మందకృష్ణ మాదిగ ఫిర్యాదు

హైదరాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పోలీసుల కస్టడీలో విచారణ అనంతరం మరణించిన దళితుడు కర్ల రాజేష్ కేసు విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని ఇంటెలిజెన్స్ చీఫ్ విజయకుమార్‌కు ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఫిర్యాదు చేశారు. పోలీసుల చిత్రహింసలే ఆయన మృతికి కారణమని ఆరోపించారు. రాజేష్ మృతికి చిలుకూరు ఎస్సై సురేష్ రెడ్డి కారణమని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. రాజేష్‌ను ఈనెల 4 నుంచి 10వ తేదీ వరకు చిలుకూరు, కోదాడ రూరల్ పోలీసులు నిర్బంధించి చిత్రహింసలు పెట్టారని ఆయన ఆరోపించారు. సీఎంఆర్ఎఫ్ డబ్బుల విషయంలో రాజేష్‌తో పాటు మిగిలిన వారిపై ఫిర్యాదుదారుడు ఈ నెల 8న కేసు పెట్టాడని, అంతకు నాలుగు రోజుల ముందు నుంచి రాజేష్‌ను చిలుకూరు ఎస్సై ఎందుకు కస్టడీలోకి తీసుకున్నారని ప్రశ్నించారు. రాజేష్ పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో 8న కేసు నమోదు చేశారని, ఐదు రోజులు అతడిని చిత్రహింసలకు గురి చేశారని, కుటుంబసభ్యులకు సైతం చూపలేదని ఆయన పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే, డీఎస్పీ రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు కావడం తోనే సురేష్ రెడ్డిని కాపాడేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఎస్సైపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుతో పాటు హత్య కేసు నమోదు చేసి విచారణ చేపట్టాలని ఆయన ఇంటెలిజెన్స్ చీఫ్‌ను కోరారు.

అణువిద్యుత్‌లో ప్రైవేటు భాగస్వామ్యం



(మొదటిపేజీ తరువాయి)

ఆవిష్కరించారు. అంతరిక్ష రంగంలో దేశంలోని ప్రైవేటు సంస్థలు చేస్తున్న కృషిని ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'అణు విద్యుత్ రంగంలో త్వరలోనే ప్రైవేటు కంపెనీలకు అవకాశం కల్పిస్తాం. అణువిద్యుత్ రంగంలో నవకల్పనలకు, అత్యాధునికమైన చిన్న రియాక్టర్ల తయారీకి ఈ నిర్ణయం శక్తినిస్తుంది. భిన్న మార్గాల ద్వారా శక్తి వనరులను సమకూర్చుకొని ఇంధన భద్రతను బలోపేతం చేయాలని, అణు ఇంధన రంగంలో పరిశోధనలను వేగవంతం చేయటం ద్వారా భారత్ స్మాల్ రియాక్టర్లను రూపొందించాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని సాధించేందుకు ఈ నిర్ణయం దోహదం చేస్తుంది' అని వివరించారు.

ప్రపంచాన్ని ఆకర్షిస్తున్న భారత ప్రైవేటు అంతరిక్ష రంగం

అంతరిక్ష పరిశోధనల్లో విశేష కృషి చేస్తున్న భారతీయ ప్రైవేటు సంస్థలు.. ఈ రంగంలో ప్రపంచవ్యాప్త పెట్టుబడులకు గమ్యస్థానంగా నిలుస్తున్నాయని ప్రధాని మోదీ ప్రశంసించారు. 'అంతరిక్ష పరిశోధనల్లో ప్రైవేటు రంగానికి మేము అవకాశం కల్పించినందువల్లే స్కైరూట్ వంటి సంస్థలు పుట్టుకొచ్చి వినూత్న ఆవిష్కరణలు చేస్తున్నాయి. యువతరం గొప్ప శక్తికి, నవకల్పనలకు, నూతన ఆలోచనలకు ఇన్ఫినిటీ క్యాంపస్ ప్రతిబింబంగా నిలుస్తోంది. యువత నూతన ఆవిష్కరణలు, నష్టభయాలను స్వీకరించే శక్తి, వ్యవస్థాపకత కొత్త శిఖరాలకు చేరాయి. ప్రపంచ వ్యాప్తంగా భారత ప్రైవేటు అంతరిక్ష రంగం తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకొని, నేడు ప్రపంచ పెట్టుబడులకు గమ్యస్థానంగా నిలిచింది. దాదాపు 300 ప్రైవేటు కంపెనీలు ఈ రంగం భవిష్యత్తును నిర్మించే పనిలో ఉన్నాయి' అని కొనియాడారు.

వచ్చే పార్లమెంటు సమావేశాల్లోనే బిల్లు..

భారత్‌లో అణు విద్యుత్, ఇతర న్యూక్లియర్ పరిశోధనలు పూర్తిగా ప్రభుత్వరంగంలోనే కొనసాగుతున్నాయి. 'అటామిక్ ఎనర్జీ యాక్ట్ -1962' ద్వారా ఈ రంగంలో ప్రైవేటు సంస్థల భాగస్వామ్యాన్ని పూర్తిగా నిషేధించారు. ఈ చట్టం స్థానంలో మోదీ సర్కారు కొత్త చట్టం తీసుకొచ్చి ప్రైవేటు రంగానికి అవకాశం కల్పించాలని నిర్ణయించింది. అందుకోసం డిసెంబర్ 1 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో 'ది అటామిక్ ఎనర్జీ బిల్-2025'ను ప్రవేశపెట్టబోతోంది. అణు విద్యుత్ విభాగంలో ప్రైవేటు రంగానికి అవకాశం కల్పించేలా 2025-26 వార్షిక బడ్జెట్‌లోనే నిర్ణయం తీసుకున్నట్లు గత ఆగస్టులో అణు ఇంధన విభాగం వెల్లడించింది. 'సివిల్ లయబిలిటీ ఫర్ న్యూక్లియర్ డ్యామేజ్ యాక్ట్-2010' (సీఎల్ఎన్‌డీ)కి కూడా సవరణలు చేయనున్నారు. ప్రస్తుతం మనదేశంలో ప్రస్తుతం అణువిద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 8,880 మెగావాట్లు ఉంది. దీనిని 2031-32 నాటికి 22,480 మెగావాట్లకు పెంచాలని నిర్ణయించారు. 2070 నాటికి పూర్తిగా కాలుష్యరహిత మార్గాల ద్వారానే (నెట్ జీరో) విద్యుత్ ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.



కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో 'తెలంగాణ రైజింగ్' సదస్సుపై సమీక్షిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సీతక్క, అజారుద్దీన్, సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి

చైనా, జపాన్ స్థాయి అభివృద్ధే లక్ష్యం

'తెలంగాణ రైజింగ్' విధాన పత్రం లక్ష్యమదే..

- రాష్ట్రాభివృద్ధిని ప్రతిబింబించేలా రూపొందించాలి
- విధానపరమైన స్తంభన ఉండదనే స్పష్టత ఇవ్వాలి
- 2034 నాటికి ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ
- రాష్ట్రాన్ని మూడు రీజియన్లుగా విభజించి అభివృద్ధి
- 'తెలంగాణ రైజింగ్' సదస్సుపై సమీక్షలో సీఎం రేవంత్

హైదరాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిని ప్రతిబింబించేలా 'తెలంగాణ రైజింగ్-2047' దార్శనిక విధాన పత్రం (విజన్ డాక్యుమెంట్) ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు వీలుగా స్పష్టమైన రోడ్ మ్యాప్ విధాన పత్రంలో కనిపించాలని ఆదేశించారు. చైనా, జపాన్‌ల స్థాయి అభివృద్ధే లక్ష్యమని స్పష్టంచేశారు. గురువారం సీఎం పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో 'తెలంగాణ రైజింగ్ విధాన పత్రంపై సమీక్షించారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అజారుద్దీన్, సీతక్క, ఆయా శాఖల ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, యువతకు మెరుగైన ఉపాధి లక్ష్యంగా 'విజన్-2047'కు సిద్ధమవుతున్నామని చెప్పారు. రాష్ట్రాన్ని కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (సీయూఆర్ఈ), పెరీ అర్బన్ రీజియన్ ఎకానమీ (పీయూఆర్ఈ), రూరల్ అగ్రికల్చర్ రీజియన్ ఎకానమీ (ఆర్ఏఆర్ఈ)గా విభజించుకోవాలని సూచించారు. వైద్యారోగ్యం, విద్య, టెక్నాలజీ, జీసీసీలు, ఫార్మా, వ్యవసాయంతోపాటు వివిధ రంగాల్లో ఎక్కడెక్కడ ఎలాంటి అభివృద్ధి చేయాలో నిర్దేశించుకోవాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో విధానపరమైన స్తంభన ఉండదని చాటి చెప్పేలా విధానపత్రం ఉండాలన్నారు.

'తెలంగాణ రైజింగ్- 2047' విజన్‌ను చాటేలా..

తెలంగాణలో ఉన్న అపారమైన పెట్టుబడుల అవకాశాలు, ప్రయోజనాలను ప్రపంచ పెట్టుబడిదారుల ముందు ఉంచే లక్ష్యంతో వచ్చే నెల 8, 9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సదస్సును నిర్వహించనున్న విషయం తెలిసిందే. విభిన్న రంగాల్లో పారిశ్రామిక అభివృద్ధికి గల అవకాశాలను వివరించటంతోపాటు వివిధ రూపాల్లో ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను సదస్సులో ప్రకటించనుంది. ఈ క్రమంలోనే 'తెలంగాణ రైజింగ్ విజన్-2047' దార్శనిక విధాన పత్రాన్ని ప్రభుత్వం రూపొందిస్తోంది. రాష్ట్రంలోని ప్రతి గ్రామం నుంచి గ్లోబల్ సిటీ హైదరాబాద్ దాకా సమాన అవకాశాలు, స్థిరమైన అభివృద్ధిని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

వాహనదారులకు డ్రైవింగ్ 'పరీక్ష'!

- ట్రయల్ ట్రాక్ వద్దకు ఆలస్యంగా వస్తున్న రవాణా శాఖ అధికారులు
- గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి
- ఫొటోల కోసమూ పడిగాపులే..

హైదరాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వాహన డ్రైవింగ్ లైసెన్స్ పొందాలంటే డ్రైవింగ్ పరీక్షకు హాజరుకావాలి. అందుకోసం స్లాట్ బుకింగ్‌లో పేర్కొన్న సమయానికి వాహనదారులు ట్రయల్ ట్రాక్ వద్దకు చేరుకోవాలి. ఆ సమయానికి వెహికిల్ ఇన్‌స్పెక్టర్ అక్కడ ఉంటే సమయానికి పరీక్ష పూర్తవుతుంది. కానీ అధికారులు ట్రాక్‌ల వద్దకు ఆలస్యంగా వస్తుండటం వల్ల వాహనదారులు గంటలపాటు నిరీక్షించాల్సి వస్తోంది. ఇటీవల సికింద్రాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి స్లాట్ బుకింగ్‌లో తనకు కేటాయించిన సమయం ప్రకారం ఉదయం 9 గంటలకు నాగోల్‌లోని వాహన ట్రయల్ ట్రాక్ వద్దకు వెళ్లాడు. కానీ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఉదయం 11 గంటలకు ట్రాక్ వద్దకు వచ్చారు. దీంతో ట్రయల్ ట్రాక్ వద్ద అతను రెండు గంటలు నిరీక్షించాల్సి వచ్చింది. ఇలాంటి సమస్య ఎప్పుడో ఒకసారి, ఎవరో ఒకరు ఎదుర్కొంటున్నది కాదు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని రవాణా శాఖ కార్యాలయాల్లోని ట్రయల్ ట్రాక్‌ల వద్ద పరీక్ష కోసం రోజూ ఎందరో వాహనదారులు ఎదుర్కొంటున్నారు. దీని వల్ల సామాన్యులతోపాటు ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు చేసే వారు ఇబ్బంది పడాల్సివస్తోంది. ఉదయం ఆలస్యంగా వెహికల్ ఇన్‌స్పెక్టర్‌లు ట్రాక్‌ల వద్దకు చేరుకుంటున్నట్టు తెలుస్తోంది. ఇలా ఎందుకని అడిగితే తనిఖీ విధులకు వెళ్లామన్న సమాధానం వస్తోంది. ఎప్పుడో ఒకసారి కాకుండా దాదాపు ప్రతి రోజు ఇలాగే జరుగుతుండటం పట్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. తాము ఆలస్యంగా వస్తే మళ్లీ స్లాట్ బుక్ చేసుకోమంటూ తిప్పి పంపే అధికారులే సమయపాలన పాటించకపోవడమేంటని ప్రశ్నిస్తున్నారు. 'డ్రైవింగ్ లైసెన్సు పరీక్ష కోసం ఉదయం ట్రాక్ వద్దకు వస్తే మధ్యాహ్నం వరకు ఉండాల్సి వచ్చింది. అధికారులు సమయపాలన పాటించనప్పుడు స్లాట్‌లో టైం పేర్కొనడం ఎందుకు?' అని సికింద్రాబాద్‌కు చెందిన ఆనంద్ ప్రశ్నించారు. ఇక రవాణా శాఖ కార్యాలయాల్లో డ్రైవింగ్ లైసెన్సు, ఆర్సీ, వాహనం, లైసెన్సు రెన్యూవల్, వాహన బదిలీ తదితర సేవలకు సంబంధించి ఒక్కో కార్యాలయానికి ప్రతి రోజు వందలాదిగా ప్రజలు వస్తుంటారు. ఆయా సేవలకు, కార్డుల జారీకి ఫొటో దిగడం తప్పనిసరి. గతంలో ప్రతి కౌంటర్‌లో ఫొటో దింపేవారు. కానీ గత కొన్నేళ్లుగా కేవలం ఒక కౌంటర్‌లోనే అన్ని సేవలకు ఫొటోలు తీస్తుండటంతో దరఖాస్తుదారులు ఫొటోల కోసం క్యూలో ఎక్కువసేపు నిరీక్షించాల్సి వస్తోంది. కాగా ఆలస్యం ఎప్పుడు ఉండదని, అనుకోని పరిస్థితుల్లో అలా జరిగే అవకాశం ఉంటుందని రవాణా శాఖ అధికారులు చెబుతున్నారు.

విదేశీ పెట్టుబడులకు గమ్యస్థానంగా తెలంగాణ

- జర్మనీ ప్రతినిధులతో మంత్రి శ్రీధర్ బాబు
- జర్మనీ-తెలంగాణ భాగస్వామ్యంలో పరిశ్రమల ఏర్పాటుకు అన్ని విధాలా సహకరిస్తామని వెల్లడి



హైదరాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విదేశీ పెట్టుబడులకు తెలంగాణ అత్యంత అనుకూల గమ్యస్థానమని, ఐటీ, ఏరోస్పేస్, తయారీ, ఫార్మా రంగాలకు మంచి ఎకో సిస్టమ్‌ను రాష్ట్రంలో అభివృద్ధి చేశామని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. గురువారం సచివాలయంలో తనను కలిసిన జర్మన్ ఫ్రీడరిక్-ఎబర్ట్-స్టిఫ్టుంగ్ ఫౌండేషన్ ప్రతినిధులు డా.సబీర్ ఫాండ్రిక్, మిర్కో గుంథర్, క్రిస్టోఫ్ మోహ్ తదితరులకు రాష్ట్రంలో అమలు చేస్తున్న సులభతర పారిశ్రామిక విధానాలు, పలు సంక్షేమ పథకాలను మంత్రి వివరించారు. అత్యంత ప్రతిభావంతులైన యువత రాష్ట్రంలో ఉన్నందున నైపుణ్యాలకు కొదువలేదని తెలిపారు. జర్మనీ-తెలంగాణ భాగస్వామ్యంలో వాణిజ్యం, పరిశ్రమల ఏర్పాటుకు తాము అన్ని విధాలా సహకరిస్తామని శ్రీధర్ బాబు చెప్పారు. "పరిశ్రమ భాగస్వామ్యంతో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ నెలకొల్పాం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో పరిశోధన, వినూత్న ఆవిష్కరణల కోసం ప్రత్యేక ఇన్నోవేషన్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నాం. రాష్ట్రంలోని పారిశ్రామిక శిక్షణ కేంద్రాలన్నింటినీ అడ్వాన్స్‌డ్ ట్రెయినింగ్ సెంటర్లుగా అభివృద్ధి చేస్తున్నాం. లైఫ్ సైన్సెస్ రంగంలో నూతన ఆవిష్కరణలు, ఇంక్యుబేషన్ కోసం జీనోమ్ వ్యాలీలో ఇటీవలే '1 బయో'ను ఏర్పాటు చేశాం. ఫార్మా ఉత్పత్తుల్లో రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో ఉండగా కొత్తగా ఏరో స్పేస్, రక్షణ ఉత్పత్తుల ఎగుమతులు దాన్ని అధిగమించాయి. రూ.1,300 కోట్లతో ఫ్రెంచ్ కంపెనీ సాఫ్రాన్ విమాన ఇంజన్ల మెయింటెనెన్స్, రిపేర్, ఓవర్ హాలింగ్ కేంద్రాన్ని నెలకొల్పింది. రఫేల్ యుద్ధ విమానాల మరమ్మతులు, ఓవర్ హాలింగ్ ఇక్కడే జరుగుతాయి" అని మంత్రి వివరించారు. తమ పార్టీ అధినేత రాహుల్ గాంధీ సూచనమేరకు ఎంఎస్ఎంఇల కోసం నూతన విధానాన్ని రూపొందించామని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. నాలుగు లక్షల మంది గిగ్ వర్కర్ల భద్రత, సంక్షేమం కోసం పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి కల్పనలో తాము మిగిలిన రాష్ట్రాలతో పోటీ పడటం లేదని, తమ పోటీ దేశాలతోనే అని సీఎం రేవంత్ రెడ్డి పలు సందర్భాల్లో చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ఇతర రాష్ట్రాలతో పోల్చితే ఇక్కడి అద్భుతమైన ఎకో సిస్టం, వాతావరణం వల్ల పెట్టుబడులు వెల్లువలా వస్తున్నాయన్నారు. అమెరికాలోని ప్రతి ప్రముఖ కంపెనీకి ఇక్కడ కార్యాలయాలున్నాయని జర్మన్ ప్రతినిధుల బృందానికి వివరించారు.

బీసీ బిల్లుపై ప్రధానితో చర్చలకు సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)



ఇందులో చర్చించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా రాజకీయాలకతీతంగా ఎంపీల సమావేశాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. పార్లమెంట్‌లో ఎంపీలు అడగాలనుకునే సమాచారాన్ని వీలైనంత త్వరగా అందించేందుకు ఢిల్లీలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశామన్నారు. పార్లమెంట్‌లో ప్రశ్నించాలన్నా, కేంద్ర మంత్రులకు విజ్ఞప్తులు ఇవ్వాలన్నా...నిర్దేశిత ఫార్మాట్‌లో సమాచారాన్ని ఎంపీలకు అందిస్తామని వివరించారు. కేంద్ర నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులు, పథకాలపై గతంలోనే కేంద్రానికి లేఖలు రాశామని గుర్తు చేశారు. ప్రత్యేక విభాగంలో ఆ లేఖలు అందుబాటులో ఉంటాయని, వాటి ఆధారంగా కేంద్ర మంత్రులకు వినతిపత్రాలు ఇవ్వాలని సూచించారు. రాష్ట్ర భవిష్యత్తు నిర్మాణానికి 'తెలంగాణ రైజింగ్-2047' పేరిట విజన్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించబోతున్నామని తెలిపారు. దేశ, విదేశాల్లోని దిగ్గజ కంపెనీల ప్రతినిధులను తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతానికి కమిటీలు వేస్తున్నామని, ఆసక్తిగల వారు పేర్లు ఇస్తే కమిటీల్లో సభ్యులుగా వేస్తామన్నారు. ఎంపీలకు తెలిసిన ప్రముఖులు, దిగ్గజ సంస్థల వివరాలు ఇస్తే.. వారినీ సమ్మిట్‌కు ఆహ్వానిస్తామన్నారు.

కలిసికట్టుగా ముందుకెళ్దాం: రఘునందన్

రీజినల్ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్లు, ఇతర సమస్యలపై ప్రధాని మోదీని సమష్టిగా కలుద్దామని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు ప్రతిపాదించారు. రాష్ట్రానికి కేటాయించిన ఐఏఎస్, ఐపీఎస్‌ల సమాచారాన్ని అందిస్తే సంబంధిత మంత్రిని కలిసి లేఖ ఇస్తామన్నారు. రాష్ట్ర ప్రయోజనా ల విషయంలో అందరం కలిసికట్టుగా ముందుకెళ్దామని చెప్పారు. బొగ్గు గనుల విషయంలో అందరం కలిసి ఆ మంత్రిని కలుద్దామన్నారు. దీనిపై నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి స్పందిస్తూ రఘునందన్ ప్రతిపాదనలు ఆహ్వానించదగ్గవన్నారు. మహబూబ్ నగర్ ఎయిర్‌పోర్టు కోసం కేంద్రానికి లేఖ రాయాలని, గద్వాల-డోర్నకల్ రైల్వే లైన్‌పైనా సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే తన నియోజకవర్గంలో లక్ష మందిపై ముంపు ప్రభావం ఉంటుందని ఎంపీ బలరాం నాయక్ చెప్పారు. ములుగు-ఏటూరునాగారం రహదారి మంజూరైనా.. అటవీ, పర్యావరణ అనుమతులు రాకపోవడంతో టెండర్ ఖరారు కాలేదని, ఈ అంశంపై కేంద్రానికి లేఖ రాయాలని కోరారు. ఉపాధి హామీ పథకం పనిదినాలు బాగా తగ్గుతున్నాయని జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ చెప్పారు. జహీరాబాద్-బీదర్ రహదారి విషయమై కేంద్రానికి లేఖ రాయాలని కోరారు. ఆదిలాబాద్ విమానాశ్రయానికి 800 ఎకరాలు అవసరమని రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కలెక్టర్‌కు లేఖ రాసిందని, ఇప్పటికే అక్కడ 369 ఎకరాలు అందుబాటులో ఉందని, ఇదీ అందులో అంతర్భాగమా? లేక అదనంగా సేకరిస్తున్నారా? అని ప్రశ్నించారు. దీనికి ప్రభుత్వ అధికారులు స్పందిస్తూ.. ఎయిర్‌పోర్టు నిర్మాణానికి మొత్తం వెయ్యి ఎకరాలపైగా అవసరమని చెప్పారు. వరంగల్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ విషయమై కేంద్రానికి లేఖ రాయడంతోపాటు సమావేశాల్లో లేవనెత్తాలని కడియం కావ్య అభిప్రాయపడ్డారు.

గ్లోబల్ సమ్మిట్‌కు చకచకా ఏర్పాట్లు

సమ్మిట్ టూ ఫ్యూచర్ సిటీ, ఫార్మా సిటీ వరకూ రోడ్లు..

- విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి సెల్ టవర్ వరకూ ఏర్పాటు
- 8 శాఖల అధికారుల సమన్వయంతో వసతుల కల్పన

కందుకూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేటలో డిసెంబరు 8,9 తేదీల్లో గ్లోబల్ సమ్మిట్-2025 నిర్వహణకు చకచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి. సమ్మిట్‌కు హాజరయ్యే జాతీయ, అంతర్జాతీయ కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు, కేంద్ర-రాష్ట్ర అధికారులు, మంత్రులకు అవసరమైన వసతుల కల్పనకు 8 శాఖల అధికారులు పనులు చేపట్టారు. సీఎం రేవంత్ రెడ్డి చొరవతో మీర్‌ఖాన్‌పేట పరిధిలోని ఫ్యూచర్ సిటీలో సమ్మిట్ నిర్వహణకు వేగంగా ఏర్పాట్లు సాగుతున్నాయి. మీర్‌ఖాన్‌పేటలోని 120వ రెవెన్యూ సర్వే నంబర్ పరిధిలోని 100 ఎకరాల భూమిలో జరుగుతున్న ఏర్పాట్లను ఫ్యూచర్‌సిటీ అథారిటీ ఎండీ శశాంక ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. గురువారం ఉదయం క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించిన శశాంక... పకడ్బందీగా వసతులు కల్పించాలని ఆదేశించారు. అంతర్జాతీయ, జాతీయ పారిశ్రామిక వేత్తలతో డిసెంబరు 8, 9వ తేదీల్లో జరిగే గ్లోబల్ సమ్మిట్ తోపాటు 10, 11వ తేదీల్లో వివిధ జిల్లాల ప్రజలతో సదస్సుల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అమెజాన్ డాటా కేంద్రానికి సమీపంలోని 200ఎకరాలను చదును చేసే పనులను ఐజీవీ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. 10 రోజులుగా పోలీసు, రెవెన్యూ, పంచాయతీ రాజ్, విద్యుత్, మిషన్ భగీరథ, తదితర శాఖల అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు.

ఫ్యూచర్‌సిటీ నుంచి సమ్మిట్ వరకూ రోడ్లు

స్కిల్ యూనివర్సిటీ, ఫ్యూచర్ సిటీ అథారిటీ కమిషన్ కార్యాలయ భవనం, అమెజాన్ డేటా కేంద్రాన్ని నేరుగా గ్లోబల్ సమ్మిట్ ప్రతినిధులు పరిశీలించడానికి వీలుగా ప్రత్యేకంగా రోడ్లను నిర్మిస్తున్నారు. హైదరాబాద్- శ్రీశైలం జాతీయ రహదారి నుంచి ఫ్యూచర్ సిటీ అథారిటీ వరకూ గత సర్కారు నిర్మించిన 4 లేన్ల రోడ్డు నుంచి స్కిల్ యూనివర్సిటీ వరకూ యుద్ధ ప్రాతిపదికన రోడ్ల నిర్మాణం జరుగుతోంది.

సీఎం, డిప్యూటీ సీఎంల ప్రత్యేక దృష్టి

గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను ఈ నెల 16న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, 23న సీఎం రేవంత్ రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పెట్టుబడులకు తెలంగాణ ఎంతో అనుకూలమని, సమ్మిట్‌కు వచ్చే అంతర్జాతీయ పెట్టుబడుల దారులకు వసతుల కల్పనలో ఎలాంటి నిర్లక్ష్యం తగదని సంబంధిత అధికారులకు పలు సూచనలు, సలహాలిచ్చారు.

తెలంగాణ రైజింగ్ సమ్మిట్‌కు నోబెల్ గ్రహీత అభిజీత్ బెనర్జీ!

- ఆర్‌బీఐ మాజీ గవర్నర్లు దువ్వూరి సుబ్బారావు, రఘురామ్ రాజన్
- వివిధ రంగాల ప్రముఖులను ఆహ్వానించనున్న రాష్ట్ర ప్రభుత్వం



అభిజీత్ బెనర్జీ (ఫైల్)

హైదరాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు వివిధ రంగాల ప్రముఖులను ఆహ్వానించనుంది. ఇందులో భాగంగా ప్రముఖ ఆర్థికవేత్త, నోబెల్ బహుమతి గ్రహీత అభిజీత్ బెనర్జీని సమ్మిట్‌కు ఆహ్వానిస్తుంది. అలాగే, ఆర్‌బీఐ మాజీ గవర్నర్లు దువ్వూరి సుబ్బారావు, రఘురామ్ రాజన్, బయోకాన్ ఛైర్‌పర్సన్ కిరణ్ మజుందార్ షా, కేంద్ర ప్రభుత్వం మాజీ ఆర్థిక ముఖ్య సలహాదారు అరవింద్ సుబ్రమణ్యన్, రామన్ మెగసెసె అవార్డు విజేత విల్సన్, ప్రముఖ ఆర్థికవేత్త సంతోష్ మెహరోత్రా, ప్రముఖ పర్యావేరణ శాస్త్రవేత్త అరుణభా ఘోష్, ఐక్యరాజ్యసమితి సలహామండలి సభ్యులు జయతి ఘోష్‌లను కూడా ఆహ్వానిస్తుంది. డిసెంబరు 8, 9 తేదీల్లో ఫ్యూచర్ సిటీలో జరిగే ఈ తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో రాష్ట్ర ప్రభుత్వం విజన్-2047 డాక్యుమెంట్‌ను విడుదల చేయనుంది. కాగా, తెలంగాణ సమగ్రాభివృద్ధికి కావాల్సిన సూచనలు, సలహాల కోసం ప్రభుత్వం నిపుణులతో ఓ సలహామండలిని కూడా ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు తెలిసింది.

ఈ-కామర్స్ గోదాముల్లో కుళ్లిన సరుకులు!

» అధికారుల తనిఖీలతో విషయం వెలుగులోకి

హైదరాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కావాల్సిన వస్తువులను కూర్చున్న చోటు నుంచి ఆర్డర్ చేస్తే... నిమిషాల్లో అవి చేతికి అందుతాయని, ఇప్పుడు చాలా మంది సరుకులు, నిత్యవసర వస్తువులు, ఆహార పదార్థాలను ఆన్‌లైన్‌లోనే ఎక్కువగా ఆర్డర్ చేస్తున్నారు. అయితే వాటిని విక్రయించే ఈ-కామర్స్ సంస్థల గోదాముల్లో చాలా వరకు కాలం చెల్లిన, కుళ్లిన సరుకులు ఉంటున్నాయనే విషయం అధికారుల తనిఖీల్లో వెలుగులోకి వచ్చింది. నవంబరు 25, 26 తేదీల్లో రాష్ట్రంలో ఉన్న జెప్టో, బ్లింకిట్, జియో మార్ట్, బిగ్ బాస్కెట్, స్విగ్గి, జొమాటో, అమెజాన్ వంటి ఈ-కామర్స్ సంస్థలకు చెందిన 75 గోదాముల్లో ఫుడ్‌సేఫ్టీ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భయంకరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. గడువు తీరిన, లేబుల్స్ సరిగా లేని సరుకులు, కుళ్లిన కూరగాయలు, పాచిపోయిన ఆహార పదార్థాలను అధికారులు గుర్తించారు. ఏకంగా 1,903 యూనిట్ల సరుకులను సీజ్ చేసి, 76 కిలోల కుళ్లిన కూరగాయలు, పాచిపోయిన ఆహార పదార్థాలను అక్కడికక్కడే పారబోయించారు. హైదరాబాద్ పరిధిలో పరిస్థితి మరీంత ఘోరంగా ఉంది. నిబంధనలు అతిక్రమిస్తున్న 32 సంస్థలకు ఇంప్రూవ్‌మెంట్ నోటీసులు, భద్రాద్రిలో ఒక సంస్థకు షోకాజ్ నోటీసులను అధికారులు జారీ చేశారు. అనుమానం ఉన్న 222 (98 ఎన్‌ఫోర్స్‌మెంట్ + 124 సర్వైలెన్స్) శాంపిల్స్‌ను సేకరించి ల్యాబ్‌కు పంపారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతూ.. కల్తీ వ్యాపారం చేసే వారిపై చట్టప్రకారం చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.


సైదాబాద్ డీసీపీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అయ్యప్ప స్వామి భక్తులు, హిందూ సంఘాల నాయకులు

మాల ధరించిన ఎస్సైకి మెమో జారీపై

హిందూ సంఘాల ఆగ్రహం

» డీసీపీ కార్యాలయం ఎదుట ధర్నా

సైదాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప మాల ధరించి విధులు నిర్వహిస్తున్న కంచన్‌బాగ్ ఎస్సై కృష్ణకాంత్‌కు మెమో‌పై ఇవ్వడంపై హిందూ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. అయ్యప్ప స్వామి భక్తులు, హిందూ సంఘాల నాయకులు, బీజేపీ నేతలతో కలిసి గురువారం సైదాబాద్‌లోని సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. స్థానిక వీరాంజనేయ స్వామి దేవాలయం నుంచి డీసీపీ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లారు. వినతిపత్రం ఇచ్చేందుకు యత్నించగా, డీసీపీ, అదనపు డీసీపీలు అందుబాటులో లేకపోవడంతో కార్యాలయం ఎదుట బైఠాయించి పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మతాలకు సంబంధించిన అంశాల్లో పోలీసుశాఖ స్పష్టమైన ఆదేశాలు జారీచేయాలని డిమాండ్ చేశారు.

విశాఖ నుంచి విమానంలో ఊపిరితిత్తులు

» శంషాబాద్ నుంచి గ్రీన్ చానెల్ ద్వారా కిమ్స్‌కు తరలింపు

శంషాబాద్ రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ రోగికి అవసరమైన ఊపిరితిత్తులు విశాఖపట్నం నుంచి హైదరాబాద్‌కు ప్రత్యేక విమానంలో వచ్చాయి. గురువారం మధ్యాహ్నం రెండున్నర గంటలకు ప్రత్యేక విమానం శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకోగా.. ఎయిర్‌పోర్టులో గ్రీన్‌చానల్(ప్రత్యేక మార్గం) ఏర్పాటు చేసిన సీఐఎస్ఎఫ్ అధికారులు ఆ ఊపిరితిత్తులను అంబులెన్స్‌లోకి చేర్చారు. అక్కడి నుంచి ట్రాఫిక్ పోలీసులు ఏర్పాటు చేసిన గ్రీన్ చానల్ ద్వారా ఆ అంబులెన్స్ శంషాబాద్ విమానాశ్రయం నుంచి సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రికి దాదాపు 22 నిమిషాల్లో చేరుకుంది. కిమ్స్ ఆస్పత్రిలో రోగికి ఆ ఊపిరితిత్తులను అమర్చారు.

ఎయిర్‌పోర్టులో ప్రయాణికురాలి బ్యాగులో కత్తి

శంషాబాద్ రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మదీనా నుంచి ఢాకా మీదుగా శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చిన ఓ ప్రయాణికురాలి బ్యాగులో పెద్ద కత్తి ఉండటం కలకలం సృష్టించింది. హైదరాబాద్‌కు చెందిన జోస్నా బేగం.. గురువారం మదీనా నుంచి ఇండిగో విమానంలో బయలుదేరి ఢాకా చేరుకున్నారు. అక్కడి నుంచి మరో ఇండిగో విమానంలో శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరారు. అయితే, ఆమె బ్యాగులను తనిఖీ చేసిన సీఐఎస్ఎఫ్ అధికారులు వాటిలో 8 అంగుళాల కత్తిని గుర్తించి ఆమెను అదుపులోకి తీసుకుని స్థానిక పోలీసులకు అప్పగించారు. సదరు మహిళ కత్తి ఎందుకు తీసుకొచ్చింది? అక్కడి విమానాశ్రయంలో కత్తిని ఎందుకు గుర్తించలేదు ? అనే విషయాలపై ఆరా తీస్తున్నారు.

ఏసీబీ వలలో ఆర్మూర్ మునిసిపల్ కమిషనర్

ఆర్మూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇంటి నంబరు కేటాయింపు విషయంలో రూ. 20 వేలు లంచం తీసుకుంటూ ఆర్మూర్ మునిసిపల్ కమిషనర్ రాజు, ఆయన డ్రైవర్ భూమేశ్ ఏసీబీ అధికారులకు చిక్కారు. ఆర్మూర్ పట్టణంలోని యోగేశ్వర కాలనీకి చెందిన నర్సయ్య అనే వ్యక్తి పట్టణంలో నూతనంగా నిర్మించుకున్న ఇంటికి నెంబర్ కేటాయింపు కోసం మునిసిపల్ కమిషనర్ రాజును సంప్రదించాడు. అందుకు రూ.50 వేల లంచం ఇవ్వాలని కమిషనర్ డిమాండ్ చేయడంతో బాధితుడు రూ. 20 వేలు ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. ముందస్తు ప్రణాళిక ప్రకారం గురువారం సాయంత్రం ఆ వ్యక్తి కమిషనర్ ఇంటికి వెళ్లి డ్రైవర్ భూమేశ్‌కు రూ. 20 వేలు లంచం ఇస్తుండగా ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

ప్రభుత్వ విత్తనాలనూ అమ్మాల్సిందే: అన్వేష్‌రెడ్డి

హైదరాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పంపిణీ చేస్తున్న వరి, శనగ విత్తనాలను తమ దుకాణాల్లో తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట అన్వేష్ రెడ్డి ప్రైవేటు డీలర్లను ఆదేశించారు. రాష్ట్రంలోని ప్రతి డీలర్ 25 క్వింటాళ్ల వరి విత్తనాలు అమ్మాలని లక్ష్యం విధించారు. ఆకర్షణీయమైన ప్రకటనలు ఇచ్చే ప్రైవేటు కంపెనీల విత్తనాలు అమ్మడానికే డీలర్లు ఎందుకు పరిమితమవుతున్నారని ప్రశ్నించారు. రైతులకు నష్టం కలగకుండా నాణ్యమైన విత్తనాలను రైతులకు అందించాల్సిన బాధ్యత డీలర్లపై ఉందని తెలిపారు.

టీయూఎఫ్ఐడీసీకి రూ.770 కోట్లు విడుదల

తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీయూఎఫ్ఐడీసీ)కు పురపాలక శాఖ భారీగా నిధులు విడుదల చేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ కేటాయింపుల్లో భాగంగా పట్టణ మౌలిక వసతులు, అభివృద్ధి సంస్థకు రూ.770 కోట్లు విడుదల చేస్తూ పురపాలక శాఖ కార్యదర్శి టీకే శ్రీదేవి ఉత్తర్వులు (జీవో 851) ఇచ్చారు.

కాళోజీ వర్సిటీలో గాడి తప్పిన పాలన!

పరీక్షల నిర్వహణ, ఫలితాలు, సీట్ల కేటాయింపులో గందరగోళం

» దంత వైద్యుడి చేతికి పరీక్షల నియంత్రణ
» తీవ్ర ఆరోపణలున్న వైద్యుడికి రిజిస్ట్రార్ బాధ్యతలు
» పీజీ రేడియాలజీ పరీక్షలో పాత పేపర్లు
» ఇటీవల పీజీ పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులను పాస్ చేయడంపై సందేహాలు
» రిటైర్డ్ ఉద్యోగులకు హెల్త్ వర్సిటీ పునరావాస కేంద్రంగా మారిందనే విమర్శలు



వరంగల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయంలో పాలన గాడితప్పింది. అకడమిక్, అడ్మినిస్ట్రేషన్ వ్యవస్థలలో నిర్లక్ష్యంతో సమస్యలు తలెత్తుతున్నాయి. వైద్య విద్య పరీక్షల నిర్వహణ నుంచి ఫలితాలు, సీట్ల కేటాయింపు వరకు నిర్లక్ష్యం, అక్రమాలతో వర్సిటీ ప్రతిష్ఠ దెబ్బతింటోంది. ఎంబీబీఎస్ చేసిన సీనియర్ వైద్యులు ఉండాల్సిన పరీక్షల నియంత్రణాధికారి (ఎగ్జామినేషన్ కంట్రోలర్)లో కొన్నేళ్లుగా దంత వైద్యుడిని డిప్యూటేషన్‌పై నియమించటం, అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న వైద్యుడికి రిజిస్ట్రార్ పదవిని అప్పగించడం ఏమిటనే విమర్శలు వస్తున్నాయి. తెలంగాణ ఏర్పాటయ్యాక కాళోజీ వర్సిటీని ఏర్పాటు చేసిన ప్రభుత్వం రాష్ట్రంలో వైద్య విద్యను ఈ వర్సిటీ పరిధిలోకి తీసుకువచ్చింది. మొత్తం 105 పోస్టులు భర్తీ చేయాల్సి ఉన్నా.. 35 మంది వరకే రెగ్యులర్ ఉద్యోగులు ఉన్నారు. రిజిస్ట్రార్, డిప్యూటీ, జాయింట్ రిజిస్ట్రార్ పోస్టులను కూడా డిప్యూటేషన్‌పై వచ్చిన వైద్యులకే అప్పగించారు. ఇక వివిధ విభాగాల్లో కీలకమైన పోస్టుల్లో రిటైరైన వారిని తాత్కాలిక ప్రాతిపదికన నియమించారు.

పరీక్షలు, ఫలితాల్లో దారుణం

ఇక వైద్య విద్య పరీక్షల నిర్వహణలో కాళోజీ వర్సిటీ తీరుపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. జనవరి 15న నిర్వహించిన రేడియాలజీ పీజీ పరీక్షలో గత ఏడాది ఇచ్చిన ప్రశ్నపత్రాన్నే మళ్లీ ఇచ్చారు. అక్టోబరు 13న జరిగిన పీజీ ఫోరెన్సిక్ పరీక్షలో 10 ప్రశ్నలకు బదులు 11ప్రశ్నలు ఇచ్చారు. ఇక గతేడాది పీజీ పరీక్షలను కౌన్సెలింగ్‌ను సిబ్బంది కొరత సాకుతో పలుమార్లు వాయిదా వేశారు. నవంబరు 5న వరంగల్ నగరానికి చెందిన ఓ విద్యార్థినికి తొలుత ఖమ్మంలోని మమత డెంటల్ కాలేజీలో సీటు వచ్చినట్టు వర్సిటీ అధికారులు మెసేజ్ పంపించారు. కానీ మరుసటి రోజే మార్చేశారు. మొదటి జాబితాలో తప్పులు దొర్లాయని.. నిజామాబాద్ మేఘనా డెంటల్ కాలేజీలో ఆమెకు సీటు వచ్చినట్టు చెప్పారు. తాజాగా హైదరాబాద్‌కు చెందిన ఓ ప్రైవేటు కాలేజీ వైద్య విద్యార్థులు ఫెయిలైనా.. రీకౌంటింగ్‌లో పాస్ చేయటంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించటంతో ఎగ్జామినేషన్ గదికి తాళం వేశారు.

కాళోజీ వర్సిటీలో అవినీతిపై చర్యలు చేపట్టండి

» పీజీ పరీక్షల మూల్యాంకనంలో భారీగా అక్రమాలు
» గవర్నర్, ఎన్ఎంసీ చైర్మన్‌కు హరీశ్‌రావు లేఖ

హైదరాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కాళోజీ యూనివర్సిటీలో అవినీతి బాగోతంపై చర్యలు చేపట్టాలని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, ఎన్ఎంసీ (నేషనల్ మెడికల్ కౌన్సిల్) చైర్మన్ అభిజాత్‌సేత్‌కు గురువారం లేఖ రాశారు. వైద్య విద్య పీజీ పరీక్షల మూల్యాంకనంలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు వినిపిస్తున్నా, ప్రభుత్వం మౌనంగా ఉందని ధ్వజమెత్తారు. ఈ తతంగం వెనుక వర్సిటీ వీసీ నందకుమార్‌రెడ్డి ఉన్నారని తెలిసినా.. ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. పరీక్షలు ముగిసిన తర్వాత వీసీ స్వయంగా సమాధాన పత్రాల్లోని క్రాస్ మార్క్ ఉన్న పేజీల్లో సమాధానాలు రాయించి, తిరిగి మూల్యాంకనం చేయించడం ద్వారా ఐదుగురిని పాస్ చేయించారని.. విజిలెన్స్ విచారణలో ఒక విద్యార్థి స్పష్టంగా వెల్లడించారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో పెద్ద మొత్తంలో డబ్బు చేతులు మారినట్లు స్పష్టమవుతోందన్నారు. వీసీకి అండగా ఉన్న రాజకీయ పెద్దలెవరో తేలాలని పేర్కొన్నారు. అర్హత లేని విద్యార్థులను అడ్డదారిలో పాస్ చేస్తే ప్రజల ప్రాణాలు తీస్తారని, దానికి ఎవరు బాధ్యత వహిస్తారని నిలదీశారు.

వైద్య కళాశాలల్లో ఈడీ సోదాలు

(మొదటిపేజీ తరువాయి)

మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, రాజస్థాన్, బిహార్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీలో 15చోట్ల సోదాలు నిర్వహించింది. ఇందులో ఏడు వైద్య కళాశాలలతో పాటు అధికారులు, మధ్యవర్తుల ఇళ్లు, కార్యాలయాలు ఉన్నాయి. తెలంగాణకు సంబంధించి వరంగల్ జిల్లాలోని ఫాదర్ కొలంబో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో, మధ్యవర్తులుగా వ్యవహరించిన ముగ్గురు వైద్యుల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. ఈ కాలేజీ యాజమాన్యానికి చెందిన ఫాదర్ కొమ్మారెడ్డి రెండు విడతల్లో రూ.66 లక్షలను మధ్యవర్తుల ద్వారా ఎన్ఎంసీ పెద్దలకు పంపించారని ఇప్పటికే సీబీఐ ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది. ముగ్గురు డాక్టర్లు అంకం రాంబాబు, హరిప్రసాద్, కృష్ణ కిషోర్ పలు వైద్య కళాశాలలకు మధ్యవర్తులుగా వ్యవహరించిన క్రమంలో వారి ఇళ్లల్లోనూ ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఏపీకి సంబంధించి.. విశాఖలోని గాయత్రి మెడికల్ కాలేజీ డైరెక్టర్ వెంకట్ నుంచి మధ్యవర్తి కృష్ణ కిషోర్‌కు రూ.50 లక్షలు అందగా.. ఆయన ఆ మొత్తాన్ని హవాలా మార్గంలో ఢిల్లీలోని ఎన్ఎంసీ పెద్దలకు పంపించిన క్రమంలో హవాలా చెల్లింపులపై ఈడీ అధికారులు ఆరా తీశారు. ముడుపుల చెల్లింపులు చాలావరకు హవాలా మార్గంలో జరిగినట్లు గుర్తించి, సాక్ష్యాధారాలను సేకరించినట్లు సమాచారం. ముడుపులతో పాటు ఎన్ఎంసీ నుంచి తనిఖీలకు సంబంధించి కీలక సమాచారం లీక్ అవుతున్న వ్యవహారంపై జూన్ 30న సీబీఐ కేసు నమోదు చేసింది. దాని ఆధారంగా మనీ లాండరింగ్ కోణంలో ఈడీ తాజాగా దర్యాప్తు చేపట్టింది. కేంద్ర ఆరోగ్య శాఖ, ఎన్ఎంసీ అధికారులు, మధ్యవర్తులు, ప్రైవేటు వైద్య కళాశాలల ప్రతినిధులు ఒక సిండికేట్‌గా ఏర్పడి అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని సీబీఐ అభియోగం. ఎన్ఎంసీ, ప్రభుత్వ అధికారులు వైద్య కళాశాలల తనిఖీలకు సంబంధించిన రహస్య సమాచారాన్ని వైద్య కళాశాలల యాజమాన్యాలకు, మధ్యవర్తులకు లీక్ చేశారని, దాంతో వారికి భారీగా ముడుపులు అందాయని సీబీఐ గుర్తించింది. తనిఖీల సమాచారం ముందుగానే అందడంతో కళాశాలల యాజమాన్యాలు జాగ్రత్తపడి.. ప్రమాణాల విషయంలో మసిపూసి మారేడుకాయ చేసి, అనుమతులు సాధిస్తున్నాయి. ఎన్ఎంసీ అధికారుల బృందం వైద్య కళాశాలల తనిఖీకి ఎప్పుడు వచ్చేదీ, బృందంలోని సభ్యుల వివరాలు, వారు ఏ అంశాలను పరిశీలిస్తారనే సమాచారం చాలా ముందుగానే బ్రోకర్ల ద్వారా కొన్ని వైద్య కళాశాలలకు అందిందని, దానికి ప్రతిఫలంగా మధ్యవర్తుల ద్వారా పలు వైద్య కళాశాలలు ఎన్ఎంసీ అధికారులకు కోట్ల రూపాయలు చెల్లించాయని సీబీఐ కేసు నమోదు చేసింది. ఎఫ్ఐఆర్‌లో 34 మంది పేర్లను చేర్చింది. వీరిలో కేంద్ర ఆరోగ్య శాఖ అధికారులు 8 మంది, జాతీయ ఆరోగ్య సంస్థ అధికారి ఒకరు, ఎన్ఎంసీ తనిఖీ బృందం సభ్యులైన ఐదుగురు డాక్టర్లు కూడా ఉన్నారు. కాగా, ఛత్తీస్‌గఢ్‌లోని ఓ వైద్య కళాశాలకు అనుకూలంగా నివేదిక ఇచ్చేందుకు రూ.55 లక్షలు లంచం తీసుకున్న అభియోగంపై ముగ్గురు ఎన్ఎంసీ తనిఖీ బృందం సభ్యులను, మరో ఐదుగుర్ని సీబీఐ ఇప్పటికే అరెస్టు చేసింది.

'ఈగల్' దూకుడు

» మత్తుమందుల స్మగ్లర్లపై దాడులు..
» ఢిల్లీ, విశాఖ పోలీసులతో ఆపరేషన్
» 50మందికి పైగా నైజీరియన్ల గుర్తింపు

హైదరాబాద్, నవంబర్ 27 (ఆంధ్రజ్యోతి): మత్తుముఠాల నెట్‌వర్క్‌ను ఛేదించి, వారి ఆర్థిక మూలాలు దెబ్బతీసే వ్యూహాలతో ఈగల్ ముందుకెళ్తోంది. అందులో భాగంగా న్యూఢిల్లీ, విశాఖపట్నం, గ్రేటర్ నోయిడా, గ్వాలియర్‌లో తెలంగాణ ఈగల్ బృందాలు దాడులు నిర్వహించాయి. ఢిల్లీ క్రైం బ్రాంచ్‌కు చెందిన 100 మంది పోలీసు అధికారులతో పాటు ఈగల్‌కు చెందిన 124 మంది పోలీసులు ఈ స్పెషల్ ఆపరేషన్లలో పాల్గొన్నారు. ఢిల్లీలో 20 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించి పాస్‌పోర్టు గడువు ముగిసినా.. అక్రమంగా నివసిస్తున్న 50మంది నైజీరియన్లను అరెస్టు చేశామని అధికారులు తెలిపారు. వీరిలో చాలామంది మత్తుమందుల స్మగ్లింగ్‌లో భాగస్వాములుగా ఉన్నారని, ఇక్కడి నుంచి వాటిని కొరియర్ల ద్వారా దేశంలోని వివిధ ప్రాంతాలకు పంపిస్తున్నారని వివరించారు. నోయిడా, గ్వాలియర్, విశాఖపట్నంలో జరిపిన సోదాల్లో మత్తుమందులు అమ్ముతున్న నైజీరియన్ మహిళలు వ్యభిచార కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు వెల్లడైందని అన్నారు. అలాగే డ్రగ్స్ దందాలో వచ్చిన డబ్బును ట్రాన్స్‌ఫర్ చేసుకోవడానికి మ్యూల్ అకౌంట్లు ఇచ్చిన పలువుర్ని అదుపులోకి తీసుకుని స్థానిక పోలీసు స్టేషన్లలో అప్పగించామని ఈగల్ అధికారులు తెలిపారు.

'స్లీప్‌వెల్'లో ప్రమాదకర పురుగుమందు

» శ్వాసకోశ వ్యాధులు వచ్చే అవకాశం
» నిర్ధారించిన వ్యవసాయ శాఖ

అమరావతి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): దోమల నిర్మూలనకు వాడే స్లీప్‌వెల్ అగరబత్తీల్లో మేపర్ ఫ్లూత్రిన్ అనే క్రిమిసంహారక మందు ఉన్నట్లు నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్ నిర్ధారించింది. మేపర్ ఫ్లూత్రిన్ వల్ల శ్వాసకోశ సంబంధ వ్యాధులు రావడానికి అవకాశం ఉందని తేల్చింది. స్లీప్‌వెల్ అగరబత్తీల కొనుగోలుపై అప్రమత్తంగా ఉండాలని గురువారం హెచ్చరించింది. వ్యవసాయశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఆదేశాల మేరకు విజయవాడ వ్యవసాయ అధికారులు గుణదలలోని సాయి హనుమాన్ ఏజెన్సీలో తనిఖీలు నిర్వహించి, భారీగా స్లీప్‌వెల్ అగరబత్తీలను స్వాధీనం చేసుకున్నారు. వీటిని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్‌కు పంపగా, బెంగళూరులోని మెస్సర్స్ ఆశికాస్ కంపెనీలో తయారైన స్లీప్‌వెల్ అగరబత్తీలో అనుమతిలేని మేపర్ ఫ్లూత్రిన్ అనే క్రిమిసంహారక మందు ఉన్నట్లు గుర్తించారు. దీంతో విజయవాడలో రూ.69లక్షల విలువైన స్లీప్‌వెల్ అగరబత్తీల అమ్మకాన్ని నిలుపుదల చేశారు. ఎక్కడైనా ఈ స్టాక్ దొరికితే క్రిమిసంహారక మందుల చట్టం-1968 ప్రకారం చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ డైరెక్టర్ హెచ్చరించారు.

ముఖ్యమంత్రా.. రియల్ ఎస్టేట్ ఏజెంటా..?

» 500 మంది కోసం.. 5 లక్షల కోట్ల ప్రజా ఆస్తులు ధారాదత్తం
» అందులో సగం డబ్బు రేవంత్, కాంగ్రెస్ నేతల జేబుల్లోకే
» బీసీలను వంచించిన కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి:కేటీఆర్



హైదరాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రేవంత్‌రెడ్డి రాష్ట్రానికి ముఖ్యమంత్రిలా కాకుండా, రియల్ ఎస్టేట్ ఏజెంట్‌లా పనిచేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ప్రజల ఆస్తులుగా ఉన్న 9300 ఎకరాల పారిశ్రామిక భూములను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే కుట్ర చేశారని విమర్శించారు. మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి, ఇవ్వకుండా మోసం చేశారని ధ్వజమెత్తారు. కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ఆధ్వర్యంలో ఆ నియోజకవర్గానికి చెందిన పలువురు బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి కేటీఆర్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. అన్ని రంగాల్లో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. రేవంత్ రెడ్డి హిల్ట్ విధానం పేరుతో మరో భారీ కుంభకోణానికి తెరలేపారని ఆరోపించారు. గతంలో ప్రజలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం నుంచి పారిశ్రామికవేత్తలు చౌకగా భూములు తీసుకున్నారని, ఇప్పుడా భూముల్లో అపార్ట్‌మెంట్లు, విల్లాలు కట్టుకునేందుకు రేవంత్‌రెడ్డి అతి తక్కువ ధరకే అనుమతులిస్తూ రియల్ దందా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదారు వందల మంది కోసం రూ.5 లక్షల కోట్ల ప్రజల ఆస్తిని తాకట్టు పెడుతున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో సగం డబ్బులు రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుల జేబుల్లోకి వెళ్తున్నాయన్నారు. భూములను అప్పజెప్పే ఈ విధానాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

42 శాతం బీసీ రిజర్వేషన్లకు హామీ.. ఇచ్చింది 17 శాతం

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు మోసం చేసిందని కేటీఆర్ దుయ్యబట్టారు. గత ప్రభుత్వం 24% రిజర్వేషన్లు కల్పిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 17 శాతం మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకొందని విమర్శించారు. రిజర్వేషన్ల పేరుతో నాటకాలాడుతున్న కాంగ్రెస్ పార్టీకి బీసీ సోదరులు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను కేసీఆర్ ప్రభుత్వం 90 శాతం పూర్తి చేయగా.. మిగిలిన 10 శాతం పనులను కూడా రేవంత్‌రెడ్డి పూర్తి చేయలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. ఎన్టీఆర్ లాంటి మహానాయకుడే కల్వకుర్తిలో ఓడిపోయారని, రాజకీయాల్లో గెలుపోటములు సహజమని కార్యకర్తలకు కేటీఆర్ ధైర్యం చెప్పారు. రానున్న రోజుల్లో పార్టీ సభ్యత్వ నమోదుతో పాటు క్షేత్రస్థాయిలో పార్టీ కమిటీలను నియమించనున్నట్లు కేటీఆర్ తెలిపారు.

రాష్ట్రానికి ప్రిజన్ అకాడమీ రానట్లే!

» వికారాబాద్‌లో నిర్మించాలని 2011లో నిర్ణయం
» రాష్ట్రంలో ఎన్‌పీఏ ఉన్నందున కేంద్రం పునరాలోచన
» ఉత్తరాదికి తరలిపోనున్న అకాడమీ

హైదరాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతీయ పోలీస్ శిక్షణా కేంద్రం (ఎన్‌పీఏ) తరహాలో తెలంగాణలో ప్రిజన్ అకాడమీ ఏర్పాటుపై నీలి నీడలు కమ్ముకున్నాయి. అనుకున్న విధంగా ఇక్కడ ప్రిజన్ అకాడమీ ఏర్పాటయ్యే పరిస్థితులు కనిపించడం లేదు. రాష్ట్ర విభజనకు ముందు హైదరాబాద్ శివారులోని వికారాబాద్‌లో 150 ఎకరాల విస్తీర్ణంలో రూ. 350 కోట్లతో ప్రిజన్ అకాడమీ నిర్మించాలని 2011లో నిర్ణయించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని వికారాబాద్ మండలం ఉత్తెరేయపల్లి గ్రామంలో స్థలం ఎంపిక చేశారు. నిర్మాణానికి అనుమతులు లభించాయి. అయితే, ఇప్పటికే ఎన్‌పీఏ తెలంగాణలో ఉండటంతో మరో జాతీయ స్థాయి అకాడమీ ఏర్పాటు సరికాదని, ఉత్తరాది రాష్ట్రాల్లో ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన కొత్తగా తెరపైకి వచ్చింది. ఈ నేపథ్యంలో ప్రిజన్ అకాడమీని ఉత్తరాది రాష్ట్రాల్లో ఏర్పాటుకు కేంద్రం సమాలోచన చేస్తున్నట్లు తెలిసింది. అకాడమీ ఏర్పాటుకోసం కేటాయించిన స్థలం ఇప్పటికీ జైళ్ల శాఖ ఆధీనంలోనే ఉంది. అయితే, ముందుగా అనుకున్న ప్రకారం ప్రిజన్ అకాడమీ ఇప్పట్లో వచ్చే పరిస్థితి లేకపోవడంతో... ఖాళీగా ఉన్న స్థలంలో పోలీసు ఫైరింగ్ రేంజ్ ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు.

తీహార్ జైలుపై భారం తగ్గించేందుకు...

తీహార్ జైల్లో ఖైదీల సంఖ్య విపరీతంగా పెరిగిపోవడం, సిబ్బందిపై పని ఒత్తిడి, భద్రతా కారణాలతో కేంద్రం 5 రాష్ట్రాల్లో హై సెక్యూరిటీ జైళ్ల నిర్మాణం చేస్తోంది. తెలంగాణతో పాటు కర్ణాటక, హర్యానా, పంజాబ్, అస్సాం రాష్ట్రాల్ని ఎంపిక చేసింది. ఇప్పటికే రెండు రాష్ట్రాల్లో కేంద్రం నిధులతో కేంద్ర కారాగారాల నిర్మాణం పూర్తయింది. తెలంగాణలోని వరంగల్‌లో కేంద్రం కారాగారం నిర్మాణానికి కేంద్రం రూ. 150 కోట్లు మంజూరు చేసింది. కేంద్రం నిధులతో పూర్తి భద్రతా ప్రమాణాలతో జైలు నిర్మాణం చేపడుతున్నారు.

సిద్దిపేటకు ఉగ్రవాద, మావోయిస్టు ఖైదీలు

అత్యంత భద్రతతో కూడిన వ్యవస్థతో సిద్దిపేట జిల్లా జైలు నిర్మాణం పూర్తయింది. 50 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన ఈ జైలును సీఎం రేవంత్ రెడ్డి త్వరలో ప్రారంభించనున్నారు. కాగా, వందల సంఖ్యలో సీసీ కెమెరాలు, ములాఖత్ గదుల నిర్మాణం, బ్యారెక్‌లు, సెంట్రింగ్ పాయింట్‌లు ఇలా ప్రతి అంశంపై అధికారులు నిర్మాణంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. దీంతో ప్రస్తుతం చర్లపల్లి కేంద్ర కారాగారంలో ఉంచిన ఉగ్రవాద, మావోయిస్టు ఖైదీలతోపాటు ఇతర కరుడు గట్టిన నేరస్తుల్ని సిద్దిపేట జైలుకు తరలించాలని జైళ్ల శాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

జనవరి 30న తెలంగాణ

బార్ కౌన్సిల్ ఎన్నికలు

డిసెంబరు 29 నుంచి నామినేషన్ల స్వీకరణ

ఫిబ్రవరి 10న ఓట్ల లెక్కింపు.. షెడ్యూల్ విడుదల

హైదరాబాద్/రంగారెడ్డి జిల్లా కోర్టులు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జనవరి 30న తెలంగాణ బార్ కౌన్సిల్‌కు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ మేరకు తెలంగాణ బార్ కౌన్సిల్ కార్యదర్శి వీ నాగలక్ష్మి షెడ్యూల్ విడుదల చేశారు. ఆయా రాష్ట్రాల్లో బార్ కౌన్సిల్ ఎన్నికలు ఆలస్యం అవుతుండటంపై ఇటీవల సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. మొదటి దశలో తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్‌కు జనవరి 31లోపు ఎన్నికలు నిర్వహించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. డిసెంబరు 1న ప్రాథమిక ఓటర్ల జాబితా ప్రచురణతో ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుంది. అదే నెల 10న తుది ఓటర్ల జాబితా ప్రకటిస్తారు. అదే నెల 29 నుంచి జనవరి 9 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 10న వాటి పరిశీలన చేపడతారు. 13 నుంచి 16 వరకు ఉపసంహరణకు గడువు ఉంటుంది. 17న తుది అభ్యర్థుల జాబితా ప్రకటిస్తారు. 30న ఎన్నికలు నిర్వహిస్తారు. ఫిబ్రవరి 10న ఓట్లు లెక్కించి ఫలితాలు ప్రకటించనున్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదతలతో అభ్యర్థులు ఆయా జిల్లాల కోర్టులకు వెళ్లి ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ప్రస్తుత బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్ సునీల్ గౌడ్, కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్, సీనియర్ న్యాయవాది వీ రఘునాథ్ తదితరులు పోటీ చేస్తున్న ప్రముఖుల్లో ఉన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.